'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 257

సోమవారం 8-12-2025

కాంస్యం కోసం పోరు

జూనియర్ ప్రపంచకప్ హాకీ సెమీఫైనల్లో జర్మనీ చేతిలో ఓడిన భారత్ -10లో

నయా చాంప్ నోరిస్

ఫార్ములావన్ ప్రపంచ చాంపియన్‌గా మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ -10లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'వందేమాతరం'పై నేడు చర్చ

జాతీయ గీతం వందేమాతరానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుగనుంది.

వివరాలు 6లో ▸

ఎస్ఐఆర్‌కు తప్పుడు సమాచారం

ఎస్ఐఆర్‌కు తప్పుడు పత్రాలు ఇచ్చిన ఆరోపణలపై దేశంలోనే తొలిసారిగా యూపీలో ఓ కుటుంబంపై కేసు నమోదైంది.

వివరాలు 6లో ▸



నిబద్ధతకు రోడ్లే నిదర్శనం

దేశ సరిహద్దుల వెంట భద్రతలో తమ ప్రభుత్వ నిబద్ధతకు నూతన రహదారులే నిదర్శనమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అన్నారు.

వివరాలు 6లో ▸

కోల్‌కతాలో గీతా పారాయణం

కోల్‌కతా కృష్ణ భగవానుని నామ స్మరణతో మార్మోగింది. సాధువుల శంఖారావాలతో పరిసరాలు ప్రతిధ్వనించాయి.

వివరాలు 6లో ▸

'ఉపాధి'కి పని గండం

చంద్రబాబు 18 నెలల పాలనలో ఏకంగా దాదాపు 5.5 కోట్ల పనిదినాలకు కోత

2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ - నవంబర్ మధ్య 21.37 కోట్ల పనిదినాలు కల్పించి గ్రామీణ ఉపాధికి వైఎస్ జగన్ ప్రభుత్వం భరోసా

ఇప్పటికే 18.63 లక్షల మంది(7.48 లక్షల కుటుంబాలు)కి సంబంధించిన జాబ్ కార్డులు ఎగరగొట్టిన చంద్రబాబు సర్కారు

రాష్ట్రంలో జూలై తర్వాత ఉపాధి కూలీలకు రూ.381 కోట్ల చెల్లింపులు బంద్

లేబర్ కాంపొనెంట్ డబ్బులు ఇవ్వకపోవడంతో గ్రామీణ నిరుపేద కూలీల అగచాట్లు

2లో



4.23 : Labour Budget trend for the last 5 years (Month wise) – PDs in Lakhs

	April	May	June	July	Aug	Sept	Oct	Nov
2023-24	392.92	775.82	541.12	222.80	63.40	40.88	44.75	55.50

వైఎస్ జగన్ హయాంలో 2023 ఏప్రిల్ - నవంబర్ మధ్య (2023- 24 ఆర్థిక సంవత్సరం) 21.37 కోట్ల పనిదినాలు కల్పించినట్లు ప్రభుత్వ పోర్టల్‌లో నమోదైన వివరాలు

ग्रामीण विकास मंत्रालय
Ministry of Rural Development
Government of India

MAHATMA GANDHI NATIONAL RURAL EMPLOYMENT GUARANTEE SCHEME

Person days generated 2025-26

S.No.	State/UT	Person days generated
1	ANDAMAN AND NICOBAR	27,814
2	ANDHRA PRADESH	15,89,98,134

చంద్రబాబు పాలనలో 2025 ఏప్రిల్ - నవంబర్ వరకు (2025-26 ఆర్థిక సంవత్సరం) 15.89 కోట్ల పనిదినాలే కల్పించినట్లు వెల్లడిస్తున్న ప్రభుత్వ పోర్టల్

గోవాలో ఘోరం

నైట్‌క్లబ్‌లో అర్ధరాత్రి చెలరేగిన మంటలు

25 మంది సజీవ దహనం | **ఆరుగురికి గాయాలు**

బయటకు వెళ్లే మార్గం ఇరుకుగా ఉండడంతో తప్పించుకోలేక మృత్యువాత

మృతుల్లో 20 మంది క్లబ్ సిబ్బంది, ఐదుగురు పర్యాటకులు

క్లబ్‌లో గ్యాస్ సిలిండర్ పేలిందంటున్న పోలీసులు

ఎలక్ట్రిక్ బాణాసంచా వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షి వెల్లడి

దుర్ఘటన పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని

నష్టపరిహారం ప్రకటించిన పీఎంవో, గోవా ముఖ్యమంత్రి

6లో

న్యూస్‌రీల్

అప్పన్న సేవలో కోహ్లి

సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని భారత క్రికెటర్లు విరాట్‌కోహ్లి, వాషింగ్టన్ సుందర్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు.

వివరాలు 14లో ▸

లొంగిపోయిన మావోయిస్టు దంపతులు

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాకు చెందిన మావోయిస్టు దంపతులు దిరిదో విజ్జల్, మడవి గంగి ఆదివారం పాడేరులో ఎస్పీ అమిత్‌బర్దర్ ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయారు.

వివరాలు 5లో ▸

స్టీల్ ప్లాంట్ ఇన్‌చార్జ్ సీఎండీపై విచారణ జరపాలి

విశాఖ స్టీల్ ప్లాంట్ ఇన్‌చార్జ్ సీఎండీ ఏకే సక్సేనాపై తక్షణమే సీబీఐ విచారణ జరపాలని ఉక్కు పరిరక్షణ పోరాట సమితి డిమాండ్ చేసింది. కోక్, పెల్లెట్స్, ఇతర రా మెటీరియల్స్ కొనుగోలుకు అనుమతించిన అన్ని ఫైళ్లను స్వాధీనం చేసుకోవాలని కోరింది.

వివరాలు 2లో ▸

టెన్త్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు పాఠశాల విద్యా శాఖ గడువు పొడిగించింది. ఈనెల 18 వరకు అవకాశం ఇచ్చినట్లు ఎస్ఎస్‌సీ పరీక్షల డైరెక్టర్ కేవీ శ్రీనివాసులరెడ్డి వెల్లడించారు.

వివరాలు 14లో ▸

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర	ఫారం దగ్గర లైవ్ బర్డ్	రిటైల్ లైవ్ బర్డ్	డ్రస్డ్ స్కిన్‌తో	స్కిన్ లెస్
₹90	135 కిలో	162 కిలో	235 కిలో	267 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇంకుడుపోత

ఆరో రోజు 650 విమానాలు

కొనసాగిన ఇండిగో విమానాల రద్దు

ప్రయాణికులకు రూ.610 కోట్లు రీఫండ్

నష్ట నివారణ చర్యలు చేపట్టిన ఇండిగో

ఈ నెల 10 నాటికి సాధారణ పరిస్థితులు నెలకొంటాయని వెల్లడి

6లో

■ ఇండిగో విమానాల రద్దు కొనసాగుతోంది. ఆదివారం 650 విమానాలు రద్దయ్యాయి. ఈ నెల 10 నాటికి సాధారణ పరిస్థితులు నెలకొంటాయని.. ప్రయాణికులు ఆందోళన చెందవద్దని ఇండిగో వర్గాలు చెబుతున్నాయి. రద్దయిన, ఆలస్యంగా నడిచిన విమానాలకు సంబంధించి ప్రయాణికులకు ఇండిగో యాజమాన్యం రూ.610 కోట్లు రీఫండ్ చేసినట్లు విమానయాన శాఖ వెల్లడించింది. ఇండిగో సంక్షోభంపై ఆ సంస్థ ప్రతినిధులతో పాటు డీజీసీఏ, విమానయాన శాఖ అధికారులను పిలిపించి విచారించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం నిర్ణయించినట్లు సమాచారం.

రామ్మోహన్.. రాజీనామా చెయ్!

- 'ఇండిగో' సంక్షోభంతో దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న డిమాండ్లు
- ఆలిండియా పైలెట్ల అసోసియేషన్ 2 నెలలు ముందే అప్రమత్తం చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిన పౌరవిమానయాన శాఖ మంత్రి
- రామ్మోహన్ నాయుడు అసమర్థతే సమస్య జఠిలం కావటానికి కారణమని నిశ్చితాభిప్రాయంలో కేంద్ర ప్రభుత్వం.. ఇండిగో సంస్థతో నేరుగా ప్రధాని కార్యాలయం చర్చలు

3లో

రామ్మోహన్ నెట్ ప్రాక్టీస్ చేస్తున్నాడా?

లేక రీల్స్, నెట్‌ఫ్లిక్స్ చూస్తున్నాడా?

ధైర్యముంటే ఈరోజు ఆయన నా ప్రశ్నలకు సమాధానం చెప్పమనండి

టీడీపీ ప్రతినిధుల్ని నిలదీసిన రిపబ్లిక్ టీవీ అర్నాబ్ గోస్వామి

3లో

అదే సీఐడీ.. ఇప్పుడు సాక్ష్యాలు

లేవంటోంది!

అప్పుడున్న సాక్ష్యాలు.. ఇప్పుడు ఏమయ్యాయి?

- ఫైబర్ 'నెట్' నుంచి చంద్రబాబు రక్షణకు సీఐడీ ప్లేటు ఫిరాయింపు
- చార్జ్‌షీట్ దాఖలైన తర్వాత క్లోజర్ రిపోర్ట్.. నిబంధనలను పక్కనబెట్టిన దర్యాప్తు సంస్థ
- ఈ అక్రమాలపై ఫిర్యాదు చేసింది గౌతంరెడ్డి
- క్లోజర్ రిపోర్ట్ విషయంలో నోటీసు ఇచ్చింది మరొకరికి..
- దొడ్డిదారిలో కేసు మూసివేతకు అప్పటి ఎండీని వాడుకున్న సీఐడీ
- తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేసిన గౌతంరెడ్డి

2లో

ఆన్‌లైన్ అమ్మకాల్లో

భారత్ దూకుడు

పండుగ అమ్మకాల్లో అమెరికాను అధిగమించిన వైనం

దసరా–దీపావళి సీజన్‌లో ఆన్‌లైన్ ద్వారా రూ.1.24 లక్షల కోట్ల సేల్స్

ఇది అమెరికాలో అత్యధికంగా జరిగే బ్లాక్ ఫ్రైడే సేల్స్ కంటే ఎక్కువ

2024లో అమెరికా బ్లాక్ ఫ్రైడే సేల్స్ రూ.95,040 కోట్లు మాత్రమే

ఈ ఏడాది రూ.1,02,960 కోట్ల విక్రయాలు ఉండవచ్చని అంచనా

ఇండియా ఆన్‌లైన్ అమ్మకాల్లో అత్యధికంగా ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలే

ఆ తర్వాత స్థానాల్లో మొబైల్స్, లైఫ్‌స్టైల్ ప్రొడక్ట్స్

ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి

14లో

కర్ణాటకంపై వీడని సస్పెన్స్

కర్ణాటకలో అధికార మార్పిడిపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఢిల్లీలో సోనియా గాంధీ నివాసంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు సమావేశమై.. కర్ణాటక అంశాన్ని ప్రత్యేకంగా చర్చించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు.

2లో

అమెరికా అగ్ని ప్రమాదంలో మరో తెలుగు విద్యార్థి మృతి

అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్న అల్బనీ ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో తెలంగాణకు చెందిన సహజారెడ్డి ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ దుర్ఘటనలో తీవ్రంగా గాయపడిన అన్వేష్ సారపెల్లి అనే మరో తెలుగు విద్యార్థి సైతం చికిత్స పొందుతూ మృతి చెందాడు.

2లో

మీరు కావచ్చు.. మిస్టర్ బాండ్!

- కాస్త ఎక్కువ వడ్డీ కావాలంటే కార్పొరేట్ బాండ్స్ చూడొచ్చు
- వీటిక్కూడా ఎఫ్‌డీల మాదిరే కొంతవరకూ గ్యారంటీ ఉంది
- కొన్ని బాండ్లలో ఎఫ్‌డీల కన్నా ఎక్కువ రిస్కు ఉంటుంది
- రేటింగ్‌ను బట్టి ఇన్వెస్ట్ చేస్తే చాలావరకూ సొమ్ముకు భద్రత
- ఈ బాదరబందీ వద్దనుకుంటే కార్పొరేట్ బాండ్ ఫండ్లూ ఉన్నాయ్.. వడ్డీలు తగ్గుతున్నాయి కనక... కాస్త ఎక్కువ రేటు కావాలంటే ఇదో మార్గం

12లో

డిగ్రీ లెవల్ ప్లానింగ్ భేష్

- కేజీ నుంచే పీజీ కోసం ఆలోచించాలి మరి
- ఉన్నత విద్య కోసం రుణాలపై ఆధారపడితే కష్టం
- ఏటా 10 శాతం వరకూ పెరుగుతున్న విద్యారంగ ద్రవ్యోల్బణం.. ఈ లెక్కన వచ్చే పదేళ్లలో ఫీజులు రెండుమూడు రెట్లు పెరిగే చాన్స్
- దానికి సిద్ధం కావాలంటే దీర్ఘకాలం పొదుపు తప్పనిసరి
- ఎంత త్వరగా పొదుపు మొదలుపెడితే అంత మంచిది

13లో

అదే సీఐడీ.. అబ్బే ఇప్పుడు
సాక్ష్యాలు లేవంటోంది..!

అప్పుడున్న సాక్ష్యాలు.. ఇప్పుడు ఏమయ్యాయి?
ఫైబర్ ‘నెట్’ నుంచి చంద్రబాబు రక్షణకు సీఐడీ ప్లేటు ఫిరాయింపు

సాక్షి, అమరావతి: నారా చంద్రబాబు నాయుడు 2014–19 మధ్య కాలంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏపీ ఫైబర్ నెట్ టెండర్ల ప్రక్రియలో జరిగిన కోట్ల రూపాయల అక్రమాలపై నమోదు చేసిన కేసులో సీఐడీ ప్లేటు ఫిరాయించింది. ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబు అక్రమాలకు నాడు అన్ని సాక్ష్యాధారాలను సంపాదించి చార్జ్‌షీట్ దాఖలు చేసిన సీఐడీ, ఇప్పుడు ఎలాంటి సాక్ష్యాలు లేవని... ఆ కేసు మూసివేయాలని విజయవాడ ఏసీబీ కోర్టులో క్లోజర్ రిపోర్ట్ దాఖలు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

చంద్రబాబు అడుగులకు మడుగులు..

2014–19 మధ్య సంవత్సరాల్లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన పలు కుంభకోణాలపై గత ప్రభుత్వం హయాంలో సీఐడీ అన్నీ సాక్ష్యాధారాలతో కేసులు నమోదు చేసింది. ఇప్పుడు ఆ కేసుల నుంచి బయట పడేందుకు తనకే సొంతమైన ‘మేనేజ్’ స్కిల్స్‌కి చంద్రబాబు మరోసారి పదును పెట్టారు. సీఐడీ సైతం ఆయన అడుగులకు మడుగులొత్తుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, షాడో సీఎం లోకేశ్, వారి ఆస్థాన సీనియర్ న్యాయవాదుల కనుసన్నల్లో సీఐడీ పనిచేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో సేకరించిన సాక్ష్యాధారాలను మూలనపడేసి చంద్రబాబుపై కేసుల మూసివేతే లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఏపీ ఫైబర్ నెట్ టెండర్ల అక్రమాల కేసులో సీఐడీ కూడా ఇదే పనిచేస్తోంది.

కంచే చేనుమేస్తున్న చందం

నిబంధనల ప్రకారం ఏదైనా కేసు మూసివేత కోసం చర్యలు చేపట్టాలంటే పోలీసులు ముందుగా ఫిర్యాదుదారుకి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఫైబర్ నెట్ కేసులో సీఐడీ అధికారులు ఇక్కడే మోసపూరితంగా వ్యవహరించారు. ఫైబర్ నెట్ అక్రమాలపై 2021లో అప్పటి ఏపీ ఫైబర్ నెట్ లిమిటెడ్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి ఫిర్యాదు చేశారు. అయితే ఆయనను పక్కనబెట్టి... ఫిర్యాదు దారుగా ఫైబర్‌నెట్ అప్పటి ఎండీ మధుసూధన్ రెడ్డిని సీఐడీ అధికారులు తెరపైకి తెచ్చారు. ఈ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ ఇచ్చిన తీర్పులో హైకోర్టు.. గౌతంరెడ్డి పేరునే ఫిర్యాదుదారుగా స్పష్టంగా పేర్కొనడం ఇక్కడ గమనార్హం. అయితే చంద్రబాబుపై కేసు మూసివేసేందుకు ఫిర్యాదు దారు అయిన గౌతంరెడ్డి అంగీకరించే ప్రసక్తే ఉండకపోవడంతో సీఐడీ చట్ట విరుద్ధ మార్గాన్ని ఎంచుకుంది. చంద్రబాబుపై ఫైబర్ నెట్ కుంభకోణం కేసును మూసివేసేందుకు ఫైబర్‌నెట్ అప్పటి ఎండీ మధుసూధన్‌రెడ్డిని ఫిర్యాదుదారుగా కోర్టుకు తీసుకొచ్చి కేసు మూసివేతకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పించింది. చంద్రబాబు, సీఐడీ ఒత్తిడికి తలొగ్గిన మధుసూధన్‌రెడ్డి సైతం సీఐడీ చెప్పినట్లు చేశారు. వాస్తవానికి ఇదే మధుసూధన్‌రెడ్డి ఏపీ ఫైబర్ నెట్ ఎండీగా ఫైబర్‌నెట్ పనుల విషయంలో థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించారు. కాంట్రాక్ట్ పొందిన సంస్థ 80 శాతం పనులను పూర్తి చేయలేదని తేల్చారు. భారీ మొత్తంలో నిధుల దుర్వినియోగం జరిగిందని మధుసూధన్‌రెడ్డి స్పష్టంగా చెప్పారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు చంద్రబాబుపై కేసు మూసివేతకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పడం పలు అనుమానాలు కలిగిస్తోంది. సీఐడీ గతంలో సేకరించిన ఆధారాలకు మధుసూధన్‌రెడ్డి ఇప్పుడు చెబుతున్న దానికి పొంతనే లేదు.

చంద్రబాబు కుయుక్తులకు నిదర్శనం

తన అవినీతిపై ఎప్పుడు కేసులు నమోదైనా అవి అసలు విచారణ వరకూ రాకుండా.. సాంకేతిక కారణాలతో కొట్టేయించుకోవడమో, మూసివేయించుకోవడమో చంద్రబాబుకు అలవాటు. తద్వారా ఆయన కేసుల నుంచి బయటపడుతున్నారు. ఇన్నేళ్లుగా ఆయన ఇదే చేస్తూ వస్తున్నారు. వ్యవస్థల్లో ఉన్న లొసుగులను తనకు అనుకూలంగా వినియోగించుకోవడంలో చంద్రబాబు కుయుక్తులకు ఇది తిరుగులేని నిదర్శనం. తాజా పరిస్థితిని చూస్తే.. తనపై నమోదైన పలు కుంభకోణాల కేసులను దర్యాప్తు చేస్తూ వచ్చిన సీఐడీ, ఏసీబీ అధికారులను చంద్రబాబు తాను అధికారంలోకి వచ్చీ రావడంతోనే మార్చేశారు. తనకు అనుకూలంగా ఉన్న వారిని ఏసీబీ, సీఐడీకి తెచ్చారు. వారంతా చంద్రబాబు పట్ల స్వామి భక్తి ప్రదర్శిస్తున్నారు. అందులో భాగంగానే చంద్రబాబుపై నమోదైన కుంభకోణాల కేసుల మూసివేతకు క్లోజర్ రిపోర్టులు దాఖలు చేయడం ప్రారంభించారు.

నేడు విచారణ

చంద్రబాబుపై కేసు మూసివేత కోసం సీఐడీ దాఖలు చేసిన క్లోజర్ రిపోర్ట్‌పై గౌతంరెడ్డి ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేశారు. ఫైబర్ నెట్ కుంభకోణం ఎలా జరిగింది.. ఎంత మేర ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లింది.. తదితర వివరాలను అందులో పొందుపరిచారు. సీఐడీ క్లోజర్ రిపోర్ట్‌ని పరిగణనలోకి తీసుకునే ముందు ఫైబర్‌నెట్ కుంభకోణంపై సీఐడీ సేకరించిన ఆధారాలను, చార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన తన పిటిషన్‌లో ఏసీబీ కోర్టును కోరారు. పరపతి కలిగిన వ్యక్తులను రక్షించేందుకు సీఐడీ దాఖలు చేసిన ఈ క్లోజర్ రిపోర్ట్‌ని తిరస్కరించాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. గౌతంరెడ్డి దాఖలు చేసిన ఈ ప్రొటెస్ట్ పిటిషన్‌తో పాటు సీఐడీ దాఖలు చేసిన క్లోజర్ రిపోర్ట్‌పై ఏసీబీ కోర్టు సోమవారం విచారణ జరపనుంది. సీఐడీ క్లోజర్ రిపోర్ట్‌పై ఏసీబీ కోర్టు నిర్ణయం వెలువరించే ముందు గౌతంరెడ్డి ప్రొటెస్ట్ పిటిషన్‌పై విచారణ జరపాల్సి ఉంటుంది.

స్కామ్‌స్టర్ చంద్రబాబే..

కేంద్ర నిధులతో చేపట్టే ప్రాజెక్టులను కూడా అడ్డగోలుగా అస్మదీయులకు కట్టబెట్టి ప్రజాధనాన్ని కొల్లగొట్టడంలో చంద్రబాబు మాస్టర్‌మైండ్ అనడానికి ఫైబర్ నెట్ కుంభకోణమే తార్కాణం. కేంద్రం నిధులతో చేపట్టిన ఈ ప్రాజెక్ట్‌ను తన అస్మదీయుడైన వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీకి కట్టబెట్టి నిధులు కొల్లగొట్టారని సీఐడీ పూర్తి ఆధారాలతో నిగ్గు తేల్చింది. అందుకే ఏ1గా చంద్రబాబు, ఏ2గా టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ వేమూరి హరికృష్ణ, ఏ3గా ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్, ఇన్‌క్యాప్ సంస్థలకు అప్పటి ఎండీ కోగంటి సాంబశివరావులతోపాటు మరికొందరిని నిందితులుగా పేర్కొంది. వారిపై ఐపీసీ సెక్షన్లు 166, 167, 418, 465, 468, 471, 409, 506 రెడ్ విత్ 120(బి)లతోపాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 13(2), రెడ్ విత్ 13(1)(సి)(డి) ప్రకారం కేసు నమోదు చేసింది. ఫైబర్‌నెట్ ప్రాజెక్ట్ పేరుతో చంద్రబాబు ముఠా ప్రజాధనాన్ని ఎలా కొల్లగొట్టిందీ సీఐడీ 2024లో సమర్పించిన తన చార్జ్‌షీట్‌లో సవివరంగా వివరించింది. అక్రమాల పర్వం చూస్తే..

- మొత్తం రూ.2 వేల కోట్ల ఈ ప్రాజెక్టు మొదటి దశలో రూ.333 కోట్ల మేర అక్రమాలు జరిగాయి.
- పక్కా పథకంలో భాగంగా హరికృష్ణ ప్రసాద్‌ను ఏపీ ఈ–గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యునిగా చేర్చారు. ప్రాజెక్టు కోసం బిడ్లు దాఖలు చేసే కంపెనీకి చెందిన వారు టెండర్ల మదింపు కమిటీలో ఉండకూడదన్నది నిబంధనను చంద్రబాబు ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తూ, హరికృష్ణ ప్రసాద్‌ను ఫైబర్‌నెట్ టెండర్ల మదింపు కమిటీలో సభ్యుడిగా కూడా నియమించారు.
- ఇక ఎలాంటి మార్కెట్ సర్వే చేపట్టకుండానే ఈ ప్రాజెక్ట్ కింద సరఫరా చేయాల్సిన పరికరాలు, వాటి నాణ్యతను ఖరారు చేసి ప్రాజెక్ట్ విలువను అమాంతంగా పెంచేశారు.
- ఈ ప్రాజెక్ట్ టెండర్ల ప్రక్రియ చేపట్టే నాటికి టెరాసాఫ్ట్ కంపెనీ ప్రభుత్వ బ్లాక్ లిస్ట్‌లో ఉంది. పౌర సరఫరాల శాఖకు ఈపోస్ యంత్రాల సరఫరాలో విఫలమవడం దీనికి కారణం. కానీ చంద్రబాబు ఆ కంపెనీని బ్లాక్ లిస్టు నుంచి ఏకపక్షంగా తొలగించారు.
- అనంతరం పోటీలో ఉన్న పలు కంపెనీలను పక్కనబెట్టేశారు. దీనిపై పేస్ పవర్ అనే కంపెనీ అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ పట్టించుకోనే లేదు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను కూడా సాంకేతిక కారణాలతో అనర్హులుగా చేసి మరీ టెరాసాఫ్ట్‌కే ప్రాజెక్టును కట్టబెట్టారు.
- టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని పట్టుబట్టిన అధికారి బి.సుందర్‌ను హఠాత్తుగా బదిలీ చేసి తమకు అనుకూలమైన అధికారులను నియమించారు.
- టెండర్ల ప్రక్రియ మొదలైన తరువాత కూడా టెరాసాఫ్ట్ కంపెనీ తమ కన్సార్షియంలో మార్పులు చేసి సాంకేతికంగా అధిక స్కోర్ సాధించేందుకుగాను వివిధ పత్రాలను ట్యాంపర్ చేశారు.
- ప్రాజెక్ట్‌ను అమలు చేయడంలో కూడా టెరాసాఫ్ట్ కంపెనీ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న నాణ్యత ప్రమాణాలను ఏ మాత్రం పట్టించుకోలేదు. దాంతో 80 శాతం ప్రాజెక్టు పనులు నిరుపయోగంగా మారాయి.
- మరోవైపు షెల్ కంపెనీల ద్వారా ప్రజాధనాన్ని అక్రమంగా తరలించారు. వేమూరి హరికృష్ణ తన సన్నిహితుడు కనుమూరి కోటేశ్వరరావు సహకారంతో కథ నడిపించారు. వేమూరికి చెందిన కాఫీ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఫ్యూచర్ స్పేస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలలో కనుమూరి కోటేశ్వరరావు భాగస్వామిగా ఉన్నారు.
- వేమూరి హరికృష్ణ, తుమ్మల గోపీచంద్, రామ్‌కుమార్ రామ్మూర్తిలతో కలసి విజయవాడ కేంద్రంగా నెటాప్స్ ఫైబర్ సొల్యూషన్స్ ఎల్ఎల్‌పీ అనే మ్యాన్‌పవర్ సప్లై కంపెనీ పేరిట ఓ షెల్ కంపెనీని సృష్టించారు. ఆ కంపెనీ ఫైబర్ నెట్ ప్రాజెక్టుకు సిబ్బందిని సమకూర్చినట్లు, పర్యవేక్షించినట్లు కథ నడిపించారు.
- ఈ ప్రాజెక్టుతో సంబంధం ఉన్న టెరాసాఫ్ట్ కంపెనీ, ఇతర కంపెనీలకు చంద్రబాబు ప్రభుత్వం ఏకంగా రూ.284 కోట్లు విడుదల చేసింది. నకిలీ ఇన్వాయిస్‌లతో ఆ నిధులను కొల్లగొట్టి, కనుమూరి కోటేశ్వరరావు ద్వారా అక్రమంగా తరలించారు. వాటిలో రూ.144 కోట్లను షెల్ కంపెనీల ద్వారా తరలించారు.
- ఇక నాసిరకమైన పనులతో కూడా ప్రభుత్వ ఖజానాకు రూ.119.8 కోట్ల నష్టం వాటిల్లింది.

కోటి సంతకాల కార్యక్రమాల్లో స్వల్పమార్పు

- 17న గవర్నర్‌తో వైఎస్ జగన్‌తో పాటు ముఖ్యనేతల సమావేశం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో– ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమాల్లో స్వల్పమార్పులు చేసినట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో – ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో ఆదివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి సంతకాల ప్రజాఉద్యమానికి అన్ని నియోజకవర్గాల్లో అనూహ్యస్పందన వచ్చిందన్నారు. కోటి సంతకాలు అనుకుంటే అంతకుమించి వచ్చాయని.. తద్వారా మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే కొనసాగించాలని ప్రజలు స్పష్టం చేశారని చెప్పారు. ఈనెల 16న రాష్ట్రపతి పర్యటన కారణంగా గవర్నర్ అపాయింట్‌మెంట్ 17న ఖరారైందని తెలిపారు. సేకరించిన సంతకాల ప్రతులను నియోజకవర్గ కేంద్రాల్లో ఈ నెల10న ప్రజలు, మీడియా ముందు ప్రదర్శించి వారి సమక్షంలోనే బాక్సుల్లో సర్ది వాహనంలో జిల్లా పార్టీ కార్యాలయానికి పంపాలని సూచించారు. జిల్లాస్థాయి కార్యక్రమాన్ని ఈ నెల13వ తేదీకి బదులు 15వ తేదీకి మార్చినట్లు తెలిపారు. జిల్లాస్థాయి కార్యక్రమంపై నాయకులంతా దృష్టిపెట్టి విజయవంతం చేయాలని కోరారు. ఆ రోజు జిల్లాస్థాయిలో ర్యాలీలు నిర్వహించి అక్కడి నుంచి విజయవాడ బయలుదేరాలని సూచించారు. 17వ తేదీన గవర్నర్‌ను మాజీ సీఎం వైఎస్ జగన్‌తో పాటు కొందరు ముఖ్యనాయకులు కలిసి సంతకాల ప్రతులను అందిస్తారని చెప్పారు. పార్టీ కేంద్రకార్యాలయం ఇన్‌చార్జి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ స్వల్ప మార్పులను నాయకులంతా గమనించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

న్యాయశాఖ సిబ్బందికీ వేతన వెతలు



విశాఖ లీగల్: రాష్ట్రంలోని ప్రత్యేక న్యాయస్థానాల న్యాయమూర్తులు, సిబ్బందికి ఆదివారం రాత్రి వరకు కూడా జీతాలు విడుదల కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం జీతాలను విడుదల చేయకపోవడంతో న్యాయశాఖ ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా.. ఎస్సీ, ఎస్టీ కోర్టులు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు, ఇతర ప్రత్యేక కోర్టుల సిబ్బందికి ఈనెల జీతాలు అందలేదు. దీంతో అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే జీతాలు విడుదల చేయాలని సిబ్బంది కోరుతున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,000 నుంచి 3,000 మంది సిబ్బందికి ప్రతీనెలా జీతాలు సక్రమంగా అందడంలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. డిసెంబరు 7వ తేదీ నాటికి కూడా జీతాలు అందలేదని విశాఖలోని న్యాయ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తంచేశారు.

‘ఉపాధి’కి పని గండం!

రాష్ట్రంలో జూలై తరువాత ఉపాధి కూలీలకు కూలి డబ్బులు చెల్లింపులు బంద్

సాక్షి, అమరావతి: ఒకపక్క ఏడున్నర లక్షల ఉపాధి హామీ జాబ్ కార్డుల తొలగింపు.. మరోవైపు దాదాపు ఐదున్నర కోట్ల పనిదినాల కోతలు.. ఇంకోవైపు లేబర్ కాంపొనెంట్ కింద నాలుగు నెలలకుపైగా ఉపాధి కూలీలకు వేతనాల బకాయిలు..! ఉపాధి పనులనే నమ్ముకున్న గ్రామీణ నిరుపేదలను చంద్రబాబు సర్కారు తీవ్ర ఇక్కట్లకు గురి చేస్తోంది. రాష్ట్రంలో ఇప్పటికే దాదాపు 17 శాతం జాబ్ కార్డులు ఏరివేసింది. పనిదినాల్లోనూ కోతలు విధిస్తూ, చేసిన పనులకు వేతనాలు చెల్లించకుండా అగచాట్లకు గురి చేస్తోంది. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు చేసిన కూలీలకు గత నాలుగున్నర నెలలుగా వేతనాలు (కూలి డబ్బులు) చెల్లించకపోవడంతో పేదలు దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారు. స్వయంగా టీడీపీకి చెందిన పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా పేదలకు రూ.381 కోట్ల మేర ఉపాధి హామీ కూలి డబ్బుల బకాయిలు పేరుకుపోవడం గమనార్హం. ఈ ఏడాది జూలై 27వతేదీ తర్వాత రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం పనులు చేసిన కూలీలెవరికీ వేతనాలు అందలేదని సమాచారం.

మూడో వంతు ఎస్సీ, ఎస్టీలే..

చంద్రబాబు సర్కారు రాష్ట్రంలో ఇటీవలే 18.63 లక్షల మంది జాబ్ కార్డు(7.48 లక్షల కుటుంబాలు)లను తొలగించిన విషయం తెలిసిందే. ఏటా ఏపీలో 47 లక్షల కుటుంబాలు ఈ పథకంలో పనులు చేసుకుంటూ సుమారు రూ.ఆరున్నర వేల కోట్ల మేర వేతనాల రూపంలో లబ్ధి పొందుతున్నాయి. ఇందులో మూడోవంతుకు పైగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలే ఉన్నాయి. గతేడాది జూన్‌లో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ఉపాధి హామీ కూలీలకు రూ.వందల కోట్ల మేర వేతన బకాయిలు పేరుకుపోతున్నాయి. కూలి డబ్బుల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొందని వ్యవసాయ కార్మిక సంఘాలు వాపోతున్నాయి. ఈ ఏడాది సంక్రాంతి, శివరాత్రి, ఉగాది, దీపావళి సమయంలో నిరుపేదలు తాము చేసిన కూలి పనుల డబ్బుల కోసం ఆర్తిగా ఎదురు చూస్తూ, అవి చేతికి అందకపోవడంతో అవస్థలు ఎదుర్కొన్నారు.

ఐదున్నర కోట్ల పని దినాలకు ఎసరు..!

చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల కల్పన తగ్గిపోయినట్లు అధికారిక గణాంకాలే పేర్కొంటున్నాయి. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2023–24లో రాష్ట్రంలో ఏప్రిల్ – నవంబరు మధ్య 21.37 కోట్ల పనిదినాల పాటు పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించగా ఇప్పుడు చంద్రబాబు సర్కారు 2025–26 ఏప్రిల్ – డిసెంబరు 7వతేదీ నాటికి కేవలం 15.94 కోట్ల పనిదినాలను మాత్రమే కల్పించింది.

జగన్ హయాంలో ఒక్క జిల్లాలోనే కూలీలకు రూ.2,700 కోట్లు

రాష్ట్రంలో వలసలు ఎక్కువగా ఉండే విజయనగరం జిల్లాలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2020–21లో ఉపాధి కూలీలకు వేతనాల రూపంలో రూ.731 కోట్ల మేర లబ్ధి చేకూర్చింది. ఈ ఒక్క జిల్లాలోనే గత ప్రభుత్వం లేబర్ కాంపొనెంట్ కింద ఐదేళ్లలో రూ.2,700 కోట్లకుపైగా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించింది. అదే జిల్లాలో ఇప్పుడు సీఎం చంద్రబాబు సర్కారు 2024–25లో రూ.407 కోట్లు, ఈ ఆర్థిక ఏడాదిలో ఇప్పటి వరకు సుమారు రూ.230 కోట్లు మాత్రమే కూలీలకు వేతనాలు చెల్లింపులు చేసింది.

ఆర్నెలల్లో రూ.435.14 కోట్లు నష్టపోయిన పేదలు..

రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్–సెప్టెంబరు మధ్య చంద్రబాబు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద పనుల కల్పన తగ్గించడం వల్ల అంతకు ముందు ఏడాదితో పోల్చితే ఆర్నెలల్లో రూ.435.14 కోట్ల మేర నష్టపోయినట్లు ఓ స్వచ్ఛంద సంస్థ నిర్ధారించింది.

- 2023–24లో గత ప్రభుత్వంలో ఉపాధి కూలీలు రూ.6,277 కోట్ల మేర లబ్ధి పొందగా 2024–25లో రూ.6,183 కోట్లు మేర మాత్రమే ప్రయోజనం పొందారు.

కొనసాగిన ఇండిగో విమానాల రద్దు

గోపాలపట్నం (విశాఖ)/గన్నవరం/కోరుకొండ/శంషాబాద్: ఇండిగో విమానాల రద్దు కొనసాగుతోంది. విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆదివారం కూడా 10 విమానాలను ఆ సంస్థ రద్దు చేసింది. ఆదివారమైనా తమ ప్రయాణాలు పునరుద్ధరించుకుందామని భావించిన ప్రయాణికులకు నిరాశే మిగిలింది. హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కత్తా వెళ్లవలసిన విమానాలను ఇండిగో రద్దు చేసింది. మొత్తంగా ఆదివారం 11 విమానాలు రాకపోకలు సాగించాయని విశాఖ విమానాశ్రయం అధికారులు తెలిపారు. కాగా.. ముంబై–విజయవాడ మధ్య నడిచే ఇండిగో విమాన సర్వీస్ ఆదివారం రద్దయింది. మిగిలిన ఇండిగో విమాన సర్వీస్‌లు యధావిధిగానే నడిచాయి. తూర్పు గోదావరి జిల్లా మధురపూడిలోని రాజమహేంద్రవరం విమానాశ్రయానికి రావాల్సిన విమాన సర్వీసులన్నీ ఆదివారం యథాతథంగా నడిచాయి.

శంషాబాద్‌లో 112 విమానాల రద్దు

శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆరో రోజు ఆదివారం మొత్తం 51 అరైవల్, 61 డిపార్చర్ విమానాలను రద్దు చేసినట్లు ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. ఇందులో దేశంలోని ప్రధాన నగరాలకు వెళ్లే సర్వీసులతోపాటు చిన్న నగరాలకు రాకపోకలు సాగించే సర్వీసులు కూడా ఉన్నాయి. అయితే షెడ్యూల్ ప్రకారం కొన్ని సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ అవి కూడా నిర్దిష్ట సమయానికి రాలేదు.

అమెరికా అగ్నిప్రమాద ఘటనలో
మరో తెలుగు విద్యార్థి మృతి

చికిత్స పొందుతూ అన్వేష్ సారపెల్లి మృతి

న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్ రాష్ట్రంలో ఉన్న అల్బనీ ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాదంలో రాష్ట్రానికి చెందిన తెలుగు విద్యార్థి ఉడుముల సహజారెడ్డి (24) మృతిచెందగా ఆ దుర్ఘటనలో తీవ్రంగా గాయపడిన అన్వేష్ సారపెల్లి అనే తెలుగు విద్యార్థి సైతం చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయం శనివారం సామాజిక మాధ్యమ వేదికగా ప్రకటించింది. మృతుని కుటుంబ సభ్యులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని.. ఈ విషయంలో వీలైనంత సాయం చేస్తున్నామని తెలిపింది. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలుగు విద్యార్థులు సహజారెడ్డి, అన్వేష్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తులు అల్బనీలోని క్వెయిల్ స్ట్రీట్‌లో ఉన్న ఓ ఇంట్లో నివసిస్తున్నారు. ఈ నెల 4న వారి ఇంటికి ప్రమాదవశాత్తూ మంటలు అంటుకోగా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. అప్పటికే సహజారెడ్డి 90 శాతం కాలిన గాయాలకు గురవగా అన్వేష్ సైతం తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో పోలీసులు వారిని అల్బనీ మెడికల్ కేర్ సెంటర్ ఆస్పత్రికి... అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వెస్ట్‌చెస్టర్ మెడికల్ బర్న్ సెంటర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సహజారెడ్డి శుక్రవారం మృతి చెందగా అన్వేష్ శనివారం మరణించాడు.

ఇన్‌చార్జ్ సీఎండీపై సీబీఐ విచారణ జరపాలి

స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాల నేతల డిమాండ్

ఉక్కునగరం (విశాఖ): స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జ్ సీఎండీ ఏకే సక్సేనాపై తక్షణమే సీబీఐ విచారణ జరపాలని ఉక్కు పరిరక్షణ పోరాట సమితి చైర్మన్ సీహెచ్.నర్సింగరావు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, వీఎస్ఈయూ ప్రధాన కార్యదర్శి పాడి త్రినాథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు.

కర్ణాటకంపై వీడని సస్పెన్స్

- సోనియా నివాసంలో కాంగ్రెస్ అధిష్టానం భేటీ
- త్వరలో మరో సమావేశం

సాక్షి బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీలో అధికార మార్పిడిపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఢిల్లీలో సోనియా గాంధీ నివాసంలో శనివారం రాత్రి అధిష్టానం నేతలు సమావేశమయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో కర్ణాటక అంశాన్ని ప్రత్యేకంగా చర్చించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. అయితే సమావేశంలో ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని, రానున్న రోజుల్లో మరోసారి సమావేశమై చర్చిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, అందరూ కలసికట్టుగానే ఉన్నారని కూడా తెలిపారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య రెండు బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌ల అనంతరం రాష్ట్రంలో సీఎం మార్పు అంశం తాత్కాలికంగా బ్రేకులు పడిన సంగతి తెలిసిందే.

సంక్రాంతికి డీకేకు శుభవార్త!

‘ఐదేళ్లు నేనే సీఎం’ అని చెప్పుకునే స్థాయి నుంచి ‘రాజకీయాల్లో ఏదీ శాశ్వతం కాదు’ అని చెప్పుకునే స్థాయి వరకూ సిద్ధరామయ్య దిగిరావడాన్ని చూస్తే, డీకే సీఎం అవ్వడం దాదాపు ఖాయం అయినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. సంక్రాంతికి డీకేకు హైకమాండ్ శుభవార్త అందించనున్నట్లు కూడా రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. డీకేను ముఖ్యమంత్రిని చేస్తే వచ్చే సాధకబాధకాలపై హైకమాండ్ ప్రధానంగా శనివారం చర్చించినట్లు కూడా తెలుస్తోంది. తమ నిర్ణయాన్ని వెల్లడించకముందు మరోసారి ఇద్దరి మధ్య సయోధ్య కుదర్చాలని హైకమాండ్ భావిస్తోంది. ఇరువురి మధ్యా మరో బ్రేక్‌ఫాస్ట్ సమావేశం జరిగే అవకాశం ఉందని అంచనా. అనంతరం ఇద్దరిని ఢిల్లీకి పిలిపించి హైకమాండ్ చర్చించనున్నట్లు భావిస్తున్నారు.

చిత్తూరు జిల్లాలో 3 స్క్రబ్ టైఫస్ కేసులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు జిల్లాలో కొత్తగా మూడు స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయి. చిత్తూరు నగరంలోని గూలింగ్స్‌పేట, పాలసముద్రం మండలం ఆముదాల, జీడీ నెల్లూరు మండలం, చిన్నమిట్టపల్లిలో ఒక్కో కేసు చొప్పున నమోదైంది. పారిశుద్ధ్య లోపం కారణంగానే ఈ వ్యాధి విజృంభిస్తోందని వైద్య అధికారులు చెబుతున్నారు. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు.

ఈ నెల 17న సీహెచ్‌ఓల ధర్నా

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో సైతం ఒప్పంద విధానంలో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారుల (సీహెచ్‌ఓ) సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నట్టు అసోయేషన్ రాష్ట్ర నాయకుడు ప్రేమ్‌కుమార్ పులి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వార్టర్స్ ఇవ్వకుండా రాత్రి 8 గంటలకు ఎఫ్ఆర్ఎస్ తప్పనిసరి అని ముడిపెట్టడం, 11గంటల పని విధానం దారుణమన్నారు. సమస్యల పరిష్కారానికి చేస్తున్న ఈ ధర్నాను సీహెచ్‌ఓలు విజయవంతం చేయాలని కోరారు.

10 నుంచి గూడ్స్ లారీలు నిలిపేస్తాం

ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఫిట్‌నెస్ ఫీజు తగ్గించకపోతే ఈ నెల 10వ తేదీ నుంచి గూడ్స్ లారీలను నిలిపివేస్తామని ది ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు ప్రకటించారు. ఆదివారం విజయవాడలోని అసోసియేషన్ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. 13 ఏళ్లు దాటిన వాహనాల ఫిట్‌నెస్ ఫీజును రూ.1,340 నుంచి రూ.33,040 కేంద్రం పెంచిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల సరకు రవాణా యజమానులపై పెనుభారం పడుతుందన్నారు. ఆ నోటిఫికేషన్ అమలును నిలిపివేసే అధికారం రాష్ట్రానికి ఉందని వివరించారు. ఫీజులు తగ్గించేలా సీఎం చంద్రబాబు వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేదంటే ఏపీలోని 10 వేల గూడ్స్ లారీలను నిలిపివేసి తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. గూడ్స్ వాహనాలకు వీఎల్ టీడీలు అవసరం లేదని గుర్తు చేశారు. తమపై భారం పడకుండా కేంద్రం, రాష్ట్రం చూడాలని కోరారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899

రామ్మోహన్.. రాజీనామా చెయ్!

'ఇండిగో' సంక్షోభంతో దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న డిమాండ్లు

సాక్షి, న్యూఢిల్లీ: 'ఇండిగో' సంక్షోభం నేపథ్యంలో అంతర్జాతీయంగా దేశం పరువు మసకబారడం.. రష్యా అధ్యక్షుడు పుతిన్ మన దేశంలో పర్యటిస్తున్న సమయంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం.. లక్షలాది మంది విమాన ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురి కావడం.. ఎయిర్‌పోర్టుల్లో కన్నీళ్లు పెట్టడం.. ఐదారు రోజులు గడిచిపోయినా కష్టాలు తీరకపోవడం.. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు అసమర్థ పనితీరుతో దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతుండటంతో ఇక ప్రధాని కార్యాలయం నేరుగా రంగంలోకి దిగినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు రెండు నెలల ముందే ఈ సమస్య తన దృష్టికి వచ్చినా పట్టించుకోకపోవడంతోనే సమస్య జటిలమైందని కేంద్ర ప్రభుత్వం ఒక నిశ్చితమైన అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. దీంతో ప్రధాని కార్యాలయమే నేరుగా రంగంలోకి దిగాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ప్రధాని పర్యవేక్షణలో పీఎంవో ఉన్నతాధికారులు నేరుగా ఇండిగో సీఈవో, ఇతర అధికారులతో చర్చలు జరిపారు. సంక్షోభం ముంచుకొస్తోందని పసిగట్టిన ఆల్ ఇండియా పైలెట్ల అసోసియేషన్ రెండు నెలల క్రితమే ఈ విషయాన్ని పౌర విమానయాన శాఖ దృష్టికి తెచ్చింది. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు కనీసం స్పందించలేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో దారుణంగా విఫలమయ్యారు. సమస్యకు మూల కారణం తెలిసినా దాన్ని పరిష్కరించకుండా ప్రయాణికులకు రీఫండ్ ఇప్పిస్తామంటూ ఎల్లో మీడియాలో ప్రచారానికి తెర తీశారు. కేంద్ర మంత్రి పదవిలో ఉంటూ కేవలం ఎల్లో మీడియాను మాత్రమే పిలిపించుకోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఎన్డీఏలోని కీలక నేతలు సైతం ఆయన కేంద్ర మంత్రా? లేక టీడీపీ మంత్రా? అని విస్తుపోయినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇంత అసమర్థ మంత్రి, చేతకాని మంత్రి, ఒక్క స్టేట్‌మెంట్ కూడా ఇవ్వలేని మంత్రి, టికెట్ల ధరల మోత, సంక్షోభాన్ని అరికట్టలేని మంత్రి మాకొద్దు..! అంటూ జాతీయ స్థాయిలో మీడియాలో, సోషల్ మీడియాలో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. రామ్మోహన్ నాయుడు పౌర విమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి దేశంలో ఏదో ఒక మూల ఏదో ఒక సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని, అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం నుంచి తాజాగా ఇండిగో సంక్షోభం దాకా దీనికి నిదర్శనమని పేర్కొంటున్నారు. రామ్మోహన్‌నాయుడు తక్షణం కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తుండటం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఫోన్ కాల్స్‌కి కేంద్ర మంత్రి స్పందించడం లేదని.. ప్రజల సమస్యను గాలికొదిలేసి స్నేహితులతో కలిసి పార్టీలు, నెట్‌ఫ్లిక్ చూసుకోవడం, రీల్స్ చేసుకోవడంలో మంత్రి బిజీగా ఉన్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇండిగో సంక్షోభం తలెత్తిన మూడోరోజు న్యూఢిల్లీలో స్నేహితుడి పార్టీలో పాల్గొన్న రామ్మోహన్‌నాయుడి ఫోటోలను షేర్ చేస్తూ మండిపడుతున్నారు. గతంలో అహ్మదాబాద్ విమానాశ్రయంలో ప్రమాద సమయంలో కూడా సంఘటనాస్థలికి వెళ్లి వాటిని రీల్స్‌గా చేసుకుని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్న సంఘటలను గుర్తు చేస్తున్నారు.

దేశం దిగ్భ్రాంతిలో ఉంటే వీడియోలా!

ఇండిగో సంక్షోభం నేపథ్యంలో పౌరవిమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకు కేంద్రం చెక్ పెట్టనుందా? అనే చర్చ దేశ రాజధానిలో జోరుగా సాగుతోంది. అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం మొదలు ఇండిగో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో పూర్తిగా విఫలమైన రామ్మోహన్ నాయుడుపై ప్రధాని కార్యాలయం సహా కేంద్ర పెద్దలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఈ ఏడాది జూన్ 12న అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా ఘోర ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 230 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. దేశ చరిత్రలో ఇది చీకటి రోజుగా నిలిచింది. సంఘటన స్థలానికి వెళ్లిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఓ వీడియోను తన సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్ట్ చేశారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మ్యూజిక్, షర్ట్‌ను మోచేతి వరకు మడతపెట్టడం చూసిన నెటిజన్లు మండిపడ్డారు. దేశం అంతా దిగ్భ్రాంతిలో ఉంటే వీడియోలు చేసుకోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రామ్మోహన్ నెట్ ప్రాక్టీస్ చేస్తున్నాడా?

- లేక రీల్స్, నెట్‌ఫ్లిక్స్ చూస్తున్నాడా?
- ధైర్యముంటే ఈరోజు ఆయన నా ప్రశ్నలకు సమాధానం చెప్పమనండి
- టీడీపీ ప్రతినిధుల్ని ఉతికిపారేసిన రిపబ్లిక్ టీవీ అర్నాబ్ గోస్వామి

సాక్షి, అమరావతి: ఇండిగో ఎయిర్‌లైన్స్ సంక్షోభం పరిష్కరించడంలో ఘోరాతి ఘోరంగా విఫలమైన కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుపై జాతీయ మీడియా తీవ్రస్థాయిలో దుమ్మెత్తిపోస్తోంది. ఇంత పెద్ద సంక్షోభం తలెత్తితే మంత్రి ఏం చేస్తున్నారు? నెట్ ప్రాక్టీస్ చేస్తున్నారా, లేక రీల్స్ చేస్తున్నారా.. నెట్‌ఫ్లిక్స్‌లో వీడియోలు చూస్తున్నారా అంటూ కడిగిపారేస్తోంది. రిపబ్లిక్ టీవీలో ప్రెజెంటర్ ఆర్నాబ్ గోస్వామి లేవనెత్తుతున్న ప్రశ్నలకు బదులివ్వలేక తెలుగుదేశం పార్టీ ఆపసోపాలు పడుతోంది. తొలుత.. రిపబ్లిక్ టీవీలో చర్చలో పాల్గొన్న దీపక్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ఈ పరిస్థితిని నారా లోకేశ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.. ఇందుకోసం వార్ రూమ్‌ని కూడా ఏర్పాటుచేశార'ంటూ ఆయన చేసిన వ్యాఖ్యలతో జాతీయ స్థాయిలో టీడీపీ అభాసుపాలైన విషయం తెలిసిందే. ఇక ఆదివారంకొమ్మారెడ్డి పట్టాభిరాంని పంపిస్తే దానికి రెండింతలు పరాభవం పార్టీ మూటగట్టుకుంది. ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ఇదే పెద్ద చర్చగా నడుస్తోంది. అర్నాబ్ గోస్వామి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఇద్దరూ నీళ్లనమిలారు.

ధైర్యం ఉంటే చర్చలో పాల్గొనమనండి..

పట్టాభిని అర్నాబ్ ఏమి అడిగారంటే.. మీ తెలుగుదేశం పార్టీకి చెందిన కె. రామ్మోహన్‌నాయుడు విమానయాన మంత్రి శాఖ నిర్వహిస్తున్నారు. ఆయన ఏం చేస్తున్నారు? నెట్ ప్రాక్టీస్ చేస్తున్నారా అంటూ పట్టాభిని సూటిగా ప్రశ్నించారు. సమస్యను తెలుసుకోవడానికి విమానయాన శాఖ మంత్రికి నేను ఫోన్ చేస్తే.. హలో హలో అంటూ ఫోన్ పెట్టేస్తున్నాడని.. ధైర్యం ఉంటే ఈరోజు చర్చలో మంత్రి పాల్గొనాలంటూ పట్టాభికి సవాల్ విసిరారు. ఈ రోజు నా చర్చలో ప్రజలకు సమాధానం చెప్పాలంటూ రెట్టించి అడిగారు. వెంటనే పట్టాభి కలుగజేసుకుని, మంత్రి సమస్యను పరిష్కరించడానికి కృషిచేస్తున్నారనగానే.. సమస్య పరిష్కారమంటే కూర్చుని నెట్‌ఫ్లిక్స్ వీడియోలు చూడటమా! అంటూ అర్నాబ్ గాలితీసేశారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉంది అని పట్టాభి చెప్పగా.. అయితే మీ మంత్రిని నా కాల్ లిఫ్ట్ చేయమనండి అంటూ అర్నాబ్ సవాల్ విసిరారు. ఈరోజు ఇంతమంది ప్రజలు ఇబ్బందులుపడుతుంటే దాన్ని తెలుసుకోవడానికి ఫోన్‌చేస్తే మీ మంత్రి హలో హలో అంటూ ఫోన్ పెట్టేస్తారా అంటూ మండిపడ్డారు. ఇలా రెండ్రోజులుగా జాతీయస్థాయిలో తెలుగుదేశం పార్టీ అప్రతిష్టపాలు కావడంతోపాటు సామాజిక మాధ్యమాల్లోనూ పరువు పోవడంతో ఆ పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు.

ఉద్యోగులపై పనిభారం తగ్గించాలి

ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

సాక్షి,అమరావతి: ప్రభుత్వ కార్యాలయాల్లో నాలుగో తరగతి ఉద్యోగుల ఖాళీలను వెంటనే భర్తీ చేసి ప్రస్తుతమున్న ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ కోరారు. విజయవాడలోని ఏపీ ఎన్జీవో హోంలో ఆదివారం ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగోతరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. దీనికి హాజరైన విద్యాసాగర్ మాట్లాడుతూ..ఉద్యోగులకు పదోన్నతులు, వేతన సవరణ వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాగా, ఆల్ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా వీఎస్ సాయిరాం (ఎన్టీఆర్), అధ్యక్షుడిగా ఎన్.చంద్రశేఖర్ (విశాఖ), సహాధ్యక్షుడిగా వి.శ్రీనివాసరావు (విజయనగరం), కోశాధికారిగా మాణిక్యాలరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.బాలరాజు (కృష్ణా)ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి డీఎస్ఎన్ రెడ్డి ప్రకటించారు.

యాదవ ద్రోహి చంద్రబాబు

యాదవులకు పదవులిచ్చి మేలు చేసిన నేత వైఎస్ జగన్

- చంద్రబాబు బీసీల్లో ఎందరికి రాజ్యసభ పదవులు ఇచ్చారు
- మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తిరుపతి లడ్డూ వ్యవహారంలో ఆవు కొవ్వు ఉందని, పంది కొవ్వు ఉందని నానాయాగీ చేసిన సీఎం చంద్రబాబుకు సుప్రీంకోర్టు అక్షింతలు వేస్తే.. ఆ విషయాన్ని పక్కదోవ పట్టించేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ప్రచారానికి ఒడిగట్టారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. వైఎస్ జగన్ యాదవులను దూషించారంటూ చంద్రబాబు ఆదేశాలతో టీడీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. యాదవ సామాజిక వర్గమంతా జగన్‌మోహన్‌రెడ్డి ఏం మాట్లాడారనే విషయాన్ని ఒకసారి చూడాలని కోరారు. చంద్రబాబే యాదవ ద్రోహి అని, యాదవ కులానికి గతం నుంచి ఆయన తీరని అన్యాయం చేశారని విమర్శించారు. టీటీడీలో యాదవులకు వంశపారంపర్య హక్కును తొలగించారని, ఎన్నికల ముందు వైఎస్ జగన్ యాదవులకు ఇచ్చిన హామీ ప్రకారం ఫైల్‌పై సంతకం చేసి యాదవుల హక్కును పునరుద్ధరించారని గుర్తు చేశారు. గొల్ల మండపాన్ని సైతం ఏర్పాటు చేశారన్నారు. వైఎస్ జగన్ హయాంలో యాదవులు, బీసీలకు ఎన్నో పదవులు కేటాయించారని గుర్తు చేశారు. యాదవులు, బీసీలకు చంద్రబాబు ఏం న్యాయం చేశారని నిలదీశారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన తనపై తణుకులో టీడీఆర్ స్కాం పేరుతో చంద్రబాబు అండ్ కో పట్టాభి ద్వారా బురదజల్లి అణగదొక్కాలని చూశారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు మంత్రి పదవి ఇచ్చి ఆదుకున్నారని గుర్తుచేశారు.

బీసీలను ఎన్ని తిట్లు తిట్టారో

గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీసీలను ఎన్ని తిట్లు తిట్టారో.. ఎంత చులకనగా చూశారో బీసీలకు తెలుసని కారుమూరి అన్నారు. నాయీ బ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానని, తాట తీస్తానని విరుచుకుపడిన విషయాన్ని ఎవరూ మర్చిపోరన్నారు ఎస్సీ కులంలో ఎవరైనా పుట్టాలనుకుంటారా అని ఎస్సీలను సైతం అవమానించారని మండిపడ్డారు. జగన్ హయాంలో నాయీ బ్రాహ్మణులు, రజకులు, రైతులు ఇలా అందరికీ వివిధ పథకాల్లో భాగంగా సంక్షేమం అందజేశారని చెప్పారు. చంద్రబాబు సూపర్ సిక్స్ అని హామీ ఇచ్చి ఏం ఇస్తున్నారని నిలదీశారు. 'చంద్రబాబులా బీసీలను జగన్‌మోహన్‌రెడ్డి ఏనాడైనా తోకలు కట్ చేస్తానన్నారా, తాట తీస్తా, తోలు తీస్తా అనే పదాలు ఎప్పుడైనా అన్నారా. కేవలం వాడు అన్న పదం తీసుకుని యాదవులను ఏదో అనేశారంటూ అపవాదులు వేయడం ఏమిటి' అని నిలదీశారు. జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాలన్నీ తీసేసి చంద్రబాబు బీసీలు, యాదవులను మోసం చేశారని మండిపడ్డారు.

జీవితం ఎక్కువగా నిరీక్షణకు సంబంధించిన విషయం.
- రోమన్ కవి హొరేస్

సాక్షి
సోమవారం, 8 డిసెంబర్ 2025

కార్పొరేట్ 'స్వర్గం'

''నేను ఎప్పుడూ స్వర్గం అనేది ఒక గ్రంథాలయంలా ఉంటుందని ఊహిస్తాను'' అన్న అర్జెంటీనా రచయిత జార్జ్ లూయీ బోర్హెస్ ప్రసిద్ధ వ్యాఖ్యానపు స్ఫూర్తిని స్వీకరిస్తూ, పబ్లిక్ లైబ్రరీలకు శ్రీకారం చుట్టింది 'కోఫోర్జ్' సంస్థ. మూడు దశాబ్దాల క్రితం 'నిట్' పేరుతో ప్రారంభమై, 2020లో 'కోఫోర్జ్'గా రీబ్రాండ్ అయిన ఈ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంపెనీ తన 'కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ'లో భాగంగా దేశవ్యాప్తంగా గొలుసుకట్టు గ్రంథాలయాలకు నడుం బిగించింది. 2024 ఫిబ్రవరిలో నోయిడాలో, 2025 జూన్‌లో గురుగ్రామ్‌లో ప్రారంభమైన ఈ గ్రంథాలయపు మూడో శాఖ 15,000 పుస్తకాలతో ఈ అక్టోబర్‌లో హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ప్రారంభమైంది. ఉదయం 9 నుంచి రాత్రి 8 దాకా సంవత్సరంలో 365 రోజులూ తెరిచి ఉండటం వీటి ప్రత్యేకత.

ఫిక్షన్, హిస్టరీ, సెల్ఫ్ హెల్ప్, రెలిజియన్ అండ్ స్పిరిచ్యువాలిటీ, సైకాలజీ, ఫిలాసఫీ, సైన్స్, పాలిటిక్స్, మేనేజ్‌మెంట్, రిఫరెన్స్ లాంటి విభాగాలతో ప్రధానంగా ఆంగ్ల పుస్తకాలతోపాటు కొద్దిస్థాయిలో హిందీ, తెలుగు విభాగాలను కూడా హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. ఉర్దూ విభాగానికి కూడా డిమాండ్ వస్తోందని చెబుతున్నారు. కావాల్సిన పుస్తకపు అందుబాటును అక్కడ ఏర్పాటుచేసిన రెండు పెద్ద టచ్ స్క్రీన్స్ మీద వెతుక్కోవచ్చు. 'చిల్డ్రెన్స్ సెక్షన్' విడిగా ఉండటం చిన్నారులను ఉత్సాహపరుస్తుంది. ది ఇల్యూమినేటెడ్ రూమి; డేనియల్స్ ఇండియా: వ్యూస్ ఫ్రమ్ ద ఎయిటీన్త్ సెంచరీ; ఎండేంజర్డ్ లాంగ్వేజెస్ ఇన్ ఇండియా; ద లైఫ్ అండ్ వర్క్స్ ఆఫ్ వాన్ గో; బిబేక్ దేబ్‌రాయ్ పది వాల్యూముల మహాభారతం; హాన్ కాంగ్ 'ద వైట్ బుక్'తో పాటు 'బిగ్ ఐడియాస్ ఎక్స్‌ప్లెయిన్డ్ సిరీస్'లో ద మూవీ, ద హిస్టరీ, ది ఎకనామిక్స్, ది ఆర్ట్ లాంటివెన్నో అందుబాటులో ఉన్నాయి.

'యోచన ముఖ్యమైనదే కానీ అసలు ప్రాధాన్యం ఉన్నది ఆచరణకే' అని సంస్థ సీఈఓ సుధీర్ సింగ్ నమ్మకం. అందుకే కాబోలు, మనకు అనుభవంలో ఉండే గ్రంథాలయాల ముతకదనానికి భిన్నంగా కార్పొరేట్స్‌కే సాధ్యమయ్యే ఒక సోఫిస్టికేషన్ ఇక్కడ కనబడుతుంది. చదవడానికి తగినంత నిశ్శబ్దం, తీర్చిదిద్దినట్టున్న ర్యాకులు, పుస్తకాలను గుట్టలుగా పోయకుండా తగినంత డిస్‌ప్లేకు ఇచ్చిన అవకాశం– బయట వేగంగా పరుగెడుతూ అద్దాల్లోంచి దూరంగా కనబడుతున్న వాహనాల హడావిడి ప్రపంచానికి భిన్నంగా, రెండు అరచేతుల్లో నెమ్మదిగా విప్పారే అక్షరాలు చూపించే లోకాలను ఇక్కడ అనుభవంలోకి తెచ్చుకోవచ్చు. 'విద్య వలన వినయం పుట్టును, వినయం వలన యోగ్యత కలుగును' అని వేమన; 'పదవులు, సంపదలు నశించును గాని జ్ఞానమనే సంపద నశించదు' అంటూ పోతన; 'పుస్తకాలు చదివే అలవాటులేనివాడికి అక్షర జ్ఞానం లేనివాడిమీద అదనపు అడ్వాంటేజీ ఏమీ ఉండ'దనే మార్క్ ట్వెయిన్ కవ్వింపు, 'ఒక పాఠకుడు చనిపోయేలోపు వెయ్యి జీవితాలు జీవిస్తాడు, అదే ఎప్పుడూ చదవనివాడు ఒక్క జీవితమే జీవిస్తాడు' అనే ఆర్.ఆర్. మార్టిన్ ఉటంకింపు బోర్డులు గ్రంథాలయ సందర్శకులను ఇట్టే పుస్తకం పట్టేలా ప్రేరేపిస్తాయి.

కృత్రిమ మేధ సృష్టించిన కవర్ పేజీల వాడకం వల్ల ఈ నవంబర్‌లో రెండు పుస్తకాలు ఒక పోటీకి అనర్హత పొందడం సాహితీ ప్రపంచంలో సంచలనానికి కారణమైంది. 65,000 డాలర్ల నగదు బహుమతితో కూడిన న్యూజిలాండ్ ప్రతిష్ఠాత్మక 'ఆక్‌హామ్ అవార్డ్' కోసం వచ్చిన ఆబ్లిగేట్ కార్నివోర్ (స్టెఫానీ జాన్సన్ కథల సంపుటి), ఏంజిల్ ట్రెయిన్(ఎలిజబెత్ స్మిథర్ నాలుగు గొలుసు నవలికలు) పుస్తకాలకు ఏఐ గీసిన ముఖచిత్రాలను వాడినట్టు గుర్తించడంతో నిర్వాహకులు వాటిని పోటీ నుంచి తప్పించారు. సాహిత్య లోకంలోకి కూడా ఏఐ చొచ్చుకువచ్చి, అంతటా డిజిటల్ జపం జరుగుతున్న కాలంలో, ప్రత్యేకించి ఒక కార్పొరేట్ సంస్థ భౌతిక పుస్తకాలను అందుబాటులోకి తేవడానికి పూనుకోవడం అభినందనీయం. మున్ముందు ఢిల్లీ, పుణె, బెంగళూరు నగరాలకూ లైబ్రరీని విస్తరించే యోచన జరుగుతోంది. సాంకేతిక పరిణామాలు, వ్యాపార నమూనాలు మారినా ఎప్పటికీ నిలబడి ఉండే దీర్ఘకాలిక సామాజిక మౌలిక వసతులుగా ప్రజా గ్రంథాలయాలను చూస్తున్నామని 'కోఫోర్జ్' చెబుతోంది. శుభం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.చవితి రా.9.21 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** పునర్వసు ఉ.9.24 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** సా.5.09 నుండి 6.41 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.14 నుండి 12.56 వరకు తదుపరి ప.2.25 నుండి 3.10 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.09 నుండి 8.40 వరకు, **సంకటహర చతుర్థి.**

సూర్యోదయం : 6.22
సూర్యాస్తమయం: 5.22
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

ఏఐ శక్తి



కృత్రిమ మేధకు మన జీవితాలను, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మార్చగల శక్తి ఉంది. ఆ మార్పును మెరుగైన మార్పుగా మార్చుకోగల శక్తి భారతదేశానికి ఉంది. ఏఐని ఒక అవకాశంగా మాత్రమే చూడకండి. ఏఐ కల్పిస్తున్న అవకాశాల కోసం వేట సాగించండి.

– గీతా గోపీనాథ్, ఐఎంఎఫ్ డిప్యూటీ ఎండీ

మాట-రూపం



నేను కొన్నిసార్లు, నా ఫిలాసఫీ 'బెర్నీ శాండర్స్' (యూఎస్ సెనేటర్) అని జోక్ చేస్తాను. కానీ నా రూపం డోనాల్డ్ ట్రంప్‌లా ఉంటుంది. నా ఉద్దేశం ఏమిటంటే – "నా మాటలు మాత్రమే వినండి. నన్నెందుకు చూస్తారు?" అని! అంశాలపై తర్కించండి. ముఖాలపైన కాదు.

– అరిందమ్ చౌధరీ, రచయిత

ఉల్లాసం



వృద్ధాప్యం అంటే యవ్వనాన్ని కోల్పోవటం కాదు. కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవటం! మన చుట్టూ యువ స్నేహితులు ఉండాలి. వారు ఎలా ఆలోచిస్తున్నారో అర్థం చేసుకోవాలి. ఉల్లాసం అనేది ఆరోగ్యకరమైన దీర్ఘాయువును వరంగా ఇస్తుంది.

– షర్మిలా టాగూర్, నటి

చిట్లింపు



ఓటమిని హృదయంలోకి తీసుకోకండి. విజయాన్ని నెత్తికి ఎక్కించుకోకండి. నవ్వుతూ ముందుకు సాగిపోండి. ముఖం చిట్లించుకుని ఉండేంత పెద్దది కాదు జీవితం. మిమ్మల్ని చూసి మీరే నవ్వుకోండి. మీకు చేతకాదా... నేనొచ్చి మిమ్మల్ని చూసి నవ్వుతాను.

– అలీ అస్గర్, స్టాండ్-అప్ కమెడియన్

క్రెడిట్

నా విజయంలో నేను ప్రతిసారీ ఒకటే మాట విన్నాను: "అతడు గొప్ప దర్శకులతో చేశాడు కాబట్టి సినిమా సక్సెస్ అయింది" అని! అంటే, సినిమా సక్సెస్ అయింది కానీ, నేను సక్సెస్ అయ్యానని కాదు. ఇది ఇలాగే ఉంటుంది, మనం గొప్పవాళ్లం అయ్యే వరకూ కూడా!

– రాహుల్ భట్, నటుడు

ఆస్తి!

ఈ డైనమిక్ ప్రపంచంలో నేర్చుకోవాలనే ఆసక్తి, దేనినైనా అవగాహన చేసుకునే శక్తి ఉండటం అన్నది అత్యంత విలువైన ఆస్తి. ఆ ఆస్తిని పోగు చేసుకోవటం కోసం అవిశ్రాంతంగా శ్రమించండి. విద్యార్థి దశలోనే మార్కెట్ డిమాండ్‌లకు అనుగుణంగా తర్ఫీదు అవండి.

– డా॥ గోపాల కృష్ణ నాయక్, ఐటీ ప్రొఫెసర్

ఎన్నికల సంఘం 'నో' అనగలదా?

విశ్లేషణ

ఎస్.వై. ఖురేషీ

భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చింది. అంతకు రెండు నెలల ముందు 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ ఈ రాజ్యాంగానికి ఆమోదం లభించింది. అయితే, పూర్తి రాజ్యాంగం అమల్లోకి వచ్చేవరకూ వేచి ఉండకుండా అదే రోజున అందులోని 324 నుంచి 329 వరకు ఉన్న అధికరణాలను అమల్లోకి తెచ్చారు. అవే భారత ఎన్నికల సంఘానికి ప్రాణం పోశాయి. ఈ అధికరణాలను ముందే అమల్లోకి తేవడం వెనుక సాంకేతికపరమైన అంశాలేమీ లేవు. అది లోతుగా ఆలోచించి తీసుకున్న నిర్ణయం.

రాజ్యాంగం అమల్లోకి వచ్చాక, దాని అధికార పరిధికి లోబడి ఒక ఎన్నికైన ప్రభుత్వం ఏర్పడి తీరాలి. రాజ్యాంగ నిర్మాతలకు ఈ విషయం తెలుసు. అందుకే గణతంత్రం పుట్టకముందే భారత ఎన్నికల సంఘాన్ని మనుగడలోకి తెచ్చారు. ఫలితంగా, కార్య నిర్వాహక వ్యవస్థ ద్వారా కాకుండా, రాజ్యాంగపరంగా స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన న్యాయ నిర్ణేత (ఎన్నికల సంఘం) పర్యవేక్షణలో తొలి ప్రభుత్వం చట్టబద్ధత పొందుతుంది.

ఎందుకు సర్వ స్వతంత్రం?

అంతే ముఖ్యమైన మరో అంశం నాడు రాజ్యాంగ నిర్మాతల ముందు నిలిచింది. సమాఖ్య వ్యవస్థలో, ప్రతి రాష్ట్రం తన సొంత అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించుకోవలసి ఉంటుంది. వాటికి ఆ అధికారం ఇవ్వడం సహజమే కదా అనిపిస్తుంది! చాలా సమాఖ్య దేశాల్లో అలా జరిగింది కూడా! అయితే, రాజ్యాంగ నిర్మాతలు ఆ నమూనాను తిరస్కరించారు.

అందుకు కారణం ఉంది. రాష్ట్రాలు తమ ఎన్నికలను తిమ్మిని బమ్మిని చేయగలవని వారు భయపడ్డారు. పనుల కోసం, చదువుల కోసం, లేదా రాజకీయ కార్యకలాపాల కోసం వలస పోయే 'వెలుపలి వారి'ని ఓటర్ల జాబితాల నుంచి రాష్ట్ర ప్రభుత్వాలు తొలగిస్తాయనీ, తద్వారా ఎన్నికలను ప్రభావితం చేస్తాయనీ సందేహించారు. రాష్ట్రాలు నడిపే ఈ వ్యవస్థ ప్రాదేశికవాదానికి పనిముట్టుగా మారుతుందని రాజ్యాంగ సభలోని పలువురు సభ్యులు హెచ్చరించారు. కాబట్టి, ప్రతి భారతీయుడికీ తాను ఎక్కడ నివసించినా సరే సమానత్వం ప్రాతిపదికగా వివక్ష లేకుండా ఓటర్ల జాబితాలో స్థానం లభిస్తుందన్న గ్యారంటీ ఇచ్చేందుకు ఒక ఏకైక సర్వ స్వతంత్ర జాతీయ అధికారిక వ్యవస్థ అవసరమైంది.

ఓటర్ల జాబితాలు; పార్లమెంటు, శాసనసభల ఎన్నికలు; అలాగే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవుల ఎన్నికలపై ఆర్టికల్ 324 కింద భారత ఎన్నికల సంఘానికి 'పర్యవేక్షణ, మార్గనిర్దేశం, నియంత్రణ' అధికారాలు దఖలు పడ్డాయి. పౌరులందరికీ ఒకే విధమైన ఓటర్ల జాబితా, వివక్ష రహితమైన సార్వత్రిక వయోజన ఓటు హక్కు ఉండేలా 325, 326 అధికరణాలు పూచీ పడుతున్నాయి. ఈ రాజ్యాంగ నిబంధనలు కేవలం పరిపాలనా సౌలభ్యం కోసం రూపొందినవి కావు. గణతంత్ర పునాదులకు రక్షణ కల్పించడమే ధ్యేయంగా వీటిని పొందుపరచారు. సమగ్రత, సమన్యాయం, స్వతంత్రత అనే విలువల ప్రాతిపదికగానే ఎన్నికల వ్యవస్థ నిర్మాణం జరిగింది.

◆ న్యాయనిర్ణేత నమ్మదగిన వాడైతేనే ఆ ప్రజాస్వామ్యం సఫలీకృతం అవుతుంది. అధికారంలో ఉన్నవారికి ఎన్నికల సంఘం 'నో' చెప్పగలదని ఓటర్లు నమ్ముతారా? దాని విశ్వసనీయతకు అదే పరీక్ష.

కమిషన్‌ను బలపరిచిన తీర్పులు

దేశ అత్యున్నత న్యాయస్థానం దశాబ్దాల తరబడిగా ఈ రాజ్యాంగ దృక్పథాన్ని విస్తరించి, పరిరక్షించింది. స్వచ్ఛమైన ఎన్నికల నిర్వహణ కోసం 'చట్టం ప్రవేశించని చోట' స్వతంత్రించి చర్యలు తీసుకునేందుకు ఎన్నికల సంఘానికి లభించిన సంపూర్ణ అధికారంగా మొహిందర్ సింగ్ గిల్ (1978) కేసులో జస్టిస్ వి.ఆర్. కృష్ణయ్యర్ ఈ 324వ అధికరణాన్ని అభివర్ణించారు. కమిషన్ అధికారాలు న్యాయ చట్టాలకు పరిపూర్ణత కల్పించేవిగానే ఉంటాయనీ, అవి వాటిని పడగొట్టేవి కావనీ ఏసీ జోస్ (1984) కేసులో కోర్టు స్పష్టం చేసింది. దీని సారాంశం: ఎక్కడ చట్టం మౌనం వహిస్తోందో, అక్కడ కమిషన్ క్రియాశీలం అయితీరాలి. ఎక్కడ చట్టం మాట్లాడుతుందో, అక్కడ ఎన్నికల సంఘం ఆ మాటకు లోబడి నడచుకోవాలి.

స్వేచ్ఛాయుత, న్యాయబద్ధ ఎన్నికలు రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని టి.ఎన్. శేషన్ (1995) కేసులో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. కార్యనిర్వాహక వ్యవస్థ ప్రభావం ఏమాత్రం పడకుండా ఎన్నికల సంఘం వ్యవహరించాల్సి ఉంటుందని తేల్చి చెప్పింది. ఓటరుకు ఉన్న తెలుసుకునే హక్కును, 'నోటా'ను ఎంపిక చేసుకునే హక్కును బలోపేతం చేస్తూ ఏడీఆర్ (2002), పీయూసీఎల్ (2013) వంటి తర్వాతి తీర్పులు యావత్ ప్రక్రియలో పౌరుడిని కేంద్రబిందువు చేశాయి.

తరచూ విస్మరించే ఒక చిన్న తేడా గురించి ఇక్కడ నొక్కి చెప్పాలి. స్వేచ్ఛాయుతమైన, న్యాయబద్ధమైన ఎన్నికల కోసం వీవీప్యాట్ పేపర్ ట్రయల్ అనేది 'తప్పనిసరి అవసరం'గా సుబ్రమణియన్ స్వామి వర్సెస్ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (2013) కేసు విచారణలో సుప్రీంకోర్టు గుర్తించింది. అయితే తక్షణం దేశవ్యాప్తంగా దీన్ని ప్రవేశపెట్టాలంటూ ఉత్తర్వులు ఇవ్వలేదు. దశల వారీగా చేపడతామంటూ చేసిన ప్రతిపాదనను ఆమోదిస్తూ ఈ దిశగా కమిషన్ తీసుకుంటున్న చొరవను ప్రశంసించింది. అందుకు అవసరమైన నిధులు సమకూర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇది వ్యవస్థల నడుమ వెల్లివిరిసిన సరైన రాజ్యాంగ సమతుల్యతను ప్రతిబింబించింది.

విశ్వసనీయతను నిలబెట్టుకునేదెలా?

ఎన్నికల సంఘానికి ఉన్న అధికారం రాజ్యాంగం ద్వారా సంక్రమించింది. అయితే దాని విశ్వసనీయత మాత్రం అసాధారణమైన నిశిత సమీక్షకు లోనయ్యే సాధారణ అధికారుల మీద ఆధారపడి ఉంది. వారు తీసుకునే లక్షలాది చర్యలతో కూడిన ఆచరణలో అది నిగ్గు తేలాల్సి ఉంటుంది.

18వ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈ రాజ్యాంగ వ్యవస్థకు సరికొత్త ఒత్తిళ్లు ఎదురవుతున్నాయి. ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, ఆడిట్స్, డాష్‌బోర్డులు అన్నీ కలిసి ఓట్ల నిరూపణీయతకు హామీ ఇస్తున్నాయి. అయితే నియమ నిబంధనల పరంగా స్వతంత్రత కలిగి ఉండటం కీలకం. నియామక ప్రక్రియలు, పదవీకాల భద్రతలు విశేష అధికారాలు కావు. అవి తటస్థ వ్యవహార శైలికి వ్యవస్థాగత అవసరాలు మాత్రమే. తను నియంత్రించే కార్యనిర్వాహక వ్యవస్థ మీదే న్యాయనిర్ణేత ఆధారపడే పరిస్థితి ఉండకూడదు. పార్లమెంటు ఆమోదించే ఏ సంస్కరణ నమూనా అయినా సరే ఒకే ఒక్క పరీక్షకు నిలబడి తీరాలి. రాజకీయ అధికారానికి ఎన్నికల కమిషన్ 'నో' చెప్పగలదని సగటు ఓటరు నమ్ముతున్నాడా అనే ప్రశ్నే ఆ పరీక్ష.

సమ్మిళితం అనేది ఇప్పటికీ నెరవేరని వ్యవహారం. వలస కార్మికులు, వికలాంగులు, తొలిసారి ఓటర్లు, మహిళలు, పోలింగ్ కేంద్రాలకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొనే వయోవృద్ధులు హర్షించేదిగా ఎన్నికల ప్రక్రియ ఉండాలి. విషాదం ఏమిటంటే, ఖైదీలు పోటీ చేయొచ్చు కాని వారు ఓటేయలేరు. వారికి ఆ అవకాశం కూడా ఉండాలి. ప్రజాస్వామ్య సక్రమత గెలిచినవారి మీదే కాదు, ఎవర్ని అనుమతిస్తున్నామనే దానిమీద ఆధారపడి ఉంటుంది.

గణతంత్ర ఆవిర్భావానికి ముందే రాజ్యాంగపు 15వ ప్రకరణాన్ని మన ప్రజాస్వామ్య వ్యవస్థాపకులు ఎందుకు అమలులోకి తెచ్చారనే విషయాన్ని మనం ఒకసారి గుర్తు చేసుకోవాలి. భారత ప్రజలు తొట్టతొలిసారి ఓటేసేప్పుడు... ఏ ప్రభుత్వం ఏర్పాటు అయ్యేందుకు తాను సహాయపడుతుందో ఆ ప్రభుత్వంపై ఆధారపడకుండా స్వతంత్రంగా ఉండే వ్యవస్థ పర్యవేక్షణలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్న ధ్యేయంతో వారా చర్య తీసుకున్నారు. న్యాయనిర్ణేత నమ్మదగిన వాడైతేనే ఆ ప్రజాస్వామ్యం సఫలీకృతం అవుతుంది. ఎన్నికల కమిషన్ దేశ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టి తీరాలి.

వ్యాసకర్త కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనర్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

మహాకవి గురజాడ మార్గం

వెయ్యేళ్ళుగా వస్తున్న సాహిత్య ఒరవడిని మార్చి, మరో వెయ్యేళ్ళ ముందుచూపుతో రచనలు చేసి సంఘ సంస్కరణ కావించిన మహా కవి గురజాడ వేంకట అప్పారావు. బౌద్ధాన్ని గురజాడ విశ్వసించారు. బుద్ధిజం ఏనాడైతే మన భారతదేశం ఎల్లలు దాటి వెళ్ళిందో ఆనాటి నుండి మన దేశం వెనుకబడిందన్నారు. దేవుళ్ళూ దయ్యా లని పూజలు చేస్తాం. సాటి మనిషికి సాయపడం. అదే కదా మూర్ఖత్వం. మనకు భౌతిక వనరులు పుష్కలంగా ఉన్నాయి. వెనుకబడటానికి మూలం మూఢవిశ్వాసం. ప్రపంచ దేశాలు హేతు వాద దృక్పథంతో విజ్ఞాన శాస్త్ర ఫలాలు పొందుతుంటే మన దేశం నమ్మకాలు, ఆచారాలు అంటూ అనాలోచితంగా వెనుకబడిపోతోందని ఆయన ఉద్దేశం. రవి కాంచని చోటు కవిగాంచునన్నారు. ఆ కవి గురజాడ.

సమాజం ఆనాడు అవినీతి క్రిములమయం. మానవత్వం మంటగలిసిపోయింది. బైరాగులు, పెత్తందార్ల ఆగడాలకు అంతే లేకుండా పోయింది. దానికి తోడు పురుషాహంకారం ప్రజ్వరిల్లింది. కన్యాశుల్కం అన్న పేరుతో పసిపిల్లలను పశువుల కన్నా హీనంగా విక్రయించడం, కాటికి కాళ్ళు చాచుకుని ఉన్న ముసలివారికి ఇచ్చి వివాహం చేయడం, వితంతువుల దౌర్భాగ్యం, దొంగ జాతకాలు, సాక్ష్యాలు, గిరీశం లాటి గిర్రలు, రామప్పంతుల లాంటి జాకాల్స్, లుబ్ధావధానులు లాంటి లోభులు, అగ్నిహోత్రావధానుల్లాంటి మూర్ఖులు సమాజానికి పట్టిన చీడపీడలు.

గురజాడ విద్యా ప్రాముఖ్యాన్ని తన రచనల ద్వారా నొక్కి చెప్పారు. విద్య నేర్వడం వలన మధురవాణి సానుల్లో సంసారిగా భాసించింది. 'దిద్దుబాటు' కథలో చదువుకున్న కమలిని తన భర్త గోపాలరావుని లేఖ ద్వారా మార్చుతుంది. ఆంగ్లేయులు వారి రాజ్యాన్ని సుస్థిరం చేసుకోవడం కోసం ఆంగ్ల భాషలో విద్యను ప్రవేశపెట్టారు. స్త్రీల కోసం కోపగృహం, మైల గదులు ఉండేవి. 'మైలగియిలా ఇంగ్లీషు వారికి లక్ష్యం లేదంటాడు' గిరీశం.

గురజాడ వేంకట అప్పారావు

సాంఘిక చైతన్యం, సంఘ సంస్కరణ అవసరం అని గురజాడ ఆశించారు. 'వెనుక చూసిన కార్యమేమోయి, మంచి గతమున కొంచెమేనోయి, మందగించక ముందుకడుగేయి వెనక బడితే వెనకే నోయి' అన్నారు. మతం ఏదైనా బాధ లేదు, మనుషులు ఒక్కటిగా ఉండాలని ఉపదేశించారు. ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును, ప్రేమ నిలిపిన ప్రేమ నిలచును అంటారు గురజాడ. అలాగే సజీవ భాష, నాల్క మీద నర్తించే భాషలో నా కలం బలంగా పలుకుతుంది అన్నారు. 'దేశము ను ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా' అన్న కవి. ఇంకా 'గుడిలో రాతి దేవుని కంటే మనతో ఉన్న మనిషిని ప్రేమించాలి' అన్నారు. ఈ రెండు వాక్యాల సారమే గురజాడ వారి రచనల సందేశం.

– డా॥ జక్కు రామకృష్ణ ।
రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు, విజయనగరం

ఆర్థికాభివృద్ధికి మరో మెట్టు!

డిసెంబర్ 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది. తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్రంగా మార్చడం, రాబోయే 20 సంవత్సరాలలో రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానానికి చేర్చడం ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం ప్రకటించింది. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ఈ సమ్మిట్‌లో ఆవిష్కరిస్తారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణను తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ సంకల్పం. ప్రపంచంలోని 500 కంటే ఎక్కువ పెద్ద కంపెనీల ప్రతినిధులు, 2,000 పైగా వ్యాపార నాయకులు, నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. అనేక రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించారు.

TELANGANA RISING GLOBAL SUMMIT

విజన్ డాక్యుమెంట్ రాష్ట్ర ఆర్థిక వృద్ధి 'క్యూర్, ప్యూర్, రేర్' అనే మూడు రకాల వ్యవస్థలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించింది. హైదరాబాద్ ప్రధాన నగర కేంద్రాన్ని సాంకేతికత, ఆవిష్కరణలు, ఉన్నత స్థాయి తయారీకి ప్రపంచ కేంద్రంగా అభివృద్ధి చేయడం క్యూర్ ఉద్దేశం. రీజినల్ రింగ్ రోడ్ లోపల ఉన్న ప్రాంతాన్ని మధ్యస్థాయి తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి పారిశ్రామిక క్లస్టర్‌లు, లాజిస్టిక్స్ కేంద్రంగా తీర్చిదిద్దడం ప్యూర్ లక్ష్యం. రేర్ అంటే... రీజనల్ రింగ్ రోడ్ బయట ఉన్న గ్రామీణ ప్రాంతాన్ని వ్యవసాయ సాంకేతికత, విలువ జోడింపు ఆధారిత పరిశ్రమలకు కేంద్రంగా ప్రోత్సహించడం. ఈ వ్యూహాల ద్వారా సమ్మిళిత సమాన ఆర్థిక వృద్ధి, ప్రాంతీయ అసమా నతలు తగ్గించడం ప్రభుత్వ లక్ష్యం – విజన్ డాక్యుమెంట్ ఉద్దేశ్యం.

గ్లోబల్ సమ్మిట్‌కు ఫార్చ్యూన్–500 కంపెనీలను ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం, రీజినల్ రింగ్ రోడ్ వంటి కీలక ప్రాజెక్టుల అభివృద్ధి కొరకు పెట్టుబడులను ఆకర్షించి వాటిని కార్యాచరణలోనికి తీసుకురావటానికి ఏక గవాక్ష (సింగిల్ విండో) అనుమతి విధానాలు, భూ కేటాయింపులు వంటివాటిపై దృష్టి సారించే దిశగా సంప్రదింపులు సమావేశాలు, అంగీకార ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా వ్యూహాలను రూపొందించింది ప్రభుత్వం. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కేంద్రాలుగా స్పోర్ట్స్ విలేజీల నిర్మాణం, మానసిక ఆరోగ్యం, యోగా, ధ్యానం, క్రీడలు, సాంస్కృతిక అవగాహనతో సమతుల్య యువత అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించారు. ఫ్యూచర్ సిటీలో జరిగే ఈ సమావేశాలు, అవగాహన ఒప్పందాలు కొత్త చరిత్రకు శ్రీకారం చుడతాయేమో చూడాలి.

– వాడవల్లి శ్రీధర్ । హైదరాబాద్

కేసులు ఎక్కువ... శిక్షలు తక్కువ

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 2014 జూన్ నుంచి ఈ ఏడాది అక్టోబరు 31 వరకు 6,312 కేసులు చేపట్టగా 'మనీ లాండరింగ్ నిరోధక చట్టం' ప్రత్యేక కోర్టు ద్వారా శిక్ష పడినవారు 12 మంది మాత్రమే!

సంవత్సరాల వారీగా...	కేసులు	ప్రత్యేక కోర్టు ద్వారా శిక్ష పడినవారు
2020-21	996	1
2021-22	1,116	4
2022-23	953	24
2023-24	698	19
2024-25	775	38
2025-26 (అక్టోబరు 31 వరకు)	426	15

ఆధారం: లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ

జన్మాంతర సౌహృదం

జ్యోతిర్మయం

మనిషికి జీవితంలో ఏర్పడే బంధాలు అనేకం. కొన్ని రక్త సంబంధాలు, మరికొన్ని అరక్త బంధాలు. అయితే వాటిలో కొన్ని మాత్రమే మనసును దృఢంగా పెనవేసుకుని ఆ అనుబంధాన్ని కాలం కూడా చెరిపేయలేని స్థితికి తీసుకువెళతాయి. అలాంటి బంధాన్నే సాహిత్యంలోనూ, ఆధ్యాత్మిక పరంగానూ 'జన్మాంతర సౌహృదం' అంటారు. అది జన్మజన్మల బంధం. ఏదో పూర్వజన్మ బంధం ఉండి ఉంటుందనిపించే ఆత్మీయ భావన. అప్పుడే మనకు పరిచయం అయినా ఎప్పటి నుంచో తెలిసిన వారిలా అనిపిస్తుంది. ఒకే చూపులో ఏర్పడే మనసుల కలయిక కూడా! ఇవన్నీ జన్మాంతర సౌహృదానుభూతులే!

ఆధ్యాత్మికంగా ఈ భావనకు విశాలమైన అర్థం ఉంది. రామకృష్ణ పరమహంస, వివేకానందుల మధ్య గురుశిష్యుల బంధాన్ని చాలా మంది జన్మాంతర సౌహృదంగా భావిస్తారు. వారిరువురు కలిసిన క్షణం నుంచే ఒకరికొకరు ఎంతోకాలంగా తెలిసినట్లుగా భావించారు. రాముని కోసమే సీత జన్మించింది. సీత కోసమే శ్రీరాముడు పుట్టాడు అనటంలో ధ్వనించే అర్థం ఈ జన్మాంతర సౌహృదమే.

శ్రీరామ, ఆంజనేయుల కలయిక కూడా జన్మాంతర సౌహృదానికి గొప్ప ఉదాహరణ. వారు కలిసిన క్షణం నుంచి ఒకరిపై ఒకరికి సంపూర్ణ నమ్మకం, గౌరవం, బంధం ఏర్పడ్డాయి. మహాభారతంలో కృష్ణార్జునులు బంధువులే కాదు, స్నేహితుల్లా మెలిగారు. కలిసిమెలిసి సంచరించారు. వారు ఆత్మసఖులు. గురుశిష్యులు. అలాగే, శబరి చిరకాల నిరీక్షణా ఫలం రామ దర్శనం. ఇది ఒక ఆధ్యాత్మిక అనుబంధం. జీవాత్మ పరమాత్మను దర్శించాలన్న ఆరాటం. ఇవన్నీ జన్మాంతర సౌహృదానికి నిదర్శనాలే! **'కొందరిని జూడ స్నేహంబు గోరు మనము / కొందరిని జూడ తొలగిపో గోరుచుండు'** అంటారు శోభిరాల సత్యనారాయణ తమ 'రాగమయి' ఖండ కావ్యంలో. కొందరిని చూస్తూనే స్నేహభావం కలగటానికి కారణం జన్మాంతర సౌహృదమే!

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

లొంగిపోయిన మావోయిస్టు దంపతులు

దిరిదో విజ్జల్‌పై రెండు రాష్ట్రాల్లో రూ.28 లక్షల రివార్డు

అతని భార్య మడవి మంగపై రూ.8 లక్షల రివార్డు

మావోయిస్టు దంపతులను మీడియాకు చూపెడుతున్న ఎస్పీ అమిత్‌బర్దర్

పాడేరు: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాకు చెందిన మావోయిస్టు దంపతులు ఆదివారం పాడేరులో ఎస్పీ అమిత్‌బర్దర్ ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయారు. ఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. మావోయిస్టు పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు (ఎస్‌జెడ్‌సీఎం) దిరిదో విజ్జల్ అలియాస్ జైలాల్, అతని భార్య అయిన డివిజనల్ కమిటీ సభ్యురాలు (డీవీసీఎం) మడవి మంగ అలియాస్ విమల/భీమే లొంగిపోయారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాల పట్ల విసుగు చెందడంతోపాటు మావోయిస్టులకు పట్టున్న ప్రాంతాల్లో పోలీసుల కూంబింగ్ పెరగడం, కొత్త పోలీస్ క్యాంపులు పెట్టడం, మావోయిస్టు పార్టీకి ప్రజల్లో ఆదరణ తగ్గిపోవడం, ఇటీవల కాలంలో వరుస ఎన్‌కౌంటర్లు, మావోయిస్టు పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారడం తదితర కారణాలతో జనజీవన స్రవంతిలోకి వచ్చి స్వేచ్ఛా జీవితం గడిపేందుకు వారిద్దరూ లొంగిపోయారని చెప్పారు.

బాలల సంఘంలో చేరి.. బ్యాంక్ దోపిడీ చేసి..

దిరిదో విజ్జల్ ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా గగనపల్లి పంచాయతీ బోడెగుబ్బల్ గ్రామానికి చెందిన వారు. 1994లో మావోయిస్టు పార్టీ బాలల సంఘంలో సభ్యుడిగా చేరారు. దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్, జాతీయ పార్క్ ప్రాంతం, కుంటా, ఏవోబీ కటాఫ్ ఏరియా, గడ్చిరోలి, దర్భా ప్రాంతాల్లో మావోయిస్టు సభ్యుడిగా ఏసీఎం, పీపీసీఎం, ఎల్‌వోఎస్ కమాండర్, సెక్షన్ కమాండర్, కంపెనీ కమాండర్, సైనిక ఇన్‌చార్జిగా వివిధ విభాగాల్లో ఏకంగా 24 ఏళ్లు మావోయిస్టు పార్టీలో పని చేశారు. ఏడు క్యాంప్ దాడులతోపాటు మరో ఏడు అంబుష్, రెండు ఎదురు కాల్పుల్లో విజ్జల్ పాల్గొన్నారు. బ్యాంకు దోపిడీ, ఐఈడీ పేల్చిన ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. ఇతనిపై ఆంధ్రప్రదేశ్‌లో రూ.8 లక్షలు, ఛత్తీస్‌గఢ్‌లో రూ.20 లక్షల రివార్డు ఉన్నాయి.

విప్లవ గీతాలకు ఆకర్షితురాలై..

మావోయిస్ట్ డివిజనల్ కమిటీ సభ్యురాలైన మడవి గంగి ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పుల్పాగిడే గ్రామానికి చెందినవారు. ఆమె 2006లో విప్లవ గీతాలకు ఆకర్షితురాలై మావోయిస్టు పార్టీలో చేరారు. 20 ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో కుంటా, బడేసత్తి, కెర్లపాల్, జగర్గొండ, మలెంగర్ ప్రాంతాల్లో పార్టీ సభ్యురాలిగా, ఎల్‌వోఎస్ కమాండర్‌గా ఏసీఎంగా, ప్రాంత కమిటీ కార్యదర్శిగా, ఏసీ కార్యదర్శిగా ఏసీఎస్ ఇన్‌చార్జిగా, మలెంగర్ ఏసీఎస్ ఇన్‌చార్జిగా పని చేశారు. ఏడు ఎదురు కాల్పులతో పాటు అనేక హింసాత్మక ఘటనల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. గంగిపై రూ.8 లక్షల రివార్డు ఉంది.

పునరావాసం కల్పిస్తాం: ఎస్పీ

లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రాయితీలు అందేలా చూస్తామని ఎస్పీ అమిత్‌బర్దర్ చెప్పారు. ఇద్దరికీ పునరావాస సౌకర్యాలు కల్పిస్తామని, వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి మార్గం చూపిస్తామన్నారు. లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్న మావోయిస్టులు బంధుమిత్రుల ద్వారా సమీప పోలీస్ స్టేషన్, జిల్లా పోలీసు ఉన్నతాధికారుల వద్ద నేరుగా వచ్చి లొంగిపోవచ్చని సూచించారు.

హిడ్మా ఎన్‌కౌంటర్‌పై తప్పుడు ప్రచారం

మావోయిస్టు అగ్రనేత మడవి హిడ్మాతో పాటు మరికొందరిని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని మావోయిస్టు లేఖ ద్వారా ప్రశ్నించారని.. దీనిపై మీ స్పందన ఏమిటని విలేకరులు ఎస్పీ అమిత్‌బర్దర్‌ను ప్రశ్నించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ మావోయిస్టులది ఆధారాలు లేని ఆరోపణలని, వారిది పూర్తిగా తప్పుడు ప్రచారమన్నారు. వాటిపై స్పందించాల్సిన అవసరం లేదన్నారు.

పోలీసు క్యాంపు వద్ద ఆదివాసీ ఆత్మహత్య

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఓ ఆదివాసీ వ్యక్తి పోలీసు క్యాంపులో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బీజాపూర్ జిల్లా తెర్రెం పోలీస్ స్టేషన్ పరిధిలోని రేఖపల్లికి చెందిన మడివి భీమా (48)ను వట్టేవాగు క్యాంపు పోలీసులు విచారణ పేరుతో కొన్ని రోజుల క్రితం తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆయన శనివారం రాత్రి క్యాంపు సమీపంలోని పొలాల్లోకి వెళ్లి టవల్‌తో చెట్టుకు ఉరివేసుకున్నాడు. క్యాంపు నుంచి బయటకు వెళ్లిన భీమా తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన సెంట్రీ పొలాల వైపు వెళ్లగా చెట్టుకు ఉరేసుకుని కనిపించాడని క్యాంప్ ఉన్నతాధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వట్టేవాగు సీఆర్‌పీఎఫ్ క్యాంపు బలగాలు కొంత కాలంగా సమీప గ్రామాల్లో కూంబింగ్ చేస్తూ కొందరు గ్రామస్తుల సహకారంతో మావోయిస్టులు సమాచారం సేకరించాయని, ఈ క్రమంలో భీమాతో పాటు మరి కొందరిని విచారించి కొండపల్లి, దామారం, రేఖపల్లి, చింతవాగు అటవీ ప్రాంతాల్లో మందుపాతరలను గుర్తించి నిర్వీర్యం చేశామని పోలీసులు వెల్లడించారు. అయితే పోలీసులకు సహకరించానన్న నెపంతో తనకు, తన కుటుంబ సభ్యులకు మావోయిస్టులు ఏమైనా హాని తలపెడతారేమో అనే భయంతో భీమా ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అధికారులు పేర్కొన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

సీపీఐ (ఎంఎల్) జనశక్తి రాష్ట్ర కార్యదర్శి గంగాధర్

దుమ్ముగూడెం: 'లొంగండి.. లేదా చావండి' అని బహిరంగ ప్రకటన చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఐ (ఎంఎల్) జనశక్తి రాష్ట్ర కార్యదర్శి గంగాధర్ రాష్ట్రపతిని కోరారు. ఈ మేరకు జనశక్తి రాష్ట్ర కమిటీ పేరిట ఈనెల 4న విడుదల చేసిన లేఖ ఆదివారం వెలుగులోకి వచ్చింది. దండకారణ్యం సహా ఈశాన్యం, జమ్మూకశ్మీర్, ఢిల్లీ, యూపీలో వేలాది మంది ఆదివాసీలు, మైనార్టీల హత్యలకు కారకుడైన అమిత్ షా చర్యలను సుమోటోగా స్వీకరించి, బీఎన్‌ఎస్ 103 ప్రకారం హత్యా నేరం కింద అరెస్ట్ చేసి విచారించాలని సుప్రీంకోర్టుకు విన్నవించారు. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ప్రభుత్వం, జాతి వ్యతిరేకులు–టెర్రరిస్టులంటూ చిత్రిస్తూ కగార్, మరో సైనిక ఆపరేషన్లను సాగిస్తూ మానవ హననాన్ని సాగిస్తోందని ఆరోపించారు. దండకారణ్యంతో పాటు జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ, మధ్యప్రదేశ్‌లో లక్షల మంది ఆదివాసీలు నివసిస్తున్న ప్రాంతాల్లో భయానక పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, మావోయిస్టులు, ఆదివాసీలతో ప్రభుత్వం చర్చలు జరపాలని, ఇందుకు మేధావులు, ప్రతిపక్ష పార్టీలు కృషి చేయాలని కోరారు.

ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించండి

మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్

దుమ్ముగూడెం: వికసిత్ భారత్ పేరుతో కేంద్రంలోని బీజేపీ–ఆరెస్సెస్ పాలకులు అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఈనెల 4న విడుదల చేసిన లేఖ ఆదివారం వెలుగులోకి వచ్చింది. దీనిపై ప్రతిపక్షాలు కూడా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించాయని, వాటిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వంలో నవంబర్ 28, 29, 30 తేదీల్లో రాయపూర్‌లో డీజీపీలు, పారామిలటరీ దళాల అధిపతులు, ఇంటెలిజెన్స్ విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారని, పోలీస్ వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు వికసిత్ భారత్ (కార్పొరేట్) నిర్మాణానికి ఆటంకం లేకుండా చూడాలని ఈ సమావేశంలో నిర్ణయించారని తెలిపారు. మోదీ హయాంలో ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల సంపదతో పాటు ప్రభుత్వ అప్పులు కూడా పెరుగుతున్నాయన్నారు. రూపాయి విలువ మరింత పతనం కావడంతో పెట్రోల్, డీజిల్, వంటనూనెలు, ఎల్‌పీజీ ధరలు పెరుగుతున్నాయని, దీంతో పేద, మధ్యతరగతి వర్గాలపై భారం పడుతోందని వెల్లడించారు.

అన్నదమ్ముల ప్రాణం తీసిన ఈత సరదా

అనంతపురం జిల్లాలో ఘటన

మృతి చెందిన చరణ్, నరేంద్ర

బ్రహ్మసముద్రం: ఈత సరదా అన్నదమ్ముల ప్రాణాలను బలిగొంది. నీటి సంపులో తమ్ముణ్ని కాపాడబోయి అన్న కూడా మృతి చెందిన ఘటన అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన బోయ వెంకటేశులు బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం గ్రామ సమీపంలో మామిడి తోటను కొనుగోలు చేశాడు. ఆదివారం చెట్లకు పురుగు మందు పిచికారీ చేయడానికి పెద్ద కుమారుడు చరణ్(23), చిన్న కుమారుడు నరేంద్ర(18)తో కలిసి మామిడి తోటలోకి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో తన ఇద్దరు కుమారులను ఇంటికి వెళ్లమని వెంకటేశులు చెప్పాడు. కానీ వారు ఇంటికి వెళ్లకుండా మామిడి తోటలోనే ఉన్న నీటి సంపులో ఈత కొట్టాలని భావించారు. ముందుగా నరేంద్ర నీటిలోకి దిగాడు. మూడు నెలల క్రితమే వివాహం చేసుకున్న చరణ్.. భార్యతో వీడియో కాల్ మాట్లాడుతున్నాడు. ఇంతలోనే ఈత రాక నరేంద్ర నీటి సంపులో కొట్టుమిట్టాడుతుండటంతో గమనించిన చరణ్ గమనించి వెంటనే వీడియో కాల్ కట్ చేసి నీటిలోకి దూకాడు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో నీటమునిగి చనిపోయారు.

వీడియో కాల్ కట్ చేయడంతో..

తన భర్త చరణ్ ఉన్నట్టుండి వీడియో కాల్ కట్ చేయడం, మళ్లీ తాను ఫోన్ చేసినా స్పందించకపోవడంతో భార్య ఆందోళనకు గురైంది. తన మామ వెంకటేశులుకు ఫోన్ చేసి చెప్పింది. దీంతో అతను నీటి సంపు వద్దకు వెళ్లి చూశాడు. తన ఇద్దరు కుమారులు నీటమునిగి ఉండటం చూసి కేకలు పెట్టాడు. చుట్టుపక్కల ఉన్న వారు అక్కడికి చేరుకుని ఇద్దరినీ బయటకు తీశారు. అప్పటికే ఇద్దరూ మరణించారు. బ్రహ్మసముద్రం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చిన వెంకన్న సేవలో హైకోర్టు జడ్జి

ద్వారకా తిరుమల: ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలోని చిన వెంకన్నను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఈవో ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేశ్ రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

మోస్ట్ వాంటెడ్ అంతర్రాష్ట్ర నేరస్తుడు అరెస్ట్

చిత్తూరులో అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఇప్పటికే అతడిపై తమిళనాడులో 50కి పైగా కేసులు

గుడిపాల: అత్యాచారాలు, హత్యాయత్నాలు, డ్రగ్స్, అక్రమ వ్యాపారంలో నిందితుడైన మోస్ట్ వాంటెడ్ అంతర్రాష్ట్ర నేరస్తుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ సాయినాథ్ తెలిపారు. ఆదివారం గుడిపాల పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ 2025 డిసెంబర్ 3 చిత్తూరు జిల్లా గుడిపాల పోలీస్‌స్టేషన్ అనుపు ఎస్టీ కాలనీకి చెందిన ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అలెక్స్‌పై అత్యాచారం కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దర్యాప్తులో భాగంగా బాధితురాలిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్పీ ఆదేశాలతో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో చిత్తూరు రూరల్ మండలం, తుమ్మిందపాళ్యం క్రాస్ వద్ద అలెక్స్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అలెక్స్ తమిళనాడులో 2010లో తొలి నేరంతో జైలుకు వెళ్లి అప్పటినుంచి దొంగతనాలు, దారి దోపిడీలు, హత్యలు, హత్యాయత్నాలు, గంజాయి, డ్రగ్స్, కొట్లాట కేసుల్లో పాల్గొంటూ కరుడుగట్టిన నేరస్తుడిగా మారాడన్నారు. తమిళనాడులోని వేలూరు జిల్లా, కాట్పాడి పోలీస్‌స్టేషన్‌లో ఇతనిపై రౌడీషీట్ కూడా ఉన్నట్లు విచారణలో వెల్లడైందని చెప్పారు. అలెక్స్(35) స్వగ్రామం తమిళనాడులోని కన్యాకుమారి. కాగా, ప్రస్తుతం కాట్పాడిలో నివసిస్తున్నాడని ఆయన చెప్పారు.

చంద్రగిరికి ఏం చేశావు బాబు?

- చెవిరెడ్డి అక్రమ అరెస్టుతో చంద్రగిరిలో ఉద్యమాల్ని ఆపలేరు
- వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: 'ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ.. నాలుగుసార్లు సీఎంనని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు.. నువ్వు పుట్టి, పెరిగిన ఊరికి ఏం చేశావు? పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించే ఆసుపత్రులను కట్టించావా? పేద విద్యార్థులు చదువుకునేందుకు ఒక్క డిగ్రీ కాలేజీనైనా తెచ్చావా?'.. అంటూ చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో కొత్తగా చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ పూర్తయిన నేపథ్యంలో.. ఈ కార్యక్రమంలో కష్టపడ్డ నేతలు, కార్యకర్తలకు అభినందనలు తెలపడానికి ఆదివారం తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని చంద్రగిరి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మోహిత్‌రెడ్డి కృతజ్ఞతాభివందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సేకరించిన సంతకాలను మోహిత్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

అక్రమ కేసులు ఎంతోకాలం ఉండవు..

రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కమీషన్ల కోసం కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్న చంద్రబాబు ప్రభుత్వంపై చంద్రగిరి నుంచే యుద్ధం మొదలైంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయడాన్ని చంద్రగిరి గడ్డ నుంచి ఎంతమంది వ్యతిరేకిస్తున్నారో ఇక్కడ సేకరించిన సంతకాలే చెబుతాయి. చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 116 గ్రామ పంచాయతీలు వుండగా అందులో 1,16,000 సంతకాలను సేకరించాం. మా నాన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జైల్లో ఉండే ప్రతీరోజును ప్రజలు మీకు చరమగీతం పాడేందుకు దగ్గరపడుతున్న రోజుగానే పరిగణించుకోవాలి. ఆయన అక్రమ అరెస్టుతో చంద్రగిరిలో జరిగే ఉద్యమాల్ని ఆపలేరు. అక్రమ కేసులు ఎంతో కాలం నిలబడవు. జగనన్న నాయకత్వంలో ప్రజల పక్షాన చేస్తున్న పోరాటాలు, ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా ఘన విజయం సాధిస్తాం. ఆ గెలుపు చంద్రగిరి నుంచే ఆరంభమవుతుంది.

కులం కాటుకు ఎంటెక్ విద్యార్థిని బలి

ప్రేమ విఫలం కావడంతో బలవన్మరణం

నళిని (ఫైల్)

ఒంగోలు టౌన్: కులం కాటుకు మరో యువతి బలైంది. ప్రేమిస్తున్నప్పుడు అడ్డురాని కులం పెళ్లి చేసుకోవడానికి అడ్డయింది. దాంతో ప్రియుడు ముఖం చాటేయడంతో మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్యకు పాల్పడింది. బాధితురాలి సూసైడ్ నోట్ ప్రకారం వివరాలివీ.. ఒంగోలు నగరంలోని కబాడిపాలెంకు చెందిన మైరాల నళిని, మహేంద్ర నగర్‌కు చెందిన సింగోలు శ్రీనివాస్ పదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమెను నమ్మించాడు. నీవు లేకపోతే బతకలేనని చెప్పిన శ్రీనివాస్ నళినిని అన్ని విధాలా వాడుకున్నాడు. తీరా పెళ్లి మాట ఎత్తేసరికి ముఖం చాటేశాడు. నీ కులం వేరు నా కులం వేరు.. ఇంట్లో వాళ్లు పెళ్లికి ఒప్పుకోవడంలేదంటూ ఫోన్ కట్ చేయడం మొదలుపెట్టాడు. దీంతో శ్రీనివాస్‌తో మాట్లాడదామని శనివారం అతడి ఇంటికి వెళ్లింది. 'శ్రీనివాస్ మాలలో ఉన్నాడు.. ఇంట్లోకి రావద్ద'ని అతని తల్లిదండ్రులు నళినిని బయట నుంచే పంపించేయడంతో ఇక శ్రీనివాస్‌తో తన పెళ్లి జరగదని ఆందోళనకు గురైన నళిని ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మరణించింది. ఆత్మహత్యకు ముందు బాధితురాలు రాసిన రెండు పేజీల సూసైడ్ నోట్ చూపరులను కలచివేస్తోంది. దళిత సామాజికవర్గానికి చెందిన నళిని ఎంటెక్ చదివింది. తండ్రి దేవదానానికి నలుగురు ఆడపిల్లలు ఉండగా వారిలో ముగ్గురికి వివాహమైంది. నళిని మూడో సంతానం. వన్ టౌన్ సీఐ నాగరాజు ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు ఆరా తీశారు. దళిత హక్కుల సంఘం నాయకులు నీలం నాగేంద్రం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. నళిని మృతికి కారణమైన శ్రీనివాస్ మీద కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

29 మంది విద్యార్థులపై వైస్ ప్రిన్సిపల్ దాష్టీకం

వాతలు పడేలా కొట్టిన వైనం

పోలీసులకు, అధికారులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

ఆందోళన చేస్తున్న విద్యార్థులు తల్లిదండ్రులు (ఇన్‌సెట్) విద్యార్థి వీపుపై తేలిన వాతలు

ఓజిలి: బాలికల తరగతి గదుల్లో ఒక విద్యార్థి అసభ్యకరమైన బొమ్మలు వేశారని.. వైస్ ప్రిన్సిపాల్ 29 మంది విద్యార్థుల్ని వాతలు తేలేలా కొట్టారు. తిరుపతి జిల్లా ఓజిలి మండలం వాకాటివారికండ్రిగ గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో శనివారం ఈ ఘటన జరిగింది. వైస్ ప్రిన్సిపాల్‌ను, హిందీ టీచర్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పోలీసులు తెలిపిన మేరకు.. ఈ గురుకుల పాఠశాలలో 250 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రిన్సిపల్ సెలవులో ఉండడంతో వైస్ ప్రిన్సిపల్ అరుణ్ కుమార్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. బాలికల తరగతి గదుల్లో ఏడో తరగతి చదువుతున్న శశికుమార్ అసభ్యకరమైన బొమ్మలు వేయడంతో బాలికలు వైస్ ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన బొమ్మలు ఎవరు వేశారని విద్యార్థులను ప్రశ్నించారు. ఎవరూ సమాధానం చెప్పకపోవడంతో ఏడు, ఎనిమిది తరగతుల విద్యార్థులు 29 మందిని డ్రిప్ పైపులతో తీవ్రంగా కొట్టారు. 20 మంది బాలురు, 9 మంది బాలికల వీపు, కాళ్లు, చేతులపై వాతలు తేలాయి. నొప్పులతో రాత్రంతా అల్లాడిపోయిన విద్యార్థులు ఆదివారం తమను చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులకు వాతలు చూపించి విలపించారు. దీంతో తల్లిదండ్రులు వైస్ ప్రిన్సిపల్‌ను నిలదీసి, అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. నాయుడుపేట సీఐ సంగమేశ్వర్‌రావు, ఎస్ఐ శ్రీకాంత్ వారికి సర్దిచెప్పారు. తహశీల్దార్ పద్మావతి, ఎంఈవో చంద్రశేఖర్ పాఠశాల వద్దకు చేరుకుని విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, ప్రతి శనివారం రాత్రి వైస్ ప్రిన్సిపల్ మద్యం తాగి విద్యార్థులను హింసిస్తున్నారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చెప్పారు. తమ పిల్లలపై దాడిచేసిన వైఎస్ ప్రిన్సిపల్ అరుణ్‌కుమార్, హిందీ టీచర్ హరికృష్ణలపై కఠినచర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, ప్రజాసంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. విద్యార్థి శశికుమార్ తల్లి ప్రసన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థులపై దాడికి పాల్పడిన వైస్ ప్రిన్సిపల్ అరుణ్‌కుమార్, హిందీ టీచర్ హరికృష్ణలను సస్పెండ్ చేసినట్లు ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు.

దేవాలయాల విధ్వంసకారుడు చంద్రబాబే

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి మండిపాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దేవాలయాల విధ్వంసకారుడు చంద్రబాబేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి విమర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు దేవుడిని సైతం విడిచిపెట్టట్లేదని మండిపడ్డారు. చంద్రబాబు హయాంలోనే ఆలయాల్లో అపచారాలు ఎక్కువగా జరిగాయని చెప్పారు. పరకామణి చోరీ కేసును వైఎస్సార్‌సీపీపై నెట్టడం దారుణమన్నారు. గుళ్ల కూల్చివేత, దాడులు, నిధుల దుర్వినియోగం, భక్తుల మరణాలు చంద్రబాబు పాలనలో పరిపాటిగా మారాయన్నారు. టీటీడీ పరకామణి చోరీ కేసులో తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఒక వీడియోలో రవికుమార్ చెప్పడం సంచలనం సృష్టిస్తోందన్నారు. కృష్ణా పుష్కరాల ఏర్పాట్ల పేరుతో విజయవాడలో 40 దేవాలయాలు కూల్చింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. తిరుమలలో వెయ్యి కాళ్ల మండపాన్ని 2003లో కూల్చింది కూడా చంద్రబాబేనన్నారు. తిరుమల ఆస్తులను ఇతర పనులకు వినియోగించేందుకు చంద్రబాబు జీవో తీసుకువస్తే, ఐఏఎస్ అధికారి అజేయకల్లం అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఇంకా తిరుమల లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని టీడీపీ నేతలు అసత్య ఆరోపణలు చేసి అభాసుపాలయ్యారన్నారు. ఇప్పటికైనా తప్పులు తెలుసుకుని ప్రజలకు క్షమాపణలు చెప్పాలని చంద్రబాబును డిమాండ్ చేశారు.

సమస్య పరిష్కరించలేక రామ్మోహన్ చేతులెత్తేశారు

- తెలుగువాడి పరువు దేశంలోనూ.. దేశం పరువు ప్రపంచంలోనూ మంటగలిపిన కేంద్ర మంత్రి
- ఇంత జరుగుతున్నా కనిపించని కేంద్ర పౌర విమానయాన మంత్రి
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

మహారాణిపేట (విశాఖ జిల్లా): దేశంలో ముందెన్నడూ లేనివిధంగా విమానయాన రంగంలో సంక్షోభం ఏర్పడితే.. సమస్యను పరిష్కరించలేక కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చేతులు ఎత్తేశారని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆక్షేపించారు. ఆదివారం విశాఖలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 'ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ల (ఎఫ్‌డీటీఎల్) అమలు చేయడంలో తలెత్తిన ఇబ్బందులను గుర్తించి, పరిష్కరించలేకపోవడం పౌర విమానయాన శాఖ వైఫల్యం. విమానాలు రద్దయి లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ సమస్య పరిష్కారంలో విఫలమవడంతోపాటు ఇష్టమొచ్చినట్టు టికెట్ల రేట్లు పెంచిన విమానయాన సంస్థలను అదుపు చేయడంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు విఫలమయ్యారు' అని అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు.

తెలుగువాళ్ల పరువు తీశారు

'మన తెలుగు వాడికి విమానయాన శాఖ మంత్రి పదవి వచ్చిందని సంతోషించాం. అయితే.. రామ్మోహన్‌నాయుడు దేశంలో మన తెలుగువారి పరువు, ప్రపంచంలో మన దేశం పరువు తీసేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర మంత్రి క్షమాపణ చెప్పాలి. కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా రామ్మోహన్‌నాయుడు రాజీనామా చేయాలి. ఇది మా డిమాండ్ కాదు. దేశ ప్రజలు కూడా అదే కోరుతున్నారు. విమానయాన శాఖ మంత్రిగా రామ్మోహన్ నాయుడు సమర్థుడు కాదని దేశ ప్రజలు అంటున్నారు. ఇండిగో సమస్యను లోకేశ్ వార్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తున్నారని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఇండిగో సమస్యను పరిష్కరించడానికి లోకేశ్ ఎవరు? దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఉన్న మంత్రుల్లో లోకేశ్ ఒకరు. ఇలాంటి మాటలు మాట్లాడటానికి టీడీపీ నేతలకు సిగ్గులేదా. తండ్రి ఆఖరి చూపులకు వెళ్లలేని పరిస్థితి బిడ్డలకు ఏర్పడింది. నూతన వధూవరులను బంధువులు కలవలేని పరిస్థితి నెలకొంది. ఇండిగో సమస్యను అడ్డం పెట్టుకుని మిగతా సంస్థలు విపరీతంగా రేట్లు పెంచాయి. విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే రూ.30 వేలు పెట్టి టికెట్ తీసుకోవాల్సి వస్తోంది. భోగాపురం ఎయిర్‌పోర్టుకు వచ్చి నెత్తిమీద హెల్మెట్ పెట్టుకుని రీల్స్ తీయడం తప్పితే రామ్మోహన్‌నాయుడు మంత్రిగా ఏం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు వేగంగా జరగడానికి కారణం వైఎస్ జగన్. ఎల్లో మీడియాలో లోకేశ్‌ను జాకీలు ఎత్తినట్టు నేషనల్ మీడియాలో ఎత్తాలని టీడీపీ నేతలు చూశారు. టీవీ–5 సాంబశివరావు దగ్గర జాకీలు ఎత్తినట్టు ఎత్తితే నేషనల్ మీడియా ఊరుకుంటుందా?. మంత్రి రామ్మోహన్ రీల్స్ మానేసి సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలి. టీడీపీ పబ్లిసిటీ పిచ్చి వల్ల దేశంలో తెలుగు వారి పరువు పోయింది' అని గుడివాడ అమర్నాథ్ మండిపడ్డారు. చెన్నై నుంచి ఢిల్లీ వెళ్లాలంటే రూ.70 వేలు, బెంగళూరు నుంచి ముంబైకి రూ.40 వేలు, హైదరాబాద్ నుంచి ఢిల్లీకి రూ.60 వేలు టికెట్ ధరలు ఉంటే.. నియంత్రణ ఎక్కడ ఉన్నట్టు? అని అమర్‌నాథ్ ప్రశ్నించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల ఘాతుకం

చికిత్స పొందుతున్న డ్రైవర్

నెల్లూరు (క్రైమ్): మద్యం మత్తులో ఉన్న యువకులు పట్టపగలు సిటీ బస్సును వెంబడించి బస్సు డ్రైవర్, కండక్టర్‌పై బ్లేడ్లతో దాడి చేసి పరారైన ఘటన నెల్లూరులో జరిగింది. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు.. ఎస్‌ఏఎస్ సిటీ బస్సు సర్వీసుకు నెల్లూరు రూరల్ మండలం మహాత్మా గాంధీనగర్‌కు చెందిన మన్సూర్ డ్రైవర్‌గా, ఇందుకూరుపేట మండలం గంగపట్నంకు చెందిన సలాం కండక్టర్‌గా ఉన్నారు. ఆదివారం సిటీ బస్సు గాంధీబొమ్మ వైపు నుంచి బోసుబొమ్మ వైపు బయలుదేరింది. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న కొందరు యువకులు నడిరోడ్డుపై బైక్‌లను నిలిపి బాతాఖానీ కొడుతున్నారు. బైక్‌లను అడ్డం తీయాలని డ్రైవర్ చాలా సేపు హారన్ కొట్టినా పట్టించుకోకపోగా బస్సు సిబ్బందినే యువకులు దుర్భాషలాడారు. దీంతో డ్రైవర్ బస్సు దిగి యువకుల వద్దకు వెళ్లగా వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో బస్సు డ్రైవర్ ఓ బైక్ తాళాన్ని తీసుకుని బస్సు ఎక్కి వెళ్లిపోయాడు. మద్యం మత్తులో ఉన్న యువకులు మరో బైక్‌పై బస్సును వెంబడించి బోసుబొమ్మ వద్ద బస్సును అడ్డుకున్నారు. బస్సులోకి వెళ్లి డ్రైవర్, కండక్టర్‌పై బ్లేడ్‌లతో విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్, కండక్టర్‌ను స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. సంతపేట ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాంకేతికత ఆధారంగా నిందితులు నెల్లూరుకి చెందిన మదన్, అతని స్నేహితులుగా గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. బస్సు కండక్టర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

అమ్మవారి వెండి కానుకలకు ఈవో ఎసరు

భక్తులు పట్టుకున్న వెండి కానుకలు

కదిరి అర్బన్: శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండల పరిధిలోని యర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలకు ఆలయ ఈఓ మురళీకృష్ణ ఎసరు పెట్టారు. సుమారు రూ.5 లక్షలు విలువ చేసే వెండి ఆభరణాలు, విలువైన చీరలను ఆదివారం భార్యతో కలసి ఆటోలో తరలిస్తుండగా భక్తులు అడ్డుకున్నారు. కానుకలను ఎక్కడికి తరలిస్తున్నారని ప్రశ్నించారు. తాము వెండి నగలను పరీక్షల నిమిత్తం కదిరికి తీసుకెళ్తున్నామని ఈఓ చెప్పగా.. గతంలో ఎన్నడూ ఏ అధికారీ ఇలా చేయలేదని, మీరు మాత్రం ఎవరికీ చెప్పకుండా, అది కూడా సెలవు రోజైన ఆదివారం ఎలా తీసుకెళ్తారని నిలదీశారు. ఈ వ్యవహారం చూస్తుంటే గతంలో గుడిలో జరిగిన దొంగతనం సైతం ఈవోనే చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈఓ వైఖరిపై అనుమానంతో కదిరి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఈఓతో పాటు ఆభరణాలు తరలిస్తున్న ఆటోను స్టేషన్‌కు తరలించారు. దేవదాయ శాఖ అధికారులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కాగా, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈవోపై కేసు నమోదు చేసినట్టు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈవోను సస్పెండ్ చేస్తూ దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఉత్తర్వులిచ్చారు.

గోవాలో ఘోరం

అర్ధరాత్రి పూట నైట్‌క్లబ్‌లో చెలరేగిన మంటలు

- 25 మంది సజీవదహనం... ఆరుగురికి గాయాలు
- బయటకు వెళ్లే మార్గం ఇరుకుగా ఉండటంతో తప్పించుకోలేక మృత్యువాత
- మృతుల్లో 20 మంది సిబ్బంది, ఐదుగురు పర్యాటకులు
- క్లబ్‌లో గ్యాస్ సిలిండర్ పేలిందంటున్న పోలీసులు
- ఎలక్ట్రిక్ బాణాసంచా వల్లనే ప్రమాదం జరిగిందన్న ప్రత్యక్ష సాక్షి
- దుర్ఘటన పట్ల దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని
- నష్టపరిహారం ప్రకటించిన ప్రధాని కార్యాలయం, గోవా ముఖ్యమంత్రి

పణజి: దేశ విదేశీ పర్యాటకులతో నిత్యం కళకళలాడే గోవాలో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. శనివారం అర్ధరాత్రి తర్వాత నైట్‌క్లబ్‌లో మంటలు చెలరేగడంతో 25 మంది సజీవదహనమయ్యారు. ఆరుగురు గాయపడ్డారు. మృతుల్లో 20 మంది నైట్‌క్లబ్ సిబ్బంది, ఐదుగురు పర్యాటకులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన ఐదుగురు పర్యాటకుల్లో నలుగురు ఢిల్లీ నుంచి వచ్చారు. వీరిలో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందినవారే. ఐదో పర్యాటకుడు కర్ణాటకవాసి. క్లబ్‌లో గ్యాస్ సిలిండర్ పేలిందని పోలీసులు చెబుతుండగా, ఎలక్ట్రిక్ బాణాసంచా కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. పనాజీకి 25 కిలోమీటర్ల దూరంలో ఉత్తర గోవాలో అర్పోరాలోని 'బిర్చ్ బై రోమియో లేన్' నైట్‌క్లబ్‌లో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వారాంతపు సరదా తీవ్ర విషాదంగా మారిపోయింది. ఎక్కువ మంది దట్టమైన పొగ కారణంగా ఊపిరాడక మృతి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. గోవాలో అగ్ని ప్రమాదం పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సహా పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ప్రధాని మోదీ గోవా ప్రభుత్వాన్ని ఆదేశించారు.

దర్యాప్తు కమిటీ ఏర్పాటు చేశాం: ప్రమోద్

నైట్‌క్లబ్ నుంచి బయటకు వెళ్లే మార్గం చాలా ఇరుకుగా ఉండటంతో పర్యాటకులు తప్పించుకోవడం కష్టంగా మారిందని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ చెప్పారు. అక్కడ సరైన భద్రతా చర్యలు లేవని, నిబంధనలను ఉల్లంఘించినారని తెలిపారు. చట్టవిరుద్ధంగా నిర్మించిన ఈ నైట్‌క్లబ్‌లో కార్యకలాపాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఈ ఘటనకు బాధ్యులుగా గుర్తిస్తూ ముగ్గురు అధికారులను గోవా ప్రభుత్వం సస్పెండ్‌ చేసింది. క్లబ్ చీఫ్ జనరల్ మేనేజర్, ముగ్గురు సిబ్బందిని అరెస్టు చేశారు. గోవాకు టూరిస్టులు అధికంగా తరలివచ్చే సీజన్‌లో ఈ ప్రమాదం జరిగింది. దుర్ఘటనపై సమగ్ర దర్యాప్తు కోసం కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారంలోగా నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించామన్నారు. అలాగే మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.50 వేల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు సీఎం ప్రమోద్ సావంత్ ప్రకటించారు. బాణాసంచా కారణంగానే ప్రమాదం జరిగిందన్నారు.

యజమానులపై కేసు నమోదు

'బిర్చ్ బై రోమియో లేన్' నైట్‌క్లబ్ యజమానులైన సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రాపై కేసు నమోదు చేసినట్లు గోవా పోలీసులు తెలిపారు. క్లబ్ మేనేజర్ తోపాటు ఈవెంట్ నిర్వాహకులపైనా కేసు పెట్టినట్లు చెప్పారు. సంబంధితులను త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. ఈ క్లబ్‌కు ట్రేడ్ లైసెన్స్ జారీ చేసిన అర్పోరా-నగోవా గ్రామ పంచాయతీ సర్పంచ్ రోషన్ రెడ్కర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. చట్టవిరుద్ధంగా నిర్మించిన ఈ క్లబ్‌ను కూల్చివేయలంటూ గతంలోనే నోటీసు ఇచ్చామని సర్పంచ్ రోషన్ రెడ్కర్ చెప్పారు. కానీ, కూల్చివేతను ప్రభుత్వ ఉన్నతాధికారులు అడ్డుకున్నారని రోషన్ ఆరోపించారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

రూ.2 లక్షల పరిహారం ప్రకటించిన పీఎంఓ

అగ్ని ప్రమాదంలో మరణించినవారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ.2 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) వెల్లడించింది. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇవ్వనున్నట్లు తెలియజేసింది.

సీఎం ప్రమోద్ రాజీనామా చేయాలి: కాంగ్రెస్

గోవా ప్రమాదం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. సీఎం ప్రమోద్ వెంటనే రాజీనామా చేయాలని గోవా కాంగ్రెస్ నేత మాణిక్‌రావు ఠాక్రే డిమాండ్ చేశారు. గోవా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రమోద్ ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే అర్హత లేదని తేల్చిచెప్పింది. 25 మంది మరణాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అతిశీ ప్రశ్నించారు.

క్షణాల్లోనే మృత్యుఘోష

అర్పోరా నది బ్యాక్‌వాటర్‌లోనే క్లబ్‌ను నిర్మించారు. లోపలికి వెళ్లడానికి, బయటకు రావడానికి ఇరుకైన మార్గమే ఉంది. లోపల కొబ్బరి మట్టలతో తాత్కాలిక గదులు నిర్మించారు.

అగ్నిప్రమాదం జరిగిన సమయంలో క్లబ్‌లోని మొదటి అంతస్తులో ఉన్న డ్యాన్స్‌ఫ్లోర్‌పై కనీసం 100 మంది పర్యాటకులు ఉన్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఫాతిమా షేక్ చెప్పారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో వంటగది ఉంది. మొదటి అంతస్తులో పేలుడు జరగ్గానే బయటకు వెళ్లే మార్గం కనిపించక పర్యాటకులు, ఇతర సిబ్బంది వెంటనే గ్రౌండ్ ఫ్లోర్‌లోని వంట గదికి చేరుకున్నారు. క్షణాల్లోనే మంటలు చుట్టుముట్టాయి. క్షణాల్లోనే దట్టమైన పొగ అలుముకుంది. సిబ్బంది, పర్యాటకులు వంట గదిలోనే చిక్కుకుపోయారు. పొగ కారణంగా ఊపిరాడక ఉక్కిరిబిక్కిరై ప్రాణాలు కోల్పోయారు. చిన్నపాటి సందులో నైట్‌క్లబ్ ఉండటంతో మంటలను ఆర్పడం కష్టసాధ్యంగా మారింది. 400 మీటర్ల దూరంలోనే అగ్నిమాపక యంత్రాలు ఆపివేయాల్సి వచ్చింది. వారాంతం కావడంతో పెద్ద సంఖ్యలో టూరిస్టులు నైట్‌క్లబ్‌కు వచ్చినట్లు తెలుస్తోంది. మృతి చెందిన సిబ్బంది ఉత్తరాఖండ్, నేపాల్‌కు చెందినవారని సమాచారం. షోలే చిత్రంలోని 'మెహబూబా ఓ మెహబూబా' అనే పాటకు ఓ డ్యాన్సర్ నృత్యం చేస్తుండగా, హఠాత్తుగా మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. సంబంధిత ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

నైట్ క్లబ్బుల్లో మరణ శాసనాలు

నిత్య జీవితంలో రోజువారీ పనులతో అలసిపోయి సరదాగా గడపడానికి నైట్‌క్లబ్‌లకు వెళితే ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వస్తోంది. గోవా నైట్‌క్లబ్బులో 25 మంది మరణించడం సంచలనం సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా నైట్‌క్లబ్బుల్లో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కాలక్షేపం, వినోదం, విశ్రాంతి కోసం వచ్చిన పర్యాటకులు విగత జీవులుగా మారారు.

- **2015 అక్టోబర్:** రొమేనియా దేశంలోని బుకారెస్ట్ కలెక్టివ్ నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం జరగడంతో 64 మంది మృతి.
- **2016 డిసెంబర్:** అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న ఘోస్ట్‌షిప్ క్లబ్‌లో మంటలు చెలరేగడంతో 36 మంది బలి.
- **2022 జనవరి:** ఆఫ్రికా దేశం కామెరూన్‌లోని యావోన్‌డే నైట్‌క్లబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 16 మంది మృతి.
- **2022 జనవరి:** ఇండోనేసియాలో వెస్ట్ పపువా ప్రావిన్స్‌లోని సోరొంగ్ నైట్‌క్లబ్‌లో మంటలు. తుదిశ్వాస విడిచిన 19 మంది టూరిస్టులు.
- **2022 ఆగస్టు:** థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లోని మౌంటెన్ బీ క్లబ్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు. 23 మంది అగ్నికి ఆహుతి.
- **2023 అక్టోబర్:** స్పెయిన్‌లోని ముర్సియాలో నైట్‌క్లబ్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం. 13 మంది మృతి.
- **2024 ఏప్రిల్:** టర్కీలోని ఇస్తాంబుల్‌లో మస్కరేడ్ నైట్‌క్లబ్‌లో చెలరేగిన మంటలు. 29 మంది అక్కడికక్కడే మృతి.
- **2025 మార్చి:** ఉత్తర మాసిడోనియాలోని నైట్‌క్లబ్‌లో బాణాసంచా కాలుస్తుండగా మంటలు అంటుకోవడంతో 62 మంది మృతి.

'వందేమాతరం'పై నేడు ప్రత్యేక చర్చ

న్యూఢిల్లీ: జాతీయ గీతం వందేమాతరానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరగనుంది. ప్రధాని మోదీ ఈ చర్చను ప్రారంభిస్తారు. పలువురు కేంద్ర మంత్రులు సహా వివిధ పార్టీల సభ్యులు మాట్లాడుతారు. ప్రత్యేక చర్చకు సభలో 10 గంటల సమయం కేటాయించారు. అవసరమైతే మరికొంత సమయం కేటాయిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. వందేమాతర గీతం గురించి ఎక్కువ మంది తెలియని విషయాలు, ముఖ్యమైన అంశాలు సభలో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. బెంగాలీ కవి బంకించంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహిస్తోంది. నవంబర్ 7న మొదలైన ఈ వేడుకలు ఏడాదిపాటు కొనసాగుతాయి. ఇందులో భాగంగానే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రత్యేక చర్చ చేపట్టాలని నిర్ణయించారు. షెడ్యూల్ ప్రకారం సోమవారం లోక్‌సభలో, మంగళవారం రాజ్యసభలో చర్చ జరుగనుంది. ఎగువసభలో వందేమాతరంపై చర్చను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రారంభిస్తారు. ఇదిలా ఉండగా, వివాదాస్పద ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సహా ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో మంగళవారం, బుధవారం చర్చించడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఆ తర్వాత ఈ అంశంపై రాజ్యసభలో చర్చ ప్రారంభమవుతుంది.

టీఎంసీ ముస్లిం ఓటు బ్యాంక్ ఖతం!

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో అధికార టీఎంసీ నుంచి సస్పెన్షన్‌కు గురైన ముర్షిదాబాద్ ఎమ్మెల్యే హుమాయూన్ కబీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. నాలుగోసారి మమతా బెనర్జీని ముఖ్యమంత్రి పీఠం ఎక్కనివ్వబోనని ప్రతినబూనారు. రాష్ట్రంలో తృణమూల్ కాంగ్రెస్‌కున్న ముస్లిం ఓటు బ్యాంకు ఇక గల్లంతేనని స్పష్టం చేశారు. అసలు కథ ముందుందంటూ హెచ్చరికలు చేశారు. ముందుగా ప్రకటించిన విధంగానే శనివారం బెల్డంగలో బాబ్రీ తరహా మసీదుకు పునాది రాయి వేయడం తెల్సిందే. పోలీసులు ఈ కార్యక్రమానికి సహకారం అందించకున్నా 8 లక్షల మంది తరలివచ్చారన్నారు. విరాళాలు ఇటుకలు, డబ్బు రూపంలో వెల్లువెత్తుతున్నాయని చెప్పారు. ఈ నెల 22న సొంతపార్టీ ఏర్పాటును ప్రకటిస్తానని, ముస్లింల సంక్షేమం కోసం పనిచేసే తమ పార్టీ అభ్యర్థులు వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీలోని 294 స్థానాలకు గాను 135 చోట్ల బరిలో ఉంటారన్నారు. ఎంఐఎం నేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో మాట్లాడి ఎన్నికల్లో పొత్తు పెట్టుకుంటామని ప్రకటించారు. రాష్ట్ర రాజకీయాలను తాము మలుపు తిప్పబోతున్నట్లు చెప్పారు. టీఎంసీయే కాదు, బీజేపీకి కూడా రాష్ట్రంలో అధికారం దక్కనివ్వబోమని తేల్చిచెప్పారు. అదేవిధంగా, మసీదు నిర్మాణానికి పునాది రాయి వేసిన బెల్డంగలోని రెజినగర్‌లో ఫిబ్రవరిలో లక్ష మందితో ఖురాన్ పఠనం చేపడతామన్నారు. పఠనం అనంతరం మసీదు నిర్మాణ పనులు మొదలవుతాయని చెప్పారు. హాజరైన వారికి బిర్యానీతో విందు ఉంటుందని వివరించారు.

ఎస్ఐఆర్‌కు తప్పుడు సమాచారం..

దేశంలో తొలి కేసు నమోదు

లక్నో: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వే సమయంలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సమర్పించిన ఆరోపణలపై దేశంలోనే మొదటిసారిగా ఉత్తరప్రదేశ్‌లో ఓ కుటుంబంపై కేసు నమోదైంది. రాంపూర్ జిల్లాకు చెందిన నూర్జహాన్ ఇద్దరు కుమారులు ఆమిర్ ఖాన్, డానిష్ ఖాన్ దుబాయ్, కువాయిట్‌లలో కొన్నేళ్లుగా నివసిస్తున్నారు. అయితే, నూర్జహాన్ ఎస్ఐఆర్ బూత్ లెవల్ అధికారులకు వాళ్లిద్దరూ రాంపూర్‌లోని జ్వాలా నగర్‌లోనే ఉంటున్నట్లు ఫోర్జరీ పత్రాలను ఎన్యుమరేషన్ సందర్భంగా సమర్పించింది. డిజిటైజేషన్ ఫాంలను పరిశీలించిన బీఎల్‌వోల ఈ విషయాన్ని గుర్తించారు. ఆరా తీయగా వారిద్దరూ

విదేశాల్లో ఉంటున్నది నిజమేనని తేలింది. దీంతో, నిజాలను దాచిపెట్టినందుకు నూర్జహాన్, ఆమె ఇద్దరు కుమారులపై ప్రజాప్రాతినిధ్య చట్టం–1950లోని సెక్షన్ 31 కింద, బీఎన్ఎస్ కింద కేసులు నమోదు చేసినట్లు జిల్లా మేజిస్ట్రేట్ అజయ్ కుమార్ ద్వివేది చెప్పారు.

ఆరో రోజు 650 విమానాలు

- కొనసాగిన విమానాల రద్దు పర్వం
- మరోవైపు పెరిగిన విమానరాకపోకల సంఖ్య
- దేశవ్యాప్తంగా ప్రయాణికులకు కాస్తంత ఊరట

ఆదివారం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ఇండిగో కౌంటర్ వద్ద బారులుతీరిన విమాన ప్రయాణికులు

ముంబై: ఇండిగో సంక్షోభం ఆరో రోజు సైతం కొనసాగింది. ఆదివారం ఒక్కరోజే మరో 650 విమానాలు రద్దయ్యాయి. ఢిల్లీలో 118, ముంబైలో 121 విమానాలు రద్దయ్యాయి. శుక్రవారం, శనివారంతో పోలిస్తే పరిస్థితి చాలావరకు అదుపులోకి వచ్చినట్లు ఇండిగో వర్గాలు వెల్లడించాయి. అయితే ఆరో రోజు ప్రయాణికులకు కొంత ఊరట లభించింది. విమానాల సంక్షోభం క్రమంగా కుదుటపడుతున్న సంకేతాలు కనిపించాయి. దేశీయ, అంతర్జాతీయ సర్వీసులకు సంబంధించి మొత్తం 2,300 విమానాలకుగాను ఆదివారం 1,650 విమానాలు రాకపోకలు సాగించాయి. ఈ నెల 10వ తేదీ కల్లా సాధారణ పరిస్థితులు నెలకొంటాయని, విమానాలు యథాతథంగా రాకపోకలు సాగిస్తాయని, ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశాయి. ప్రయాణికులతోపాటు ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేయడంతో ఇండిగో యాజమాన్యం నష్టనివారణ చర్యలు ప్రారంభించింది. పరిస్థితిని చక్కదిద్దడానికి నడుం బిగించింది. ఇండిగో సిబ్బందిని ఉద్దేశించి సంస్థ సీఈఓ పీటర్ ఎల్‌బెర్స్ ఒక వీడియో సందేశం విడుదల చేశారు. ఒక్కో అడుగు వేసుకుంటూ సాధారణ స్థితికి చేరుకుంటున్నామని తెలిపారు. ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్(సీఎంజీ)ను ఏర్పాటు చేసింది. ఇండిగో విమానాల రాకపోకలకు సంబంధించి తాజా పరిణామాలను ఈ గ్రూప్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది.

త్వరలో పార్లమెంటరీ కమిటీ విచారణ!

ఇండిగో సంక్షోభంపై ఆ సంస్థ ప్రతినిధులతోపాటు డీజీసీఏ అధికారులను, విమానయాన శాఖ అధికారులను పిలిపించి విచారించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం నిర్ణయించింది. త్వరలో వారికి సమన్లు జారీ చేయబోతున్నట్లు సమాచారం. పెద్ద సంఖ్యలో విమానాలు రద్దు కావడం, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోవడాన్ని పట్ల సంజయ్ ఝా నేతృత్వంలో రవాణా, పర్యాటకం, సంస్కృతిపై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తీవ్రంగా పరిగణిస్తోంది. ఆయా అధికారులను పిలిపించి ప్రశ్నించడంతోపాటు భవిష్యత్తులో ఇలాంటి సమస్య తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సంక్షోభానికి మూల కారణాలపై విశ్లేషణ ప్రారంభించినట్లు ఇండిగో వర్గాలు పేర్కొన్నాయి.

రాజస్తాన్ పర్యాటకానికి ఎదురుదెబ్బ

రాజస్తాన్‌కు ప్రతిఏటా డిసెంబర్‌లో పర్యాటకులు భారీగా తరలివస్తుంటారు. ఇండిగో సంక్షోభం వల్ల గత ఆరు రోజులుగా ప్రముఖ పర్యాటక ప్రాంతాలు వెలవెలబోతున్నాయి. విమానాలు అందుబాటులో లేక పర్యాటకులు రావడం లేదు. చాలామంది తమ పర్యటనలు రద్దు చేసుకున్నారు. కొందరు వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సీజన్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నామని, పర్యాటకులు రాకపోవడంతో చాలా నష్టపోతున్నాయని రాజస్తాన్‌లోని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోటళ్లు, దుకాణాలు, రవాణా రంగాల్లో వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. వీరందరికీ దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులే జీవనాధారం.

ప్రయాణికులకు రూ.610 కోట్లు రీఫండ్

రద్దయిన, ఆలస్యంగా నడిచిన విమానాలకు సంబంధించి ప్రయాణికులకు ఇండిగో యాజమాన్యం శనివారం నాటికి రూ.610 కోట్లు రీఫండ్ చేసినట్లు విమానయాన శాఖ ఆదివారం వెల్లడించింది. అలాగే బ్యాగేజీని కూడా వెనక్కి ఇచ్చినట్లు తెలిపింది. ప్రయాణికులకు టిక్కెట్ల సొమ్మును ఆదివారం రాత్రి 8 గంటలకల్లా పూర్తిగా చెల్లించాలని ఇండిగోను కేంద్ర ప్రభుత్వం ఆదేశించి సంగతి తెలిసిందే. అలాగే బ్యాగేజీని 48 గంటల్లోగా అందజేయాలని పేర్కొంది. సంక్షోభంపై వివరణ ఇవ్వడానికి ఇండిగో సీఈఓ పీటర్ ఎల్‌బెర్స్, అకౌంటబుల్ మేనేజర్ ఇసిడ్రో పోర్కిరస్‌కు మరికొంత సమయం ఇవ్వాలని డీజీసీఏ ఆదివారం నిర్ణయించింది. సోమవారం సాయంత్రంకల్లా వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

ఇండిగో విమానంలో పావురం కలకలం

ఇండిగో విమానం టేకాఫ్‌కు సిద్ధమవుతున్న సమయంలో అందులో పావురం కనిపించడం తీవ్ర కలకలం సృష్టించింది. బెంగళూరు నుంచి వడోదరకు బయలుదేరిన విమానంలో ఈ ఘటన జరిగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. తాజాగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. సరిగ్గా టేకాఫ్‌కు ముందు పావురం విమానంలో ఎగరడం చూసి ప్రయాణికులు, సిబ్బంది ఆశ్చర్యానికి గురయ్యారు. దాన్ని పట్టుకోవడానికి ప్రయత్నించారు. వారి చేతికి చిక్కకుండా చాలాసేపు అటుఇటూ ఎగురుతూ కనిపించింది. బయటపడేందుకు ప్రయత్నించింది. ప్రయాణికుల్లో ఒకరు ఈ దృశ్యాన్ని చిత్రీకరించి, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. ఇండిగోకు బ్యాడ్‌టైమ్ కొనసాగుతోందని కొందరు పేర్కొన్నారు. పావురానికి 'బర్డింగ్ పాస్' ఉంది కాబోలు, అందుకే లోపలికి వచ్చిందని ఒకరు చమత్కరించారు.

భద్రతలో మా నిబద్ధతకు రోడ్లే నిదర్శనం

- సరిహద్దు రోడ్లు జాతీయ భద్రతకు జీవనాధారాలు
- 125 బీఆర్‌ఓ ప్రాజెక్టులను జాతికి అంకితమిచ్చాక రాజ్‌నాథ్ వ్యాఖ్య



లేహ్: సరిహద్దుల వెంట జాతీయ భద్రతలో తమ ప్రభుత్వ నిబద్ధతకు ఈ నూతన రహదారులే ప్రబల నిదర్శనాలు అని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. సరిహద్దు రోడ్లు జాతీయ భద్రతకు జీవనాధారాలని, మెరుగైన అనుసంధానతతో భారీ ప్రయోజనాలు ఒనగూరతాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సరిహద్దుల వెంట బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌ఓ) కొత్తగా నిర్మించిన 125 ప్రాజెక్టులను ఆదివారం ఆయన లేహ్‌లో జరిగిన కార్యక్రమంలో జాతికి అంకితమిచ్చాక ప్రసంగించారు. లద్దాఖ్, జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతాలతోపాటు అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, మిజోరం రాష్ట్రాల్లో మొత్తంగా రూ.5,000 కోట్ల వ్యయంతో సరిహద్దుల వెంట 28 రహదారులు, 93 వంతెనలు, నాలుగు ఇతర నిర్మాణాలను బీఆర్‌వో విజయవంతంగా పూర్తిచేసింది. బీఆర్‌వో చరిత్రలో ఒకేరోజు ఇన్ని ప్రాజెక్టుల ప్రారంభోత్సవం జరగడం ఇదే తొలిసారి. ''సరిహద్దు మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో ప్రభుత్వ నిబద్ధతకు ఇవి ప్రబల నిదర్శనాలు. మన సైనికుల శౌర్యం, ధైర్యం మనకు స్ఫూర్తిదాయకం. దేశ సేవలో ప్రాణాలను అర్పించిన వీరులకు ఈ మౌలిక సదుపాయాల ప్రాజెక్టును అంకితమిస్తున్నా. అత్యంత అనువైన రహదారులు అనేవి సరిహద్దుల వెంట సైన్యం విజయవంతమైన సైనిక ఆపరేషన్లు చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అద్భుతమైన రోడ్ల అనుసంధానతతోనే చక్కటి సైనిక విజయాలను సాధించగలం. ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంతో పాటు షెడ్యూల్ కంటే ముందే పూర్తి చేయడం విశేషం''అని బీఆర్‌ఓ విభాగాన్ని రాజ్‌నాథ్ పొగడ్తల్లో ముంచెత్తారు. ''సరిహద్దును అనుసంధానం చేయడం, భద్రతను బలోపేతం చేయడమే కాకుండా స్థానిక ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి చేస్తుందని, ప్రకృతి విపత్తుల సమయాల్లో సహాయక చర్యల వేగాన్ని పెంచుతుంది. సాయుధ బలగాలతోపాటు బీఆర్‌ఓ సిబ్బంది, సరిహద్దు ప్రాంతాల పౌరులు జాతీయ భద్రతలో భాగస్వాములవుతున్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి''అని ఆయన పిలుపునిచ్చారు. లద్దాఖ్‌లోని దుర్బుక్–శ్యోక్–దౌలత్ బేగ్ ఓల్డీ మధ్య 920 మీటర్ల పొడవునా నిర్మించిన సొరంగం ఇంజనీరింగ్ అద్భుతం అని కొనియాడారు.

రూ.1.51 లక్షల కోట్లకు దేశీయ రక్షణ ఉత్పత్తి

''రక్షణరంగ పరిశ్రమలో భారత్ అద్భుతమైన ప్రగతిని కనబరుస్తోంది. 2014లో రూ.46,000 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తుల విలువ ఇప్పుడు రికార్డు స్థాయిలో రూ.1.51 లక్షల కోట్లకు పెరిగింది. రూ. 1,000 కోట్ల కంటే తక్కువగా ఉన్న మన రక్షణ ఎగుమతులు ఇప్పుడు రూ. 24,000 కోట్లకు చేరుకున్నాయి''అని గుర్తుచేశారు. ''2024–25 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో బీఆర్‌ఓ రూ.16,690 కోట్ల వ్యయంతో రోడ్లను నిర్మించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.18,700 కోట్ల విలువైన మౌలిక వసతుల ప్రాజెక్టులను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. గత రెండేళ్లలో బీఆర్‌ఓ 356 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను జాతికి అంకితం చేయడం, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఒక మైలురాయి. జాతీయ భద్రతలో బీఆర్‌ఓ పాత్రను గుర్తించిన ప్రభుత్వం 2025–26లో బడ్జెట్‌ను రూ.6,500 కోట్ల నుంచి రూ.7,146 కోట్లకు పెంచింది''అని చెప్పారు.

ఈరోడ్‌లో విజయ్ ర్యాలీకి పోలీసులు నో

ఈరోడ్: తమిళ నటుడు, తమిళగ వెట్రి కజగం(టీవీకే) పార్టీ చీఫ్ విజయ్ ఈ నెల 16వ తేదీన ఈరోడ్‌లో తలపెట్టిన ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించారు. ఇటీవలే ఆ పార్టీలో చేరిన మాజీ మంత్రి సెంగొట్టయాన్ ఈ మేరకు ఆదివారం పెట్టుకున్న అర్జీని తిరస్కరించినట్లు పోలీసు శాఖ తెలిపింది. అయితే, అదే రోజు ఓ ప్రైవేట్ మ్యారేజీ హాల్‌లో జరిగే సమావేశంలో విజయ్ పాల్గొంటారని సెంగొట్టయాన్ మీడియాకు తెలిపారు. ఈరోడ్ ప్రాంతం సెంగొట్టయాన్‌కు గట్టిపట్టున్న ప్రాంతం. తొమ్మిది పర్యాయాలు ఇక్కడి నుంచే ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఏఐఏడీఎంకే బహిష్కరించడంతో విజయ్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ ర్యాలీని తన బలాన్ని ప్రదర్శించుకునేందుకు వాడుకోవాలని ఆయన భావించారు. అయితే, విజయ్ తలపెట్టిన బహిరంగ సభా వేదికను ఎస్పీ సుజాత పరిశీలించారు. ఏడెకరాల సభాస్థలి 70 వేల మందికిపోదని భావిస్తూ అనుమతి నిరాకరించినట్లు చెప్పారు.

కోల్‌కతాలో గీతా పారాయణం

- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- హిందువులు ఏకం కావాలంటూ సాధువుల పిలుపు

కోల్‌కతా: కోల్‌కతా నగరం ఆదివారం కృష్ణ భగవానుని నామ స్మరణతో మార్మోగింది. సాధువులు, సాధ్వీల శంఖారావాలతో కార్యక్రమానికి వేదికైన ప్రఖ్యాత బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్ పరిసరాలు ప్రతి ధ్వనించాయి. సనాతన సంస్కృతి సన్సద్ చేపట్టిన కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భారత్ సేవాశ్రమ్ సంఘ్‌కు చెందిన స్వామి ప్రదీప్తానంద మహారాజ్ తదితరులు కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. కాషాయ వస్త్రాలు ధరించిన సాధువులు భగవద్గీతలోని శ్లోకాలను ముక్తకంఠంతో పఠించారు. విశాలంగా నిర్మించిన మూడు వేదికలపై వివిధ ప్రాంతాల నుంచి ధీరేంద్ర శాస్త్రి వంటి పండితులు, గురువులు ఆశీనులయ్యారు. గీతా మనీషి మహామండల్‌కు చెందినస్వామి జ్ఞానానందజీ మహారాజ్ ఆధ్వర్యం వహించారు. తమ కార్యక్రమంతో ఏ రాజకీయ పార్టీకి కూడా సంబంధం లేదని ప్రదీప్తానంద మహారాజ్ చెప్పారు. ఇక్కడికి దాదాపు నాలుగైదు లక్షల మంది హిందువులు స్వచ్ఛందంగా, సనాతన ధర్మ పరిరక్షణ కోసం తరలివచ్చారన్నారు. బెంగాల్ బీజేపీ చీఫ్ సుకాంత మజుందార్ తదితర నేతలు కార్యక్రమానికి హాజరయ్యారు. హిందువులు ఏకం కాకుంటే, బెంగాల్‌లో ద్వితీయ పౌరులుగా మారే ప్రమాదముందని మజుందార్ అన్నారు. ఆహ్వానించినా సీఎం మమతా బెనర్జీ హాజరు కాకపోవడంపై సుకాంత మజుందార్ స్పందిస్తూ..ఆమె అసలు హిందువేనా అనే అనుమానం కలుగుతోందన్నారు. టీఎంసీ నేతలు స్పందిస్తూ.. అది బీజేపీ నేతలు పాల్గొంటున్న రాజకీయ కార్యక్రమమని పేర్కొన్నారు. బాబ్రీ తరహా మసీదు నిర్మాణానికి పునాది రాయి పడిన మరునాడే జరిగిన ఈ కార్యక్రమానికి యంత్రాంగం భారీగా భద్రతా ఏర్పాట్లను చేపట్టింది. 2023 డిసెంబర్‌లో లోక్‌సభ ఎన్నికలకు ముందు కోల్‌కతాలో లక్ష గొంతుకల గీతా పారాయణ కార్యక్రమం చేపట్టడం విశేషం.

మధ్యప్రదేశ్‌లో చీతా కూన మృతి

గ్వాలియర్: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలో గుర్తు తెలియని వాహనం ఢీకొని చీతా కూన ఒకటి ప్రాణాలు కోల్పోయింది. ఆగ్రా–ముంబై జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వివరాలను గ్వాలియర్ జోన్ ఐజీ అరవింద్ సక్సేనా ఆదివారం వెల్లడించారు. దాదాపు 20 నెలల వయస్సున్న మగ చీతా కూన కునో జాతీయవనం(కేఎన్‌పీ) నుంచి బయటకు వచ్చింది. ఇది ఆగ్రా–ముంబై జాతీయరహదారిని దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అది అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. చీతా ప్రాణాలు తీసిన ఒక కారుకు సంబంధించి కొన్ని ఆధారాలు లభించాయని పోలీసు అధికారి వెల్లడించారు. ఆదివారం చనిపోయిన చీతా కూనతో పాటు మరో కూన సైతం తల్లి నుంచి విడిపోయి, దారి తప్పి తిరుగుతోందని అటవీశాఖ అధికారులు చెప్పారు.

సాక్షి
గుంటూరు
సోమవారం । 8 । డిసెంబర్ । 2025



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్
దాచేపల్లి: స్థానిక పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎస్పీ జగదీష్, సీఐ భాస్కర్, ఎస్ఐ పాపారావు పాల్గొన్నారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం
అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వెయ్యి క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 4400 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 43.98 టీఎంసీలు.

పురుగుమందులు స్వాధీనం
నరసరావుపేట: ట్రాన్స్‌పోర్టు కంపెనీల ద్వారా అక్రమంగా రవాణా చేసిన పురుగుమందుల బాక్స్‌లను వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు.

న్యూస్‌రీల్

మహాశక్తి దేవతగా బగళాముఖి

చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారు ఆదివారం మహాశక్తి దేవత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారికి జరిగిన అర్చనలు, విశేష పూజలలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

వైభవంగా ప్రారంభమైన శ్రీరామకోటి మహోత్సవాలు

నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీరామ నామక్షేత్రం ఆవరణలో 99వ శ్రీరామకోటి మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ట్రస్టీస్ రాగం వెంకటలీలాసుందరి, బెల్లంకొండ మస్తాన్‌రావు ఆధ్వర్యంలో జరగ్గా, సాయంత్రం క్రోసూరి మురళీకృష్ణమాచార్యుల బృందం అంకురారోపణం, అగ్నిస్థాపనం, రుత్విగ్వరణం, అఖండ జ్యోతిస్థాపన, శ్రీరామ పతాకావిష్కరణ, పూజ కార్యక్రమాలు నిర్వహించారు. రామకృష్ణ మిషన్ (సీతానగరం) కార్యదర్శి శ్రీమాన్ స్వామి వినిశ్చలానంద పతాకావిష్కరణ చేసి, అనుగ్రహభాషణం చేశారు. 99 ఏళ్లుగా శ్రీరామకోటి మహోత్సవాలను నిర్విరామంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వంశపారంపర్యంగా ఆ సీతారాముల అనుగ్రహంతో పలు ప్రాంతాల భక్తులు, దాతల సహకారంతో చేపట్టడం ఒక బృహత్తర యజ్ఞంగా పేర్కొన్నారు. కలియుగంలో తరించేందుకు రామనామ సంకీర్తనే సరైన మార్గమని చెప్పారు. క్షేత్రాన్ని విద్యుత్ దీపాలతో అలకరించారు.

హైకోర్టుకు వెళ్లే బస్సు సమయం మార్పు

పట్నంబజారు: గుంటూరు డిపో 1 నుంచి హైకోర్టుకు వయా తుళ్లూరుకు నిత్యం ఉదయం 8.00గంటలకు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయలుదేరే జనరల్ బస్సు టైమ్‌ను 7.45 నిమిషాలకు మార్చినట్లు డిపో 1 అధికారులు తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుండి 15 నిముషాల ముందుగా మార్చినట్లు వివరించారు. సోమవారం నుంచి మారిన బస్సు సమయం మార్పులను ప్రయాణికులు, ఉద్యోగులు గమనించాలని కోరారు.

సాగర్ నీటిమట్టం వివరాలు



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 578.00 అడుగులకు చేరింది. ఇది 277.2460 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 10,000, ఎడమ కాలువకు 8,367, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల అవుతోంది. జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లో 20,167 క్యూసెక్కులు కాగా... శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 20,167 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది

మరో ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్

నగరంపాలెం: అక్రమ రేషన్ వ్యాపారులకు సహకరిస్తున్న పొన్నూరు రూరల్ పోలీస్‌స్టేషన్ (పీఎస్) కానిస్టేబుళ్లు ఎం.నాగార్జున, వై.మహేష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమార్కులపై ఉన్న పోలీసుల నిఘాను ఎప్పటికప్పుడు చేరవేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని అన్నారు. పోలీస్ శాఖ ఉద్యోగులకు ఉండాల్సిన నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణను వారు విస్మరించారని ఆయన పేర్కొన్నారు. పోలీస్ వ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేదిలేదని, శాఖాపరమైన చర్యలు ఉంటాయని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

కోటి గళాల నిరసన సంతకం

- వైద్య కళాశాలల ప్రయివేటీకరణపై వైఎస్సార్‌సీపీ పోరు
- చంద్రబాబు సర్కారు అడ్డగోలు నిర్ణయంపై నిరసన
- ప్రజల నుంచి పెద్ద ఎత్తున సంతకాల సేకరణకు మద్దతు
- పేద, మధ్య తరగతి వర్గాలకు వైద్యం, వైద్యవిద్య దూరం చేయడంపై మండిపాటు

పేద, మధ్య తరగతి వారికి వైద్యాన్ని, విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేలా చంద్రబాబు సర్కార్ తీసుకున్న దుర్మార్గ నిర్ణయంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమించింది. వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల కార్యక్రమంతో గళమెత్తింది. ఇప్పటికే వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రతి గడపకు వెళ్లి వైద్య కళాశాలలు ప్రయివేటీకరణ వలన అనర్థాలను వివరించారు. జిల్లాలోని నియోజకవర్గాల్లో జరిగిన సంతకాల సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.

గుంటూరు కోబాల్డ్‌పేటలోని మసీదు వద్ద సంతకాల సేకరణలో మాజీ మంత్రి అంబటి రాంబాబు (ఫైల్)

పట్నంబజారు: వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేయాలని చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి లభిస్తున్న మద్దతే దీనికి సాక్ష్యంగా నిలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 4 లక్షల సంతకాలు వరకు పూర్తి అయిన నేపథ్యంలో ఈ నెల 10వ తేదీన జిల్లాలోని గుంటూరు పశ్చిమ, గుంటూరు తూర్పు, తెనాలి, పొన్నూరు, తాడికొండ, ప్రత్తిపాడు, మంగళగిరి నియోజకవర్గాల నుంచి జిల్లా పార్టీ కార్యాలయానికి భారీ ర్యాలీల నడుమ ఇలా సేకరించిన సంతకాల ప్రతులను తీసుకురానున్నారు. అనంతరం ఈ నెల 15వ తేదీన గుంటూరు నగరం బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయం నుంచి లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ జరగనుంది. ఆయన విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం పూర్తి స్థాయి సంతకాల ప్రతులను కేంద్ర పార్టీ కార్యాలయంలో అందజేయనున్నారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో...

గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు ఆధ్వర్యంలో అక్టోబర్ 22వ తేదీన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలోని 26 డివిజన్‌లలో సంతకాల సేకరణ కార్యక్రమాలను పార్టీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు చేపట్టారు. అంబటి స్వయంగా పర్యవేక్షించారు. ఆరు డివిజన్‌లలో స్వయంగా పాల్గొని సంతకాల సేకరణ చేశారు. నియోకవర్గంలో మొత్తం 44,500 సంతకాలు పూర్తి అయ్యాయి.

కొరిటెపాడులో వాహనచోదకుడి వద్దకు వెళ్లి సంతకం సేకరిస్తున్న అంబటి రాంబాబు (ఫైల్)

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో...

గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 23 డివిజన్‌లలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఆధ్వర్యంలో అక్టోబర్ 18వ తేదీ నుంచి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభమైంది. నియోజకవర్గంలోని 1 నుం 15వ డివిజన్ వరకు, 17, 50, 51, 53, 54, 55. 56, 57 డివిజన్‌లలో సంతకాల సేకరణ జరిగింది. నూరిఫాతిమా 14 డివిజన్‌లలో స్వయంగా పాల్గొని, సంతకాలు సేకరించారు. ఇప్పటివరకు 40 వేల సంతకాలు పూర్తి కాగా, మరిన్ని సంతకాల సేకరణ జరగనుంది.

పొన్నూరు నియోజకవర్గంలో...

పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పొన్నూరు టౌన్, రూరల్, చేబ్రోలు, పెదకాకాని మండలాలలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. పొన్నూరు మండలంలో 20 వేలు, పట్టణంలో ఐదు వేలు, చేబ్రోలు మండలంలో 15 వేలు, పెదకాకాని మండలంలో 25 వేల సంతకాలు సేకరించారు. నియోజకవర్గం మొత్తం 65 వేల సంతకాలు పూర్తయ్యాయి. అంబటి మురళీకృష్ణ గ్రామాలకు వెళ్లి ప్రజలకు మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ వల్ల జరిగే అనర్థాలను వివరిస్తున్నారు.

మంగళగిరి నియోజకవర్గంలో...

మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతి వేమారెడ్డి ఆధ్వర్యంలో అక్టోబరు 26వ తేదీ నుంచి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. మంగళగిరి పట్టణం, మంగళగిరి రూరల్, దుగ్గిరాల, తాడేపల్లి మండలాల్లో అన్ని గ్రామాల్లో ఇంటింటికీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తిరిగి కోటి సంతకాల సేకరణ చేపట్టారు. అందులో భాగంగా ఇప్పటికే 70 వేల సంతకాలు సేకరించారు.

తెనాలి నియోజకవర్గంలో...

తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం అక్టోబరు 15వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఇందులో భాగంగా తెనాలి పట్టణం, రూరల్, కొల్లిపర మండలాలలో 59 వేల సంతకాలు సేకరించారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ పార్టీ శ్రేణులు వెళ్లి ప్రజలను చైతన్య పరుస్తున్నారు. ఈ మేరకు సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో పార్టీ అనుబంధ విభాగాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో...

ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అక్టోబరులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని ఇళ్లకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి వైద్య కళాశాలల ప్రయివేటీకరణ వల్ల జరిగే అనర్థాలను వివరిస్తూ 50 వేల సంతకాలు పూర్తి చేశారు. ప్రత్తిపాడు, గుంటూరు రూరల్, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో సంతకాల సేకరణ కార్యక్రమం సాగింది. పార్టీ అనుబంధ విభాగాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జేబులు నింపుకొనేందుకే..

సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్‌లు తమ జేబులు నింపుకొనేందుకే మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు తెగబడ్డారు. ఎంతో మంది పేద విద్యార్థుల కలలు చిదిమేసేలా వైద్య కళాశాలలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు దాసోహం అవుతున్నారు. ఒక దుష్ట సంస్కృతికి తెరలేపారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చారు. వాటిని ప్రయివేటీకరణ చేయడం చంద్రబాబుకు సిగ్గుచేటు. రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తే పూర్తయ్యే వైద్య కళాశాలల విషయంలో ఇలా చేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం. ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదు. ప్రయివేటీకరణను కచ్చితంగా అడ్డుకుని తీరుతాం.

– అంబటి రాంబాబు,
వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు,
పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త

తాడికొండ నియోజకవర్గంలో...

తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు ఆధ్వర్యంలో తాడికొండ, తుళ్లూరు, ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల్లో కోటి సంతకాల కార్యక్రమం అక్టోబరు 16న ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో సుమారు 65 వేల సంతకాలు సేకరించారు. స్వయంగా వనమా బాలవజ్రబాబు ఆయా మండలాల్లోని ఇళ్లకు వెళ్లి చంద్రబాబు సర్కారు కుట్రల గురించి వివరించారు. ప్రజల నుంచి సంతకాలు సేకరించారు.

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సంతకాలు సేకరిస్తున్న సమన్వయకర్త నూరిఫాతిమా (ఫైల్)

మాదకద్రవ్య రహిత సమాజమే సంకల్పం



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఈగల్ టీం ఐజీ రవికృష్ణ, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్, ఈగల్ ఎస్పీ నగేష్‌బాబు తదితరులు

- ఈగల్ టీం ఐజీ ఆకే రవికృష్ణ
- 'డ్రగ్స్ వద్దు బ్రో..సైకిల్ తొక్కు బ్రో' పేరిట అవగాహన కార్యక్రమం

గుంటూరు రూరల్: మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించడమే సంకల్పంగా ప్రతిష్టాత్మకంగా డ్రగ్స్ వద్దు బ్రో.. సైకిల్ తొక్కు బ్రో కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఈగల్ టీం ఐజీ ఆకే రవికృష్ణ తెలిపారు. ఆదివారం అడవితక్కెళ్లపాడులోని రాజీవ్‌గృహకల్ప నుంచి డ్రగ్స్ వద్దు బ్రో.. సైకిల్ తొక్కు బ్రో అనే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించటానికి సైకిల్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పెద్ద ఎత్తున విద్యార్థులు, ప్రజలు, సైక్లిస్టులు, పోలీసులు సుమారు 500 మంది ఈ ర్యాలీలో పాల్గొనగా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గుంటూరు జిల్లా పోలీస్, ఈగల్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమం నల్లపాడు పోలీస్‌స్టేషన్ సమీపంలోని టిడ్కో గృహాల వద్ద నుండి ప్రారంభమైన ర్యాలీ స్వర్ణభారతి నగర్, జేకేసీ కాలేజీ రోడ్డు, గుజ్జనగుండ్ల సర్కిల్, స్వామి థియేటర్ సెంటర్, టీజేపీఎస్ కాలేజీ, పట్టాభిపురం ఫ్లై ఓవర్ మీదుగా సాగిన జిల్లా పోలీస్ పరేడ్ మైదానం వరకు వెళ్లి ముగిసింది. అవగాహనతో మాదక ద్రవ్యాలను అంతమొందిద్దాం అనే సంకల్పంతో సాగిన సైకిల్ ర్యాలీలో ఐజీతోపాటు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఈగల్ ఎస్పీ నగేష్‌లు మాదక ద్రవ్యాల వలన జరిగే నష్టాల గురించి వివరించారు. దేశ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో కీలకమని, అటువంటి యువత శక్తిని మాదక ద్రవ్యాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. ప్రధానమంత్రి ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా ప్రజలు ఫిట్‌గా ఉండాలంటే సైకిల్ తొక్కాలని పిలుపునిచ్చారన్నారు. యువత సైకిల్ తొక్కే కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. డ్రగ్స్‌కి అలవాటు పడితే క్రమంగా అది మిమ్మల్ని బానిసలుగా మార్చి, మీ జీవితాలను చిత్తు చేస్తాయని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. నేటి సమాజం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య మాదక ద్రవ్యాలని, ఈ మాదక ద్రవ్యాలను నిర్మూలించడానికి ప్రజలందరూ కలసి మెలసి ముందుకు రావాలని ఈగల్ ఎస్పీ నగేష్‌బాబు తెలిపారు. ఎవరైనా గంజాయి వినియోగం, విక్రయం సరఫరా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే వెంటనే 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కి గాని, డయల్ 112 నంబర్‌కిగాని, స్థానిక పోలీస్ వారి దృష్టికి గానీ తీసుకురావాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీస్ అధికారులు సూచించారు. టిడ్కో గృహాల సముదాయాల మధ్యలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక గురుకుల పాఠశాల, మాస్టర్ మైండ్స్, శ్రీ చైతన్య, చలపతి, 24 బెటాలియన్ ఎన్‌సీసీ విద్యార్థులు, రెడ్ క్రాస్ సొసైటీ, సైకిల్ అసోసియేషన్, స్థానిక ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది సుమారు 500 మంది పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వ పరీక్షల విభాగం ఉత్తర్వులు విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించేందుకు తుది గడువు ఈనెల 9వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. రూ.50 అపరాధ రుసుంతో ఈనెల 12, రూ.200తో ఈనెల 15, రూ.500 అపరాధ రుసుంతో కలిపి చెల్లించేందుకు ఈనెల 18 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.125, గతంలో ఒకసారి పరీక్షల్లో తప్పిన విద్యార్థులు మూడు సబ్జెక్టులకు పైబడి రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ.110 చొప్పున ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు చెల్లించాలని సూచించారు. ఒకేషనల్ విద్యార్థులు సబ్జెక్టుకు రూ.60 చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉందని, తక్కువ వయస్సు గల విద్యార్థులు పరీక్ష రాసేందుకు వయస్సు మినహాయింపు కోసం రూ.300 చెల్లించాలని తెలిపారు. విద్యార్థులు చెల్లించిన ఫీజును ప్రధానోపాధ్యాయులు తమ లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో నిర్దేశిత గడువులోపు సమర్పించాలని ఆదేశించారు. పూర్తి వివరాలకు బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

వైకుంఠపురవాసుని అనుగ్రహంతో ఉన్నత స్థానం

- నటుడిగా జన్మ సార్థకం
- బొల్లిముంత పురస్కారం.. పూర్వజన్మసుకృతం
- ప్రముఖ సినీనటుడు బ్రహ్మానందం

బ్రహ్మానందంకు జీవితకాల పురస్కారం ప్రదానం

వైకుంఠపురం దేవస్థానంలో బ్రహ్మానందం

తెనాలిటౌన్: నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు యోధుడు బొల్లిముంత శివరామకృష్ణ తెలుగు సినిమాలకు రాసిన మాటలు, పాటలు ఆ రోజుల్లో సమాజంపై ఎంతో ప్రభావం చూపాయని, ఆయన పేరిట పురస్కారం అందుకోవటం తన పూర్వజన్మసుకృతమని ప్రముఖ సినీనటుడు బ్రహ్మానందం అన్నారు. బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సౌజన్యంతో తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరిగిన రెండురోజుల తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవంలో చివరిరోజైన ఆదివారం రాత్రి ఏర్పాటైన సభకు విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ చందు సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సభలో సినీనటుడు బ్రహ్మానందకు బొల్లిముంత శివరామకృష్ణ జాతీయస్థాయి జీవితకాల పురస్కారాన్ని రూ.లక్ష నగదుతో బహూకరించారు. అనంతరం బ్రహ్మానందం తన కృతజ్ఞతాపూర్వక ప్రసంగంలో, తెనాలితో తనకు ఎంతగానో అనుబంధం ఉందన్నారు. వైకుంఠపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతోనే తానీ స్థాయికి ఎదిగానని చెప్పారు. నలభై తొమ్మిదేళ్ల కిందట డిసెంబరు 14న తన వివాహం వైకుంఠపురం దేవస్థానంలో నిరాడంబరంగా జరిగిందని గుర్తుచేసుకున్నారు. అప్పుడు తాను పేదరికంలో ఉన్నానని చెప్పుకున్నారు. ఇక్కడకు వచ్చే ముందు వైకుంఠపురం దేవస్థానం వెళ్లి శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నట్టు తెలిపారు. తెనాలిలో జరిగే శ్రీరామనవమి వేడుకలు గొప్పగా ఉండేవనీ, ఆకాశమంత పందిళ్లు, మార్కెట్లోని దొంగరాముడి గుడి వద్ద పానకం, వడపప్పు తిన్న రోజులు మరచిపోలేనని చెప్పారు. సినిమాల్లో తనను చూడగానే జనం నవ్వుకోవటం దేవుడు ప్రసాదించిన వరంగా భావిస్తానని, నటుడిగా తన జన్మ సార్థకమైందని బ్రహ్మానందం అన్నారు. మంచిగా ఆలోచించి, పదిమందికీ మంచిచేయాలన్నారు. ధర్మం, సహాయం అనే పదాలు తనకు ఇష్టం ఉండదని ఏ సహాయం చేసినా గోప్యంగా ఉంచాలనేది తన భావనగా చెబుతూ ఆ సహాయం కూడా యోగ్యులకు చేయాలని సూచించారు. మనుషులంతా ఒక్కటే అనే భావన ప్రతి ఒక్కరిలో రావాలనేది తన ఆకాంక్షగా చెప్పారు. ఏపీ నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ పేద కళాకారులకు ఆర్థికసహకారం అందించటంలో బ్రహ్మానందం ముందువరుసలో ఉంటారని, చేసిన సాయం ఎవరికీ చెప్పుకోరని అన్నారు. ఆయనొక ప్రొఫెసర్, ఫిలాసఫర్‌గా అభివర్ణించారు. డాక్టర్ ఆలపాటి కృష్ణ సందీప్, తుమ్మల కిషోర్‌బాబు, చందు శ్రీనివాసరావు, అరవ రామకృష్ణ, బి.శ్రీనివాసరావు, సింగరాయకొండ మండల విద్యాధికారి బొల్లిముంత అజయ్‌కుమార్, బొల్లిముంత కృష్ణ, కనపర్తి బెన్‌హర్ మాట్లాడారు. సభలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, సామాజిక కార్యకర్త చెరుకూరి రమేష్‌బాబు, అంతర్జాతీయ శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్షలను సత్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చందు సుబ్బారావు పర్యవేక్షించారు.

మధ్యవర్తిగా వచ్చి మృత్యువాత

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- నరసరావుపేట మండలం కేఎం అగ్రహారంలో ఘటన
- మధ్యవర్తిగా వచ్చి ప్రాణాలు పోగొట్టుకున్న పర్వతాలు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

పర్వతాలు మృతదేహం వద్ద విలపిస్తున్న కుమారులు

తీవ్రంగా గాయపడిన కోటేశ్వరరావు

నరసరావుపేట రూరల్: స్వల్పవివాదం నేపథ్యంలో జరిగిన దాడిలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని కేఎం అగ్రహారంలో ఆదివారం చోటుచేసుకుంది. ఇంటి పక్కన వారితో ఏర్పడిన వివాదం పరిష్కారంలో మధ్యవర్తిగా వెళ్లిన వ్యక్తి దాడిలో మృత్యువాత పడ్డాడు. నరసరావుపేట రూరల్ పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన వివరాలు. నరసరావుపేట మండలం కేఎం అగ్రహారానికి చెందిన ఓర్సు ముసలయ్య, వేముల వెంకటేశ్వర్లు పక్కపక్క ఇంటిలో నివసిస్తున్నారు. స్థలం విషయంలో గతంలో ఇరువురి మధ్య వివాదం ఉంది. అప్పటి నుంచి ఇరు కుటుంబాల మధ్య పలు మార్లు స్వల్ప ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం వేముల వెంకటేశ్వర్లు కుమారుడు అంకారావు ద్విచక్రవాహనంపై గడ్డి తీసుకొస్తుండగా రోడ్డుపై నిలిపి ఉంచిన ముసలయ్యకు చెందిన ద్విచక్రవాహనానికి తగిలి బండి కింద పడింది. దీనిపై ముసలయ్య కుటుంబ సభ్యులు ప్రశ్నించడంతో ఇరు కుటుంబాల మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ సమయంలో అంకారావు రాడ్‌తో ముసలయ్యకు చెందిన ద్విచక్రవాహనంపై దాడిచేయడంతో పాక్షికంగా దెబ్బతిన్నది.

మధ్యవర్తిగా వచ్చి..

ఇంటి వద్ద ఆదివారం జరిగిన వివాదాన్ని దేచవరంలో ఉంటున్న తన సోదరుడు పర్వతాలుకు ముసలయ్య తెలియజేశాడు. గ్రామానికి వచ్చి వివాదాన్ని పరిష్కరించాలని కోరారు. తన కుమారుడు హనుమంతరావుతో కలిసి పర్వతాలు అగ్రహారం వచ్చాడు. ముసలయ్య కుమారుడు కోటేశ్వరరావు, భార్య రమణలు, పర్వతాలు, హనుమంతరావులు నలుగురు రెండు ద్విచక్రవాహనాలపై వెంకటేశ్వర్లుకు చెందిన పొలం వద్దకు వెళ్లారు. అక్కడ వెంకటేశ్వర్లు ఆయన కుమారుడు అంకారావుతో వీరికి వాగ్వివాదం జరిగింది. వెంకటేశ్వర్లు, అంకారావులు గడ్డపార, కర్రలతో వీరిపై దాడి చేశారు. ఈ దాడిలో పర్వతాలు అక్కడికక్కడే మృతిచెందాడు. కోటేశ్వరరావు తీవ్రంగా గాయపడటంతో ఏరియా వైద్యశాలకు తరలించారు. పర్వతాలు కుమారుడు హనుమంతురావుకు స్వల్పగాయాలయ్యాయి.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

దాడి జరిగిన సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన రూరల్ సీఐ సుబ్బారావు, ఎస్ఐ కిషోర్‌లు చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన కోటేశ్వరరావును 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. మృతుల బంధువులతో మాట్లాడి వివరాలు సేకరించారు. దాడికి ఉపయోగించిన గడ్డపారను స్వాధీనం చేసుకున్నారు. క్లూస్‌టీమ్ నమూనాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ సీఐ సుబ్బారావు తెలిపారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై భగ్గుమన్న ప్రజలు

- తెనాలి నియోజకవర్గంలో 59 వేల మంది సంతకాలు
- గడువులోగా 65 వేల సంతకాలు పూర్తి చేస్తామన్న పార్టీ నేతలు

సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ రాధిక

తెనాలి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని ప్రభుత్వమే నిర్వహించాల్సి ఉండగా, చంద్రబాబు సర్కార్ పీపీపీ పద్ధతితో కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి చేతులు దులుపుకోవాలని చూడటంపై ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రభుత్వ చర్యను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కోటి సంతకాలతో రాష్ట్ర గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆయన పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు.

అద్భుత స్పందన

సంతకాల సేకరణకు తెనాలి నియోజకవర్గంలో అద్భుతమైన స్పందన లభించింది. ఇప్పటి వరకు 59 వేల మంది సంతకాలను సేకరించారు. గడువులోగా 65 వేల సంతకాలను సేకరిస్తామన్న ఆశాభావాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో వార్డు, గ్రామ కమిటీలు, అనుబంధ కమిటీల నియామకం కోసం ముఖ్యనేతలు, క్రియాశీల కార్యకర్తల సమావేశాలను ఎక్కడికక్కడ నిర్వహిస్తూ వచ్చారు. ఆయా సమావేశాల అనంతరం అక్కడే స్థానికుల నుంచి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలను సేకరించారు.

ఉద్యమ స్ఫూర్తితో కార్యాచరణ

నియోజకవర్గంలో అక్టోబరు 15వ తేదీన సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టారు. ఆరోజు కొల్లిపర మండలం వల్లభాపురంలో, రూరల్ మండల గ్రామం హాఫ్‌పేటలో, పట్టణంలోని ఒకటో వార్డులో వార్డు సమావేశాలు, సంతకాల సేకరణను ఆరంభించారు. వైఎస్సార్ సీపీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉద్యమస్ఫూర్తితో ఇందుకోసం పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే శివకుమార్ ప్రత్యేకంగా పలుచోట్ల సంతకాల సేకరణలో స్వయంగా పాల్గొన్నారు. ఇప్పటి వరకు 53 రోజుల కార్యాచరణలో మొత్తం 59 వేలమంది ప్రజలు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ, చంద్రబాబు సర్కార్ తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ సంతకాలు చేయడం చేయటం విశేషం! మరో రెండుమూడురోజుల గడువులోగా 65 వేలమంది సంతకాలతో పార్టీకి సమర్పించనున్నట్టు నాయకులు వెల్లడించారు.

స్వచ్ఛందంగా సంతకాలు

అన్నిచోట్లా మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయటమనే ప్రభుత్వ నిర్ణయాన్ని విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు, సంస్థల ప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించటం సంతకాల సేకరణలో ప్రస్ఫుటమైంది. సొంత పనులపై రోడ్డు పక్కన వెళుతున్నవారు కూడా ఈ శిబిరాల దగ్గర, విషయం తెలుసుకుని స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేసి వెళుతున్నారు. చదువురాని వ్యవసాయ కూలీ నుంచి అధ్యాపకులు, న్యాయవాదులు, డాక్టర్లు కూడా సంతకాలు చేసినవారిలో ఉన్నారు. వీరిలో మహిళలు సగం మంది పైనే ఉండటం చెప్పుకోవాల్సిన అంశం. ఈ ఉద్యమానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక, అంబేడ్కర్ సేవా ట్రస్ట్, జై భీమ్ ఫెడరేషన్ సంపూర్ణంగా సహకరించాయి. కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు, విశ్రాంత ఉద్యోగులు కూడా తమ సంతకాల ఉద్యమానికి సహకరించినట్టు ఈ కార్యక్రమ పర్యవేక్షకుల్లో ఒకరైన అక్కిదాసు కిరణ్‌కుమార్ చెప్పారు. పేద విద్యార్థులకు ఉచితంగా మెడికల్ సీట్లు వచ్చే అవకాశాన్ని కోల్పోతారనే బాధ అందరిలోనూ కనిపించిందని ఈ సందర్భంగా చెప్పారు.

సంతకాల సేకరణలో వైఎస్సార్ సీపీ మహిళా నేతలు

తెనాలి కోర్టుల సముదాయం ఎదుట న్యాయవాదుల సంతకాల సేకరణ

శరవేగంగా సంతకాల సేకరణ

కొల్లిపర మండలంలో ప్రతి గ్రామంలోనూ ఇప్పటికి సంతకాల సేకరణ పూర్తయిది. రూరల్ మండలంలో అయిదారు గ్రామాలు, పట్టణంలోని అయిదు వార్డుల్లో సంతకాల సేకరణ జరుగుతోంది. అవి కూడా పూర్తయితే నియోజకవర్గంలో నూరుశాతం ప్రజాభిప్రాయాన్ని సేకరించినట్టు కాగలదని చెబుతున్నారు. వార్డు, గ్రామ సభల్లోనే కాకుండా కూడలి ప్రదేశాల్లోనూ ప్రత్యేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. బస్‌స్టేషన్, అంబేడ్కర్ సెంటర్, చినరావూరు సెంటర్ వంటి ప్రదేశాలతోపాటు దేవాలయాలు, మసీదులు, చర్చిలు సమీపంలోనూ చేయడం మరో విశేషం!

ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలనే చంద్రబాబు ప్రభుత్వ విధానాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మేము అధికారంలో దిగిపోయేనాటికి ఐదు మెడికల్ కాలేజీలు పూర్తయ్యాయి. మరో రెండు తుది దశకు వచ్చాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. వాటిని కూడా పూర్తిచేసి ప్రభుత్వం నిర్వహించాల్సి ఉంది. ఇప్పుడు ప్రైవేటు పరం చేస్తే ఆ ప్రయోజనాలన్నీ దెబ్బతింటాయి. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని చంద్రబాబు తన నిర్ణయాన్ని మార్చుకోవాలి.

– అన్నాబత్తుని శివకుమార్, మాజీ ఎమ్మెల్యే

ఉపసంహరించుకోవాలి

అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్ర సందర్భంగా మంగళగిరి నియోజకవర్గంలో మాట్లాడుతూ జీవో నెంబర్ 107, 108లు రద్దుచేసి మెడికల్ కాలేజీల్లో నూరుశాతం ఫ్రీగా ఇస్తానని హామీనిచ్చారు. తీరా ఇప్పుడు అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వం నడపలేదనీ, పీపీపీ పద్ధతిలో ప్రైవేటు పరం చేస్తామంటున్నారు. దీనివల్ల విద్యార్థులకు ఫ్రీ సీట్లు రావు. పేదలకు ఉచిత వైద్యం అందదు. ఇది సమంజసం కాదు. చంద్రబాబు ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– గండు శివనాగరాజు, విద్యార్థి

క్లుప్తంగా

ప్రాచీన ఆలయంలో మరోసారి చోరీ

తెనాలిరూరల్: రూరల్ గ్రామం కొలకలూరులో అతి ప్రాచీన దేవాలయం గంగా పార్వతీ సమేత శ్రీ అగస్త్యేశ్వ స్వామి దేవస్థానం(శివాలయం)లో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఉదయం ఆలయంలో పూజల నిమిత్తం వచ్చిన పూజారి, భక్తులు ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి ఉండటం, హుండీ తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారికి సమాచారం ఇచ్చారు. ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. హుండీలో సుమారు రూ.ఐదు వేలు ఉండవచ్చునని గుర్తెరిగి ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి నుంచి ఫిర్యాదు అందుకున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జూలై 9వ తేదీన ఇదే ఆలయంలో చోరీ జరిగింది. అతి పురాతన ఆలయంలో కనీసం సీసీ కెమెరాలు లేవన్న విమర్శలు అప్పట్లో రావడంతో ఇటీవల వాటిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సీసీ కెమెరా ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఆలయ సమీపంలో పలుగు పడిన ఉంది.

త్వైక్వాండోలో చిన్నారి రోషన్ రెడ్డికి పతకం

వేమూరు(చుండూరు): నేషనల్ ఓపెన్ కరాటే త్వైక్వాండో పోటీల్లో చిన్నారి రోషన్ రెడ్డి సత్తా చాటినట్లు టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ కె. సురేష్ తెలిపారు. గుంటూరు పట్టణంలో ది చాంపియన్ త్వైక్వాండో అకాడమీ కోచ్ ఆధ్వర్యంలో ఆదివారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చుండూరు మండలం మోదుకూరులోని బీఎంహెచ్ లైఫ్‌సైన్ స్కూలు విద్యార్థి అన్నపురెడ్డి రోషన్ రెడ్డి సిల్వర్ మెడల్ సాధించాడని సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

104 ఉద్యోగుల వేతన బకాయిలు చెల్లించాలి

లక్ష్మీపురం: గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తూ ప్రజాసంజీవనిగా పేరుతెచ్చుకున్న 104 వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బంది మాత్రం సమస్యలు వలలో చిక్కుకొని తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని 104 ఎంఎంయూ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు అన్నారు. గుంటూరులోని పాతుగుంటూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో 104 ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా సమావేశం గోరంట్ల సురేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరబిందో నుంచి రావాల్సిన బకాయిలు గ్రాట్యుటీ, ఎర్న్ లీవ్ డబ్బులు ఇప్పటికి చెల్లించకపోవడం తీవ్ర అన్యాయం అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అరబిందో నుంచి రావాల్సిన బకాయిలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత భవ్య యాజమాన్యం కూడా ఇప్పటి వరకు నియామకపత్రాలు కానీ, పే స్లిప్స్ కూడా ఇప్పటి వరకు ఉద్యోగులకు అందజేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ అధికారులు యాజమాన్యం యూనియన్ ప్రతినిధులతో మీటింగ్ నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఎటువంటి అనుభవం లేని డేటా ఎంట్రీ ఆపరేటర్‌కి మందుల నిర్వహణ బాధ్యతలు తొలగించాలని అన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌కి జీతాలు రూ.18500 పెంచాలని, ఐదేళ్ల సర్వీస్ పూర్తి అయిన డ్రైవర్‌లకు ఆటోమెటిక్‌గా స్లాబ్ అమలు చేయాలని, ప్రతి డివిజన్‌కి ఒక బఫర్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ హర్ష, కోశాధికారి ఐ.నాగులు, నాయకులు సత్యరాజు, సుబ్బారావు, విజయ్, సురేష్, వెంకట్రావు, సాయి, రమేష్ పాల్గొన్నారు.

వ్యక్తిపై గొడ్డలితో దాడి

బెల్లంకొండ: డబ్బులు విషయంలో ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం జరిగి గొడ్డలితో దాడిచేసుకునే వరకు వెళ్లిన ఘటన ఆదివారం మండలంలోని పాపాయపాలెంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓర్చు కృష్ణయ్య అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన సంక్రాంతి గోపాలకృష్ణ గొడ్డలితో దాడి చేశారు. గోపాలకృష్ణ తండ్రి కోటయ్య కృష్ణయ్యకు రూ.700 అప్పుగా ఇచ్చాడు. ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వమని అడగడంతో మధ్యాహ్నం కృష్ణయ్య, కోటయ్యలమధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ విషయాన్ని సంక్రాంతి కోటయ్య తన కుమారుడు అయిన గోపాలకృష్ణకు తెలిపాడు. దీంతో కోపోద్రిక్తుడైన గోపాలకృష్ణ, కృష్ణయ్యను గొడ్డలితో దాడి చేసి గాయపరిచాడు. ఈ దాడిలో కృష్ణయ్య మెడ భాగంలో తీవ్రగాయాలయ్యాయి. దీంతో బాధితుడిని సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు జిల్లా కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

బాపట్ల: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఈమేరకు ఉదయం తొమ్మిది నుంచి 10 గంటల వరకు అన్ని శాఖల జిల్లా అధికారులతో అర్జీలపై సమావేశం ఉంటుందని తెలిపారు. అర్జీలను ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంటల వరకు స్వీకరిస్తామని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామిరెడ్డి

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులుగా టీవీ రామిరెడ్డి(వ్యవసాయ శాఖ) ఎన్నికయ్యారు. ఆదివారం అంకమ్మనగర్‌లోని సంఘ కార్యాలయంలో జిల్లా కార్యవర్గం ఎన్నిక రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, గుంటూరు జిల్లా ఇన్‌చార్జి నాగ సాయి అధ్యక్షతన జరిగింది. ఇటీవల జిల్లా అధ్యక్ష పదవికి సయ్యద్ చాంద్ బాషా చేసిన రాజీనామాను ఆమోదించారు. నూతన జిల్లా అధ్యక్షులుగా టీవీ రామిరెడ్డి (వ్యవసాయ శాఖ), జిల్లా కార్యదర్శిగా వై నాగేశ్వరరావు (వైద్య ఆరోగ్య శాఖ), గుంటూరు నగర శాఖ అధ్యక్షులుగా షేక్ కరీముల్లా షా ఖాదరి (వైద్య ఆరోగ్యశాఖ) , నగర శాఖ కార్యదర్శిగా బి.కోటేశ్వర రావు (కార్మిక శాఖ), జిల్లా ఉపాధ్యక్షులుగా వి.పెద్ద రత్తయ్య (వైద్య ఆరోగ్యశాఖ)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికై న సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ప్రయోజనాలను కాపాడతామని ఇందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికై న సభ్యులకు సమావేశానికి హాజరైన సభ్యులందరూ అభినందనలు తెలిపారు.

నూతనంగా ఎన్నికైన సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

నేటి నుంచి ఏఎన్‌యూలో యువజనోత్సవాలు

ఏఎన్‌యూ(పెదకాకాని): అంతర్ కళాశాలల యువజన ఉత్సవాలు సోమవారం నుంచి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ప్రారంభం కానున్నాయి. వర్సిటీ కళాశాలలతోపాటు అనుబంధ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో పూర్తి సదుపాయాలు కల్పించి, ఏర్పాట్లు పూర్తి చేసినట్లు యువజన ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ తెలిపారు. సోమ, మంగళ, బుధవారాలలో మూడు రోజులపాటు మ్యూజిక్, డ్యాన్స్, లిటరరీ ఈవెంట్స్, థియేటర్, ఫైన్ ఆర్ట్స్ వంటి అంశాలలో పోటీలు జరుగునున్నాయి. యువజన ఉత్సవాల నిర్వహణకు పలు కమిటీలను ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే యువజనోత్సవాలకు ముఖ్య అతిథులుగా వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ప్రత్యేక ఆహ్వానితులుగా వర్సిటీ రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ప్రముఖ మ్యూజిక్ కంపోజర్, ప్లే బ్యాక్ సింగర్ ఎస్ఎస్.తమన్ హాజరుకానున్నారు. అతిథులుగా ఓ ఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ రవికుమార్, పాలక మండల సభ్యులు ఆచార్య కె. సుమంత్‌కుమార్, ఆచార్య ఎం.జగదీష్ నాయక్, వివిధ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్‌కుమార్, ఆచార్య వీరయ్య, ఆచార్య పాల్‌కుమార్, ఆచార్య లింగరాజు, ఆచార్య దివ్య తేజ మూర్తి తదితరులు హాజరు కానున్నట్లు యువజనోత్సవాల కో ఆర్డినేటర్ ఎస్. మురళీమోహన్ తెలిపారు.

రుణాలు ఇప్పిస్తానంటూ మోసం

- సుమారు రూ.6 లక్షలు టోకరా
- పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మహిళ

మంగళగిరి టౌన్: బ్యాంకుల్లో, వివిధ లోన్ యాప్‌లలో రుణాలు ఇప్పిస్తానంటూ ఓ మహిళను మోసం చేసిన ఘటన మంగళగిరి పట్టణంలో ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి పట్టణం ఎల్‌జీ నగర్‌కు చెందిన రాజేశ్వరి వంట పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. కొన్నినెలల క్రితం పట్టణ పరిధిలోని ఇందిరానగర్ ఏపీఎస్పీ గేటు సమీపంలో ఓ షాపు పెట్టుకుని వ్యాపారం నిర్వహిస్తోంది. 2024 సంవత్సరంలో మార్చి, ఏప్రిల్ నెలల్లో చరణ్‌రెడ్డి ఆమె షాపునకు వచ్చి తరచూ చీరలు కొనేవాడు. ఆ విధంగా రాజేశ్వరికి పరిచయమయ్యాడు. చీరల వ్యాపారం అభివృద్ధికై లోన్లు ఇప్పిస్తానని రాజేశ్వరిని నమ్మించాడు. పాన్‌కార్డు, ఆధార్ కార్డు కావాలని, అప్పుడప్పుడు మహిళ ఫోన్ కూడా ఇవ్వాల్సి వస్తుందని చరణ్‌రెడ్డి చెప్పాడు. అందుకు ఆమె ఒప్పుకోవడంతో గత సంవత్సరం ఆగస్టు 15వ తేదీన గుంటూరులోని హర్షిత ఎంటర్‌ప్రైజెస్‌కు సదరు మహిళను తీసుకువెళ్లి లోన్ ఇప్పిస్తానని చెప్పి ఆధార్, పాన్‌కార్డు చెక్ చేయించి మహిళ చేతి వేలిముద్రలు తీసుకున్నాడు. ఈ క్రమంలో హర్షిత ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు రూ.3 లక్షల లోన్ సరిపోతుందా అని ప్రశ్నిస్తూ ఫొటోలు కూడా తీసుకున్నారు. వాళ్లు ఏం అడిగినా మాట్లాడద్దని రాజేశ్వరికి చెప్పడంతో మౌనంగా ఉంది. అదే సంవత్సరం సెప్టెంబర్ 11న గుంటూరులోని సత్య షోరూమ్‌కు తీసుకువెళ్లి అంతకుముందు లోన్ ఫెయిల్ అయ్యిందని, మళ్లీ ప్రయత్నం చేస్తున్నానంటూ నమ్మబలికాడు. అక్కడ కూడా రాజేశ్వరి వేలముద్రలు వేయించి, ఆధార్, పాన్ వెరిఫికేషన్ అంటూ మాయమాటలు చెప్పాడు. మరల లోన్ ఫెయిల్ అయిందని, నీ ఫోన్ కావాలంటూ చెప్పడంతో ఫోన్‌ను చరణ్‌రెడ్డికి రాజేశ్వరి ఇచ్చింది. అలా 10 రోజుల తరువాత మంగళగిరిలోని మహిళ షాప్‌కు వచ్చి గంటలు గంటలు రాజేశ్వరి ఫోన్ తీసుకుని చూసేవాడు. వచ్చిన కస్టమర్లకు చీరలు చూపిస్తూ ఫోన్ గురించి పట్టించుకోకపోవడంతో రాజేశ్వరి ఫోన్‌లో లోన్ యాప్‌లు వేశాడు. 2024 అక్టోబర్ 5వ తేదీన ఒక లోన్ యాప్ వేసి పూర్తిచేయమని చెప్పి వెళ్లిపోయాడు. ఆ యాప్‌లో సమాచారం ప్రకారం పూర్తిచేసింది రాజేశ్వరి. సాయంత్రానికి తన ఖాతాలో నుండి రూ.17 వేల మాయమైనట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే చరణ్‌రెడ్డికి రాజేశ్వరి ఫోన్ చేసి ఖాతాలో డబ్బులు పోయాయని, ఎందుకు అని అడిగితే షాప్‌కు వస్తానని చెప్పి వచ్చాడు. చరణ్‌రెడ్డి మహిళ ఫోన్ తీసుకుని కొద్ది సమయం ఫోన్‌లో ఏదేదో చేస్తూ మీ నగదు ఎక్కడికీ పోలేదు. నేను ఆ యాప్‌లో రిపోర్ట్ చేశాను, తిరిగి నీ ఖాతాలోకి డబ్బులు వచ్చేస్తాయని నమ్మబలికాడు. అదేవిధంగా పలుమార్లు ఆమె ఖాతా నుంచి నగదు తీసుకున్నాడు. అతనిపై చర్యలు తీసుకోవాలని మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి రాజేశ్వరి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ నందకిషోర్‌కు ఐఎంఏ రాష్ట్ర ఉత్తమ అధ్యక్ష అవార్డు

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన సీనియన్ ఈఎన్‌టీ సర్జన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గర్లపాటి నందకిషోర్‌కు 'ఉత్తమ రాష్ట్ర అధ్యక్షుని అవార్డు' లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షునిగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి, వైద్యుల సమస్యల్ని తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయడం, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత అధికారులతో కలిసి రాష్ట్ర ప్రజారోగ్య పరిరక్షణ చర్యలలో పాలుపంచుకోవడం వంటి సేవలకుగాను 2024–2025 సంవత్సరానికి డాక్టర్ నందకిషోర్‌కు ఈ అవార్డు ప్రకటించారు. ఈ మేరకు ఐఎంఏ జాతీయ కార్యాలయం ఢిల్లీ నుంచి సమాచారం వచ్చింది. ఈ అవార్డును ఈనెల 27, 28 తేదీలలో గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో నిర్వహించే ఐఎంఏ జాతీయ సదస్సులో ప్రముఖుల చేతుల మీదుగా డాక్టర్ నందకిషోర్ అందుకోనున్నారు. తనకు జాతీయఅవార్డు లభించిన సందర్భంగా రాష్ట్ర వైద్యులందరికీ డాక్టర్ నందకిషోర్ కతజ్ఞతలు తెలిపారు .జాతీయ అవార్డు కు ఎంపిక కావడం పట్ల ఐఎంఏ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నాగెళ్ల కిషోర్, సిజిపి డైరెక్టర్ డాక్టర్ ఎం.ఫణికుమార్ ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.సుభాష్ చంద్రబోస్, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.బాలరాజు, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్, డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు తదితరులు అభినందనలు తెలిపారు. గుంటూరు బ్రాంచ్‌కి చెందిన డాక్టర్ నందకిషోర్‌కి ఈ అవార్డు లభించడం పట్ల ఐఎంఏ గుంటూరు శాఖ ప్రస్తుత అధ్యక్షుడు డాక్టర్ టీ.సేవకుమార్, పూర్వఅధ్యక్షుడు డాక్టర్ వై. సుబ్బారాయుడు, కార్యదర్శి డాక్టర్ బి.సాయికృష్ణ, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎం.శివప్రసాద్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ సిహెచ్.శ్రీనివాసరెడ్డి, బ్రాంచ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఆరోగ్యశాఖలో సస్పెన్షన్‌లు ఆందోళనకరం

నరసరావుపేట ఈస్ట్: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించారనే కారణంలో వైద్య ఆరోగ్యశాఖలో ఒకేసారి 12 మంది ఉద్యోగులను సస్పెండ్ చేయటం సరికాదని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వర్ణ చినరామిరెడ్డి, కార్యదర్శి చుక్కా వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సస్పెండ్‌కు దారితీసిన పరిస్థితులపై సమీక్షించారు. ఈనెల 3వ తేదీన గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సాయంత్రం 5.30 గంటల సమయంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ సందర్శించారనీ, ఆ సమయంలో ఆరోగ్య కేంద్రాన్ని తాళం వేసి ఉండటాన్ని గమనించి కేంద్రంలోని 12 మందిని సస్పెండ్‌చేయటం సరైన చర్య కాదని అభిప్రాయపడ్డారు. ఆరోజున కేంద్రంలోని ముగ్గురు ఉద్యోగులు సెలవుపై ఉన్నారనీ, మిగిలిన వారు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు విధి నిర్వహణలో ఉన్నారని తెలిపారు. ఉద్యోగుల వివరణ కోరకుండా సస్పెండ్ చేయటం బాధాకరమని తెలిపారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు దీనిపై పునరాలోచించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ షేక్.బాజీ, తాలూకా యూనిట్ నాయకులు ఎం.ఫ్లోరెన్స్, ఎస్.చలమారెడ్డి, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఆరుగురు అరెస్ట్

- రెండు కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్

వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్, ముసుగులో ఉన్న ఆరుగురు నిందితులు

లక్ష్మీపురం: గంజాయి క్రయ, విక్రయాలు జరుపుతున్న ఆరుగురిని నగరంపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ వివరాలు వెల్లడించారు. శనివారం రాత్రి 10 గంటలకు నగరంపాలెం సీఐ సత్యనారాయణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీఐపీ రోడ్డులోని లాలుపురం వెళ్లే డొంక సమీపంలో ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలం వద్ద గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని అందిన సమాచారం మేరకు ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో ఎస్ఐ ప్రసన్నకుమార్ పోలీసు బృందంతో అక్కడికి చేరుకున్నారు. కొంత మంది పోలీసులను చూసి పారిపోతుండగా సీఐ తన సిబ్బందితో వెంబడించి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి చేతుల్లో ఉన్న కవర్లను పరిశీలించగా గంజాయి ఉండటం గుర్తించి, వెంటనే వాటిని సీజ్ చేసి, పట్టుబడిన ఆరుగురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గంజాయి క్రయ, విక్రయాలు జరుపుతుండగా పట్టుబడిన వారిలో ఐదుగురిపై పలు స్టేషన్‌లలో కేసులు ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ఈ కేసులో ఇంకా కొంత మంది నిందితులను గుర్తించామని వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. కేసులో నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో గంజాయి, మాదక ద్రవ్యాలు ఎక్కడైనా సరఫరా చేస్తున్నట్లు గాని, వినియోగిస్తున్నట్లు గాని తెలిస్తే చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఈ కేసులు నగరంపాలెం సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రసన్నకుమార్, హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్‌బాబు, దాసు, కానిస్టేబుల్ శ్రీనివాసు, ఉదయ్, నాగేశ్వరరావు, నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన వీరిందరిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

ఉత్సాహంగా స్వర్ణోత్సవ సంబరం

బాపట్ల: స్థానిక వ్యవసాయ కళాశాలలో విద్యనభ్యసించిన 1975–79 బ్యాచ్ విద్యార్థులు 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం స్వర్ణోత్సవ సంబరాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆత్మీయ పలకరింపులతో ఆత్యంతం ఆహ్లాదకరంగా గడిపారు. ఒకరినొకరు కుశల ప్రశ్నలతో పలకరించుకున్నారు. సుదీర్ఘ కాలం తరువాత కలుసుకున్న ఉద్వేగంతో ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మొత్తం 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్న ఈ సమ్మేళనంలో నలుగురు మహిళలు కూడా ఉండటం విశేషం. ఇక్కడ చదివిన అనంతరం వైద్య విద్యనభ్యసించిన నలుగురు ఎంబీబీఎస్ డాక్టర్లు, అఖిల భారత సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఐఎఫ్ఎస్‌కు ఎంపికైన నలుగురు అధికారులు, బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్లు, వివిధ రంగాల్లో నిష్ణాతులై తమ పదవులకు వన్నె తెచ్చిన వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో వివిధ హోదాల్లో ఉద్యోగ బాధ్యతలను నిర్వహించి రిటైర్ అయిన వారు ఉన్నారు. వీరంతా ఆదివారం వ్యవసాయ కళాశాలలో కలుసుకున్నారు. విద్య నేర్పిన 12 మంది గురువులకు వేద పండితుల ఆశీస్సులతో పట్టు వస్త్రాలను బహూకరించి, ఘన సన్మానం చేసి గురు భక్తిని చాటుకున్నట్లు ఈ బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థి సంఘం నాయకులు జె.ధర్మారావు, పి.రాజశేఖరరావు తెలిపారు. చివరిగా ప్రస్తుత విద్యార్థులతో ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యానంతర ఉద్యోగావకాశాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూన రాణి, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ గుంటూరు సిటికి ఆనుకొని ఉన్న పేరేచర్ల NRI IT కాలేజ్ ప్రక్కన, orrకి మధ్యలో AP CRDA ప్లాట్స్ కలవు. ప్లాట్ కొనుగోలుపై రిజిస్ట్రేషన్ ఫ్రీ.ఫ్రీ. సంప్ర।। 7729075959, 9959127008

SERVICES

ASTROLOGY

■ తమిళనాడు వైదీశ్వరన్ కోయిల్ శ్రీ అగస్త్యే నాడి జ్యోతిష్యాలయం మీ చేతి బొటనవేలి ముద్రతో మీ భవిష్యత్తు పూర్తిగా చెప్పబడును. అన్ని సమస్యలకు పరిష్కారం చెప్పబడును. GNT. 8978215913

BUSINESS OFFER

■ వ్యాపార భాగస్వాములు కావాలి. తక్షణం వ్యాపార భాగస్వాములు వెతుకుతున్నాము. సంప్రదించండి: RSJ Inspection Service Ltd. సెల్ : 85959 24917.

CHANGE OF NAME

■ I, MANDALA AYYAPPA REDDY, S/o M RAMIREDDY , R/o. H.No: 1-51, Vemavaram , Phirangipur, Guntur, A.P-522529. I am the Holder of Passport No: N7843879. I wish to officially update my wife's name in my passport from PRASANNA to PAIDALA PRASANNA.

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును ✆ 8790741166

WANTED

■ APSRTC ఆవరణలో పనిచేయుటకు యువతి యువకులు కావలెను. అర్హత: 10th-డిగ్రీ, ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర।। 9705263264

■ అబ్బినేనిగుంటపాలెంలోని కరోలి ప్లాస్టిక్ ఇండస్ట్రీస్‌లో పనిచేయుటకు లైసెన్సు డ్రైవర్ కం ఫిట్టర్స్ కావలెను. జీతం: 15,000/- సంప్ర।। 9866201885

■ తెనాలిలోని ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు ICU స్టాఫ్, స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్ కావలెను. సంప్రదించండి. ఫోన్. 7702762108, 9666354489

■ Wanted Qualified Primary Teachers, Helpers & Receptionist English fluency is must. ✆ Montessori E.M. School, Gnt. 81214 00100

■ శ్రీవసుధ డెవలపర్స్ గుంటూరులో పని చేయుటకు మేనేజర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలికాలర్స్, డ్రైవర్స్, అకౌంటెంట్ & సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర: 77319 51999

■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు, 10th పాస్ 50సం।। పై వయస్సు వారు కావలెను. 9989909698

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ్ నందు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌గా, క్లాస్ ఇన్‌ఛార్జ్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు: 22సంవత్సరాల నుండి 45సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 8978480429

■ ప్రముఖ MNC కంపెనీకి VRS రిటైర్డ్, ప్రయివేట్, గవర్నమెంట్ ఎంప్లాయిస్, లెక్చరర్స్, టీచర్స్, మార్కెటింగ్, గృహిణులు, ఆడిటర్స్ కావలెను.వ.35–65 yrs. ✆ 70134 81406

■ Hydలో పెద్దవారికి సేవ చేయుటకు బేబికేర్, ఇంటి / వంట పనికి హెల్పర్స్, ఆయాలు, కేర్‌టేకర్స్ స్త్రీ / పు కా. జీ : 18,000 to 30,000/- రూం + మీల్స్ ఫ్రీ. Ph : 6300639598

■ యూనిటీ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంటపనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫోన్. 8121631212, 9640016901

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4లైన్లు) ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం గుంటూరు 7075167663 7075167541

గమనిక

క్లుప్తంగా

భక్తులకు అన్నదానం

మంగళగిరి టౌన్: మంగళగిరి శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం చిన్నరథం వద్ద శివభక్త బృందం ఆధ్వర్యంలో భక్తులకు ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సుమారు 30 ఏళ్ల నుంచి ప్రతి నెలలోని అమావాస్యకు దగ్గరగా ఉండే ఆదివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని శివభక్త బృంద ప్రతినిధులు పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలు, ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో శివాలయం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోటేశ్వరరావు, భక్తబృందం ప్రతినిధులు రామకృష్ణ, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి వడ్డేశ్వరంలో అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు స్థానిక టీడీపీ నాయకులు ఆదివారం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వడ్డేశ్వరం గ్రామంలోని మాదివాడ శారద అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని కాట్రగడ్డ మధుసూధనరావు రూ.15 వేలను వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, షేక్ మస్తాన్, షేక్ కుమార్, నెమలికంటి చిన్ని, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన మాంసం ధరలు

చికెన్ కేజీ రూ.270.. మటన్ రూ.1000

తాడేపల్లి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా కోళ్లఫారాల్లో కోళ్లు మృత్యువాత పడడంతో ప్రతీవారం ఆదివారం వచ్చేసరికి చికెన్ ధర రూ.10 నుంచి 30 వరకు పెరుగుతోంది. గతవారం బాయిలర్ కోడి రూ.240 ఉండగా ఇప్పుడు రూ.270కు చేరింది. గత వారంలో నాటుకోటి ధర రూ.750 ఉండగా ప్రస్తుతం రూ.850కి అమ్ముతున్నారు. మటన్ మాత్రం ఆయా ప్రాంతాల్లో ఒక కేజీ రూ.900 నుంచి వెయ్యి రూపాయల వరకు అమ్ముతున్నారు. మటన్ రేటు ఎలా ఉన్నా ఎక్కువ మంది ఆదివారం వస్తే చికెన్ షాపు వైపే పరుగులు తీస్తున్నారు. కోడిగుడ్డు ధరతో పాటు చికెన్ రేటు కూడా పెరుగుతుండడంతో సామాన్యులు చికెన్ కొనడానికి కూడా దూరం కావాల్సి వస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ధర పెరగడం వల్ల వ్యాపారం బాగా తగ్గిందని.. గతంలో 100 నుంచి 200 కేజీలు మాంసం అమ్మగా, ప్రస్తుతం 75 నుంచి 90 కేజీలే అమ్ముతున్నట్లు పలువురు వ్యాపారస్తులు తెలిపారు.

రైల్వే టికెట్ కౌంటర్ లేక అవస్థలు

దుగ్గిరాల: చిలువూరు రైల్వే స్టేషన్‌లోని టికెట్ కౌంటర్‌ను అర్ధంతరంగా మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందు ఎదుర్కొంటున్నారని ఏపీ ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ తెలిపారు. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిలువూరు రైల్వే స్టేషన్ నుంచి నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, పలువురు కూలీలు తెనాలి, విజయవాడ వెళుతూ ఉంటారని.. కారణం లేకుండా స్టేషన్‌లో టికెట్ కౌంటర్ మూసివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సంబంధిత రైల్వే ఉన్నత అధికారులు స్పందించి టికెట్ కౌంటర్‌ను పునరుద్ధరించాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

తెనాలి అర్బన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) అర్హత పరీక్ష తెనాలిలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్, చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్, కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిరా బాలికల హైస్కూల్, మారీసుపేటలోని ఎన్‌సీఆర్‌ఎంహెచ్, ఐతానగర్‌లోని ఎన్‌ఎస్‌ఎస్‌ఎంహెచ్ స్కూళ్లలో పరీక్ష జరిగింది. మొత్తం 960 మంది విద్యార్థులకు గాను 949 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. దీనిలో ఎంపికైన వారికి కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందజేస్తుందని చెప్పారు.

జూదరుల అరెస్ట్

తెనాలి రూరల్: తెనాలి వైకుంఠపురం కాల్వకట్ట సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 25 వేలు స్వాధీనం చేసుకున్నారు.

కాలువలో పడి వృద్ధురాలు మృతి

తెనాలి రూరల్: కాలువలో పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన తెనాలిలో ఆదివారం చోటుచేసుకుంది. పట్టణ చెంచుపేటకి చెందిన లక్ష్మమ్మ(87) వార్ఫ్ రోడ్డులో ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందింది. త్రీ టౌన్ ఎస్ఐ నక్కా ప్రకాశరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణం.. నరకప్రాయం!

తాడికొండ నుంచి కంతేరు వెళ్లే ప్రధాన రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా ధ్వంసమైంది. ఫలితంగా గుంతలతో రహదారి దర్శనమిస్తోంది. అధ్వానంగా ఉన్న ఈ రహదారి కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. భారీగా ఏర్పడిన గుంతలలో పడి గాయాలపాలవుతున్నామని వాహనచోదకుడు మండిపడుతున్నారు. తాడికొండ సమీపంలోని మొదటి మలుపు వద్ద రహదారి పక్కకు ఒరిగిపోవడంతో వెన్ను అదురుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే కనీస మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– తాడికొండ

సామాజిక సేవలో ఎన్‌ఎస్‌ఎస్

మంగళగిరి టౌన్: సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులు పాల్గొనేలా చేసి వారిలో దేశభక్తి, సేవాతత్పరతను పెంపొందించే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిందే జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) అని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ దామర్ల వెంకట నరసింహం పేర్కొన్నారు. మంగళగిరి మండల పరిధి చినకాకానిలో గల ఎలిమెంట్రీల స్కూల్‌లో ఆదివారం ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో భాగంగా ముగింపు సభను నిర్వహించారు. గత ఏడు రోజులుగా నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులను ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రేమ్‌రాజ్ అభినందించారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ల సేవలు అభినందనీయం అని కొనియాడారు. గత వారం రోజులుగా చినకాకానిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ఏర్పాటు చేసి వివిధ కార్యక్రమాలను డిగ్రీ కళాశాల వాలంటీర్లతో నిర్వహించడం, పలు అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం ప్రశంసనీయం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా సేవలు చేస్తూ ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.నాగేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ సుధీర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కళాశాల కరస్పాండెంట్ నరసింహం

సీఐటీయూ మహాసభలకు నిధుల సేకరణ

తాడేపల్లి రూరల్: సీఐటీయూ అఖిల భారత మహాసభలకు నాయకులు ఆదివారం నిధులు సేకరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని కేఎల్ రావు కాలనీలో ఇంటింటికి తిరిగి నిధులు సేకరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఈనెల 30 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగనున్న సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై పనిచేస్తున్న సీఐటీయూకు ఆదరణ ఉందని అన్నారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, మేరి, విజయబాబు, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

తాడికొండ: తుళ్లూరు మండలం రాయపూడిలో కారుణ్య మరణం కోరిన వృద్ధురాలు నెల్లూరి శేషగిరమ్మ కుటుంబానికి రెడ్‌క్రాస్ సొసైటీ అండగా నిలిచింది. శనివారం ఆమె ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో 90 ఏళ్ల శేషగిరమ్మ మతిస్థిమితం లేని మనుమరాలితో నివసిస్తుండగా ఆమెకు సాయమందించాలని తహసీల్దార్ హరిబాబు రెడ్‌క్రాస్ సొసైటీకి సమాచారం అందించారు. దీంతో వారు ఆదివారం వృద్ధురాలికి సాయం అందించే ప్రక్రియలో భాగంగా వంట పాత్రలు, కుక్కర్, దుప్పట్లు, ఇతర సామాగ్రి అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరిబాబు మాట్లాడుతూ.. శేషగిరమ్మ కుటుంబ పరిస్థితిపై జరిగిన ప్రమాదానికి సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపామని, ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ఆమెకు మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు. ఉన్న పూరిల్లు కాలిపోవడంతో వారి సమీప బంధువు మనుమడు ప్రస్తుతం తాత్కాలికంగా బ్రిక్స్ రాళ్లతో రేకుల షెడ్డును ఏర్పాటు చేస్తున్నారు.

శేషగిరమ్మ కుటుంబానికి సహాయం అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

తాడేపల్లి రూరల్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచి గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు సర్టిఫికెట్లను ఆదివారం అందజేశారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి అరవింద స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి సర్వోత్తమ గ్రంథాలయ సెక్రటరీ రావి శారద విచ్చేసి సర్టిఫికెట్లను విజేతలకు అందజేశారు. అనంతరం గ్రంథాలయ ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ఇంద్రాణి, లైబ్రేరియన్ రవికుమార్, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోండి

తెనాలి అర్బన్: ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు బుచ్చిబాబు పేర్కొన్నారు. డెల్ కంపెనీ సహకారంతో కొత్తపేటలోని మహిళా బాలల గ్రంథాలయానికి శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన రెండు కంప్యూటర్లు, ఒక స్మార్ట్ టీవీ, సెల్ ఫోన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి సమాజంలో కంప్యూటర్ పరిజ్ఞానానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. చిన్న వయస్సు నుంచే బాలలు కంప్యూటర్ కోర్సులను నేర్చుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కడియాల సుజాత, ప్రభుత్వ ఉపాధ్యాయులు పసుపులేటి చిరంజీవి, తన్నీరు శివశంకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బుచ్చిబాబు

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

దుగ్గిరాల: మధ్యాహ్న సమయంలో దాహంగా ఉందని.. తాగడానికి నీళ్లు కావాలని వచ్చిన గుర్తుతెలియని యువకుడు మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించాడు. ఈ ఘటన దుగ్గిరాల మండల పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈమని గ్రామానికి చెందిన కామిశెట్టి జయలక్ష్మీ బేల్దారు సామాను అద్దెకు ఇస్తూ జీవనం సాగిస్తుంటారు. ఆమె మెడలో బంగారు గొలుసు ఉందని గమనించిన ఓ యువకుడు దాహంగా ఉందని.. తాగడానికి నీళ్లు కావాలని అడిగారు. యువకుడి మాటలకు స్పందించిన ఆమె నీళ్లు ఇచ్చేందుకు యువకుడి వద్దకు వచ్చారు. ఈ సందర్భంలో యువకుడు ఆమె వద్ద గల బంగారు గొలుసును తెగలాగి పరారైయ్యాడు. బాధితురాలు ఆదివారం పోలీసులకు వివరాలు తెలుపగా ఎస్ఐ ఎస్.వెంకట రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న మహా నాట్య ప్రదర్శన

నృత్య ప్రదర్శనలో చిన్నారులు

తెనాలి: బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా ఆదివారం 500మంది కూచిపూడి నృత్య కళాకారులతో మహానాట్య ప్రదర్శన నిర్వహించారు. చందు సుబ్బారావు, బొల్లిముంత కృష్ణ పర్యవేక్షణలో నృత్య గురువులు జి.నిర్మలా రమేష్, బి.రంగనాయకి, ఎ.వెంకటలక్ష్మి, పి.వసంతదుర్గ, శ్రీరామచంద్రమూర్తి లక్కరాజు, చల్లా బాలాత్రిపురసుందరి, సీహెచ్. యామినిల శిష్య బృందం నర్తించారు.

సహజీవనం చేస్తూ మోసగించారని ఫిర్యాదు

తెనాలి రూరల్: సహజీవనం చేస్తున్న వ్యక్తి మోసం చేశాడని మహిళ ఫిర్యాదు చేసింది. చెంచుపేటకు చెందిన ఓ మహిళ పదేళ్లుగా లైన్‌మ్యాన్‌గా పని చేస్తున్న గోపీతో సహజీవనం చేస్తోంది. తన దగ్గర డబ్బు, బంగారం తీసుకుని మోసం చేశాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ కరిముల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధాప్య సమస్యలపై అవగాహన

తెనాలి: మనుషుల్లో నలభై ఏళ్ల వయసు తర్వాత ఎముకలు బలహీనమవుతాయని ఫలితంగా తుంటి, మోకాలు, మడమల వద్ద నొప్పులు వస్తాయని డాక్టర్ కంభం వెంకటకుమార్ చెప్పారు. నొప్పులు మొదలుకాగానే నడక ఆపకుండా కొన్నిరకాల వ్యాయామాలతో నివారించవచ్చని సూచించారు. వాకర్స్ క్లబ్, తెనాలి సమావేశం శనివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షతన జరిగింది. 'వృద్ధాప్యంలో ఎముకలు, నరాలకు ఫిజియోథెరపీ ఆవశ్యకత' అనే అంశంపై డాక్టర్ వెంకటకుమార్ మాట్లాడారు. నరాల సమస్యలపై డాక్టర్ కాశీభట్ల విష్ణుప్రియ మాట్లాడుతూ వయసు పెరిగేకొద్దీ నరాల్లో బలహీనత వస్తుందన్నారు. మధుమేహం ఉన్న వారికి రక్తంలో మార్పుతో రక్తప్రసరణ తగ్గి, మెడనొప్పి, చేతులు, కాళ్లలో జాలుగా ఉండి నొప్పులు ఆరంభమవుతాయని తెలిపారు. డాక్టరు సూచనతో తగిన వ్యాయామంతో నివారించవచ్చని తెలిపారు. సమావేశానికి కార్యదర్శి కడియాల రవిబాబు స్వాగతం పలికారు. సభ్యులు అచ్చయ్య, రత్తయ్య, అశోక్, ప్రసాద్, మొవ్వా సత్యనారాయణ, వెంకటరామయ్య, గోపాలరావు పాల్గొన్నారు.

డాక్టర్ వెంకటకుమార్, విష్ణుప్రియకు సత్కారం

పరంజ్యోతి కల్కి సేవా సమితి సేవలు అభినందనీయం

తెనాలి టౌన్: సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి తోడ్పాటును అందిస్తున్న శ్రీ పరంజ్యోతి కల్కి సేవా సమితి సేవలు అభినందనీయమని బుర్రిపాలెం మాజీ సర్పంచ్ పెమ్మసాని జయప్రకాశరావు కొనియాడారు. రూరల్ మండలం బుర్రిపాలెంలోని చక్రాయపాలెం రోడ్డులో ఆదివారం శ్రీ పరంజ్యోతి కల్కి సేవా సమితి సహకారంతో ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్‌ను ప్రారంభించారు. మాజీ సర్పంచ్ జయప్రకాశరావు పాల్గొని మాట్లాడారు. తెనాలి పరిసర ప్రాంతాలు కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి బుర్రిపాలెంలోని శ్రీ సర్వదేవా పరంజ్యోతి మానవ సేవా ఆలయానికి భక్తులు భారీగా వస్తారని చెప్పారు. వారి సౌకర్యార్థం ఆర్టీసీతో మాట్లాడి రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయించడం ముదావహమని పేర్కొన్నారు.

ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్‌ను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ ప్రకాశరావు

వైభవంగా కలశ జ్యోతుల యాత్ర

మంగళగిరి టౌన్: మంగళగిరిలో ఆలిండియా భవానీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి భవానీ భక్తుల కలశ జ్యోతుల యాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని రాజీవ్ గృహకల్ప రోడ్డులో గల శ్రీకాళీమాత ఆలయం వద్ద నుంచి కలశ జ్యోతుల ఊరేగింపు ప్రారంభమైంది. నగర పరిసర ప్రాంతాల్లోని భవానీ భక్తులు కాళీమాత ఆలయం వద్దకు చేరుకుని యాత్రలో పాల్గొన్నారు. భవానీ భక్తులు జ్యోతులను చేతబట్టి జై భవానీ.. జైజై భవానీ అంటూ ఊరేగింపు నిర్వహించారు. మేళ తాళాలు, కనకతప్పెట్లు, విచిత్ర వేషధారణ యాత్రలో భక్తులను ఆకట్టుకున్నాయి. భవానీలు శ్రీదుర్గా భవానీ ఆలయంలోని అమ్మవారికి జ్యోతులు సమర్పించారు. కార్యక్రమంలో గురు భవానీలు నవీన్, వెంకటేష్, శ్రీనాథ్, బాలగురవయ్య, శివకాశీ తదితరులు పాల్గొన్నారు.

కలశ జ్యోతుల యాత్రలో పాల్గొన్న భవానీలు, భక్తులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధి చింతిక్రింది కనకయ్య హైస్కూల్‌కు చెందిన 1982–83 సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు 5వ వన సమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మంగళగిరి మండల పరిధి వడ్లపూడిలో గల డీబీఎన్ గార్డెన్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వివిధ వృత్తులు, వ్యాపారులు, ఉద్యోగాల్లో స్థిరపడిన 42 సంవత్సరాల క్రితం నాటి బాల్యమిత్రులు ఒకేచోటకు చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందోత్సవాల్లో గడిపారు. ఒకరినొకరు యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీజే విద్యాసంస్థల డైరెక్టర్, పూర్వ విద్యార్థి ప్రగడ రాజశేఖర్ మాట్లాడుతూ.. నాటి మధుర స్మృతులను, జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ జీవితంలో నూతన ఉత్సాహంతో ముందుకు వెళ్లడానికి పూర్వవిద్యార్థుల కలయిక ఉపయోగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చంద్రశేఖర్, రత్నాకర్, శ్రీను, దుర్గారావు, పార్థసారధి, సీతయ్య, సాంబశివరావు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

369వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారానికి 369వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా మృతి చెందిన సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు సత్యనారాయణ మృతికి సంతాపం తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం యాజమాన్యం కార్మికుల సమస్య పరిష్కరించకపోవడం వల్లే ఆర్థిక ఇబ్బందులతో కార్మికులు మృతి చెందుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యాజమాన్యంతో చర్యలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నవనీతం, అన్నమ్మ, లక్ష్మి, దుర్గమ్మ, రిబ్కా, నాయకులు నాగేశ్వరరావు, సుభాని, నాగేశ్వరరావు, హగ్గయ్య, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షా శిబిరంలో కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలి

తాడేపల్లి రూరల్: రాజధాని అమరావతికి మొదటి విడతగా భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని సీపీఎం రాష్ట్ర పూర్వకార్యదర్శి పి.మధు డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులతో కలిసి రాజధాని అమరావతికి అనుబంధంగా ఉన్న సీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. మొదట్లో భూములు ఇచ్చిన రైతులకు సరైన న్యాయం చేయకుండా, మరలా కొన్ని గ్రామాల్లో పూలింగ్ పద్ధతి మీద భూములు సేకరించడం సరికాదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయని, పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. రైతులకు కేటాయించిన ప్లాట్లలో ఇప్పటి వరకూ ఒక్క రోడ్డు కూడా వేయలేదని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, రైతు సంఘం రాజధాని అధ్యక్షులు కె.జగదీశ్వర్ రెడ్డి, ఎస్కే పీర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

ఉచిత వైద్య శిబిరంలో 130 మందికి పరీక్షలు

చుండూరు(తెనాలి): రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, రోటరీ చారిటబుల్ ట్రస్ట్, ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం చుండూరు మండల గ్రామం దుండిపాలెంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ప్రవాస భారతీయులు నల్లమోతు మృత్యుంజయప్రసాద్, సుచేత సహకారంతో గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటైన శిబిరాన్ని రోటరీ 3150 అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, జోనల్ సెక్రెటరీ గుత్తా వెంకటరత్నం ప్రారంభించారు. ఈ శిబిరంలో 130 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 37 మందికి కళ్లజోళ్లు, 20 మందికి శుక్లాలు ఆపరేషన్ చేయాల్సి ఉందని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, గుమ్మడి వెంకటనారాయణ తెలియజేశారు. శుక్లాలు ఆపరేషన్ అవసరమైన వారిని మంగళవారం గూడవల్లిలోని ఎల్.వి ప్రసాద్ హాస్పిటల్‌కు తీసుకుని వెళ్లి ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామని వివరించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు వెంకటరెడ్డి, రోటరీ డిస్ట్రిక్ట్ కేబినెట్ కన్నెగంటి మురళీకృష్ణ, పావులూరి రాంబాబు, మల్లాది అర్జున, బత్తుల వెంకటేశ్వరరావు, చుండూరు మండలం ఎంపీటీసీ సభ్యుడు నాగేందర్ రెడ్డి, ఎల్వీ ప్రసాద్ సిబ్బంది వై. వెంకట్, డి.సరళ, వి.మాధవి, డి.జ్యోతి, ఎ.స్రవంతి, ఇంట్రాక్ట్ క్లబ్ సభ్యులు అఖిల్, పార్థ వెంకట్, గోపీకృష్ణ, యోసెస్, చేతన్ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ప్రభుత్వ హామీలు ప్రకటనలకే పరిమితం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: ''ప్రతి గింజా కొనుగోలు చేస్తాం...రైతులు అధైర్య పడొద్దు.. కొనుగోలు చేసిన నాలుగు గంటల్లోనే మీ బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తాం'' అంటూ ప్రభుత్వం చేసిన చేసిన ప్రకటనలు ఆచరణలో అమలు కావడం లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. తెనాలి రూరల్ గ్రామం కంచర్లపాలెం తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేసి, ఆరు రోజులు గడిచినా ఇంతవరకు నగదు జమ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆయన తెలిపారు. ఎంటీయూ–1262 రకం ధాన్యం కొనుగోలు చేయకపోవడం రైతాంగానికి ఇబ్బందిగా ఉందన్నారు. కంచర్లపాలెం వచ్చిన అధికారులను ఈ విషయమై రైతులు నిలదీస్తే, తమకు తెలియదని సమాధానం ఇవ్వటం సరైన పద్ధతి కాదని హితవు పలికారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, పుట్టినరోజు, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

ఉప్పల్, జింఖానా మైదానాల్లో నేటి మ్యాచ్‌లకు ప్రేక్షకులకు 'నో ఎంట్రీ'

హైదరాబాద్‌లో జరుగుతున్న సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ మ్యాచ్‌లకు ప్రేక్షకులను అనుమతించబోమని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఒక ప్రకటనలో తెలిపింది. దేశవాళీ టి20 టోర్నమెంట్‌లో భాగంగా గ్రూప్ 'సి' మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యమిస్తోంది. ఈ నెల 2న ఉప్పల్ స్టేడియంలో పంజాబ్, బరోడా జట్ల మధ్య మ్యాచ్ జరగగా... పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. భారత స్టార్ ఆటగాళ్లు హార్దిక్ పాండ్యా, అభిషేక్ శర్మ ఆడుతుండటంతో వారిని చూసేందుకు అభిమానులు ఆసక్తి చూపారు. సరైన సెక్యూరిటీ లేకపోవడంతో... పలువురు అభిమానులు మైదానంలోకి దూసుకెళ్లి స్టార్ ప్లేయర్‌లతో సెల్ఫీలు సైతం దిగారు. దీనిపై సర్వత్ర విమర్శలు వ్యక్తం కావడంతో... ఆటగాళ్ల భద్రతను దృష్టిలో పెట్టుకొని తాజాగా హెచ్‌సీఏ ఈ నిర్ణయం తీసుకుంది. ఉప్పల్‌తో పాటు జింఖానా మైదానంలో సోమవారం జరిగే మ్యాచ్‌లకు ప్రేక్షకులను అనుమతించబోమని హెచ్‌సీఏ తెలిపింది.

లాండో నోరిస్

నయా చాంప్ నోరిస్

ఫార్ములావన్ ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్ సొంతం

- 2008 తర్వాత మెక్‌లారెన్ జట్టు డ్రైవర్‌కు వరల్డ్ టైటిల్
- డిఫెండింగ్ చాంపియన్ వెర్‌స్టాపెన్‌కు రెండో స్థానం

వెర్‌స్టాపెన్

అబుదాబి: నాలుగేళ్ల తర్వాత ఫార్ములావన్ (ఎఫ్1)లో కొత్త ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్ అవతరించాడు. మెక్‌లారెన్ జట్టుకు చెందిన లాండో నోరిస్ 2025 ఫార్ములావన్ విజేతగా నిలిచాడు. సీజన్‌లోని చివరి రేసు అబుదాబి గ్రాండ్‌ప్రి మూడో స్థానంలోపు నిలిస్తే ప్రపంచ టైటిల్‌ను ఖరారు చేసుకునే పరిస్థితిలో బరిలోకి దిగిన నోరిస్ అదే పని చేశాడు. పూర్తి నియంత్రణతో, సంయమనంతో 58 ల్యాప్‌లను 1 గంట 26 నిమిషాల 24.041 సెకన్లలో పూర్తి చేసిన నోరిస్ మూడో స్థానంలో నిలిచి వరల్డ్ టైటిల్‌ను అందుకున్నాడు. నిర్ణీత 24 రేసులు ముగిశాక నోరిస్ 423 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి తొలిసారి వరల్డ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. అంతేకాకుండా 2008 తర్వాత మెక్‌లారెన్ జట్టు ఖాతాలో ఈ ప్రతిష్టాత్మక టైటిల్‌ను జమ చేశాడు. చివరిసారి 2008లో లూయిస్ హామిల్టన్ (బ్రిటన్) మెక్‌లారెన్ జట్టుకు ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను అందించాడు. వరుసగా నాలుగేళ్లపాటు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ వెర్‌స్టాపెన్ ఈసారి 421 పాయింట్లతో రెండో స్థానానికి పరిమితయ్యాడు. అబుదాబి గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ 58 ల్యాప్‌లను 1 గంట 26 నిమిషాల 7.469 సెకన్లలో పూర్తి చేసి టైటిల్ గెలిచాడు. అయితే నోరిస్ టాప్–3లో లేకపోతేనే వెర్‌స్టాపెన్‌కు వరల్డ్ టైటిల్ దక్కేది. నోరిస్ మూడో స్థానాన్ని పొందడంతో వెర్‌స్టాపెన్ రెండో స్థానంతో సంతృప్తి పడ్డాడు. మెక్‌లారెన్‌కే చెందిన మరో డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి 410 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. అబుదాబి గ్రాండ్‌ప్రిలో పియాస్ట్రి రెండో స్థానాన్ని సాధించాడు.

'చాన్నాళ్లుగా ఈ రోజు కోసం ఎదురుచూస్తున్నా. అసలు నమ్మలేకపోతున్నా. సీజన్ ఆసాంతం జట్టు కోసం నా వంతు కృషి చేశా. అందుకు తగిన ఫలితం దక్కింది. అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. చాలా ఆనందంగా ఉంది. వెర్‌స్టాపెన్, పియాస్ట్రి నుంచి ఏడాదంతా గట్టి పోటీ ఎదురైంది. వారిద్దరికీ అభినందనలు' అని టైటిల్ అందుకున్న అనంతరం నోరిస్ పేర్కొన్నాడు. మెక్‌లారెన్ రిజర్వ్ డ్రైవర్‌గా కెరీర్ ప్రారంభించిన 26 ఏళ్ల నోరిస్... ఎఫ్1 చాంపియన్‌షిప్ టైటిల్ నెగ్గిన 11వ బ్రిటన్ రేసర్‌గా నిలిచాడు. గతేడాది రెండో స్థానంలో నిలిచిన నోరిస్ ఈసారి టైటిల్ కైవసం చేసుకున్నాడు. హామిల్టన్ (2020) తర్వాత ఎఫ్1 వరల్డ్ టైటిల్ గెలిచిన తొలి బ్రిటన్ డ్రైవర్ నోరిస్. మధ్యలో నాలుగేళ్లు వరుసగా వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు.

స్వర్ణం కాదు... కాంస్యం కోసమే

- సెమీఫైనల్లో జర్మనీ చేతిలో భారత్ పరాజయం
- బుధవారం అర్జెంటీనాతో కాంస్యం కోసం పోరు

చెన్నై: సొంతగడ్డపై భారత జూనియర్ పురుషుల హాకీ జట్టుకు నిరాశ ఎదురైంది. స్వదేశంలో జరుగుతున్న జూనియర్ ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టు కాంస్య పతకం కోసం పోటీపడనుంది. డిఫెండింగ్ చాంపియన్ జర్మనీ జట్టుతో ఆదివారం జరిగిన రెండో సెమీఫైనల్లో రోహిత్ నాయకత్వంలోని భారత జట్టు 1–5 గోల్స్ తేడాతో ఓడిపోయింది. తొలి సెమీఫైనల్లో స్పెయిన్ 2–1తో అర్జెంటీనాపై గెలిచింది. బుధవారం జరిగే ఫైనల్లో స్పెయిన్‌తో జర్మనీ; మూడో స్థానం కోసం జరిగే మ్యాచ్‌లో అర్జెంటీనాతో భారత్ తలపడతాయి.

క్వార్టర్ ఫైనల్లో బెల్జియంపై 'షూటౌట్'లో గట్టెక్కిన టీమిండియాను సెమీఫైనల్లో జర్మనీ హడలెత్తించింది. ఆరంభం నుంచి దూకుడుగా ఆడుతూ భారత రక్షణపంక్తికి పని కల్పించింది. 13 నిమిషాలపాటు జర్మనీని నిలువరించిన టీమిండియా... నిమిషం వ్యవధిలో రెండు గోల్స్ సమర్పించుకుంది. 14వ నిమిషంలో లుకాస్ కోసెల్... 15వ నిమిషంలో టిటుస్ వెక్స్ ఒక్కో గోల్ చేయడంతో తొలి క్వార్టర్ ముగిసేసరికి జర్మనీ 2–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం 30వ నిమిషంలో లుకాస్ కోసెల్ రెండో గోల్ చేయడంతో రెండో క్వార్టర్ ముగిసేసరికి జర్మనీ ఆధిక్యం 3–0కు పెరిగింది. మూడో క్వార్టర్‌లోనూ జోరు కొనసాగించిన జర్మనీకి 40వ నిమిషంలో జోనస్ వోన్ జెర్సుమ్ గోల్ అందించాడు. చివరి క్వార్టర్‌లోని 49వ నిమిషంలో బెన్ హస్బాచ్ గోల్‌తో జర్మనీ ఆధిక్యం 5–0కు పెరిగింది. 51వ నిమిషంలో భారత్‌కు అన్‌మోల్ ఎక్కా ఏకైక గోల్ అందించాడు. మ్యాచ్ మొత్తంలో జర్మనీ జట్టుకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు, ఒక పెనాల్టీ స్ట్రోక్ లభించింది. జర్మనీ ఒక పెనాల్టీ కార్నర్‌ను, పెనాల్టీ స్ట్రోక్‌ను సద్వినియోగం చేసుకుంది. భారత్‌కు దక్కిన ఒక్క పెనాల్టీ కార్నర్‌ను అన్‌మోల్ లక్ష్యానికి చేర్చాడు. 12వసారి జూనియర్ ప్రపంచకప్‌లో ఆడుతున్న భారత జట్టు రెండుసార్లు (2001, 2016) విజేతగా, ఒకసారి రన్నరప్‌గా (1997) నిలిచింది. మూడుసార్లు (2005, 2021, 2023) కాంస్య పతకం మ్యాచ్‌లో ఓడిపోయి టీమిండియా నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.

క్వార్టర్స్ చేరని భారత జట్టు

మరోవైపు చిలీలోని సాంటియాగోలో జరుగుతున్న మహిళల జూనియర్ ప్రపంచకప్ టోర్నీలోనూ భారత జట్టుకు నిరాశే మిగిలింది. లీగ్ దశ ముగిశాక జ్యోతి సింగ్ సారథ్యంలోని భారత జట్టు టాప్–8లో చోటు దక్కించుకోకపోవడంతో క్వార్టర్ ఫైనల్ చేరలేకపోయింది. గ్రూప్ 'సి'లో భారత జట్టు 6 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఆరు గ్రూపుల్లో 'టాప్'లో నిలిచిన ఆరు జట్లతోపాటు (నెదర్లాండ్స్, బెల్జియం, జర్మనీ, చైనా, ఆస్ట్రేలియా, అమెరికా)... రెండో స్థానంలో నిలిచిన రెండు ఉత్తమ జట్లకు (అర్జెంటీనా, ఇంగ్లండ్) క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లు లభించాయి. రెండో స్థానంలో నిలిచిన ఆరు జట్లలో భారత జట్టు మూడో స్థానంలో ఉండటంతో క్వార్టర్ ఫైనల్‌కు దూరమైంది.

సిమ్రన్‌కు స్వర్ణం

దోహా: వరల్డ్ కప్ ఫైనల్స్ షూటింగ్ టోర్నమెంట్‌లో ఆదివారం భారత్‌కు మూడు పతకాలు లభించాయి. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ స్వర్ణ పతకం సాధించగా... పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో అనీశ్ భన్వాలా రజతం... పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ రజతం గెలిచారు. ఫైనల్స్‌లో సిమ్రన్‌ప్రీత్ 41 పాయింట్లు స్కోరు చేసి జూనియర్ వరల్డ్ రికార్డును సమం చేసింది. అనీశ్ 31 పాయింట్లు, ఐశ్వర్య ప్రతాప్ 413.3 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచారు. ప్రస్తుతం భారత్ 2 స్వర్ణాలు, 3 రజతాలు, 1 కాంస్యంతో కలిపి ఆరు పతకాలతో రెండో స్థానంలో ఉంది.

స్మృతి వివాహం రద్దు

పలాశ్‌ను పెళ్లి చేసుకోవడం లేదని ప్రకటించిన భారత మహిళా స్టార్ క్రికెటర్

పలాశ్, స్మృతి

న్యూఢిల్లీ: భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన పెళ్లి రద్దయ్యింది. పలాశ్ ముచ్చల్‌తో బంధాన్ని ఇక్కడితోనే ముగింపు పలుకుతున్నట్లు సోషల్ మీడియాలో ప్రకటించింది. దయచేసి తమ వ్యక్తిగత జీవితాన్ని గౌరవించాలని, అనవసర చర్చ, పోస్టులతో ఇబ్బంది పెట్టకూడదని ఆమె కోరింది. 'నా పెళ్లిపై స్పష్టత ఇవ్వదలిచాను. పలాశ్ ముచ్చల్‌తో నా పెళ్లిని రద్దు చేసుకున్నాను. ఈ విషయాన్ని ఇక్కడితోనే ముగించాలని అనుకుంటున్నాను. మీరు (నెటిజన్లు, అభిమానులనుద్దేశించి) కూడా ఆపేస్తే మంచిది. రెండు వారాలుగా మా పెళ్లి విషయమై విపరీత ధోరణిలో వ్యాఖ్యానాలు నెట్టింట వైరల్ అయ్యాయి. దాంతో మా వ్యక్తిగత గోప్యతకు, మా కుటుంబ గౌరవానికి ఇబ్బందిగా మారింది. అందుకే స్పష్టత ఇస్తున్నాను' అని స్మృతి పేర్కొంది. ఇరు కుటుంబాల ప్రైవసీని గౌరవించాలని ఆమె అభిమానుల్ని కోరింది. ఆమె పోస్ట్ వెలువడిన కొద్దిసేపటికే పెళ్లాడాలనుకున్న పలాశ్ ముచ్చల్ కూడా ఇలాంటి వివరణే ఇచ్చారు. ఇక జీవితంలో ముందుకు సాగుతానని చెప్పారు. వ్యక్తిగత జీవితానికి ఇబ్బంది పెట్టేలా నెటిజన్లు ప్రవర్తిస్తే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతానని హెచ్చరించారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ప్రగతికి 4 పతకాలు

సాక్షి, హైదరాబాద్: ఆసియా ఓపెన్, మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన టాలీవుడ్ ప్రముఖ సినీ నటి ప్రగతి మహావాది నాలుగు పతకాలతో మెరిసింది. ఇందులో ఒకస్వర్ణం, మూడు రజత పతకాలు ఉన్నాయి. టర్కీలోని ఇస్తాంబుల్‌లో జరిగిన ఈ పోటీల్లో 49 ఏళ్ల ప్రగతి –84 కేజీల విభాగంలో పోటీపడింది. డెడ్‌లిఫ్ట్ అంశంలో పసిడి పతకం సొంతం చేసుకున్న ప్రగతి... బెంచ్ ప్రెస్, స్క్వాట్, ఓవరాల్ డివిజన్‌లో రజత పతకాలు గెల్చుకుంది.

విద్య, ఉద్యోగ సమాచారం

స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లో 25,487 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కేంద్ర సాయుధ పోలీసు బలగాలు(సీఏపీఎఫ్ఎస్), సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్(ఎస్ఎస్ఎఫ్), అస్సాం రైఫిల్స్(ఏఆర్)లలో కానిస్టేబుల్, రైఫిల్‌మ్యాన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 25,487.
- » పోస్టుల వివరాలు: సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)–14,595, సెంట్రల్ రిజర్వ్ పోలీస్‌ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్)–5,490, సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ) –1,764, అస్సాం రైఫిల్స్(ఏఆర్)–1,706, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ) –1,293, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్)–616, సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్ (ఎస్ఎస్ఎఫ్)–23.
- » అర్హత: అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపు పొందిన బోర్డు/యూనివర్శిటీ నుంచి మెట్రిక్యులేషన్ లేదా పదో తరగతి పరీక్షల్లో 01.01.2026 నాటికి లేదా అంతకుముందు ఉత్తీర్ణులై ఉండాలి.
- » వయసు: 01.01.2026 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.
- » వేతనం: నెలకు రూ.21,700 నుంచి రూ.69,100.
- » ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, వైద్య పరీక్షలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, అభ్యర్థులు ఎంచుకున్న ఫోర్స్ ప్రాధాన్యత ఆధారంగా తుది ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 01.12.2025.
- » ఆన్‌లైన్ ఫీజు చెల్లించడానికి చివరితేది: 01.01.2026.
- » దరఖాస్తు సవరణ తేదీలు: 08.01.2026 నుంచి 10.01.2026 వరకు
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.12.2025.
- » కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది: 2026 ఫిబ్రవరి–ఏప్రిల్.
- » వెబ్‌సైట్: https://ssc.gov.in/

ఎస్‌బీఐలో 996 స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో స్పెషలిస్ట్ క్యాడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 996.
- » పోస్టుల వివరాలు: వీపీ వెల్త్(ఎస్ఆర్ఎం)–506, ఏవీపీ వెల్త్(ఆర్ఎం)–206, కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్–284.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితోపాటు పని అనుభవం ఉండాలి.
- » వయసు: పోస్టును అనుసరించి 01.05.2025 నాటికి 20 నుంచి 42 ఏళ్లు ఉండాలి.
- » ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా .
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా .
- » ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 02.12.2025.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 23.12.2025.
- » వెబ్‌సైట్: https://sbi.bank.in

బెల్‌లో ఇంజనీర్ పోస్టులు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) ఘజియాబాద్ యూనిట్‌లోని వివిధ విభాగాల్లో సీనియర్ ఇంజనీర్, డిప్యూటీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 07.
- » పోస్టుల వివరాలు: సీనియర్ ఇంజనీర్–02, డిప్యూటీ ఇంజనీర్–05.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- » వయసు: 01.12.2025 నాటికి 28 నుంచి 40 ఏళ్లు ఉండాలి.
- » వేతనం: నెలకు సీనియర్ ఇంజనీర్‌కు రూ.50,000 నుంచి రూ.1,60,000, డిప్యూటీ ఇంజనీర్‌కు రూ.40,000 నుంచి రూ.1,40,000.
- » ఎంపిక విధానం: రాతపరీక్ష ఆధారంగా .
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 01.12.2025.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 22.12.2025.
- » వెబ్‌సైట్: https://bel-india.in

ఉపాధ్యాయ వృత్తికి మార్గం.. సీటెట్

- » 2026 ఫిబ్రవరి 8న సీటెట్
- » దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
- » డీఈడీ, బీఈడీ అర్హతతో పోటీ పడే అవకాశం
- » టీచర్ పోస్టులకు అర్హతగా సీటెట్ స్కోర్
- » సీటెట్ స్కోర్‌కు జీవిత కాల గుర్తింపు

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్.. సంక్షిప్తంగా సీటెట్! బీఈడీ, డీఈడీ తదితర.. ఉపాధ్యాయ విద్య కోర్సుల ఉత్తీర్ణులు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రభుత్వ పాఠశాలలు, అదే విధంగా జాతీయ స్థాయిలో ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ కొలువులు సొంతం చేసుకోవాలంటే.. సీటెట్ ఉత్తీర్ణత తప్పనిసరి. అందుకే.. సీటెట్‌ను ఏటా రెండుసార్లు నిర్వహిస్తూ.. ఉపాధ్యాయ కోర్సుల ఉత్తీర్ణులకు కెరీర్ మార్గం సుగమం చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. సీటెట్–2026ను ఫిబ్రవరి 8న నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. సీటెట్ పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

రెండు పేపర్లుగా సీటెట్

సీటెట్ పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధనకు పేపర్–1కు హాజరు కావలసి ఉంటుంది. ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు టీచింగ్‌కు పేపర్–2లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. రెండు స్థాయిల్లోనూ బోధించాలనుకునే వారు రెండు పేపర్లకు హాజరై ఉత్తీర్ణత సాధించాలి. ఈ పేపర్లు రాసేందుకు నిర్దేశిత విద్యార్హతలు కలిగుండాలి.

పేపర్–1 ఇలా

ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధించే వారికి పేపర్–1ను అయిదు విభాగాల్లో 150 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు–30 మార్కులకు, లాంగ్వేజ్–1.. 30 ప్రశ్నలు– 30 మార్కులకు, లాంగ్వేజ్ –2.. 30 ప్రశ్నలు–30 మార్కులకు, మ్యాథమెటిక్స్ 30 ప్రశ్నలు –30 మార్కులకు, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ 30 ప్రశ్నలు–30 మార్కులకు ఉంటాయి. ఈ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా ఉంటుంది. లాంగ్వేజ్–1 విభాగంలో అభ్యర్థులు ఎంచుకున్న బోధన మాధ్యమానికి సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. లాంగ్వేజ్–2 విభాగంలో 20 లాంగ్వేజ్‌లలో ఏదో ఒక లాంగ్వేజ్‌ను ఎంచుకోవచ్చు. అయితే ఈ విభాగంలో ఎంచుకునే లాంగ్వేజ్‌ను లాంగ్వేజ్–1 విభాగంలో ఎంచుకోకూడదు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు లాంగ్వేజ్–2లో తెలుగు, ఉర్దూ భాషల్లో హాజరయ్యే అవకాశం ఉంది.

పేపర్–2 ఇలా

- → ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించేందుకు అర్హతగా నిర్దేశించిన పేపర్–2ను రెండున్నర గంటల వ్యవధిలో 150 మార్కులకు నిర్వహిస్తారు.
- → ఇందులో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు–30 మార్కులకు, లాంగ్వేజ్–1.. 30 ప్రశ్నలు–30 మార్కులకు, లాంగ్వేజ్ –2.. 30 ప్రశ్నలు–30 మార్కులకు, మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ 60 ప్రశ్నలు–60 మార్కులకు, సోషల్ స్టడీస్/సోషల్ సైన్స్ 60 ప్రశ్నలు–60 మార్కులకు ఉంటాయి.
- → అభ్యర్థులు తాము ఏ మీడియంలో బోధించాలనుకుంటున్నారో ఆ మాధ్యమంలో లాంగ్వేజ్–1 పరీక్ష రాయాల్సి ఉంటుంది. లాంగ్వేజ్–2 విభాగంలో లాంగ్వేజ్–1లో హాజరైన భాష కాకుండా.. ఇతర లాంగ్వేజ్‌లలో హాజరు కావాలి. మొత్తం 20 లాంగ్వేజ్‌లు అందుబాటులో ఉన్నాయి.
- → మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ టీచింగ్ అభ్యర్థులు పేపర్–2లో నాలుగో విభాగాన్ని, సోషల్ టీచర్లు అయిదో విభాగాన్ని ఎంచుకుని పరీక్షకు హాజరు కావాలి. ప్రతి పేపర్‌కు రెండున్నర గంటల సమయం అందుబాటులో ఉంటుంది.

కనీస అర్హత మార్కులు

సీటెట్ అభ్యర్థులు ప్రతి పేపర్‌లోనూ కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులు (90 మార్కులు) సాధించాలి. బీసీ కేటగిరీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు(70 మార్కులు), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు (60 మార్కులు) పొందాలి.

జీవిత కాల గుర్తింపు

సీటెట్‌లో ఒకసారి నిర్ణీత అర్హత మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే.. ఆ స్కోర్‌కు శాశ్వత గుర్తింపు ఉంటుంది. అంటే ఒకసారి ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే.. ఎప్పుడైనా టీచింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఉపాధ్యాయ పోస్ట్‌లు... సీటెట్ అర్హత

నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచింగ్ ఎడ్యుకేషన్ పేర్కొన్న నిబంధనల ప్రకారం– ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలనుకునే వారికి పాఠశాల స్థాయి, కేటగిరీతో సంబంధం లేకుండా బీఈడీ, డీఈడీ, బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్)తోపాటు.. సీటెట్‌లో అర్హత సాధించడం తప్పనిసరి. దీంతో.. సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, ఆర్మీ పబ్లిక్ స్కూల్స్ వంటి వాటిలో టీచర్‌గా చేరేందుకు సీటెట్ ఉత్తీర్ణత తప్పనిసరిగా మారింది.

విజయానికి అడుగులు ఇలా

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి: ఈ విభాగంలో ఎడ్యుకేషనల్ సైకాలజీపై ప్రాథమిక స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు ప్రధానంగా శిశువు సైకాలజీకి సంబంధించిన అంశాలపై ఎక్కువ దృష్టిసారించాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు మొదలైన అంశాలను క్షుణ్నంగా చదవాలి. శిశువు ప్రవర్తనలో మార్పునకు సంబంధించిన అభ్యాసం, అభ్యసన బదలాయింపు అంశాలను చదవాలి. సైకాలజీ అంశాలను చదివేటప్పుడు కీలక భావనలు, సాంకేతిక పదాలు, సిద్ధాంతాలు –సూత్రాలు, ప్రతిపాదించిన శాస్త్రవేత్తలు, వారి గ్రంథాలు తదితర విషయాలను విశ్లేషణాత్మకంగా చదవాలి. ఇక పెడగాజి అంటే బోధన శాస్త్రం. ఇందులో సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం–నాయకత్వం– గైడెన్స్–కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి.

లాంగ్వేజ్ పేపర్లు: లాంగ్వేజ్–1 విభాగంలో రాణించేందుకు.. అదే విధంగా మరో ఇతర లాంగ్వేజ్ నైపుణ్యాన్ని పరీక్షించే లాంగ్వేజ్–2 పేపర్‌లో స్కోర్ కోసం సంబంధిత భాషా విభాగాలపై స్కూల్ స్థాయిలో సబ్జెక్ట్ పుస్తకాలను పూర్తిగా చదవాలి. లాంగ్వేజ్–2కు సంబంధించి ఎక్కువ మంది అభ్యర్థులు ఇంగ్లిష్‌ను ఎంచుకుంటున్నారు. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి. అభ్యర్థులు నిర్దిష్టంగా ఒక ఒక ప్రామాణిక పుస్తకాన్ని ఎంచుకుని సిద్ధం కావాలి. పెడగాజికి సంబంధించి టీచింగ్ మెథడ్స్, అప్రోచెస్, టెక్నిక్స్, లాంగ్వేజ్ స్కిల్స్, ఇంగ్లిష్ నేపథ్యం మీద ప్రశ్నలు వస్తాయి.

మ్యాథమెటిక్స్: పేపర్–1లో ఒకటి నుంచి అయిదో తరగతి వరకు పుస్తకాలను చదవాలి. పేపర్–2 కోసం ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉండే కాన్సెప్టులపైనే ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నల క్లిష్టత ఇంటర్ స్థాయిలో ఉంటుంది.

ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్: బోటనీ బేసిక్ అంశాలతోపాటు, పర్యావరణ అంశాలు, సైన్స్ ఇన్ డైలీ లైఫ్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

సైన్స్: ఈ సబ్జెక్ట్‌లో మంచి మార్కుల పొందాలంటే.. మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు పుస్తకాలు ఔపోసన పట్టాలి. పేపర్–2 కోసం ప్రత్యేకంగా ఆరు నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు చదవాలి. గత టెట్‌లో ఈ విభాగంలో ప్రశ్నలు కాసింత క్లిష్టంగానే ఉన్నాయని చెప్పొచ్చు. కాబట్టి అభ్యర్థులు ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్ వంటి వాటిపై ప్రత్యేక అధ్యయనం చేయాలి.

సోషల్ స్టడీస్: హైస్కూల్ స్థాయిలో పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. భూగోళ శాస్త్రంలో ఒక ప్రాంతం గురించి చదువుతున్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన అన్ని అంశాలను చదవాలి. వాతావరణ, భౌగోళిక పరిస్థితులు, నదులు.. వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సివిక్స్, ఎకనామిక్స్ అంశాలను సమకాలీన అంశాలతో అప్‌డేట్ చేసుకుంటూ అధ్యయనం చేయాలి.

ముఖ్య సమాచారం

- ✦ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ దరఖాస్తులు ప్రారంభం: 27.11.2025
- ✦ దరఖాస్తులకు చివరి తేదీ: 18.12.2025
- ✦ సిటెట్ 2026 పరీక్ష తేదీ: 08.02.2026
- ✦ వివరాలకు వెబ్‌సైట్: https://ctet.nic.in.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: భౌతికశాస్త్రం » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: కంప్యూటర్ అవేర్‌నెస్



ఆశ మనిషిని గెలిపిస్తుంది. నిరాశ మనిషిని ఓటమిపాలు చేసి కుంగదీస్తుంది. గెలవగలననే ధీమా మనిషికి ఆశను కలిగిస్తుంది. నిరాశావాదంలో పలాయనమార్గం గోచరిస్తుంది. ఆశ బతికిస్తే, నిరాశ మనిషిని చంపితే, ఆశ మనిషిని బతికిస్తుంది. అందుకే ఎప్పుడూ ఆశావహ దృక్పథం కలిగి ఉండడం అవసరం.

● మంచిమాట

మనస్సు చంచలమైనది. అది నిరంతరం ఏదో ఒక దానిగురించి ఆలోచిస్తూ ఉంటుంది. అలాంటి మనస్సును స్వేచ్ఛగా వదిలేస్తే ఇంద్రియాలకు అధీనమైపోతుంది. కామక్రోధాదులను బలపరుస్తుంది. అహంకార మమకారాలను వృద్ధి చేస్తుంది. ఈ క్రమంలో ఇంద్రియాలకు లాలసుడైన మనిషి విచక్షణను కోల్పోయి క్షణిక సుఖాలకు దగ్గర అవుతాడు. దీంతో అభివృద్ధి నిలిచిపోయి అథఃపాతాళంలోకి పడిపోయే ప్రమాదం ఉంటుంది. అందుకే మనస్సును ఎప్పటికప్పుడు నిగ్రహించుకుంటూ ఇంద్రియ వశం కాకుండా మంచి పనులు మాత్రమే చేయాలనే నిబద్ధతతో మనస్సును అధీనంలో ఉంచుకోవడమే ఆత్మ నిగ్రహం.



ఆత్మనిగ్రహం... ఆత్మస్థైర్యం

చంచలమైన మనస్సును నిశ్చలంగా చేయడం సాధారణమైన విషయం కాదు. సామాన్యులకే కాదు, అత్యంత శూరుడైన అర్జునికి కూడా మనస్సును నిగ్రహించుకోవడం సాధ్యం కాలేదు. మనసును నిగ్రహించడం వాయువును బంధించడం కన్నా కష్టమైందని అర్జునుడే స్వయంగా అన్నాడు. భారత యుద్ధం ప్రారంభం కావడానికి ముందు తనకు సారథ్యం వహిస్తున్న శ్రీ కృష్ణునితో అర్జునుడు ఈ మాటలు పలికాడు. యుద్ధంలో ప్రతిపక్షం మీద దృష్టి సారించి తన తాత భీష్ముడు, గురువు ద్రోణాచార్యుడు, సహాధ్యాయ గురుపుత్రుడు అశ్వత్థామ, అన్నదమ్ములైన కౌరవ సోదరులను చూసి విషాదంలో పడిపోయాడు. వారంతా తన స్వజనం కావడంతో యుద్ధం చేయడానికి అతనికి మనస్కరించలేదు. దాంతో అతని చేతిలో నుంచి ధనస్సును జార విడుస్తూ ''కృష్ణా నాకు విజయం వద్దు... రాజ్య సుఖాలు వద్దు... ఆచార్యుణ్ణి, పితామహుణ్ణి, బంధువులను నేను సంహరించలేను'' అంటూ మౌనం వహించి విముఖుడై కూర్చుండిపోయాడు.

అతని మనస్సు నిగ్రహాన్ని కోల్పోయింది. అందువల్లనే అర్జునికి ఇలాంటి స్థితి ఏర్పడింది.

ఇది గమనించిన శ్రీ కృష్ణుడు అర్జునుణ్ణి యుద్ధానికి సన్నద్ధం చేయడానికి ఎంతో శ్రమ పడాల్సి వచ్చింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 18 అధ్యాయాలుగా ఉండే భగవద్గీతను బోధించాడు. భౌతికమైనవి, తాత్వికమైనవి అనేకానేక విషయాలు తాను గురువుగా మారి అర్జునునికి బోధించాడు. దాంతో అర్జునుడు శత్రువులను సంహరించడానికి అంగీకరించాడు. మనోనిగ్రహం పొందడం చేతనే అర్జునుడు తిరిగి మామూలు స్థితికి వచ్చాడు. తన ధర్మాన్ని తాను నిర్వర్తించాడు.

దీనినే మనం నిత్య జీవిత పోరాటంలో పాఠంగా మలచుకోవాలి. ఆ పాఠం మనల్ని సత్యసంధులుగా, న్యాయవేత్తలుగా, నీతిపరులుగా తీర్చిదిద్దుతుంది. మనో నిగ్రహం అలవడితే సద్గుణ సంపన్నులు అవుతారు. భక్తి, జ్ఞాన, వైరాగ్య భావనలు కలిగి, సమదృష్టి అలవడుతుంది.

అయితే ఆత్మ నిగ్రహానికి, ఆత్మ స్థైర్యానికి అవినాభావ సంబంధం ఉంది. ఆత్మ స్థైర్యం ఉన్న మనిషికి ఆత్మ నిగ్రహం ఏర్పడుతుంది. ఆత్మ పట్ల నమ్మకం, విశ్వాసం ప్రోది చేసుకున్న వ్యక్తి ఆత్మ స్థైర్యాన్ని సంపూర్ణంగా కైవసం చేసుకోవచ్చు. స్వార్థరహితమైన మనసు, ప్రవత్తి, వ్యాపకం వంటివి మనిషి ధీరోదాత్తతకు ఉపకరణాలు. ఏ ప్రలోభాలకూ లొంగని స్వభావం వల్ల మనిషి ఆత్మస్థైర్యాన్ని సంతరించుకుంటాడు. దైవం పట్ల ప్రత్యేక శ్రద్ధ లేకపోయినప్పటికీ తన పట్ల గురి, నమ్మకం ఉన్న వ్యక్తి ఆత్మస్థైర్య సంభూతుడే అవుతాడు. ఆత్మస్థైర్యం మనిషి శక్తి సామర్థ్యాలను ద్విగుణీకృతం చేస్తుంది. పిరికితనాన్ని పారదోలుతుంది. విద్యార్జనకు, ఆరోగ్య సాధనకు తోడ్పడుతుంది. భిన్నత్వం గల సమాజంలో ఏకతాభావన సాధించేందుకు బలం ఇస్తుంది. ఆధ్యాత్మిక అంశంలో సైతం ముందుకు సాగేందుకు తోడ్పడుతుంది. అందువల్ల జీవితంలో ఉన్నత సోపానాలను అధిరోహించాలనుకునే ప్రతివ్యక్తి ఆత్మస్థైర్యం పెంపొందించుకుంటే ఆత్మనిగ్రహం దానికదే సొంతమవుతుంది.

– దాసరి దుర్గాప్రసాద్

మనోనిగ్రహం ఆధ్యాత్మిక సాధనకు అత్యవసరం. లౌకిక విషయాల సాధనకు కూడా మనో నిగ్రహం అవసరం. అలాంటపుడే మనిషి సజ్జనుడుగా నలుగురిలో కీర్తింపబడతాడు. చంచల చిత్తమైన మనస్సును, విషయలోలత్వం నుంచి మరల్చి ఆత్మయందే స్థాపితం చేసి ఆత్మకు సర్వదా అధీనమై ఉండేటట్లు చేయాలని భగవద్గీత కూడా స్పష్టం చేసింది.

● ఆత్మీయం

శుచి... శుభ్రం

బతికి ఉన్నంత కాలం అన్నం తినటం ఎంత అవసరమో, శుచిగా... శుభ్రంగా ఉండటమూ అంతే అవసరం. రాగి చెంబుని ఎంత తోమితే అంత మెరుస్తుంది అని ఒక నానుడి. రాగి చెంబే కాదు జీవితమైనా అంతే. ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలి. భౌతికమైన అంటే పరిసరాల, శారీరక శౌచం మాత్రమే కాదు మనసుని కూడా శుభ్రం చేస్తూ ఉండాలి. ఒక్కక్షణం ఏమరుపాటు కలిగినా జరగవలసిన హాని జరిగిపోతుంది. మనకి మిత్రులలాగా కనపడుతూ కీడు చేసే శత్రువులు అవకాశం కోసం ఎదురు చూస్తూ తొంగి చూస్తూ ఉంటారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా మనసులో తిష్ఠవేసుకుని కూర్చుంటారు. ఆ శత్రువుల విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి.

ఒక్క రోజు నిర్లక్ష్యం చేస్తే అప్పటి వరకు చేసినదంతా తుడిచి పెట్టుకు పోతుంది. రోజూ తుడుస్తున్న అద్దాన్ని ఒక్కసారి తుడవకపోతే దుమ్ముపొర ఉండి దానిలో ప్రతిబింబం సరిగ్గా కనపడదు. ఇది అందరికి ప్రత్యక్ష ప్రమాణం. అదే మనస్సనే అద్దం మీద కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే మలినాలు ఉంటే దానిలో పరమాత్మ రూపం సరిగ్గా ప్రతిఫలిస్తుందా? ఎన్నో మార్పులతో కనిపిస్తుంది. అందుకే



సాధకులకి ఒక్కొక్కరికి దైవం ఒక్కొక్క విధంగా ఉన్నట్టు తోస్తుంది. వీటికి తోడు అహంకార మమకారాలు ఆడే నాటకాలు కూడా తక్కువేమీ కావు. ఈ పొరలు కప్పి ఉండటం వల్లనే ఎన్నో వికల్పాలు కలుగుతూ ఉంటాయి. కనుకనే వీటిని ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలి. లేకపోతే అదే సహజమైన రూపం అని భ్రమ పడే ప్రమాదం ఉంది. ఈ భ్రమప్రమాదాల కారణంగా సాధన పెడత్రోవ పట్టే అవకాశం ఉంది.

అందుకే అన్ని సంప్రదాయాల్లోను శౌచం అనే దానికి చాలా ప్రాధాన్యం ఉంది. అది పరిసరాలతో ప్రారంభమై శరీరం, మనస్సు, ఆత్మల వరకు విస్తరిస్తుంది. దీనిని సూచించటానికే ఏసుక్రీస్తు, షిరిడీ సాయి బాబా వంటివారు కూడా పాత్రలు శుభ్రం చేస్తున్న చిత్రాలు కనిపిస్తూ ఉంటాయి. వాళ్ళకి ఎంగిలి పళ్ళాలు కడగవలసిన అవసరం ఏమిటి? అనే సందేహం ఎవరికైనా ఎప్పుడయినా వచ్చిందా?

వాళ్ళు కడుగుతున్నది తమ శిష్యులు, లేక భక్తులు, లేక అనుయాయుల మనస్సులని కప్పిన పాపాలనే మలినాలని. పాపరహితులైన వారే నిరంతరం శుభ్రం చేయటానికి ప్రాధాన్యం ఇస్తూ ఉంటే సామాన్యులమైన మనవంటి వారమెంత? పుట్టినప్పుడున్నంత నిష్కల్మషంగా ఉండటానికి ప్రయత్నం చేయాలి.

● తాత్త్వికథ

మల్లెల మాల

వరదల బీభత్సంతో ఇల్లూ వాకిలి కొట్టుకుపోవడంతో ఒక అవ్వా మనవడు నిరాశ్రయులయ్యారు. వృద్ధురాలైన ఆ అవ్వ, చిత్రకారుడైన మనవడు ఇకపై ఆ ఊరిలో ఉండటం క్షేమకరం కాదని భావించారు.

వేరే ఏ ఊరిలోనైనా ఆశ్రయం పొందాలని, వలస వెళ్ళడానికి నిర్ణయించుకున్నారు. ఒక ఎద్దుల బండి మాట్లాడుకుని సామానులన్నీ సర్దుకుని బయలుదేరారు. మొదటిగా ఒక ఊరికి చేరుకున్నారు. అక్కడ రచ్చబండ కాడ కొందరు పెద్దలు కూర్చుని ఉన్నారు. వారి దగ్గరికి వెళ్ళిన మనవడు తాము ఆ గ్రామంలో నివాసముంటామని చెప్పాడు. ఆ గ్రామ పెద్దలు ''మీ దగ్గర ఎంత డబ్బు ఉంది? ఎంత బంగారముంది?'' అని అడిగారు. ఆ ఊరిలో నివాసమొద్దని అవ్వ, మనవడికి సైగ చేసింది. ఆ ఊరిలో నివాసాన్ని విరమించుకున్నారు.

ఇద్దరూ అక్కడినుంచి ప్రయాణమై మరో ఊరు చేరారు. ఆ ఊరి మధ్యలో రాములవారి గుడి ఉంది. అక్కడ కొందరు అమ్మలక్కలు కూర్చుని ఉన్నారు. తాము ఎందుకు వచ్చామో వారికి తెలియజేశాడు మనవడు. అమ్మలక్కలు వెంటనే 'మీది ఏ కులం? ఏ మతం?' అని అడిగారు. ఆ ఊరిలో కూడా నివాసమొద్దని అవ్వ, మనవడికి చిన్నగా చెవిలో చెప్పింది. మళ్ళీ ఇద్దరూ ప్రయాణమై ఇంకో ఊరు చేరారు. ఆ ఊరి మొదట్లో పెద్ద బండ మీద కొందరు రైతులు కూర్చుని చద్దిబువ్వ తింటున్నారు. వారికి కూడా ఆ మనవడు తాము వచ్చిన కారణం చెప్పడం ప్రారంభించాడు.

మనవడి మాటలు పూర్తికాక ముందే రైతులు కలుగజేసుకుని ''అవన్నీ నిదానంగా మాట్లాడుకుందాం. మీరు చాలా దూరం ప్రయాణం చేసి వచ్చారు. మొదట మాతో పాటు కలిసి తినండి'' అని చెప్పారు. వారు తింటున్న అన్నం పెట్టారు. వెంటనే అవ్వ ఈ ఊరిలో నివాసముందామని మనవడికి సలహా ఇచ్చింది. ఎద్దుల బండిలోని వస్తువులన్నీ దించుతూ మనవడు ఎందుకు ఈ ఊరిని ఎంపిక చేశావని అవ్వను అడిగాడు.

''డబ్బే ప్రధానంగా చూశారు మొదటి ఊరు ప్రజలు. కులమతాల కళ్ళతో చూశారు రెండవ ఊరి ప్రజలు. మనల్ని మనుషులుగా చూసి, మనల్ని ఆదరించిన వారు ఈ ఊరి వారు. మల్లెపూలు దారానికి చుట్టి మల్లెల మాల చేస్తే పూల వాసన దారానికి కూడా అంటుకుంటుంది. అలాగే ఇలాంటి మంచి మనుషుల మధ్యన మనం ఉంటే మనమూ ఎదుగుతాము, మనం ఊరికీ ఉపయోగపడుతాము'' అని చెప్పింది. సంతోషంగా మనవడు సామానులు తీసుకుని కొత్త ఇంటిలోకి ప్రవేశించాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

● అమృత బిందువులు

● ఏ పనిలోనైనా మన నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి 'సాధన' అవసరం. సాధన వల్ల ఆ పనిలో తప్పులు దొర్లకుండా జాగ్రత్త పడగలం. గురువులు కూడా నిరంతర తపస్సులా సాధన చేస్తారు. ఒక్క రోజు సాధన చేయకపోయినా సాధకుడికి ఆ లోపం తెలుస్తుంది. రెండు రోజులు సాధన చేయకపోతే పోటీదారులకు తెలిసిపోతుంది. మూడు రోజులు సాధన మానుకుంటే ప్రేక్షకులు కూడా గ్రహించగలరని పెద్దల మాట. అదీ సాధన గొప్పదనం.

● కృషి ఉంటే మనుషులు నిజంగానే ఋషులవుతారు. నిరంతర సాధన చేసే యోధులకే, విజయద్వారం స్వాగతం పలుకుతుంది. సామాన్యులను సైతం అసామాన్యులుగా తీర్చిదిద్దగల శక్తి సాధనకు ఉంది. దీనికి ప్రణాళిక, క్రమశిక్షణ, లక్ష్యంపై గురి ఇవన్నీ సహకరిస్తాయి. తప్పలను సరిచేసుకోగలగడమే కాదు, చేస్తున్న పని మీద ఏకాగ్రత సాధించడానికీ సాధన తోడ్పడుతుంది. సాధనకు పూనుకున్నప్పుడు ఎన్నో అవరోధాలు ఎదురవుతాయి. దిగలాగే ప్రయత్నాలు, నొప్పిస్తూ నిరుత్సాహం కలిగించే మాటలు వినిపిస్తాయి. సాధకుడు వాటిని వినిపించుకోకూడదు. ప్రోత్సాహాన్నిచ్చే మంచి మాటలనే అతడు వినాలి. ఎవరికి వారే 'దర్పణ ధ్యానం' అంటే అద్దం ముందు నిలబడి తమను తాము అభినందించుకోవాలి. దానివల్ల శక్తి, ఉత్సాహం జనిస్తాయి.

సాక్షి సినిమా

కానుకలొద్దోయ్ శ్రీవారు...

● నయనతార, చిరంజీవి

''శశిరేఖా... ఓ మాట చెప్పాలి. చెప్పాక ఫీలు కాక..., ఓ ప్రసాదూ... మోమాటం లేకుండా చెప్పేసేయ్. ఏమి కాదూ...', అంటూ సాగుతుంది 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాలోని 'శశిరేఖ' పాట. చిరంజీవి, నయనతార హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో శంకర వరప్రసాద్ పాత్రలో చిరంజీవి, శశిరేఖ పాత్రలో నయనతార నటిస్తున్నారు. వెంకటేశ్, వీటీవీ గణేశ్, క్యాథరిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రంలోని 'శశిరేఖ' పాట లిరికల్ వీడియోను ఆదివారం విడుదల చేశారు. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించిన ఈ పాటను మధుప్రియతో కలిసి ఈ చిత్రసంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఆలపించారు. భాను మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ''ఏయ్... సిద్ధంగున్న పెళ్లామా... సిగ్నల్ ఇచ్చేయ్ చాలమ్మ..., కొండ మీది కోహినూరు కావాలా? జంగిలెల్లి జాగ్వారు తేవాలా?', 'కానుకలొద్దోయ్ శ్రీవారు... లొంగదు వాటికి నా ప్యారు... చెప్పినట్టు టైముకొస్తే చాలంట... అంతకన్నా మంచి గిఫ్ట్ ఏంటంటా..', 'ఏయ్... యురేఖ నువ్వు కేక... భలేగా ఉంది రేఖ...' అంటూ భార్యాభర్తల మధ్య సాగే సరదా సాంగ్‌లా 'శశిరేఖ' సాగుతుంది. అర్చన సమర్పణలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదల కానుంది.

ది రిటర్న్ ఆఫ్ పడయప్ప

● 'పడయప్ప' పోస్టర్

పాతికేళ్ల తర్వాత 'పడయప్ప' తిరిగి రానున్నాడు. రజనీకాంత్ హీరోగా, శివాజీ గణేశన్, రమ్యకృష్ణ, సౌందర్య, అబ్బాస్ ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'పడయప్ప' (తెలుగులో 'నరసింహా'). కేఎస్ రవికుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 1999లో విడుదలై, బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమా ఈ నెల 12న రీ–రిలీజ్ కానుంది. డిసెంబరు 12న రజనీకాంత్ పుట్టినరోజు అనే విషయం తెలిసిందే. ఇక నటుడిగా రజనీకాంత్ యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'పడయప్ప' సినిమాను డిసెంబరు 12న రీ రిలీజ్ చేస్తున్నట్లుగా ఆయన కుమార్తె, దర్శకురాలు సౌందర్య రజనీకాంత్ 'ఎక్స్' వేదికగా స్పష్టం చేస్తూ, 'ది రిటర్న్ ఆఫ్ పడయప్ప' అంటూ ఓ వీడియోను షేర్ చేశారు. 'పడయప్ప' సినిమాలోని తన ట్రేడ్ మార్క్ స్టైల్‌ను రజనీకాంత్ రీ క్రియేట్ చేసిన సీన్ ఈ వీడియోలో కనిపిస్తోంది.

జోడీ కుదిరిందా?

నటుడిగా విజయ్ సేతుపతి వైవిధ్యమైన పాత్రలు చేస్తుంటారు. నటిగా సాయి పల్లవి ఎంచుకునే పాత్రలు ఎంత వైవిధ్యంగా ఉంటాయో తెలిసిందే. ఇలా విభిన్న పాత్రల్లో మెప్పిస్తున్న ఈ ఇద్దరి జోడీ ఒక సినిమాకి కుదిరిందని చెన్నై అంటున్న మాట. అది కూడా మణిరత్నం దర్శకత్వంలో అని ప్రచారం జరుగుతోంది. ఇది ప్రేమకథా చిత్రం అని సమాచారం. విజయ్ సేతుపతి – సాయి పల్లవి ఈ చిత్రంలో నటించడానికి అంగీకారం తెలిపారట. జనవరిలో ఈ సినిమాని అధికారికంగా ప్రకటించి, షూటింగ్‌ని ఏప్రిల్‌లో ప్రారంభిస్తారట. ఒకవేళ మణిరత్నం దర్శకత్వంలో విజయ్ సేతుపతి – సాయి పల్లవి నటించనున్నారనే వార్త నిజమైతే... 'నవాబ్' తర్వాత ఆయన దర్శకత్వంలో విజయ్ సేతుపతికి ఇది రెండో చిత్రం అవుతుంది. మణిరత్నం డైరెక్షన్‌లో సాయి పల్లవికి ఇది తొలి చిత్రం అవుతుంది.

● విజయ్ సేతుపతి ● సాయి పల్లవి

ఆవేశం దర్శకుడితో సూర్య

● సూర్య 47 ప్రారంభోత్సవంలో...

సూర్య హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం ఆదివారం చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ చిత్రంలో నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, నస్లెన్, జాన్ విజయ్, ఆనంద రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సూర్య కెరీర్‌లోని ఈ 47వ సినిమాను 'ఆవేశం' మూవీ ఫేమ్ మలయాళ దర్శకుడు జీతూ మాధవన్ దర్శకత్వంలో జఘరమ్ స్టూడియోస్ నిర్మిస్తోంది. ''తొలి షూటింగ్ షెడ్యూల్ ప్రారంభమైంది. కొత్త భాషలో సూర్యవంటి స్టార్ హీరోతో ఓ కొత్త సినిమా చేయడం నాకు చాలా ఉత్సాహంగా ఉంది. మేం కొత్త తరహా సినిమా చేయాలనుకుంటున్నాం'' అని పేర్కొన్నారు జీతూ మాధవన్. ఈ చిత్రానికి సుషిన్ శ్యామ్ సంగీతం అందిస్తుండగా, వినీత్ ఉన్ని పలోడే ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవంలో నటి–నిర్మాత జ్యోతిక, హీరో కార్తీ, నిర్మాతలు ఎస్ఆర్ ప్రకాశ్, ఎస్ఆర్ ప్రభు, నిర్మాత రాజశేఖర్ పాండియన్ పాల్గొన్నారు.

ఆ సినిమా ఆన్‌లోనే ఉంది

– ఆమిర్ ఖాన్

హీరో ఆమిర్ ఖాన్, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో ఓ సూపర్ హీరో సినిమాకు సన్నాహాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రం పట్టాలెక్కే పరిస్థితి కనిపించడంలేదట. దానికి కారణం రజనీకాంత్ హీరోగా లోకేశ్ దర్శకత్వం వహించిన 'కూలీ' చిత్రంలో ఆమిర్ ఖాన్ పోషించిన 'దాహా' పాత్రకు ప్రేక్షకుల నుంచి సరైన స్పందన రాకపోవడమే అని సమాచారం. ఈ కారణంగా ఆమిర్, లోకేశ్ మధ్య అభిప్రాయబేధాలు వచ్చాయనే వార్త ప్రచారమవుతోంది. కాగా ఈ సినిమా గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమిర్ ఖాన్ స్పందించారు. ''గత నెలలో నేను, లోకేశ్ కలిసి ఈ సినిమా గురించి మాట్లాడుకోవడానికి సమావేశం కావాల్సింది. కానీ కుదర్లేదు. ఆ తర్వాత లోకేశ్‌తో ఫోన్‌లో మాట్లాడాను. త్వరలో ముంబై వచ్చి, కలుస్తానని చెప్పాడు. అప్పుడు ఆ సినిమా నరేషన్ వింటాను. ఇప్పటికైతే ఈ సినిమా ఆన్‌లోనే ఉంది'' అని ఆమిర్ తెలిపారు. దీంతో ఆమిర్ ఖాన్– లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లోని సినిమా క్యాన్సిల్ కాలేదనే విషయం స్పష్టం అవుతోంది. మరోవైపు అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలోని 'డీసీ' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు దర్శకుడు లోకేశ్ కనగరాజ్. ఈ సినిమా షూటింగ్ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత దర్శకుడిగా లోకేశ్ కనగరాజ్ మళ్లీ మెగాఫోన్ పడతారని, వచ్చే ఏడాది ప్రారంభంలోనే ఆమిర్‌తో ఈ దర్శకుడు చేయబోయే సినిమాపై సరైన స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఊహించవచ్చు.

యువతకు సందేశం

సంజోష్ తగరం హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మై లవ్'. ఈ చిత్రంలో హర్షిత హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆర్‌వీ శ్రీనివాస్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి తెలంగాణ ఐటీ అండ్ ఇండస్ట్రీస్ మినిస్టర్ శ్రీధర్ బాబు క్లాప్ ఇవ్వగా, జూబ్లీహిల్స్ ఎమ్ఎల్ఏ నవీన్ యాదవ్ కెమెరా స్విచ్చాన్ చేసి, గౌరవ దర్శకత్వం వహించారు. సంజోష్ తగరం మాట్లాడుతూ– ''యూనివర్సల్ కంటెంట్‌తో రూపొందిస్తున్న ఈ సినిమాలో ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని ఓ పాయింట్‌ని చెప్పబోతున్నాం. నేటి యువతకు మంచి సందేశం ఉంది'' అని చెప్పారు. ''మంచి కథతో రూపొందిస్తున్న ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది'' అని తెలిపారు శ్రీనివాస్ రావు. తనికెళ్ల భరణి, మురళీధర్ గౌడ్, రచ్చ రవి ఈ చిత్రంలోని ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

● సంజోష్, హర్షిత

ఓటీటీ ఇది చూడొచ్చు

సూపర్ రాబరీ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం జింగిల్ బెల్ హీస్ట్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

దొంగతనాల కథాంశం సినిమాలలో భలే గమ్మత్తుగా, థ్రిల్లింగ్‌గా అనిపిస్తుంది. ఏ తరం ప్రేక్షకులనైనా ఇట్టే మెప్పిస్తుంది. దొంగతనానికి సమయం, సందర్భంతో పాటు చక్కటి ప్రణాళిక కూడా చాలా ముఖ్యం. అదే నేపథ్యంలో హాలీవుడ్ దర్శకుడు మైఖేల్ ఫిమోగ్నారి 'జింగిల్ బెల్ హీస్ట్'ని తెరకెక్కించారు. పేరుకు తగ్గట్టు క్రిస్మస్ పండగ నేపథ్యంలోనే జరిగే ఓ దొంగతనం పై ఈ సినిమా ఉంటుంది. దొంగతనంతో పాటు ఈ సినిమాలో సెంటిమెంట్, కామెడీ ఎలిమెంట్స్‌తో మంచి థ్రిల్లింగ్‌గా ఉంటుందీ సినిమా. ఈ సినిమా కథ విషయానికొస్తే... ఓ పెద్ద మాల్‌లో పని చేసే సోఫీ తన కోసం, తన తల్లి ఆసుపత్రి ఖర్చుల కోసం చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ ఉంటుంది. ఓ సమయంలో తన స్టోర్‌లోనే కాస్తంత పెద్ద సొమ్మును కాజేస్తుంది. ఇది అక్కడి సీసీ టీవీలో రికార్డ్ అవుతుంది. ఆ సీసీ టీవీని ఎక్కడ నుండో హ్యాక్ చేసిన నిక్... సోఫీ చేసిన పనికి విస్తుపోతాడు. అదే అదనుగా సోఫీకి నిక్ తన వీడియో చూపించి తాను చేయబోయే ఓ పెద్ద దొంగతనానికి సహాయపడమని బెదిరిస్తాడు. ఇక వేరే దారి లేక నిక్‌తో కలుస్తుంది సోఫీ. ఇక సోఫీ పని చేసే స్టోర్ ఓనర్ లాకర్‌ని దోచుకోవాలని ప్లాన్ చేస్తాడు నిక్. ఆ స్టోర్ ఓనర్ దగ్గర భారీ ఎత్తున ఓ సేఫ్‌లో డబ్బు ఉంటుంది. ఆ సేఫ్ సూపర్ సెక్యూర్‌గా ఉంటుంది. నిక్, సోఫీ క్రిస్మస్ పండగ రోజు దొంగతనం చేయాలనుకుంటారు. స్టోర్ ఓనర్ సేఫ్ సెక్యూరిటీని హ్యాక్ చేసి పాస్‌వర్డ్ తెలుసుకోవాలని స్టోర్ ఓనర్ గర్ల్ ఫ్రెండ్‌ని ట్రాప్ చేస్తాడు నిక్. ఆ ట్రాప్‌లో ఇరుక్కుని స్టోర్ ఓనర్ గర్ల్ ఫ్రెండ్ పాస్‌వర్డ్ లీక్ చేస్తుందా? సోఫీ, నిక్ ఈ దొంగతనాన్ని చేయగలుగుతారా? లేదా అన్నది మాత్రం నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'జింగిల్ బెల్ హీస్ట్'లోనే చూడాలి. ఓ రొటీన్ పాయింట్‌ని చాలా విభిన్నంగా చూపించాలని దర్శకుడు ప్రయత్నించారు. ఈ సినిమా తెలుగు వెర్షన్ కూడా లభ్యమవుతోంది. వాచ్‌బుల్ మూవీ.

– హరికృష్ణ ఇంటూరు

సాక్షి వెల్త్ By ప్రాఫిట్ ప్లస్
సోమవారం
8-12-2025

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

గతవారం (1-12-25 నుంచి 5-12-25 వరకు)

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
6	17
85,712	26,187

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	23,578	▲	73
డోజోన్స్	47,957	▲	104
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,667	▼	43
డాక్స్	24,028	▲	146
షాంఘై	3,902	▲	27
నికాయ్	50,491	▼	536

అమెరికా · బ్రిటన్ · జర్మనీ · చైనా · జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	89.44	90.46
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.40	121.38
€	యూరో	ఎస్‌బీఐ	103.40	106.18
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.28	58.69
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	58.33	60.63
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.16	70.88
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.11	24.61
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.61	24.87
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.85	13.67

మీరూ కావచ్చు... మిస్టర్ బాండ్!

రెండ్రోజుల కిందటే ఆర్‌బీఐ రెపోరేటు మరో 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. అంటే... వడ్డీ రేట్లు తగ్గుతాయన్న మాట. వాస్తవంగా చూస్తే అటు రుణాలపై చెల్లించాల్సిన వడ్డీరేటూ తగ్గాలి.. ఇటు మన డిపాజిట్లపై వచ్చే వడ్డీ రేటూ తగ్గుతుంది. కాకపోతే మన బ్యాంకులకు వాటి వ్యాపారమే తొలి ప్రాధాన్యం. కాబట్టి రుణాలపై వడ్డీ రేట్లకు సంబంధించి కాస్త లేటుగా స్పందిస్తాయి. కానీ డిపాజిట్లపై వడ్డీ రేట్లు వెంటనే తగ్గించేస్తాయి. పాపం... డిపాజిట్లు చేసుకుని, వాటిపై వడ్డీతో బండి లాగించేవారికి ఇది ఇబ్బందికరమే. మరి డిపాజిట్లపై వడ్డీ తగ్గుతూ పోతున్న ఇలాంటప్పుడు ఏం చెయ్యాలి? ప్రత్యామ్నాయ మార్గాలేంటి? చాలామంది స్టాక్ మార్కెట్లవైపు చూస్తారు. మార్కెట్లలో డబ్బులు సంపాదించాలంటే వాటి గురించి బాగా తెలిసి ఉండాలి. అందుకే మ్యూచువల్ ఫండ్లను ఆశ్రయిస్తారు. అవి కొంతవరకూ బెటరే అయినా... వీటిలో ఎక్కడా రాబడులపై గ్యారంటీ ఉండదు. మరి ఎలా? ఇదిగో... ఇలాంటి వారి కోసమే కార్పొరేట్ బాండ్లున్నాయి. అవేంటో చూద్దాం...

- కాస్త ఎక్కువ వడ్డీ కావాలంటే కార్పొరేట్ బాండ్స్ చూడొచ్చు
- వీటిక్కూడా ఎఫ్‌డీల మాదిరే కొంతవరకూ గ్యారంటీ ఉంది
- కొన్ని బాండ్లలో ఎఫ్‌డీల కన్నా ఎక్కువ రిస్కు కూడా ఉంటుంది
- రేటింగ్‌ను బట్టి ఇన్వెస్ట్ చేస్తే చాలావరకూ సొమ్ముకు భద్రత
- ఈ బాదరబందీ వద్దనుకుంటే కార్పొరేట్ బాండ్ ఫండ్లూ ఉన్నాయ్
- వడ్డీలు తగ్గుతున్నాయి కనక... కాస్త ఎక్కువ రేటు కావాలంటే ఇదో మార్గం

కంపెనీలు నేరుగా ప్రజల నుంచి డబ్బులు సమీకరించడానికి బాండ్లు (రుణపత్రాలు) జారీ చేస్తుంటాయి. వాటికి నిర్దిష్ట కాలపరిమితి ఉంటుంది. పైపెచ్చు వార్షికంగా చెల్లించేలా స్థిరమైన వడ్డీ రేటుంటుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై దాదాపు 7 శాతమే వడ్డీ వస్తున్న తరుణంలో బాండ్లపై మాత్రం 8 నుంచి 12% వరకూ వడ్డీ వచ్చే అవకాశం ఉంది. దీనికి గ్యారంటీ కూడా ఉంటుంది. కాకపోతే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

అవసరాలకు అనుగుణంగా..

కంపెనీలు తమ వ్యాపార విస్తరణ కోసమో, వర్కింగ్ క్యాపిటల్ కోసమో లేదా అధిక వడ్డీపై తీసుకున్న రుణాలను తీర్చేసేందుకో నిధుల సమీకరణ కోసం జారీ చేసే బాండ్లను కార్పొరేట్ బాండ్లుగా పిలుస్తారు. అంటే ఈ బాండును కొనుక్కున్న వాళ్లు, సదరు కంపెనీకి నిర్దిష్ట కాల వ్యవధికి అప్పు ఇచ్చినట్లు లెక్క. దీనికోసం ఆ కంపెనీ మధ్య మధ్యలో (అంటే నెల, మూడు నెలలు, వార్షికంగా..) వడ్డీ చెల్లిస్తుంది. మెచ్యూరిటీ తీరాక అసలును చెల్లిస్తుంది. ఈ వడ్డీ రేటును బాండ్ల పరిభాషలో కూపన్ రేటుగా వ్యవహరిస్తారు. కూపన్ కాకుండా సాధారణ మార్కెట్లో వడ్డీ రేట్లు పెరిగినప్పుడు బాండు విలువ కూడా పెరగవచ్చు. ఆ విధంగా వడ్డీతో పాటు, పెట్టిన పెట్టుబడి పెరిగే అవకాశం కూడా ఉంటుంది.

కొన్ని రిస్కులుంటాయి ..

అధిక రాబడులు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లే ఈ బాండ్లలో రిస్కులు కూడా ఉంటాయి. సాధారణంగా బ్యాంకుల్లో రూ.5 లక్షలలోపు చేసే డిపాజిట్లకు డిపాజిట్ ఇన్సూరెన్స్, క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) నుంచి బీమా రక్షణ ఉంటుంది. కానీ కార్పొరేట్ బాండ్లకు అలాంటిదేమీ ఉండదు. వాటి ధరలు కూడా వడ్డీ రేట్లను బట్టి ప్రభావితమవుతూ ఉంటాయి. పైపెచ్చు ఆ కంపెనీ తాలూకు క్రెడిట్ రేటింగ్‌ను బట్టి కూడా మారుతుంటాయి. ఇష్యూ చేసే కంపెనీ క్రెడిట్ రేటింగ్, వడ్డీ రేట్లను బట్టి మారిపోతుంటాయి.

ఎంచుకోవడం ఇలా..

తీసుకున్న మొత్తాన్ని ఆ కంపెనీ తిరిగి సక్రమంగా చెల్లించగలదా లేదా అనేది ఇన్వెస్టర్లు తెలుసుకునేందుకు వీలుగా ఇక్రా, క్రిసిల్, కేర్ లాంటి రేటింగ్ ఏజెన్సీలు .. ఏ ప్లస్, ఏఏ, ట్రిపుల్ ఎ, బి ప్లస్ అంటూ బాండ్లకు రకరకాల రేటింగ్ ఇస్తాయి. దీన్ని బట్టి వాటిలో ఇన్వెస్ట్ చేయాలా వద్దా అనేది ఇన్వెస్టర్లు నిర్ణయించుకోవచ్చు. సాధారణంగా ట్రిపుల్ ఏ నుంచి ట్రిపుల్ బీ మైనస్ వరకు రేటింగ్ ఉన్న వాటిని అత్యంత సురక్షితమైనవిగా, డబుల్ బీ ప్లస్ నుంచి బీ మైనస్ వరకు రేటింగ్‌ను ఒక మోస్తరు రిస్కు ఉన్నవాటిగా పరిగణిస్తారు. షేర్ల మాదిరిగానే ఎన్ఎస్ఈ, బీఎస్ఈ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఇవి ట్రేడవుతూ ఉంటాయి. ఎప్పుడు కావాలంటే అప్పుడు వీటిని విక్రయించుకోవచ్చు, కొనవచ్చు కూడా.

ఎవరికి అనువైనవంటే..

- మధ్యకాలికం నుంచి దీర్ఘకాలికంగా అంటే ఏడాది నుంచి సుమారు పదేళ్ల వ్యవధి గాను స్థిరంగా ఆదాయాన్ని అందించే సాధనాల కోసం చూస్తుంటే
- బ్యాంక్ డిపాజిట్లకే పరిమితం కాకుండా ఇతరత్రా ఫిక్స్‌డ్ ఇన్వెస్ట్‌మెంట్ సాధనాల్లో పెట్టుబడులను డైవర్సిఫై చేయదల్చుకుంటే
- ఎఫ్‌డీలకు మించి మెరుగైన రాబడులు ఆశిస్తున్నా... రిటైర్మెంట్ తరువాత స్థిరంగా నెలవారీ ఆదాయాన్ని కావాలనుకుంటున్నా
- పిల్లల చదువుల కోసం ప్లాన్ చేసుకుంటున్న తల్లిదండ్రులు... పెద్దగా రిస్కులను ఇష్టపడకుండా ఎఫ్‌డీలు కాకుండా ఇతర సాధనాలను చూస్తున్నవారికి

బాండ్ ఫండ్స్..

ప్రతి బాండును క్షుణ్నంగా అధ్యయనం చేసి, సరైన దాన్ని ఎంపిక చేసుకోవడం కష్టతరంగా అనిపించే వారి కోసం బాండ్ ఫండ్స్ కూడా ఉన్నాయి. ఇవి ఇన్వెస్టర్ల నుంచి సమీకరించిన నిధుల్లో కనీసం 80 శాతం మొత్తాన్ని అత్యుత్తమ క్రెడిట్ రేటింగ్ ఉండి, ఆర్థికంగా పటిష్ఠంగా ఉన్న సంస్థల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. నిప్పన్ ఇండియా కార్పొరేట్ బాండ్ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ కార్పొరేట్ బాండ్ ఫండ్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ కార్పొరేట్ బాండ్ ఫండ్, కోటక్ కార్పొరేట్ బాండ్ ఫండ్, యాక్సిస్ కార్పొరేట్ బాండ్ ఫండ్ మొదలైనవి వీటిలో ఉన్నాయి. ఇవి వార్షికంగా సగటున ఏడు శాతానికి పైగా రాబడులు అందించాయి. ఇవి 2–5 ఏళ్ల కాలవ్యవధికి అనువుగా ఉంటాయి.

ఇదీ.. బాండ్ పరిభాష..

కూపన్ రేటు: కంపెనీ చెల్లించే వడ్డీ
ఈల్డ్: ధరల్లో మార్పుల వల్ల చేతికి అందే మొత్తం రాబడి
క్రెడిట్ రేటింగ్: తిరిగి చెల్లించడంలో కంపెనీకి ఉండే సామర్థ్యం
మెచ్యూరిటీ: అసలును తిరిగి చెల్లించే సమయం
లిక్విడిటీ: బాండ్‌ను ఎప్పుడు కావాలంటే అప్పుడు విక్రయించే వీలు

ఎక్కడ కొనొచ్చు..

జిరోధా, హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్, ఏంజెల్ వన్, అప్‌స్టాక్స్ బ్రోకరేజ్ ప్లాట్‌ఫాంలతో పాటు ఇండియా బాండ్స్, బాండ్ బజార్, గ్రిప్ ఇన్వెస్ట్‌లాంటి సెబీ రిజిస్టర్డ్ ప్లాట్‌ఫాంల ద్వారా రిటైల్ ఇన్వెస్టర్లు.. తమకు కావాల్సిన కార్పొరేట్ బాండ్లను ఎంచుకుని, కొనుగోలు చేయొచ్చు. కొనుగోలు, అమ్మకం లావాదేవీలను బట్టి స్వల్ప చార్జీలు ఉంటాయి. ప్లాట్‌ఫాంను బట్టి కనీస పెట్టుబడి రూ. 1,000 నుంచి ఉంటోంది. కొనుక్కున్న తర్వాత ఒకటి రెండు రోజుల్లో డీమ్యాట్ ఖాతాలోకి బాండ్లు క్రెడిట్ అవుతాయి.

రేటింగ్ బట్టి రాబడి..

AAA:	తక్కువ రిస్కు	:	7–8 శాతం
AA:	మధ్య స్థాయి రిస్కు	:	8–9.5 శాతం
A:	అధిక రిస్కు	:	10–12 శాతం

స్టాక్స్ వ్యూ

డేటామాటిక్స్ గ్లోబల్ | బ్రోకరేజ్: చాయిస్ బ్రోకింగ్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 837 **టార్గెట్: రూ. 1,130**

ఎందుకంటే: ఐటీ, డిజిటల్ సేవలందించే డేటామాటిక్స్ గ్లోబల్ సర్వీసెస్ యాజమాన్యంతో ఇటీవల సమావేశమయ్యాం. కంపెనీ సీఈవో, సీఎఫ్‌వో, సీఎంవో అందించిన వివరాల ప్రకారం డిజిటల్ కార్యకలాపాల విభాగం వృద్ధి పథంలో సాగుతోంది. టీఎన్‌క్యూటెక్ కొనుగోలు ఇందుకు ప్రధానంగా తోడ్పాటునిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), జెన్ ఏఐ, ఎజెంటిక్ ఏఐలో చాలా ముందుగానే ఇన్వెస్ట్ చేయడం కంపెనీకి లబ్ధిని చేకూరుస్తోంది. డిజిటల్ టెక్నాలజీస్ బిజినెస్‌లో పురోగతికి సహకరిస్తున్నాయి. డేటామాటిక్స్ ప్రధాన లక్ష్యంగా కార్యకలాపాలు నిర్వహించే మధ్యస్థాయి క్లయింట్ కంపెనీలను ప్రత్యేక వర్టికల్ లీడర్‌షిప్‌తో ఆకట్టుకుంటోంది. బిజినెస్ ట్రాన్స్‌ఫార్మేషన్ బాటలో సాగుతున్న ఎంటర్‌ప్రైజెస్‌కు సేవలు సమకూర్చుతోంది. ఇప్పటికే 300కుపైగాయాక్టివ్ క్లయింట్లను కలిగి ఉన్న సంస్థ యూఎస్, యూరప్‌లలో భారీ అవకాశాలను అందిపుచ్చుకోనుంది. బీఎఫ్ఎస్ఐ, పబ్లిషింగ్ అండ్ ప్రోక్టరింగ్(కస్టమర్ ఎక్స్‌పీరియన్స్), రిటైల్, లాజిస్టిక్స్ విభాగాలలో టాప్ క్లయింట్లకు సర్వీసులు అందిస్తోంది. మరోపక్క క్లయింట్ రిస్కులను తగ్గించుకునే బాటలో కొత్త కస్టమర్లపై దృష్టిపెట్టి ముందుకు సాగుతోంది. మైక్రోసాఫ్ట్, ఏడబ్ల్యూఎస్‌కుతోడు డెక్స్‌టారా ద్వారా కొత్తగా జత కలుపుకున్న సేల్స్‌ఫోర్స్ సామర్థ్యాలతో ఎంటర్‌ప్రైజ్ ప్లాట్‌ఫామ్‌ను పటిష్టపరచుకుంటోంది. టెక్నాలజీ విభాగంలో ముందుండేలా ఇన్నోవేషన్‌పై ఏడాదికి రూ. 40–50 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేసే ప్రణాళికల్లో ఉంది. అంతేకాకుండా వ్యయ నియంత్రణ ద్వారా లాభదాయకత కొనసాగింపునకు ప్రాధాన్యత ఇస్తోంది. వెరసి ప్రత్యేకత కలిగిన విభాగాలు, ఏఐ ఆధారిత ఎగ్జిక్యూషన్, లాభదాయకతపై దృష్టి తదితర సానుకూలతలతో మరింత పటిష్ట పనితీరు చూపే అవకాశముందని భావిస్తున్నాం.

ప్రెస్టేజ్ ఎస్టేట్స్ | బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,690 **టార్గెట్: రూ. 2,295**

ఎందుకంటే: రియల్టీ రంగ దిగ్గజం ప్రెస్టేజ్ ఎస్టేట్స్ గృహ సముదాయాలు(రెసిడెన్షియల్), కార్యాలయాలు(ఆఫీసులు), ఆతిథ్యం(హోటళ్లు), చిల్లర దుకాణ(రిటైల్) విభాగాలలో కార్యకలాపాలు విస్తరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి అర్ధభాగం(ఏప్రిల్–సెప్టెంబర్)లో ప్రోత్సాహకర పనితీరుకు తెరలేచింది. రూ. 33,100 కోట్ల విలువైన బిజినెస్ డెవలప్‌మెంట్‌కుతోడు రూ. 77,000 కోట్ల విలువైన ప్రాజెక్టుల(పైప్‌లైన్) కారణంగా రానున్న మూడేళ్ల కాలంలో ముందస్తు అమ్మకాల(ప్రీ సేల్స్)లో సగటున 40 శాతం చొప్పున వార్షిక వృద్ధికి అవకాశమేర్పడింది. వెరసి 2027–28కల్లా రూ. 46,300 కోట్ల విలువైన ప్రీసేల్స్‌ను సాధించే వీలుంది. ఈ బాటలో ఆఫీసులు, రిటైల్ విభాగాలలో 50 మిలియన్ చదరపు అడుగులకు బిజినెస్‌ను విస్తరిస్తోంది. మరోపక్క ఆతిథ్య రంగ పోర్ట్‌ఫోలియోను సైతం విస్తరిస్తోంది. ఫలితంగా ఆఫీస్, రిటైల్ విభాగాలలో ఉమ్మడిగా అద్దె(రెంటల్) ఆదాయం వార్షిక ప్రాతిపదికన 2025–28 కాలంలో 50 శాతం పురోగతి సాధించనున్నట్లు అంచనా. తద్వారా రూ. 2,510 కోట్లకు చేరే వీలుంది. ఇదేవిధంగా ఆతిథ్య రంగ ఆదాయం 22 శాతం వార్షిక వృద్ధితో రూ. 1,600 కోట్లకు చేరవచ్చు. నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తే 2029–30కల్లా వాణిజ్య ఆదాయం రూ. 3,300 కోట్లకు బలపడవచ్చని అంచనా. ఓవైపు ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం(ఎంఎంఆర్)లో వేగంగా మార్కెట్ వాటాను పెంచుకుంటోంది. మరోపక్క దేశ రాజధాని ప్రాంతం(ఎన్‌సీఆర్)లోనూ భారీస్థాయిలో ప్రవేశించింది. అంతేకాకుండా పుణే కార్యకలాపాలు విస్తరిస్తోంది. దీంతో సమీకృత ఆదాయ వృద్ధికి వీలుంటుంది. రెసిడెన్షియల్, కమర్షియల్ విభాగాలలో వృద్ధి, ఆతిథ్య రంగంలో విలువ పెంపు కంపెనీకి లబ్ధిని చేకూర్చనున్నాయి.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

పాఠకుల ప్రశ్నలు.. నిపుణుల సమాధానాలు

రియల్టీ..

నేనో స్థలం కొందామనుకుంటున్నాను. గేటెడ్ కమ్యూనిటీలో అయితే మంచిదా... లేకపోతే మామూలు సింగిల్‌గా ఉండే ప్లాటయితే మంచిదా?

ప్లాట్ల విషయానికొచ్చినపుడు గేటెడ్ కమ్యూనిటీలో ఉండే స్థలానికున్న రక్షణ బయట సింగిల్‌గా ఉండే స్థలాలకు ఉండదు. కబ్జాలకు అవకాశం తక్కువ. కాకపోతే స్థలమన్నది ఎక్కడ కొన్నా ముందుగా చెక్ చేసుకుని కొనటం తప్పనిసరి. గేటెడ్ అయితే రీసేల్ కాస్త సులువుగా అవుతుంది. దీని కోసం 10–20 శాతం ధర ఎక్కువ పెట్టాల్సి వచ్చినా పర్వాలేదు.

బ్యాంకింగ్..

నేను భవిష్యత్ లక్ష్యాల కోసం క్రమానుగత ఇన్వెస్ట్‌మెంట్ చేద్దామనుకుంటున్నాను. బ్యాంకులో రికరింగ్ డిపాజిట్ చేయటం మంచిదా... మ్యూచువల్ ఫండ్స్ మంచివా?

దీర్ఘకాలానికి ఇన్వెస్ట్ చేసేటపుడు మ్యూచ్‌వల్ ఫండ్స్‌ను ఎంచుకోవటమే సరైన నిర్ణయం అనిపిస్తుంది. ఎందుకంటే ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే శక్తి షేర్ మార్కెట్‌కు ఉంటుంది. పైపెచ్చు ఆర్‌డీతో పోలిస్తే దీర్ఘకాలానికి ఫండ్లే మంచి రాబడినిస్తాయి. ఆర్‌డీ సురక్షితమే అయినా రాబడి తక్కువ. స్వల్పకాలానికైతే అది మంచిది.

స్టాక్ మార్కెట్లు...

ఈ ఏడాది చాలా ఐపీఓలు వచ్చాయి. వచ్చే ఏడాది కూడా ఇలాగే రావచ్చేమో. మరి 2026లో ఐపీఓల్లో పెట్టుబడి పెట్టవచ్చా?

ఈ మధ్య కాలంలో చాలా ఐపీఓలు అత్యధిక ధర వద్ద ఇష్యూకు వస్తున్నాయి. లిస్టింగ్ నాడు లాభాలొస్తున్నా... అది దైవాధీనమనుకోవాలి. ఎందుకంటే చాలా ఐపీఓలు లిస్ట్ అయిన నెల–రెండు నెలలకే నేల చూపులు చూస్తున్నాయి. కాబట్టి ఏ ఐపీఓలో పెట్టుబడి పెట్టినా కంపెనీ ఫండమెంటల్స్ చూడండి. ఫండమెంటల్స్ బాగుండి, ఆ వ్యాపారానికి భవిష్యత్ ఉందనిపిస్తే పెట్టండి. దీర్ఘకాలానికైనా పనికొచ్చేలా ఉండాలి.

ఫండ్స్...

నేను మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడుతున్నాను. ప్రస్తుతం నా పోర్ట్‌ఫోలియోలో 22 మ్యూచువల్ ఫండ్స్ ఉన్నాయి. ఇది మంచిదేనా? అసలు ఎన్ని ఫండ్స్ ఐతే బెటర్?

వాస్తవానికి అన్ని మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడం కరెక్ట్ కాదు. ఎందుకంటే అన్ని ఫండ్ల పనితీరూ ఒక్కలా ఉండదు. ఇలా పెట్టడమంటే షేర్లలో పెట్టినట్లే. షేర్లలో పెట్టుబడి పెడితే రిస్కు ఎక్కువనే కదా మీరు మ్యూచువల్ ఫండ్లు ఎంచుకున్నది. మరి ఇన్ని ఫండ్లలో ఇన్వెస్ట్ చేస్తే అన్నింటి పనితీరునూ ఎప్పటికప్పుడు గమనిస్తూ వెళ్లగలరా? అందుకే నా సూచనేమిటంటే కనిష్ఠంగా 3, గరిష్ఠంగా 5 మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడం ఉత్తమం.

ఇన్సూరెన్స్...

క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్ అంటే ఏంటి? ఎంతవరకూ ఉపకరిస్తుంది? అది తీసుకోవటం మంచిదేనా?

మంచిదే. మీ ఆరోగ్య బీమా ప్రీమియానికి కొంత మొత్తాన్ని జోడించటం ద్వారా ఈ రైడర్‌ను తీసుకోవచ్చు. ఇలా తీసుకోవటం వల్ల కేన్సర్, గుండెపోటు, కిడ్నీ ఫెయిల్యూర్, మేజర్ అవయవ మార్పిడి వంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు వాస్తవంగా ఆసుపత్రి బిల్లు ఎంతయిందనే అంశంతో సంబంధం లేకుండా ఇన్సూర్ చేసిన మొత్తాన్ని కంపెనీ మీకు చెల్లించేస్తుంది. ఆ మొత్తాన్ని మీరు చికిత్సకు, రికవరీకి, ఈ మధ్యలో చెల్లించాల్సిన ఈఎంఐల వంటి ఖర్చులు వాడుకోవచ్చు. ఊహించని వ్యాధులొచ్చినపుడు ఈ రైడర్ వల్ల ఆర్థికంగా కూడా ఇబ్బందులు పడటమనేది తప్పుతుంది. కాబట్టి క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్‌ను తీసుకోవటం సరైనదే.

మీ సందేహాలకు నిపుణుల ద్వారా సమాధానాలు కావాలంటే business@sakshi.comకు మెయిల్ చేయండి.

ఫెడ్‌పై మార్కెట్ దృష్టి

ప్రధానంగా విదేశీ గణాంకాల ఆధారంగా ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లు కదలనున్నట్లు నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లను ప్రభావితం చేయగల యూఎస్ ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమీక్షను చేపట్టనుంది. ఇది సెంటిమెంటుకు కీలకంగా నిలవనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. వివరాలు చూద్దాం.. –సాక్షి, బిజినెస్ డెస్క్

- 10న పరపతి సమీక్షా నిర్ణయాలు
- యూఎస్ ఉపాధి గణాంకాల వెల్లడి
- చైనా, యూఎస్ వాణిజ్య వివరాలు
- దేశీయంగా ద్రవ్యోల్బణ గణాంకాలు
- ఈ వారం ట్రెండ్‌పై నిపుణుల విశ్లేషణ

యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ 9న పరపతి విధాన సమీక్షను చేపట్టనుంది. 10న చైర్మన్ పావెల్ అధ్యక్షతన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) మానిటరీ పాలసీ నిర్ణయాలు ప్రకటించనుంది. ఫెడ్ ఫండ్స్(వడ్డీ) రేట్లను 0.25 శాతంమేర తగ్గించవచ్చని అధికశాతంమంది ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. గత పాలసీ సమావేశంలోనూ వడ్డీ రేటులో పావు శాతం కోత పెట్టిన సంగతి తెలిసిందే. దీంతో ప్రస్తుతం ఫెడ్ ఫండ్స్ రేట్లు 3.75–4 శాతంగా అమలవుతున్నాయి. కాగా.. ముందు రోజు అంటే 9న యూఎస్ ఉపాధి గణాంకాలు విడుదలకానున్నాయి. 11న సెప్టెంబర్ నెలకు వాణిజ్య గణాంకాలు వెల్లడికానున్నాయి. ఆగస్ట్‌లో వాణిజ్య లోటు 59.6 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. జూలైలో 78 బిలియన్ డాలర్లుగా నమోదైంది. నవంబర్ నెలకు చైనా వాణిజ్య గణాంకాలు విడుదలకానున్నాయి. అక్టోబర్‌లో చైనా 90 బిలియన్ డాలర్లకుపైగా వాణిజ్య మిగులు ప్రకటించిన సంగతి తెలిసిందే. 10న గత నెలకు చైనా ద్రవ్యోల్బణ వివరాలు తెలియనున్నాయి.

ఆర్‌బీఐ ఎఫెక్ట్

దేశీయంగా ఆర్‌బీఐ గత వారం వడ్డీ రేట్లకు కీలకమైన రెపోలో 0.25 శాతం కోత పెట్టింది. దీంతో రెపో రేటు 5.25 శాతానికి దిగివచ్చింది. అంతేకాకుండా రూ. లక్ష కోట్ల లిక్విడిటీకి సైతం తెరతీయనుంది. ఫలితంగా దేశీ స్టాక్ మార్కెట్లు వారాంతాన ఊపందుకున్నాయి. అయితే డాలరుతో మారకంలో రూపాయి 90కు బలహీనపడటం గమనించదగ్గ అంశం. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీకి దన్నుగా ఆర్‌బీఐ 5 బిలియన్ డాలర్ల రుపీ డాలర్ స్వాప్‌నకు తెరతీయనుంది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ చర్యలు జీఎస్‌టీ సంస్కరణలకు జత కలసి సెంటిమెంటుకు ప్రోత్సాహాన్నివ్వనున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు. ఆరు ప్రపంచ ప్రధాన కరెన్సీలతో మారకంలో యూఎస్ డాలరు ఇండెక్స్, ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ సైతం మార్కెట్లలో ట్రెండ్‌ను ప్రభావితం చేసే అవకాశముంది. ఇవి గ్లోబల్ ఇన్వెస్టర్లను రిస్కు పెట్టుబడులైన ఈక్విటీల నుంచి పసిడి తదితర రక్షణాత్మక సాధనాలవైపు మళ్లించవచ్చని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

రిటైల్ ధరలు..

నవంబర్ నెలకు వినియోగ ధరల(సీపీఐ) గణాంకాలు శుక్రవారం(12న) విడుదలకానున్నాయి. అక్టోబర్‌లో సీపీఐ 0.25 శాతానికి నీరసించింది. దీంతో ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపునకు వీలు కలిగిన విషయం విదితమే. కాగా.. వరుసగా 9వ నెలలోనూ ఆర్‌బీఐ లక్ష్యం 4 శాతానికంటే దిగువనే రిటైల్ ధరలు నమోదవుతుండటం గమనార్హం!

బుల్లిష్‌గా..

గత వారం ఆటుపోట్ల మధ్య దేశీ స్టాక్ మార్కెట్లు దాదాపు ఫ్లాట్‌గా ముగిశాయి. రూపాయి పతనంతో ఐటీ కౌంటర్లు బలపడ్డాయి. అయితే సాంకేతికంగా చూస్తే ఈ వారం మార్కెట్లు పుంజుకోవడానికే అధిక చాన్స్ ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

- ఎన్ఎస్ఈ నిఫ్టీ 26,300–26,350 పాయింట్లకు పెరిగే వీలుంది. ఈ స్థాయిలో రెసిస్టెన్స్ ఎదురుకావచ్చు. దీనిని అధిగమిస్తే స్వల్ప కాలంలో 26,850–26,900 వరకూ పురోగమించే అవకాశముంది. ఒకవేళ బలహీనపడితే తొలుత 26,000, తదుపరి 25,850 పాయింట్ల వద్ద సపోర్ట్ లభించే వీలుంది. ఆపై మరోసారి 25,700 వద్ద మద్దతు కనిపించవచ్చు. ఇంతకంటే దిగువకు చేరితే మరింత నీరసించేందుకు ఆస్కారం ఉంటుంది.
- బీఎస్ఈ సెన్సెక్స్ 86,350 వరకూ బలపడవచ్చు. ఈస్థాయిని దాటితే 87,500–88,000 పాయింట్లవరకూ పుంజుకునే అవకాశముంది. ఒకవేళ బలహీనపడితే తొలుత 84,800 వద్ద, తదుపరి 84,450 పాయింట్ల వద్ద సపోర్ట్ లభించవచ్చు. ఆపై మరింత నీరసిస్తే 83,600–83,300 పాయింట్లవరకూ క్షీణించే వీలుంది.

ఎఫ్‌పీఐల అమ్మకాల స్పీడ్

తొలి వారంలో రూ. 11,820 కోట్లు ఔట్

దేశీ స్టాక్స్‌లో ఇటీవల విక్రయాలకే ప్రాధాన్యమిస్తున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఈ నెల మొదటి వారంలోనూ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. నగదు విభాగంలో నికరంగా రూ. 11,820 కోట్ల విలువైన అమ్మకాలు చేపట్టారు. దీంతో ఈ కేలండర్ ఏడాది(2025)లో ఇప్పటి వరకూ రూ. 1.55 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నట్లయింది! గత నెలలోనూ రూ. 3,765 కోట్ల విలువైన స్టాక్స్‌ను నికరంగా విక్రయించిన ఎఫ్‌పీఐలు అక్టోబర్‌లో మాత్రం రూ. 14,610 కోట్లు ఇన్వెస్ట్ చేసిన విషయం విదితమే. అయితే అంతకుముందు సెప్టెంబర్‌లో రూ. 23,885 కోట్లు, ఆగస్ట్‌లో రూ. 34,990 కోట్లు, జూలైలో రూ. 17,700 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకోవడం గమనార్హం!

న్యూ ఫండ్ ఆఫర్

యూనియన్ కన్జంప్షన్ ఫండ్

యూనియన్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా యూనియన్ కన్జంప్షన్ ఫండ్‌ని ప్రవేశపెట్టింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో) డిసెంబర్ 15తో ముగుస్తుంది. 'రైజ్' విధానం కింద వినియోగ ఆధారిత రంగాల సంస్థల్లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ప్యాకేజ్డ్ ఫుడ్స్, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, ఫిన్‌టెక్, ట్రావెల్, ఆతిథ్యం, ఎంటర్‌టైన్‌మెంట్ తదితర రంగాలు వీటిలో ఉంటాయి. 2008 నుంచి చూస్తే భారత్‌లో తలసరి ఆదాయం మూడు రెట్లు పెరగ్గా, 2030 ఆర్థిక సంవత్సరం నాటికి మరో 1.6 రెట్లు పెరుగుతుందనే అంచనాలు ఉన్నాయి. ఆదాయ పన్ను రేట్లు, జీఎస్‌టీ మార్పులు మొదలైన వాటి రూపంలో ఎకానమీకి ఊతమిచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని యూనియన్ ఏఎంసీ సీఈవో మధు నాయర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వినియోగం పెరిగి, తత్సంబంధిత రంగాలు లబ్ధి పొందగలవని చెప్పారు. వినోద్ మాలవీయ, సంజయ్ బెంబాల్కర్ ఈ ఫండ్‌కి మేనేజర్లుగా వ్యవహరిస్తారు.

సంపద అనేది మనం సంపాదించే డబ్బులో లేదు..దాచుకునే డబ్బులో ఉంది
- క్రిస్ రాక్, అమెరికన్ నటుడు, వ్యాపారవేత్త

డిగ్రీ లెవల్ ప్లానింగ్ భేష్

కేజీ నుంచే పీజీ కోసం ఆలోచించాలి మరి

- ఉన్నత విద్య కోసం రుణాలపై ఆధారపడితే కష్టం
- ఏటా 10 శాతం వరకూ పెరుగుతున్న విద్యా రంగ ద్రవ్యోల్బణం
- ఈ లెక్కన వచ్చే పదేళ్లలో ఫీజులు రెండుమూడు రెట్లు పెరిగే చాన్స్
- దానికి సిద్ధం కావాలంటే దీర్ఘకాలం పొదుపు తప్పనిసరి
- ఎంత త్వరగా పొదుపు మొదలుపెడితే అంత మంచిది

మన విద్యావ్యవస్థ అమెరికా కన్నా పూర్తి భిన్నం. అక్కడ ప్రాథమిక విద్య మొత్తం ప్రభుత్వ రంగంలోనే ఉంటుంది. అతితక్కువ ఖర్చుతో పూర్తయిపోతుంది. కానీ ఉన్నత విద్యకు మెజారిటీ జనం అప్పులు చేయాల్సిందే. అంత భారీగా ఖర్చవుతుంది మరి. ఇక మన దగ్గర పరిస్థితి పూర్తిగా వేరు. ప్రాథమిక విద్య నుంచే అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఉన్నత విద్యకొచ్చేసరికి టాప్‌గ్రేడ్ సంస్థలన్నీ ప్రభుత్వ రంగంలోనే ఉన్నా... వాటిలో సీట్లు దక్కేది అతితక్కువ మందికి. సో... మంచి సంస్థలో ఉన్నతవిద్య పూర్తి చేయాలంటే మామూలుగా ఖర్చవదు. మరి పిల్లలకోసం తప్పదు కదా? అందుకే... వాళ్లు ప్రాథమిక స్థాయిలో ఉన్నపుడే... ఉన్నత విద్య కోసం ఆర్థికంగా ప్రణాళిక వేసుకుంటే ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పూర్తి చేయగలుగుతారు. అదెలాగో తెలుసుకుందాం.

ఉన్నత విద్య కోసం ప్లాన్ చేసుకునేటపుడు ముందుగా గుర్తుంచుకోవాల్సింది భవిష్యత్ ద్రవ్యోల్బణం. ఇంజినీరింగ్, మెడిసిన్, విదేశీ విద్య... ఇలా ఏది చూసుకున్నా ఫీజులు ఏటా పెరుగుతున్నాయి. ప్రస్తుతం సగటున విద్యా ద్రవ్యోల్బణం 8 నుంచి 10 శాతం ఉంటోంది. ఫీజులు ఈ స్థాయిలో పెరుగుతుంటే... పదేళ్ల తరవాత డిగ్రీకయ్యే ఖర్చు ప్రస్తుతానికన్నా రెండు మూడు రెట్లు ఎక్కువ ఉండవచ్చనేది ఆర్థిక నిపుణుల మాట. వారి అంచనాల ప్రకారం... మరి ఈ స్థాయిలో పెరిగే విద్యా వ్యయం కోసం ఇప్పటి నుంచే ప్రణాళిక వేసుకోవాలి కదా? ఈ లెక్కన నెలకు ఎంత పొదుపు చెయ్యాలి?

- వచ్చే 12 సంవత్సరాల్లో రూ.30 లక్షలు కావాలనుకుంటే కనక నెలకు రూ.10వేల చొప్పున ఇప్పటి నుంచే సిప్ చెయ్యాలి. ఏటా 12 శాతం వార్షిక రాబడిని ఆశించవచ్చు.
- వచ్చే 15 ఏళ్లలో రూ.50 లక్షల మొత్తాన్ని ఆశిస్తే కనక నెలకు రూ.8,500 నుంచి రూ.9000 మొత్తాన్ని సిప్ చేస్తే సరిపోతుంది.

డిగ్రీ	ప్రస్తుత వ్యయం	2035లో అంచనా...
ఇంజినీరింగ్	10-15 లక్షలు	25-35 లక్షలు
మెడిసిన్(ఎంబీబీఎస్)	70 లక్షలు-1.2 కోట్లు	1.8- 2.5 కోట్లు
ఎంబీఏ (టాప్ సంస్థలు)	25-30 లక్షలు	45-70 లక్షలు
విదేశీ విద్య (మాస్టర్స్)	25-40 లక్షలు	60 లక్షలు-1.2 కోట్లు

ఈ జాగ్రత్తలు తప్పనిసరి...

- పొదుపు చేయటంలో ఆలస్యం వద్దు
- కేవలం ఎఫ్‌డీలపైనే ఆధారపడొద్దు (తక్కువ రాబడి)
- హాస్టల్, ఇతర ఖర్చులనూ పరిగణనలోకి తీసుకోవాలి
- అనవసరంగా విద్యా రుణాల జోలికి వెళ్లొద్దు

2035లో డిగ్రీకయ్యే వ్యయం...

ఇంజినీరింగ్ - రూ.25-35 లక్షలు
ఎంబీబీఎస్ - రూ.1.8 - 2.5 కోట్లు
ఎంబీఏ - రూ.45-70 లక్షలు
విదేశీ విద్య (మాస్టర్స్) - రూ.60 లక్షలు- 1.2 కోట్లు

మరి ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?

- సిప్ కోసం మ్యూచువల్ ఫండ్లను ఆశ్రయించవచ్చు. ఎందుకంటే వాటికి మాత్రమే ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే శక్తి ఉంటుంది. లార్జ్ క్యాప్ లేదా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లను దీర్ఘ కాలానికి ఎంచుకుంటే సరిపోతుంది.
- ఆడ పిల్లల కోసమైతే కనక సుకన్య సమృద్ధి యోజనను ఎంచుకోవచ్చు. దీనిపై 8 శాతం వడ్డీతో పాటు పన్ను ప్రయోజనాలూ ఉంటాయి.
- తల్లిదండ్రులు గనక ఒకవైపు బీమా భద్రత మరోవైపు ఇన్వెస్ట్‌మెంట్... ఈ రెండింటి ప్రయోజనాలూ ఆశిస్తే గనక చైల్డ్ యూలిప్స్‌ను ఆశ్రయించవచ్చు.
- ఒకవేళ పిల్లలు గనక ఇప్పటికే 15-17 ఏళ్లకు వస్తే.. డెట్ ఫండ్లను, విడగొట్టే ఫిక్స్‌డ్ డిపాజిట్లను పరిశీలించవచ్చు. అంటే ఏడాది, రెండేళ్లు, మూడేళ్ల చొప్పున ఎఫ్‌డీలను విడగొట్టడమన్న మాట. దీనివల్ల ప్రతి ఏడూ కొంత మొత్తం చేతికొస్తుంది.
- ఇక్కడ గమనించాల్సిందేంటంటే పిల్లల చదువు గురించి మనకు ముందే తెలుసు. మరి ముందే ప్రణాళిక వేసుకోవాలి కదా? లేకపోతే చివరిక్షణంలో అప్పులపైనే ఆధారపడాల్సి వస్తుంది. ఆ ఒత్తిడి తట్టుకోవటం అంత ఈజీ కాదు.
- ఇంకో ముఖ్య విషయమేంటంటే దీర్ఘకాలం సిప్ చేస్తే కనక నెలవారీ మొత్తం చాలా తక్కువే సరిపోతుంది. అందుకని ఎంత త్వరగా సిప్ మొదలుపెడితే అంత మంచిదన్న మాట. కేజీ నుంచే మొదలుపెడితే ఇంకా బెటర్.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో భారీగా ఇన్వెస్ట్ చేయండి

కార్పొరేట్లకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ: ఫుడ్ ప్రాసెసింగ్ రంగం వృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ కార్యదర్శి ఎ.పి. దాస్ జోషి తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రాసెసింగ్ స్థాయిని, ఎగుమతులను పెంచే దిశగా పెద్ద ఎత్తున ఇన్వెస్ట్ చేయాలంటూ కార్పొరేట్లకు ఆయన సూచించారు. పరిశఅరమల సమాఖ్య సీఐఐ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. 'మనం భారీగా ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్నప్పటికీ సుమారు 12 శాతం మాత్రమే ప్రాసెస్ అవుతోంది. ఈ విషయంలో అమెరికా, యూరోపియన్ యూనియన్‌లను అటుంచితే కనీసం ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్‌కి కూడా దగ్గర్లో లేము. దేశవ్యాప్తంగా 24 లక్షల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉండగా, వాటిలో రెండు శాతమే సంఘటిత రంగంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో విదేశీ పెట్టుబడులు, దేశీయంగా ప్రైవేట్ పెట్టుబడులు పెట్టేందుకు గణనీయంగా ఆస్కారం ఉంది. దీని వల్ల గ్రామీణ రైతాంగానికి కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది' అని జోషి చెప్పారు. 2014-15లో మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో 11 శాతంగా ఉన్న ప్రాసెస్డ్ ఫుడ్ వాటా ప్రస్తుతం 22 శాతానికి పెరిగిందని తెలిపారు. 2030 నాటికి ఇది 30-32 శాతానికి చేరవచ్చని, పరిశ్రమకు అపరిమిత వృద్ధి అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కొత్తగా అమల్లోకి వచ్చిన లేబర్ కోడ్‌లు, కార్మిక శక్తి ఎక్కువగా ఉండే ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాలకు ప్రయోజనకరంగా ఉంటాయని వివరించారు.

పసిడి ధర మరింత పెరుగుతుందా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

బంగారం ధర ఇప్పటికే బాగా పెరిగింది. ఇంకా పెరుగుతుందా? - శ్రావణి అద్దంకి

బంగారం ధరలు అదే పనిగా ర్యాలీ చేస్తుండం తప్పకుండా ఆకర్షిస్తుంది. అవును బంగారం ధరలు ఇటీవలి కాలంలో గణనీయమైన రాబడిని ఇచ్చాయి. కానీ, ఇంకెంత పెరుగుతుందన్నది సమాధానం లేని ప్రశ్నే అవుతుంది. ఏ అసెట్ క్లాస్‌కు అయినా ఇదే వర్తిస్తుంది. కనుక దీనికి బదులు మీ పెట్టుబడుల్లో బంగారాన్ని చేర్చుకోవడం వల్ల ఒనగూరే ప్రయోజనాలనే పరిగణనలోకి తీసుకోవాలి. అనిశ్చితుల్లో బంగారం మంచి పనితీరు చూపిస్తుంటుంది. ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల సమయంలో లేదా ఈక్విటీ మార్కెట్లు ఆటుపోట్లను ఎదుర్కొంటున్న తరుణంలో బంగారం ధరలు పెరుగుతుంటాయి. అలాంటి అనిశ్చితులన్నీ సర్దుకుని, ఆర్థిక వ్యవస్థలు మంచి పనితీరు చూపిస్తుంటే అప్పుడు బంగారం పనితీరు పరిమితం అవుతుంది. గత 15 ఏళ్లలో బంగారం ఏటా 10 శాతం రాబడిని అందించింది. వివిధ రంగాలు, పరిమాణంతో కూడిన కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసే ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఇదే కాలంలో ఏటా ఇచ్చిన రాబడి 12 శాతంగా ఉంది. రాబడిలో వ్యత్యాసం స్వల్పమే అయినప్పటికీ దీర్ఘకాలంలో కాంపౌండింగ్ కారణంగా చెప్పుకోతగ్గంత అదనపు నిధి సమకూరుతుంది. ఈక్విటీలు అన్నవి వ్యాపారాల్లో వాటాలను అందిస్తాయి. అవి సంపదకు వీలు కల్పిస్తాయి. బంగారం కేవలం నిల్వ ఉంచుకునే సాధనమే. కనుక ఇన్వెస్టర్లు తమ ప్రాధాన్యతలకు అనుగుణంగా మొత్తం పెట్టుబడుల్లో 10 శాతం వరకు బంగారానికి కేటాయించుకోవచ్చు.

నేను ప్రతి నెలా రూ.45,000 చొప్పున ఆర్నేళ్లపాటు పెట్టుబడి పెట్టాలని నిర్ణయించుకున్నాను. ఈ మొత్తాన్ని ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ లేదా డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో వేటిల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి? - దీపక్

పెట్టుబడిలో తక్కువ రిస్క్ కోరుకునే వారు 50 శాతాన్ని డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల పెట్టుబడికి రిస్క్ ఉండదు. మిగిలిన 50 శాతాన్ని వృద్ధి కోసం ఈక్విటీలకు కేటాయించుకోవాలి. డెట్ విషయంలో షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ లేదా టార్గెట్ మెచ్యూరిటీ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఈక్విటీల్లో లార్జ్‌క్యాప్ ఫండ్స్ లేదా లో కాస్ట్ ఇండెక్స్ ఫండ్స్ నుంచి ఎంపిక చేసుకోవాలి. ఒకవేళ అధిక రిస్క్ తీసుకునేట్టు అయితే.. ఈక్విటీలకు 65 శాతం నుంచి 80 శాతం, మిగిలిన మొత్తాన్ని డెట్ సాధనాలకు కేటాయించుకోవాలి.

లోరిస్క్ విదేశీ ఇన్వెస్టర్లకు సింగిల్ విండో

- దేశీ స్టాక్స్‌లో పెట్టుబడులకు వీలు
- తాజాగా నిబంధనలు సవరించిన సెబీ

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా లోరిస్క్ విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులకు సింగిల్ విండోను ప్రవేశపెట్టింది. తద్వారా దేశీ స్టాక్ మార్కెట్లో లావాదేవీలు చేపట్టేందుకు నిబంధనలను సరళతరం చేసింది. ఇందుకు సింగిల్ విండో ఆటోమేటిక్ అండ్ జనరలైజ్‌డ్ యాక్సెస్ ఫర్ ట్రస్టెడ్ ఫారిన్ ఇన్వెస్టర్స్(స్వాగత్-ఎఫ్ఐ)పేరుతో తాజా మార్గదర్శకాలను జారీ చేసింది. తద్వారా విదేశీ పెట్టుబడులను మరింతగా ఆకట్టుకునేందుకు వీలు చిక్కనుంది. దీంతో వివిధ పెట్టుబడి మార్గాలను ఏకీకృతం చేయడంతోపాటు.. ఆయా సంస్థలు నిబంధనలు పాటించడంలో మరింత సరళతర విధానాలకు తెరతీసింది. లోరిస్క్ విదేశీ ఇన్వెస్టర్ల జాబితాలో ప్రభుత్వ ఫండ్స్, కేంద్ర బ్యాంకులు, సావరిన్ వెల్త్ ఫండ్స్, మల్టీలేటరల్ సంస్థలు, అత్యధిక నియంత్రణలు కలిగిన పబ్లిక్ రిటైల్ ఫండ్స్, తగిన నియంత్రణలున్న బీమా కంపెనీలు, పెన్షన్ ఫండ్స్‌ను సెబీ చేర్చింది. విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు), విదేశీ వెంచర్ క్యాపిటల్ ఇన్వెస్టర్ల(ఎఫ్‌వీసీఐలు)కు విడిగా రెండు నోటిఫికేషన్లను స్వాగత్-ఎఫ్ఐ మార్గదర్శకాలకు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా సెబీ నిబంధనలను సవరించింది. వెరసి 2026 జూన్1 నుంచి ఇవి అమలు కానున్నాయి. ఈ ప్రతిపాదనలకు సెబీ బోర్డు సెప్టెంబర్‌లో ఆమోదముద్ర వేసింది.

అక్విజిషన్ డేటు V/S రిజిస్ట్రేషన్ డేటు

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ఎన్నో స్థిరాస్తుల క్రయవిక్రయాల్లో ఇదొక సమస్య. ఈ విషయంలో ఎన్నో వివాదాస్పదమైన చర్చలు, సంభాషణలు జరిగాయి. స్థిరాస్తి క్రయవిక్రయాల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కంపల్సరీ. చట్టరీత్యా చెయ్యాలి. అలా చేసిన తర్వాతే కొనుక్కునే వారికి హక్కు ఏర్పడుతుంది. అందుకని రిజిస్ట్రేషన్ డేటునే ప్రాతిపదికగా తీసుకుంటారు.

- రిజిస్ట్రేషన్ తేదీ నాడే హక్కు సంక్రమిస్తుంది.
- హోల్డింగ్ పీరియడ్.. అంటే ఆ సదరు ఆస్తి ఎన్నాళ్ల నుంచి ఆ వ్యక్తి వద్ద ఉంది అనేది. కొన్న తేదీ అలాగే అమ్మిన తేదీ .. ఈ రెండూ కూడా ఒప్పందం/అగ్రిమెంట్/డీడ్ ప్రకారం రిజిస్ట్రేషన్ తేదీలే. ఈ మధ్య వ్యవధిని హోల్డింగ్ పీరియడ్ అంటారు. ఇక కొనుగోలు తేదీ నుంచి అమ్మకపు తేదీల మధ్య వ్యవధి .. దీన్ని నిర్ణయించడానికి రిజిస్ట్రేషన్ తేదీనే ప్రాతిపదికగా తీసుకుంటారు.
- ఈ హోల్డింగ్ పీరియడ్.. స్థిరాస్తి క్రయ, విక్రయాల్లో 2 సంవత్సరాలు దాటితే దీర్ఘకాలికం. రెండు సంవత్సరాల కన్నా తక్కువ ఉంటే స్వల్పకాలికం అంటారు.
- దీర్ఘకాలికం అయితే ఒక రకమైన పన్ను రేటు ఉంటుంది. (రెసిడెంటుకి 20 శాతం, నాన్ రెసిడెంటుకి 12.5 శాతం)
- స్వల్పకాలికం అయితే, ఇతర ఆదాయాలతో కలిసి శ్లాబుల ప్రకారం రేట్లు విధిస్తారు.
- హోల్డింగ్ పీరియడ్ కాకుండా కాస్ట్ ఆఫ్ ఇండెక్సింగ్ లెక్కించడానికి అక్విజిషన్ డేటును ప్రాతిపదికగా తీసుకుంటారు.

ఈ మేరకు ఎన్నో ట్రిబ్యునల్స్, కోర్టులు కూడా రూలింగ్ ఇచ్చాయి. వీటి సారాంశం ఏమిటంటే .. కొన్న వ్యక్తి మొత్తం ప్రతిఫలం చెల్లించి, ఆ ఆస్తిని తీసుకుని అనుభవిస్తున్నారు. అనుభవించడం అంటే తాను ఆ ఇంట్లో ఉండటం గానీ లేదా అద్దెకి ఇచ్చి.. ఆ అద్దెని ఇన్‌కం ట్యాక్స్ లెక్కల్లో చూపించినట్లయితే గానీ అని అర్థం. అయితే, ఏదో ఒక కారణం వల్ల రిజిస్ట్రేషన్ జరగలేదు. రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో పడింది. అలాంటప్పుడు అలాట్‌మెంట్‌నే పరిగనలోకి తీసుకుంటారు.

- సుప్రీం కోర్టు: సీఐటీ వర్సెస్ ఘన్‌శ్యామ్ 2009
- రాజస్తాన్ హైకోర్టు: సీఐటీ వర్సెస్ రుక్మిణీ దేవి 2010.

పైన చెప్పిన కేసుల్లో ఈ విషయాన్ని నిర్ధారించారు. వీటి సారాంశం ఏమిటంటే ఏ తేదీన అయితే స్వాధీనపర్చుకున్నారో, అంటే డేట్ ఆఫ్ అక్విజిషన్, ఆ తేదీనే రిజిస్ట్రేషన్ తేదీగా పరిగణిస్తారు. కాబట్టి డేట్ ఆఫ్ అక్విజిషన్ ముఖ్యం.

ఇక అలాట్‌మెంట్ డేట్ వేరు. ముఖ్యంగా సొసైటీల్లో, డెవలప్‌మెంట్ అథారిటీపరంగా ఎన్నెన్నో సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. ఫలితంగా అలాట్‌మెంట్ జరుగుతుంది.. అక్విజిషన్ కూడా జరుగుతుంది.. కానీ న్యాయపరమైన చిక్కులు, కోర్టు లిటిగేషన్స్ వల్ల చట్టపరంగా జరగాల్సిన రిజిస్ట్రేషన్ సంవత్సరాల తరబడి వాయిదా అవుతుంది. బేరసారాలు జరిగి, అగ్రిమెంటు ప్రకారం ప్రతిఫలం ఇచ్చి అక్వైర్ (acquire) చేసుకున్నా, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోతుంది. పెండింగ్ పడిపోతుంది. ఇదొక సాంకేతిక సమస్య తప్ప న్యాయపరమైనది లేదా హక్కులపరమైన సమస్య కాదు.

అందుకని హోల్డింగ్ పీరియడ్‌కి, కాస్ట్ ఆఫ్ ఇండెక్సింగ్‌కి డేట్ ఆఫ్ అక్విజిషన్‌నే ప్రాతిపదికగా తీసుకుంటారు. క్రయవిక్రయాలు చేసే ముందు, లింక్ డాక్యుమెంట్లు, దస్తావేజులను క్షుణ్నంగా చదవాలి. అప్పుడే ముందడుగు వేయాలి. మరొక జాగ్రత్త. సేల్ డీడ్‌లో మార్కెట్ విలువను ప్రస్తావిస్తారు. ప్రతిఫలం కన్నా మార్కెట్ విలువ ఎక్కువ ఉంటే, మార్కెట్ విలువనే అమ్మకపు విలువగా తీసుకుంటారు. తగిన జాగ్రత్త వహించండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

తక్కువ అస్థిరతలు - మెరుగైన రాబడి

ఐసీఐసీఐ లార్జ్‌క్యాప్ ఫండ్

ప్రతీ ఇన్వెస్టర్ పోర్ట్‌ఫోలియోలో లార్జ్‌క్యాప్ ఫండ్స్ తప్పకుండా ఉండాలి. కొత్త ఇన్వెస్టర్లలో చాలా మంది మెరుగైన రాబడుల కోసం చిన్న, మధ్య స్థాయి కంపెనీల్లో పెట్టుబడులు పెట్టే పథకాల వైపు మొగ్గు చూపిస్తుంటారు. 10-20 ఏళ్లు అంతకుమించిన దీర్ఘకాల లక్ష్యాల కోసం పెట్టుబడులు పెట్టే వారు స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌కు సైతం కొంత కేటాయించుకోవచ్చు. కానీ, ఇక్కడ రాబడి ఒక్కటే కాకుండా, పెట్టుబడులకు రిస్కును తగ్గించే విధంగా పోర్ట్‌ఫోలియో నిర్మాణం ఉండాలి. అందుకని ఇన్వెస్టర్లు తమ మధ్య, దీర్ఘకాల పెట్టుబడుల్లో అధిక భాగం లార్జ్‌క్యాప్ ఫండ్స్‌కు కేటాయించుకోవాలన్నది నిపుణుల సూచన. ఈ విభాగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లార్జ్ క్యాప్ ఫండ్ మంచి రాబడితో ఇన్వెస్టర్లను ఆకర్షిస్తోంది.

రాబడులు

2008 మేలో ఈ పథకం ప్రారంభమైంది. నాడు రూ.లక్షను ఈ పథకంలో లంప్‌సమ్‌గా ఇన్వెస్ట్ చేసి ఉంటే, ఆ మొత్తం ఇప్పటికి రూ.11 లక్షలుగా మారేది. అంటే ఏటా 15 శాతం కాంపౌండెడ్ రాబడిని తెచ్చిపెట్టింది. ఇంతే మొత్తాన్ని తీసుకెళ్లి నిఫ్టీ 100 టీఆర్ఐలో ఇన్వెస్ట్ చేసి ఉంటే, అది రూ.6.89 లక్షలే అయి ఉండేది. వివిధ కాలాల్లో బెంచ్‌మార్క్ సూచీలకు మించి ఈ పథకం మెరుగైన పనితీరు చూపిస్తున్నట్టు గణాంకాలు పరిశీలిస్తే తెలుస్తుంది. ఈ పథకం మూడేళ్లలో ఏటా 17.8 శాతం, ఐదేళ్లలో ఏటా 22.1 శాతం రాబడిని అందించింది. ఈ కాలంలో బెంచ్ మార్క్ కంటే 3 శాతానికి పైగా అధిక రాబడి ఈ పథకంలో నమోదైంది. ఏడేళ్లలో 17 శాతం, పదేళ్లలో 15 శాతానికి పైనే వార్షిక రాబడి నమోదైంది. 2008, 2013, 2020 మార్కెట్ పతనాలను ఈ పథకం సమర్థవంతంగా ఎదుర్కొన్నది. ప్రతి దశలోనూ అస్థిరతలను తక్కువకు పరిమితం చేయడం, ఆ తర్వాతి కాలంలో మెరుగైన రాబడులు ఇచ్చినట్టు తెలుస్తోంది. లార్జ్‌క్యాప్‌లో పెట్టుబడులు తక్కువ అస్థిరతలతో, దీర్ఘకాలంలో మెరుగైన రాబడినిచ్చే విధంగా ఉంటాయన్న విషయాన్ని ఇన్వెస్టర్లు పరిగణనలోకి తీసుకోవాలి.

పెట్టుబడుల విధానం

లార్జ్‌క్యాప్ ఫండ్ కావడంతో మార్కెట్ విలువ పరంగా అగ్రగామి 100 కంపెనీల్లో ప్రధానంగా పెట్టుబడులు పెడుతుంది. పరిస్థితులకు అనుగుణంగా మిడ్‌క్యాప్ కంపెనీలకు స్వల్ప మొత్తం కేటాయిస్తుంటుంది. బోటమ్ అప్ విధానంలో స్టాక్స్‌ను ఎంపిక చేస్తుంది. ఏదో ఒక రంగానికి ఎక్కువ పెట్టుబడులు కేటాయించే విధానానికి దూరంగా ఉంటుంది. విడిగా ఆయా రంగాల్లో మెరుగైన భవిష్యత్తున్న కంపెనీలను ఎంపిక చేస్తుంది. లాభదాయకతతోపాటు, ఆయా విభాగంలో మార్కెట్ అగ్రగామి అయి ఉండి, ఇక్కడి నుంచి పెట్టుబడిని వృద్ధి చేసే కంపెనీలకే పోర్ట్‌ఫోలియో చోటు ఉంటుందని ఈ ఫండ్ మేనేజర్ అయిన అనీష్ తవాక్లే చెబుతున్నారు.

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.75,863 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఈ పథకం పట్ల ఇన్వెస్టర్లలో ఉన్న నమ్మకానికి ఈ స్థాయి ఆస్తులే నిదర్శనం. ఇందులో 93.43 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, డెట్ సాధనాలకు 1.37 శాతం కేటాయించింది. మరో 5.2 శాతాన్ని నగదు రూపంలో కలిగి ఉంది. ఈక్విటీ పెట్టుబడుల్లో 97 శాతానికి పైనే లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. మిడ్‌క్యాప్ కంపెనీలకు 2.75 శాతం కేటాయించింది. పోర్ట్‌ఫోలియోలో 62 స్టాక్స్ ఉన్నాయి. పెట్టుబడుల్లో అత్యధికంగా 28.86 శాతం బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత ఇంధన రంగ కంపెనీలకు 14 శాతం, టెక్నాలజీ కంపెనీలకు 11 శాతం, ఇండస్ట్రియల్స్, కన్జ్యూమర్ డిస్క్రీషినరీ కంపెనీలకు 11 శాతం చొప్పున పెట్టుబడులను కేటాయించింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	9.84
ఐసీఐసీఐ బ్యాంక్	8.13
రిలయన్స్ ఇండస్ట్రీస్	6.79
ఎల్అండ్‌టీ	6.75
భారతీ ఎయిర్‌టెల్	4.59
మారుతి సుజుకీ	4.24
యాక్సిస్ బ్యాంక్	4.19
ఇన్ఫోసిస్	3.53
అల్ట్రాటెక్ సిమెంట్	3.36
సన్‌ఫార్మా	2.62
ఎన్‌టీపీసీ	2.40

18 వరకు పదో తరగతి పరీక్ష ఫీజుకు గడువు

సాక్షి, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల (ఎస్ఎస్‌సీ–2026) ఫీజు చెల్లింపునకు పాఠశాల విద్యాశాఖ గడువు పొడిగించింది. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆలస్య రుసుంతో ఈనెల 15వ తేదీ వరకు అవకాశం ఇవ్వగా, తాజాగా ఈనెల 18 వరకు పెంచారు. ఆలస్య రుసుం లేకుండా ఈనెల 9వ తేదీ వరకు, రూ.50 ఆలస్య రుసుంతో 12వ తేదీ, రూ.200 ఫైన్‌తో ఈనెల 15, రూ.500 ఆలస్య రుసుంతో 18వ తేదీ వరకు అవకాశం కల్పించినట్టు ఎస్ఎస్‌సీ పరీక్షల డైరెక్టర్ కేవీ శ్రీనివాసులరెడ్డి వెల్లడించారు.

వచ్చే ఏడాది రాయ్‌పూర్–విశాఖ కారిడార్ పూర్తి

సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే ఏడాది రాయ్‌పూర్–విశాఖపట్నం కారిడార్ నిర్మాణం పూర్తవుతుందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీని కలుపుతూ 6 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇది ప్రధానంగా ఇంధన ఆదాతోపాటు ప్రజలకు, సరుకు రవాణాదారులకు రవాణా ఖర్చులను తగ్గిస్తుందని కేంద్రం ఆదివారం తెలిపింది. రూ.16,482 కోట్లతో ఈ కారిడార్‌ను నిర్మిస్తున్నారు. ఇది ప్రస్తుత 26వ నంబర్ జాతీయ రహదారితో అనుసంధానం ద్వారా ప్రయాణ దూరాన్ని 597 కిలోమీటర్ల నుంచి 465 కిలోమీటర్లకు తగ్గించనుంది. దీని ద్వారా 132 కి.మీ.ల దూరం, 7 గంటల ప్రయాణ సమయం ఆదా అవుతుంది. ప్రస్తుతం 12 గంటలుగా ఉన్న ప్రయాణ సమయం ఈ కారిడార్ ద్వారా 5 గంటలకు తగ్గనుంది. ఈ కారిడార్ 2026–27 డిసెంబర్ నాటికి అందుబాటులోకి వస్తుందని కేంద్రం పేర్కొంది.

అద్భుతం ఆవిష్కృతం

కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన పురోహితుడు పెద్దింటి రామచంద్ర శ్రీహరి (రామం) ఇంట శనివారం రాత్రి ఒకే మొక్క నుంచి ఏకంగా 100 బ్రహ్మ కమలాలు విరబూశాయి. సాధారణంగా ఒక మొక్కకు ఒక రోజులో 10 నుంచి 15 వరకు పువ్వులు పూస్తాయి. అటువంటిది ఇన్ని పూయడం దైవ సంకల్పంగా భావించి ఆ మొక్కకు రామం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, బ్రహ్మకమలం ఉత్తరాఖండ్ రాష్ట్రీయ పుష్పం. దీనిని కింగ్ ఆఫ్ హిమాలయన్ ఫ్లవర్, పార్వతీ పుష్ప అని కూడా పిలుస్తారు. ఇంట్లో ఈ పువ్వు పూస్తే శ్రీమహాలక్ష్మి కటాక్షం లభిస్తుందని విశ్వాసం. - కొత్తపేట

వీడని మంచుతెరలు!

అల్లూరి జిల్లా జి.మాడుగులలో ఆదివారం 5.3 డిగ్రీలు, ముంచంగిపుట్టులో 7.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంచు దట్టంగా కురుస్తుండటంతో చలిగాలుల తీవ్రత కొనసాగుతోంది. ఉదయం 9 గంటల వరకు మంచుతెరలు వీడకపోవడంతో సూర్యోదయం ఆలస్యమవుతోంది. - చింతపల్లి

ఆన్‌లైన్ అమ్మకాల్లో భారత్ దూకుడు

పండుగ అమ్మకాల్లో అమెరికాను అధిగమించిన వైనం

సాక్షి, అమరావతి: ఆన్‌లైన్ అమ్మకాల్లో భారత్ దూసుకుపోతోంది. టెక్నాలజీ వినియోగంలో ముందుండే అమెరికాను దాటేసి భారతీయులు ఆన్‌లైన్‌లో వారికి నచ్చిన వస్తువులను కొనేస్తున్నారు. మన దేశంలో అత్యధికంగా అమ్మకాలు జరిగే దసరా–దీపావళి పండుగ సమయంలో జరిగిన అమ్మకాలు.. అమెరికాలో క్రిస్మస్ ముందు జరిగే బ్లాక్ ఫ్రైడే అమ్మకాలను మించిపోయాయని ఎస్‌బీఐ రీసెర్చ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఈ సంవత్సరం పండుగల సీజన్‌లో రూ.1.24 లక్షల కోట్ల విలువైన అమ్మకాలు జరిగినట్లు ఎస్‌బీఐ అంచనా వేసింది. ఇది గతేడాది జరిగిన అమ్మకాలు రూ.94,800 కంటే ఎక్కువ. పండుగల సీజన్‌కు ముందు కేంద్రప్రభుత్వం జీఎస్టీ రేట్లను సంస్కరించడం ఈ ఏడాది అమ్మకాలు పెరగడానికి ప్రధాన కారణంగా పేర్కొంది. ఇదే సమయంలో అమెరికాలో ఈ ఏడాది బ్లాక్ ఫ్రైడే అమ్మకాలు రూ.1,02,960 కోట్లు ఉంటాయని అంచనా వేసింది. 2024లో ఈ బ్లాక్ ఫ్రైడే అమ్మకాలు రూ.95,040 కోట్లుగా నమోదయ్యాయి. అంటే భారత్‌లో ఈ ఏడాది పండుగ అమ్మకాల్లో 31 శాతం నమోదయితే అమెరికాలో మాత్రం ఈ వృద్ధి 8.3 శాతానికి పరిమితమవుతుందని ఎస్‌బీఐ అంచనా వేసింది. అమెరికా ఆర్థికవ్యవస్థ అంతంతమాత్రంగానే ఉండటంతో ఈ ఏడాది అమ్మకాల్లో అంత వృద్ధి నమోదు కాకపోవచ్చని పేర్కొంది.

ఎక్కువ ఎలక్ట్రానిక్ వస్తువులే

దేశీయ ఆన్‌లైన్ అమ్మకాల్లో అత్యధికభాగం ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లయిన్సెస్ వస్తువులే అత్యధికంగా ఉంటున్నాయి. మొత్తం అమ్మకాల్లో 43 శాతం (సుమారు రూ.53 వేలకోట్లు) ఈ రెండు రంగాల్లోనే జరుగుతున్నాయి. ఆ తర్వాత అత్యధికంగా మొబైల్ ఫోన్లు (26 శాతం) కొనుగోలు చేస్తున్నారు. తర్వాతి స్థానాల్లో లైఫ్‌స్టైల్ ఉత్పత్తులు (22 శాతం), సౌందర్యసాధనాలు (21 శాతం) ఉన్నాయి. ఈ సారి ఖరీదైన వస్తువులను మెట్రో వాసులే కాకుండా నాన్ మెట్రో వాసులు కూడా అత్యధికంగా కొనుగోలు చేసినట్లు ఎస్‌బీఐ తెలిపింది.

జయచంద్రారెడ్డిని ఎందుకు అరెస్టుచేయలేదు?

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్

సాక్షి, అమరావతి : నకిలీ మద్యం తయారీలో పాత్రధారులు, సూత్రధారులంతా అధికార పార్టీ నేతలేనని, టీడీపీ తంబళ్లపల్లె ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలోనే నకిలీ మద్యం తయారవుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ ఆరోపించారు. ఈ విషయంలో జయచంద్రారెడ్డికి అద్దేపల్లి జనార్ధనరావు కీలక భాగస్వామి అని, వీళ్లిద్దరూ నెల్లూరు వాకాడు ఇంజనీరింగ్ కాలేజీలో సహచరులని, అయినా చంద్రబాబు ప్రభుత్వం జయచంద్రారెడ్డిని ఎందుకు అరెస్టుచేయలేదని ప్రశ్నించారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాబు అక్రమ కేసులకు భయపడేదిలేదని, రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగానే వైఎస్సార్‌సీపీ నేతల అరెస్టులు జరుగుతున్నాయని, ఇందుకు బాధ్యులైన అధికారులకూ చట్టపరంగా శిక్ష ఖాయమని హెచ్చరించారు. 'నాణ్యమైన మద్యం అందిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు.. నకిలీ మద్యం పాలసీ తీసుకొచ్చారు. ఈ మద్యం తయారీ, సరఫరా.. విక్రయించేది అంతా టీడీపీ బ్యాచే. ఈ క్రమంలోనే తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ములకలచెరువులో ఏర్పాటు చేసిన నకిలీ మద్యం తయారీ యూనిట్ గుట్టురట్టయ్యింది. ఎన్‌సీబీఎన్ అనేది ఒక బ్రాండ్ అని బాబు చెప్పుకుంటారు. కానీ, ఎన్‌సీబీయన్ అంటే నారా చీప్ బాటిల్ నెట్‌వర్క్. దీని ద్వారా నకిలీ మద్యం తయారుచేసి వాటికి నకిలీ లేబుళ్లు వేసి పల్లెల్లో బెల్ట్ షాపులు, పట్టణాల్లో పర్మిట్ రూమ్‌ల ద్వారా విచ్చలవిడిగా తాగిస్తున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వైఎస్సార్‌సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మాజీమంత్రి జోగి రమేష్ అక్కడ జరుగుతున్న అక్రమ దందాను గుట్టురట్టు చేసే క్రమంలో 27,800 నకిలీ మద్యం బాటిళ్లు దొరికాయి. దీంతో జోగి రమేష్‌ను ఈ కేసులో ఇరికిస్తే.. బాబు, లోకేశ్‌ల పేర్లు బయటకు రావని అక్టోబరు 30న జనార్ధనరావుతో మరో స్టేట్మెంట్ ఇప్పించారు' అని దుయ్యబట్టారు.

అప్పన్నను దర్శించుకున్న విరాట్ కోహ్లి, సుందర్

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని భారత క్రికెటర్లు విరాట్‌కోహ్లి, వాషింగ్టన్ సుందర్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో వీరి పేరిట అర్చకులు స్వామికి పూజ చేసి, వేద ఆశీర్వచనం అందజేశారు. డిప్యూటీ ఈవో రాధ, ఏఈవో తిరుమలేశ్వరరావు స్వామివారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాలను అందజేశారు. - సింహాచలం (విశాఖ)

గోదావరి మధ్యలో నిలిచిన పంటు

సఖినేటిపల్లి: గోదావరి నదిలో ఓ పంటుకు త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి, పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం మధ్య వశిష్ట గోదావరి నదిపై పంటు మీద ప్రతి రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం నర్సాపురం నుంచి సఖినేటిపల్లి వైపు సుమారు 80 మంది ప్రయాణికులు, 20 వాహనాలతో పంటు బయలుదేరింది. నది మధ్యలోకి చేరిన తరువాత ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో పంటు నది మధ్యలోనే నిలిచిపోయింది. దీనికి తోడు సముద్ర ఆటుపోట్ల కారణంగా గోదావరిలోకి బలంగా వస్తున్న కెరటాల ధాటికి పంటు వేగంగా సయ్యాటలాడుతూ దిశ మారింది. అందులో పిల్లలతో ఉన్న ప్రయాణికులు అరగంట పాటు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. పంటుకు తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు నిర్వాహకులు విఫలయత్నం చేశారు. కొద్దిసేపటికి అదే రేవు నుంచి ప్రయాణికులతో వస్తున్న మరో పంటుకు తాడు కట్టి, మొరాయించిన పంటును సఖినేటిపల్లి వైపు గోదావరి ఒడ్డుకు చేర్చారు. దీంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తున్న రేవులో పంటు సామర్థ్యం, నిర్వహణలో అధికారులు, నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అయ్యో పాపం!

వలస కూలీ దంపతుల ఆత్మహత్య
పుట్టిన వారానికే అనాథైన శిశువు

శ్రీనివాసపురం: పుట్టిన వారానికే పసిగుడ్డు అనాథ అయిన హృదయవిదారక ఘటన కర్ణాటకలోని కోలారు జిల్లా ఉప్పరపల్లిలో ఆదివారం జరిగింది. అస్సాం నుంచి కూలీ పనుల కోసం వలస వచ్చిన ఫరీజా(22), రెహమాన్(28) స్థానికంగా శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తికి చెందిన కోళ్ల ఫారంలో 15 రోజుల కిందట చేరారు. వారం క్రితం ఫరీజా ఆడశిశువుకు జన్మనిచ్చింది. ఆదివారం ఉదయం శిశువు గట్టిగా ఏడుస్తుండడం గమనించిన స్థానికులు వెళ్లి చూడగా.. ఇంట్లో భార్యాభర్తలు శవాలై పడి ఉన్నారు. పక్కనే పురుగుల మందు సీసా ఉండటంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి మృతదేహాలను పోస్టుమార్టం కోసం శ్రీనివాసపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

వెరీ గుడ్డు

రూ.6.50 పలుకుతున్న గుడ్డు ధర

చలి తీవ్రత పెరిగితే రూ.7 దాటే చాన్స్

మరో 3 నెలలు ఇలాగే ఉంటే నష్టాల నుంచి గట్టెక్కుతామంటున్న రైతులు

పెరవలి: కాలం కలిసి వచ్చి, ప్రస్తుతం కోడి గుడ్డు ధరలు పెరగటంతో రైతులు నాలుగు డబ్బులు కళ్లజూస్తున్నారు. ఏడాది కాలంగా గిట్టుబాటు ధర లేక నష్టపోయిన వారికి.. ప్రస్తుతం లభిస్తున్న ధరలు ఊరటనిస్తున్నాయి. గత ఏడాది సరిగ్గా ఇదే సమయంలో బర్డ్ ఫ్లూ వ్యాప్తితో లక్షలాదిగా కోళ్లు చనిపోయాయి. దీని ప్రభావంతో ఏడాది కాలంగా కోడి మాంసంతో పాటు గుడ్లు తినడానికి మాంసాహార ప్రియులు భయపడ్డారు. ఫలితంగా కొనుగోళ్లు పడిపోయి, కోళ్ల రైతులు ఆర్థికంగా దెబ్బ తిన్నారు. అనేక కోళ్ల ఫామ్‌లు మూతపడిన పరిస్థితులు నెలకొన్నాయి. దీనికితోడు మేత, పిల్ల ధరలు కూడా గణనీయంగా పెరగడంతో రైతులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సాధారణంగా వేసవి, కార్తిక మాసంలో గుడ్ల అమ్మకాలు తగ్గుముఖం పడతాయి. కానీ, ఈ ఏడాది కార్తిక మాసం ప్రారంభంలో రూ.5.44 ఉన్న గుడ్డు ధర రానురానూ పెరుగుతూ ప్రస్తుతం రూ.6.50కు చేరింది. ఒకవైపు కార్తిక మాసం ముగిసినా.. అక్కడక్కడ అయ్యప్ప దీక్షధారులు ఉండటంతో ప్రస్తుతానికి తూర్పు గోదావరి జిల్లాలో గుడ్ల వినియోగం అంతంత మాత్రంగానే ఉంది. అయితే, ఈపాటి వినియోగానికి సరిపడా ఉత్పత్తి కూడా లేకపోవడంతో ధరలు క్రమంగా పెరిగింది. డిసెంబర్ 15 తరువాత గుడ్లకు మరింత డిమాండ్ వస్తుందని, ధరలు మరింత పెరగవచ్చని రైతులు అంటున్నారు. చలి తీవ్రత పెరిగితే స్థానికంగాను, ఉత్తర భారతాన డిమాండ్ వచ్చి, గుడ్డు ధర రూ.7 కూడా దాటవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ధరలు ఇలాగే మరో మూడు నెలలు కొనసాగితే ఏడాదిగా జరిగిన నష్టాలను కొంత వరకూ పూడ్చుకోవచ్చని ఆశ పడుతున్నారు.

1.40 కోట్ల గుడ్ల ఉత్పత్తి

గత ఏడాది ఇవే రోజుల్లో జిల్లావ్యాప్తంగా 245 షెడ్లలో 1.60 కోట్ల కోళ్లను రైతులు పెంచేవారు. అయితే, ఆ సమయంలో బర్డ్‌ఫ్లూ సోకడంతో లక్షలాది కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఆ తరువాత కోళ్లు, గుడ్ల వినియోగం పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొంతమంది కోళ్ల షెడ్లను ఖాళీగా వదిలేశారు. ఇప్పటికీ కొన్ని షెడ్లు ఖాళీగానే ఉన్నాయి. అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 165 షెడ్లలో కోటి కోళ్లను పెంచుతున్నారు. వీటిల్లో ఒక్కో షెడ్డులో సుమారు 50 వేల నుంచి 5 లక్షల వరకూ కోళ్లను పెంచుతుంటారు. వీటితో పాటు 5 వేల నుంచి 40 వేల సామర్థ్యం కలిగిన పలు కోళ్లఫామ్‌లలో కోళ్ల సాగు జరుగుతోంది. ఒక్క అనపర్తి నియోజకవర్గంలోనే 70 లక్షలు, నిడదవోలు నియోజకవర్గంలో 50 లక్షలు, నల్లజర్ల, గోపాలపురం, కొవ్వూరు, రాజమండ్రి రూరల్ నియోజకవర్గాల్లో మరో 30 లక్షల కోళ్ల వరకూ పెంచుతున్నారు. ఈ ఫామ్‌ల నుంచి రోజుకు 1.60 కోట్ల గుడ్ల ఉత్పత్తి జరగాల్సి ఉంది. అయితే, ప్రస్తుతం చలికాలం కావడంతో 1.40 కోట్ల గుడ్ల దిగుబడి మాత్రమే వస్తోంది. జిల్లాలో గుడ్ల వినియోగం సాధారణంగా 40 లక్షల వరకూ ఉంటుంది. ప్రస్తుతం 25 లక్షల నుంచి 30 లక్షల వరకూ మాత్రమే గుడ్లు స్థానికంగా వినియోగమవుతున్నట్లు పౌల్ట్రీ ప్రతినిధులు చెబుతున్నారు.

పిట్టల వేమవరంలో కోళ్ల ఫామ్

30 లారీలతో ఎగుమతులు

తూర్పు గోదావరి జిల్లా నుంచి నిత్యం 30 లారీల్లో ఒడిశా, పశ్చిమ బెంగాల్, బీహార్, మధ్యప్రదేశ్‌తో పాటు అసోం తదితర ఈశాన్య రాష్ట్రాలకు కోడి గుడ్లు ఎగుమతి అవుతున్నాయి. అక్కడ చలి తీవ్ర మరింత పెరిగితే ఎగుమతులు రోజుకు 60 లారీల పైనే ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ఆ సమయంలో పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా గుడ్ల ధర కూడా అమాంతం పెరుగుతుందని అంటున్నారు.

ఇలాగే కొనసాగితే..

కోళ్ల ఫామ్‌లతో ఇప్పటి వరకూ నష్టాల బాట పట్టాం. ప్రస్తుతం గుడ్డు ధర పెరగటంతో గత నష్టాలను పూడ్చుకునే పనిలో ఉన్నాం. ధర ఇలాగే కొనసాగితే గత నష్టాల నుంచి బయట పడతాం.

– భూపతిరాజు వరాహ నరసింహరాజు, ఖండవల్లి, పెరవలి మండలం, తూర్పు గోదావరి జిల్లా

ఆర్థికంగా కోలుకుంటాం

గత 15 ఏళ్లుగా కోళ్ల ఫామ్ నిర్వహిస్తున్నాను. ఏడాది కాలంగా ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొని ఆర్థికంగా నలిగిపోయాం. ప్రస్తుతం గుడ్డు ధర రూ.6.50 పలుకుతోంది. ఈ ధరలు మరో 3 నెలలుంటే గత నష్టాల నుంచి బయట పడి, ఆర్థికంగా కోలుకుంటాం.

– మండా తాతారెడ్డి, కోళ్ల రైతు, పిట్టల వేమవరం, పెరవలి మండలం, తూర్పు గోదావరి జిల్లా

క్లుప్తంగా...

రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

సాక్షిఅమరావతి: బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు అసోసియేషన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర అధ్యక్షుడిగా భూపతి రామారావు, ప్రధాన కార్యదర్శిగా చిట్టేటి రమేష్ ఎన్నికయ్యారని చెప్పింది. సంఘం వ్యవస్థాపకుడు నూకలపాటి రమణయ్య ఎన్నికల అధికారిగా, జాతీయ ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు పరిశీలకునిగా వ్యవహరించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు పేర్కొంది. సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా కె.మోహనరావు, అసోసియేట్ అధ్యక్షులుగా పర్రె వెంకటరావు, పల్లం వేణుగోపాల్, బి.మనోజ్ కుమార్, ట్రెజరర్‌గా ఎంఆర్ చక్రవర్తి, మహిళా విభాగం కార్యదర్శిగా వి.మేరీ స్టెల్లాతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్టు ప్రకటించింది.

స్పీడ్‌కు ఏపీ బ్రాండ్ అంబాసిడర్: మంత్రి లోకేశ్

సాక్షి, అమరావతి: 'ప్రతిపక్షంలో ఉండగా అండగా నిలిచిన ప్రవాసాంధ్రులను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం. విదేశాల్లో ఉన్న తెలుగువారికి ఏ కష్టం వచ్చినా ఏపీఎన్ఆర్టీ మీకు అండగా ఉంటుంది' అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అమెరికా డల్లాస్‌లోని కర్టిస్ కల్ వెల్‌సెంటర్‌లో నిర్వహించిన తెలుగు డయాస్పోరా సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ స్పీడ్‌కు ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ అంబాసిడర్‌గా మారిందని దేశంలో అనేక రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్‌లు ఉంటే.. ఒక్క ఏపీలోనే డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉందన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ తన పని తాను చేసుకుపోతుందని, చట్టాన్ని ఉల్లంఘించిన ఎవరినీ వదిలిపెట్టేది లేదన్నారు.

ఎంఎస్ఎంఈ టెక్నాలజీ, ఐపీఆర్‌పై వర్క్‌షాప్

సాక్షి, అమరావతి: జాతీయ పరిశోధన అభివృద్ధి సంస్థ (ఎన్ఆర్‌డీసీ), ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ(ఎంఎస్ఎంఈ) సంయుక్తంగా ఈనెల 9న మంగళగిరిలోని రతన్ టాటా ఇన్నోవేషన్‌హబ్ (ఆర్‌టీఐహెచ్)లో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ, ఇన్నోవేషన్, మేధోసంపత్తి హక్కుల (ఐపీఆర్)పై వర్క్‌షాప్ నిర్వహించనుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలోని ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లలో ఆవిష్కరణల సామర్థ్యం, సాంకేతిక స్వీకరణ, మేధో సంపత్తిపై అవగాహన పెంచే లక్ష్యంతో ఎంఎస్ఎంఈల పనితీరును పెంచడం, వేగవంతం చేయడం కోసం ర్యాంప్ కార్యక్రమం క్రింద ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వ్యవస్థాపకులు ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్లు భవ్య మంజీర, డాక్టర్ బి.కె.సాహును 99495 68527, 98101 04163 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పచ్చనేత పుట్టినరోజులో బొకేతో ప్రత్యక్షమైన సీఐ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఆయన ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యే కాదు...పోనీ ఎంపీపీ కాదు.. చివరికి గ్రామ సర్పంచ్ కూడా కాదు. అధికార పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న నాయకుడు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్ బాబు పుట్టిన రోజు వేడుకలు ఆదివారం యర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో అట్టహాసంగా జరిగాయి. నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య జరిగిన ఈ పుట్టిన రోజు వేడుకల్లో యర్రగొండపాలెం సీఐ అజయ్ కుమార్ బొకేతో ప్రత్యక్షం కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తన సర్కిల్ పరిధిలోని వైపాలెం ఎస్సై చౌడయ్య, దోర్నాల ఎస్సై మహేష్, పుల్లల చెరువు ఎస్సై సంపత్ కుమార్‌లతో పసుపు పచ్చరంగు బొకేతో రంగ ప్రవేశం చేసిన సీఐ అజయ్ కుమార్ టీడీపీ నాయకుడికి కేక్ కట్ చేసి తినిపించారు.

భూములు, స్థలాలు కొంటున్నారా..?

ఈ జాగ్రత్తలు పాటించాలి

అప్రూవల్ స్థలాలు కొనాలి...

- ఇటీవల అనప్రూవల్ వెంచర్లు చాలానే వెలుస్తునాయి. లే అవుట్ అప్రూవల్ స్థలాలను కొనుగోలు చేయాలి. లేదంటే అప్రూవల్ సమయంలో స్థలం విలువపై 14 శాతం చెల్లించాల్సి ఉంటుంది.
- ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఉచితంగా భూములు, ఇళ్ల స్థలాలు, ఇళ్లను ఇస్తుంది. అలాంటి వాటిని కొనుగోలు చేసినా మళ్లీ వారికే వెళతాయి. రిజిస్ట్రేషన్ చెల్లదు.
- పేదవారికి ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన స్థలాలు కొనకూడదు.

అనంతపురం అర్బన్: నగరం, నగర పరిధి విస్తరిస్తోంది.. జనాభాకనుగుణంగా భూములు, స్థలాల అవసరం ఏర్పడింది. భూములు, స్థలాల విలువ కూడా బాగా పెరిగిపోయింది. ఇదే అదునుగా చూసు కొని కొందరు అక్రమ మార్గంలో నడుస్తున్నారు. భూములు, స్థలాల హక్కుదారుల పేరిట నకిలీ డాక్యుమెంట్లు సృష్టిస్తున్నారు. మరోవైపు డబుల్ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. భూములు, స్థలాలు,ఇళ్లను కొనుగోలు చేసే క్రమంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి...అక్రమార్కుల మోసాన్ని ఎలా గుర్తించాలి..అనే అంశాలపై 'మీకోసం'లో 'సాక్షి' అంది స్తోంది.

అవసరమైన డాక్యుమెంట్లు ఏవంటే..

- యజమాని సేల్ డీడ్ ఒరిజినల్‌డాక్యుమెంట్‌పై స్టాంప్ చూడాలి. లింక్ డాక్యుమెంట్లు చూడాలి.
- అన్ని డాక్యుమెంట్లలో కొనేవారు, విక్రయించే వారు ఒక్కరే కాకపోతే.. అమ్మేవారి వంశవృక్షం సర్టిఫికెట్ తప్పనిసరిగా ఇప్పించుకోవాలి.
- డాక్యుమెంట్ మొదటి పేజీలో ఏదైనా కోర్టు సీల్, సంతకం ఉంటే ఆ ఆస్తి పైన కేసు ఉందని అర్థం చేసుకోవాలి.
- ఈసీ (ఎన్కంబర్స్‌మెంట్ సర్టిఫికెట్) మదర్ డీడీ సర్టిఫికెట్, రికార్డ్ ఆఫ్ రైట్స్, వ్యవసాయ భూమి అయితే టౌనాన్సీ అండ్ క్రాప్, సర్వే స్కెచ్ ఉండాలి.
- లే అవుట్ అప్రూవల్, ఖాతా ధ్రువపత్రం, డీసీ కన్వవర్షన్ సర్టిఫికెట్ (అగ్రికల్చర్ నుంచి నాన్ అగ్రికల్చర్ కన్వర్షన్), ఆస్తి పన్ను సర్టిఫికెట్.
- అపార్మెంట్‌మెంట్లు, ఇళ్లు అయితే ప్లాన్ అప్రూవల్ ఉండాలి. తక్కువ ఫ్లోర్లకు అప్రూవల్ తీసుకొని ఎక్కువ ఫ్లోర్లు నిర్మిస్తారు. అలాంటి ఫ్లాట్లు కొంటే భవిష్యత్తులో ఇబ్బంది వస్తుంది.

ఇలా జాగ్రత్తలు తీసుకోవాలి..

- స్థలం కొనేప్పుడు తప్పుడు వివరాలు ఇస్తారు. బేరం మాట్లాడేప్పుడు బ్రోకర్లు వచ్చి రెచ్చ గొట్టి ఎక్కువ ధరకు కొనే విధంగా చేస్తారు.
- ఆస్తి ఎవరి పేరున ఉందనేది తెలుసుకోవాలి. రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి ఈసీ (ఎన్కంబరెన్స్ సర్టిఫికెట్) తీసుకోవాలి.
- ఆస్తి కొనేముందు ఒరిజినల్ సేల్ డీడ్ (అసలైన డాక్యుమెంట్) లో ఉండే యజ మాని ఫొటోను గమనించాలి. అన్ని లింక్ డాక్యుమెంట్ల హిస్టరీ చూడాలి.
- సేల్ అగ్రిమెంట్ కనీసం మూడు నెలలు ఉండేలా చూసుకోవాలి. అగ్రిమెంట్ చేసుకునేప్పుడు డబ్బులు 5 నుంచి 10 శాతం కంటే ఎక్కువ ఇవ్వకండి.
- ధర మాట్లాడే అప్పుడు నిజమైన యజ మానితో మాట్లాడాలి. యజమానికి సంబంధించి గుర్తింపుకార్డు అడగాలి.
- కొనుగోలు చేయబోవు స్థలం డాక్యుమెంట్లు, చిరునామా నిజమైనదా? కాదా తెలుసుకోవాలి.
- క్షేత్రస్థాయిలో స్థలం కొలతలు, డాక్యుమెంట్‌లోని కొలతల్లో తేడాలు గుర్తించాలి.
- కొందరు ఆస్తిని వేరేవాళ్లకు విక్రయించి, మన వద్ద అగ్రిమెంట్ చేసుకుంటారు. అగ్రిమెంట్ సమయంలో, రిజిస్ట్రేషన్ ముందు రోజు ఈసీ తీసుకోవాలి.

పాఠశాల విద్యాశాఖ.. అత్యవసర శాఖనా?

- విద్యాశాఖకు యూటీఎఫ్ సూటి ప్రశ్న

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా ఉంటూ, మానసిక శాస్త్రం ప్రకారం నేర్చుకొనేవారికి, చదువు చెప్పే వారికి విశ్రాంతి అవసరమని, కానీ దానికి భిన్నంగా పాఠశాల విద్యాశాఖను అత్యవసర శాఖగా మార్చేశారని యూటీఎఫ్ ఆక్షేపించింది. ఉపాధ్యాయులను వేధిస్తూ మానసిక ఒత్తిడికి గురి చేస్తోందని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆదివారం విజయవాడలో జరిగిన యూటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేసినట్టు ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖను నాన్ వెకేషన్ శాఖగా మార్చమని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖ కమిషనర్‌కు గతంలో విన్నవిస్తే సాధ్యం కాదని సమాధానం ఇచ్చారని, స్వేచ్ఛాయుత వాతావరణంలో బోధించాల్సిన ఉపాధ్యాయులను రోజుకో స్కీం పేరుతో ఒత్తిడి చేస్తూ శని, ఆదివారాలు, పండుగ సెలవులలో పని చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. 10వ తరగతి బోధించే ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వకుండా ఇబ్బందికి గురి చేస్తున్నారని విమర్శించారు. 100% ఉత్తీర్ణత పేరుతో ప్రతిరోజు సాయంత్రం పరీక్ష నిర్వహించి మార్కులు అప్‌లోడ్ చేయాలని ఒత్తిడి చేయడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు.

గంజాయికి బానిసలు కాకుండా చర్యలు తీసుకోవాలి

విద్యార్థులు గంజాయికి బానిసలుగా మారి జీవితాలను బలిచేసుకుంటున్న ఘటనలపై యూటీఎఫ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గంజాయిని విక్రయించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు.

ఆమదాలవలస ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు

ఆమదాలవలస: మీడియా సమావేశాల్లో తనపై అనుచిత వాఖ్యలు చేసిన శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై విచారణ జరపాలని వైఎస్సార్ సీపీ ఆమదాలవలస సమన్వయ కర్త చింతాడ రవికుమార్ పోలీసులను కోరారు. ఆయన ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమదాలవలస పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూన రవి దయాదాక్షిణ్యాల మీద తనకు డిగ్రీ సర్టిఫికెట్లు వచ్చాయని చెబుతున్నారని, తనను ఉద్దేశించి 'నా చెప్పుతో సమానం' అని వ్యాఖ్యానించారని, వైఎస్సార్‌సీపీ క్యాడర్ బట్ట కట్టేవారు కాదు, తిండి తినేవారు కాదంటూ ఆగస్టు 18న మీడియా ముఖంగా అనుచితంగా మాట్లాడారని చింతాడ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై ఎస్ఐకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇలాంటి వ్యాఖ్యలకు, తాటాకు చప్పుళ్లకు బెదిరే ప్రసక్తే లేదన్నారు.

ముగిసిన వక్ఫ్ ఆస్తుల నమోదు

- ఉమీద్ పోర్టల్‌లో అప్‌లోడ్‌కు తీరిన గడువు
- దేశంలో 9 లక్షలకు పైగా వక్ఫ్ ఆస్తులు..
- వాటిలో 5,17,082 మాత్రమే పోర్టల్‌లో నమోదు
- అందులో ఆమోదం పొందినవి 2,16,937 మాత్రమే
- మిగిలినవి ఆమోదించడానికి మూడు నెలల గడువు
- సాంకేతిక కారణాల వల్ల ఇంకా అప్‌లోడ్ కానీ 4 లక్షల ఆస్తులు
- వాటి కోసం ట్రిబ్యునల్‌ను ఆశ్రయించేందుకు పలు రాష్ట్రాలు సన్నద్ధం

సాక్షి, అమరావతి: ఉమీద్ పోర్టల్‌లో వక్ఫ్ ఆస్తుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు శనివారం అర్ధరాత్రితో ముగిసింది. దేశంలో సుమారు 9 లక్షలకు పైగా వక్ఫ్ ఆస్తులు ఉన్నట్లు అంచనా వేయగా.. ఈ ఆరు నెలల గడువులో 5,17,082 వక్ఫ్ ఆస్తులనే ముతవల్లీలు, నిర్వాహకులు నమోదు చేశారు. వీటికి వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ పరిశీలన తర్వాత.. వక్ఫ్ బోర్డు సీఈవో ఆమోదం తెలిపే ప్రక్రియ సగమే పూర్తయ్యింది. దీంతో ఇప్పటి వరకు 2,16,937 ఆస్తులకు మాత్రమే తుది ఆమోదం లభించింది. ఇప్పటికే అప్‌లోడ్ పూర్తి చేసిన ఆస్తుల పరిశీలన.. ఆమోదానికి కేంద్ర ప్రభుత్వం మూడు నెలల వెసులుబాటు కల్పించింది. దీంతో వక్ఫ్ బోర్డుల ముతవల్లీలు, నిర్వాహకులు అప్‌లోడ్ చేసిన ఆస్తులను ఆమోదించేందుకు ఈ మూడు నెలల గడువు ఉపయోగపడనుంది.

ట్రిబ్యునల్‌పైనే ఆశలు..

ఉమీద్ పోర్టల్‌లో నమోదు గడువు ముగియడంతో.. దేశంలోని 4 లక్షలకు పైగా వక్ఫ్ ఆస్తుల నమోదు ప్రశ్నార్థకంగా మారింది. సాంకేతిక కారణాల వల్ల చాలా రాష్ట్రాల్లో ఆస్తుల నమోదు సరిగ్గా జరగలేదు. దీంతో వక్ఫ్ సవరణ చట్టంలోని వెసులుబాటును ఉపయోగించుకుని ట్రిబ్యునల్‌ను ఆశ్రయించేందుకు ఆయా రాష్ట్రాలు సిద్ధమవుతున్నాయి. ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తే వక్ఫ్ ఆస్తుల నమోదుకు మరో 6 నెలల గడువు లభిస్తుందని.. ఆ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని భావిస్తున్నట్లు ఏపీ ముస్లిం జేఏసీ కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ 'సాక్షి'కి చెప్పారు. ఉమీద్ పోర్టల్ క్లోజ్ అయినందున.. ముస్లిం సమాజానికి ఉన్న ఏకైక మార్గం ట్రిబ్యునల్ మాత్రమేనని తెలిపారు. కానీ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత కర్నూలు కేంద్రంగా ఉన్న ట్రిబ్యునల్‌కు శాశ్వత జడ్జిని నియమించలేదని చెప్పారు. దీని వల్ల వారంలో ఒక రోజు మాత్రమే ట్రిబ్యునల్ పనిచేస్తోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వక్ఫ్ ఆస్తులను కాపాడేందుకు వెంటనే ట్రిబ్యునల్‌కు శాశ్వత జడ్జిని నియమించాలని మునీర్ అహ్మద్ డిమాండ్ చేశారు.

అటకెక్కిన విద్యుత్ ఆదా

'ఆంధ్రప్రదేశ్ ఎనర్జీ కన్జర్వేషన్ అండ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ పాలసీ' గత ప్రభుత్వం రూపకల్పన

- రాష్ట్రంలో వార్షిక ఇంధన డిమాండ్ దాదాపు 65,830 మిలియన్ యూనిట్లు
- రూ.11,778 కోట్ల విలువైన 16,875 మిలియన్ యూనిట్ల ఆదాకు ప్రణాళిక
- 25.6 శాతం విద్యుత్ పొదుపుతో పాటు 14.34 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గించేలా అడుగులు
- చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక చతికిల పడ్డ ఇంధన పరిరక్షణ మిషన్
- ఇంధన పరిరక్షణ వారోత్సవాల పేరుతో మొక్కుబడి ర్యాలీలకు సన్నద్ధం



సాక్షి, అమరావతి : విద్యుత్ చార్జీల బాదుడుపై చూపించిన ఆసక్తిని ప్రభుత్వం ఆదా చేయడంలో చూపడం లేదు. రాష్ట్రంలో ప్రస్తుతం వార్షిక ఇంధన డిమాండ్ దాదాపు 65,830 మిలియన్ యూనిట్లుగా ఉంది. ఇందులో రూ.11,778 కోట్ల విలువైన సుమారు 16,875 మిలియన్ యూనిట్లు ఆదా చేసేందుకు గత ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. తద్వారా 25.6 శాతం విద్యుత్ ఆదాతో 14.34 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గించేలా అడుగులు వేసింది. అందుకు అనుగుణంగా 'ఆంధ్రప్రదేశ్ ఎనర్జీ కన్జర్వేషన్ అండ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ పాలసీ'ని గత ప్రభుత్వం రూపొందించింది. చంద్రబాబు సర్కారు అధికారంలోకి వచ్చాక బిల్లుల మోత మోగుతుండగా ఆదా చర్యలు మాత్రం పూర్తిగా అటకెక్కాయి. ఇంధన పరిరక్షణ వారోత్సవాల పేరుతో గతేడాది మొక్కుబడిగా ర్యాలీలు నిర్వహించి సరిపెట్టింది. ఏడాదంతా విద్యుత్ పొదుపు సంగతే మర్చిపోయింది. మళ్లీ ఇప్పుడు ఈ నెల 14 నుంచి రాష్ట్రంలో విద్యుత్తు పొదుపు వారోత్సవాల నిర్వహణకు సిద్ధమవుతోంది. స్టార్ హోటల్‌లో ఇంధన పరిరక్షణ అవార్డుల కార్యక్రమాలను నిర్వహించి కేంద్రం ఇచ్చే డబ్బులను ఖర్చు చేయడం మినహా పొదుపు చర్యలు శూన్యమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గత ప్రభుత్వంలో ఆదర్శంగా ఏపీ..

ఇంధన సామర్థ్య లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వ విభాగాలలో ఇంధన పరిరక్షణ సెల్‌ల ఏర్పాటుకు జీవో జారీ చేసిన ఏకైక రాష్ట్రంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపడం, ఆర్థిక కార్యకలాపాలను పెంచడం, పర్యావరణ ప్రయోజనాలతో పాటు విద్యుత్ బిల్లులను తగ్గించడం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటికి ప్రయోజనం చేకూర్చే దిశగా గత ప్రభుత్వం అడుగులు వేసింది. ప్రభుత్వ విభాగాలు, ప్రైవేట్ సంస్థలు, విద్యుత్ వినియోగదారులతో సహా అందరిని భాగస్వాములుగా చేసి ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్య జీవన విధానాలను అనుసరించేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన సంరక్షణ మిషన్ 'ఏపీఎస్ఈసీఎం' ద్వారా చర్యలు తీసుకుంది. పెర్ఫార్మ్, అచీవ్ ట్రేడ్ (పాట్) స్కీమ్ అమలులో దేశంలోనే అత్యుత్తమంగా ఏపీఎస్ఈసీఎం నిలిచింది. గత కొన్నేళ్లుగా రూ.3,800 కోట్ల విలువైన 5,600 మిలియన్ యూనిట్లను వివిధ సెక్టార్లలో ఆదా చేయడంలోనూ ఈ సంస్థ కీలక పాత్ర పోషించింది. పారిశ్రామిక రంగంలో ఒక్క 'పాట్' ద్వారానే రూ.2,394 కోట్ల విలువైన దాదాపు 3,430 మిలియన్ యూనిట్లు ఆదా చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఎస్ఈసీఎం చేపట్టిన ఉత్తమ విధానాలను అనుసరించాలని నాటి కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్.కె సింగ్ అన్ని రాష్ట్రాలకు లేఖలు రాయడం గమనార్హం.

గత ప్రభుత్వం రూపొందించిన పాలసీ అమలుతో వివిధ కేటగిరీల్లో ఆదా అయ్యే విద్యుత్ (మిలియన్ యూనిట్లలో)

కేటగిరీ	డిమాండ్	మిగిలే విద్యుత్	ఆదా రూ.కోట్లలో
గృహ	19,355	5,284	3,688
ఇండస్ట్రియల్	18,844	3,486	2,433
వ్యవసాయం	19,119	5,736	4,003
వాణిజ్యం	4,822	1,447	1,010
ఇన్‌స్టిట్యూషనల్	3,690	922	644
మొత్తం	65,830	16,875	11,778

● సుందర దృశ్యాలకు నెలవు

మంచుకొండల్లో మరువలేని ప్రయాణం

పర్వతాలు వాటి దిగువ ప్రాంతాలలో జీవిస్తున్నవారికి తాగు నీరు, ఆహారం, జీవనోపాధిని అందించేందుకు ప్రతి సంవత్సరం కృషి జరుగుతోంది. ఐక్యరాజ్య సమితి 2025ను అంతర్జాతీయ హిమానీ నదాల సంరక్షణ సంవత్సరంగా ప్రకటించడం వెనుక గల ఉద్దేశమూ అదే. డిసెంబర్ 11 ఇంటర్నేషనల్ మౌంటెయిన్ డే సందర్భంగా సుందర దృశ్యాలకు నెలవుగా ఉన్న హిమాలయాలలో సాహసోపేతమైన ట్రెక్కింగ్ మార్గాలను అన్వేషిద్దాం...

పర్వతారోహణలో సుందర దృశ్యాలు, ఆత్మిక శక్తి, శిఖరాగ్రం చేరుకున్నాక పూర్తి శాంతిని అనుభవంలోకి తీసుకువస్తాయి హిమనీ నదాలు. భారతదేశం, నేపాల్ అంతటా విస్తరించి ఉన్న హిమాలయాలు ఉత్కంఠభరితమైన ప్రకృతి దృశ్యాలు, గొప్ప సాంస్కృతిక అనుభవాలను అందిస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లోని పచ్చని లోయలు, కాశ్మీర్‌లోని స్వచ్ఛమైన సరస్సులు, లడఖ్‌లో క్లిష్టమైన మార్గాలు, సిక్కింలోని ప్రశాంతమైన కొండల నుండి నేపాల్‌లోని గంభీరమైన శిఖరాల వరకు హిమాలయాలు సాహస యాత్రకు ఆహ్వానం పలుకుతున్నాయి.

మన దేశంలో కేదార్‌కాంత ట్రెక్, ఉత్తరాఖండ్‌లోని ఉల్లాసకరమైన పంగర్చుల్లా పీక్ ట్రెక్, కాశ్మీర్ గ్రేట్ లేక్స్, పశ్చిమ బెంగాల్‌లోని సందక్‌ఫు ట్రెక్, సిక్కింలోని గోచల, లడఖ్‌లోని మార్ఖా లోయను వీక్షించి తీరాల్సిందే. నేపాల్‌లో ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ట్రెక్, సుందరమైన అన్నపూర్ణ సర్క్యూట్ ట్రెక్, ప్రశాంతమైన లాంగ్ టాంగ్ వ్యాలీ, అద్భుతమైన మార్ది హిమాల్ ట్రెక్ వంటి ప్రపంచ ప్రఖ్యాత ట్రెక్కింగ్ మార్గాలలోనూ మునిగిపోవచ్చు. హిమాలయాలలో భద్రత, సౌకర్యాలతో మరపురాని జ్ఞాపకాలను అందించేందుకు ట్రావెల్ ఏజెన్సీలు రూ.20,000 నుంచి లక్ష రూపాయల వరకు ప్యాకేజీలను అందిస్తున్నాయి.

అనువైన మరిన్ని ట్రెక్కింగ్ ప్లేస్‌లు...
కేదార్‌కాంతతో పాటు హిమాలయాలలోనే ఎత్తైన పర్వత శిఖరాలలో పేరొందినవి.

దయారా బుగ్వాల్ ట్రెక్

అతి ఎత్తైన శిఖరాలలో ఒకటిగా పేరొందిన దయారా పర్వతం ఎత్తైన గడ్డి మైదానాలతో నిండి ఉంటుంది. ఇది ఏడాది పొడవునా ట్రెకింగ్ చేయడానికి అందుబాటులో ఉండగా జనవరి, ఫిబ్రవరి నెలల్లో స్కీయింగ్ చేసేవారికి మరింత అనుకూలం. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు పచ్చదనంతో నిండి ఉంటుంది. నవంబర్ నుంచి మార్చి వరకు మంచుతో నిండి ఉంటాయి. హిమాలయ శిఖరాలను 360 డిగ్రీల కోణంలో చూడవచ్చు. ట్రావెల్ ఏజెన్సీలు అందిస్తున్న ప్యాకేజీలో భోజనం, టిఫిన్, టెంట్లు, స్లీపింగ్ బ్యాగులు, అనుభవజ్ఞులైన ట్రెక్కింగ్ గైడ్లు, వైద్య సౌకర్యాలు, ఆక్సిజన్ సిలిండర్లు.. వంటివి అందిస్తారు. డెహ్రాడూన్ నుండి దయారా బుగ్వాల్ చేరుకోవడానికి రోడ్డు మార్గం ఉంది.

బ్రహ్మతల్... లేక్ ట్రెక్

పచ్చిక, అడవులు, మంచుతో నిండిన శిఖరాలను చూస్తూ సాగించే వింటర్ ట్రెక్ ఇది. బెకల్తాల్ సరస్సు పూర్తిగా ఘనీభవించి ఉంటుంది. దీనికి తోడు త్రిశూల్ పర్వతం, నందా ఘుటి పర్వతం వంటి శక్తివంతమైన హిమాలయ శిఖరాలు కనిపిస్తాయి. ఇక బ్రహ్మతల్ శిఖరాగ్రం నుండి మరిన్ని అద్భుత శిఖరాలను చూడవచ్చు. అడవులు, గ్రామాలు, పచ్చికభూములు, ఘనీభవించిన సరస్సు మీదుగా ఈ ట్రెక్కింగ్ సాగుతుంది. సరస్సు చుట్టూ పడే శీతాకాలపు సాయంత్రం నడక ఎప్పటికీ గుర్తుండిపోతుంది. బ్రహ్మతల్ సరస్సు వద్ద బ్రహ్మ తపస్సు చేశాడని, ఈ సరస్సును బ్రహ్మ పవిత్ర సరస్సుగా మార్చాడని స్థానిక గ్రామస్తులు చెబుతారు.

కువారీ పాస్ ట్రెక్

ఇది గర్వాల్ పర్వత శ్రేణిలోని ప్రాచీన ట్రెక్‌లలో ఒకటిగా పేరొందింది. ట్రావెల్ ఏజెన్సీలు ఆరు రోజులకు గాను రూ.7000 నుంచి రూ.9000 వరకు ప్యాకేజీలు అందిస్తున్నాయి. ఇది చారిత్రక ప్రాముఖ్యాన్ని కలిగి ఉన్న ట్రెక్. 1905లో అప్పటి భారత వైస్రాయ్ లార్డ్ కర్జన్ ఈ ట్రెక్ చేరుకున్నాడు. అప్పటి నుండి అతని పేరు మీదుగానే ఈ ట్రెక్‌ను పిలుస్తున్నారు. ఇది ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో ఉంది. ఈ ట్రెక్ రిషికేశ్ నుండి మొదలవుతుంది. జోషిమఠ్ ప్రాంతంలోని గ్రామాల మీదుగా ప్రయాణించాలి. మంచుతో నిండి, ఏడాది పొడవున ఉండే కువారీ పాస్ ట్రెక్ అన్ని సీజన్లలోనూ అందంగా ఉంటుంది.

సందక్ఫు ఫలుట్ ట్రెక్..

ఈ ట్రెక్‌లో నాలుగు ఎత్తైన శిఖరాలను చూసే ఉత్కంఠభరితమైన అనుభవాన్ని పొందవచ్చు. ఒకవైపు ఎవరెస్ట్, లోట్సే, మకాలు శిఖరాలు చూడవచ్చు. మరోవైపు గంభీరమైన కాంచన్‌జంగా శిఖరంపై కిరీటంలా ఉన్న ప్రసిద్ధ స్లీపింగ్ బుద్ధ మాసిఫ్‌ను చూడవచ్చు. సందక్ఫు ట్రెక్‌లో భారతదేశంలోనే అత్యుత్తమ సూర్యాస్తమయ, సూర్యోదయాలను చూడవచ్చు. వెదురు, రోడోడెండ్రాన్ అడవులు సందక్ఫు ట్రెక్ అందాన్ని మరింత పెంచుతాయి. హిమాలయా పుష్పాలుగా ప్రత్యేకత గల రోడోడెండ్రాన్‌లు ఇక్కడ కనిపిస్తాయి. అరుదైన ఎర్రపాండాలను కూడా చూడవచ్చు.

ట్రావెల్ ట్రెండ్స్

క్వయిట్ వోవర్ ఎవ్రీ థింగ్

‘క్వయిట్ వోవర్ ఎవ్రీథింగ్’ హవా కొనసాగనుంది. ఆధునిక జీవితంలోని రకరకాల ఒత్తిళ్ల నుంచి తప్పించుకోవడానికి ఒక మార్గాన్ని కనుగొనే ట్రెండ్ ఇది. డిజిటల్ సంస్కృతిలో పీకల లోతు మునిగిపోయాక చాలా మందికి ఇతర ప్రపంచాలేవీ కనిపించడం లేదు. డిజిటల్ సంస్కృతికి ఆవల అద్భుత ప్రపంచం ఉంది. ఆ ప్రపంచంలోకి వెళ్లాలంటే ప్రయాణించాలి. ప్రయాణించాలంటే డిజిటల్ సంకెళ్లను ఛేదించాలి. ఈ క్రమంలోనే డిజిటల్ డిటాక్స్‌కు ప్రాధాన్యత పెరిగింది. మితిమీరిన డిజిటల్ సంస్కృతి నుంచి బయటపడి మానసిక ప్రశాంతతను వెదుక్కుంటూ కొత్త ప్రదేశాలకు వెళ్లే ధోరణి పెరిగింది. ఒరెగాన్స్ సైకేవ్ రిట్రీట్స్‌లో అతిథులు చీకటి క్యాబిన్‌లలో మూడు రోజులు బస చేస్తారు! కొన్ని రోజుల పాటు బాహ్యప్రపంచానికి, వెలుతురుకు దూరంగా ప్రత్యేకంగా సిద్ధం చేయబడిన పిచ్–బ్లాక్ గదులలో లేదా చీకటి గుహలలో గడపడం అనేది టిబెటన్ బౌద్ధంలోని సంప్రదాయం. ఈ బౌద్ధ సంప్రదాయం ట్రావెల్స్ ట్రెండ్స్‌లో ఒకటిగా మారింది. ‘స్వీయ–ఆవిష్కరణకు ఉపకరిస్తుంది’ అంటారు ఈ విధానాన్ని అనుసరించేవారు.

పర్వతారోహకులకు వెంట తప్పనిసరి...



పర్వతారోహణ చేసే పర్యాటకులు ఆడ/మగ సమకూర్చుకోవాల్సినవి, వెంట తెచ్చుకోవాల్సినవి...

రక్‌బ్యాక్, డౌన్ జాకెట్, గ్లౌజ్‌లు (వాటర్ ప్రూఫ్‌వి), పోంచో లేదా రెయిన్ కోట్, ట్రెక్కింగ్ పోల్, హెడ్ ??టార్చ్, ట్రెక్ షూస్, ట్రెక్ ప్యాంట్ – 2, ఒక జత థర్మల్స్, వెచ్చని సాక్స్ (జత), కాటన్ సాక్స్ (3–4 జతలు), ఉన్ని టోపీ, సన్ క్యాప్, గ్లౌజులు (ఉన్ని, వాటర్ ప్రూఫ్), అవసరాన్ని బట్టి అదనపు దుస్తులు, ప్లేట్లు, చెంచా, కాఫీ కప్పు, ఫోటో గుర్తింపు కార్డు, సన్ గ్లాసెస్, హ్యాండ్ టవల్, సన్ స్క్రీన్ లోషన్, మాయిశ్చరైజర్, చెప్పులు. పవర్‌బ్యాంక్స్, టాయిలెట్ పేపర్ రోల్స్, టవల్స్, జిప్ లాక్ బ్యాగులు, శానిటైజింగ్ టాయిలెట్ స్ప్రే, సోప్, హ్యాండ్ వాష్, టూత్ పేస్ట్, టూత్ బ్రష్ .. మొదలైనవి అవసరం అవుతాయి.

- నిర్మలారెడ్డి, సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి

మంచు కొండల్లో ట్రెక్కింగ్..

ప్రపంచంలో.. ఎత్తైన ఏడు శిఖరాలు

ప్రపంచంలోని ప్రతి ఖండంలో ఉన్న ఎత్తైన శిఖరాలను అధిరోహించడం ఏ పర్వతారోహకుడికైనా లభించే అత్యంత గౌరవనీయమైన విజయాలలో ఒకటి. సెవన్ సమ్మిట్‌గా పేరొందిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఏడు శిఖరాలను కలిగి ఉన్న పర్వతాలు, వాటి మార్గాలు..

ఆసియా: ఎవరెస్ట్ శిఖరం

ఎవరెస్ట్ శిఖరం ఆసియాలోనూ, ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వతం. ఇది నేపాల్, టిబెట్ మధ్య సరిహద్దులో దక్షిణ ఆసియాలోని గ్రేట్ హిమాలయాలలో ఉంది. 29,035 అడుగుల (8,850 మీటర్లు) ఎత్తుకు చేరుకున్న దీనిని 1852లో గవర్నమెంట్ సర్వే ఆఫ్ ఇండియా భూమి ఉపరితలంపై ఎత్తైన ప్రదేశంగా గుర్తించింది. ఎవరెస్ట్ పైకి ప్రధాన యాత్రలు 1920లలో ప్రారంభమయ్యాయి. కానీ 1953లో ఎడ్మండ్ హిల్లరీ, టెన్సింగ్ నార్గే లు దాని శిఖరాన్ని చేరుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు చాలా మంది పర్వతారోహకులు ఈ శిఖరాగ్రాన్ని చేరుకునేందుకు తపిస్తున్నారు.

దక్షిణ అమెరికా: మౌంట్ అకాన్‌కాగువా

దక్షిణ అమెరికా, పశ్చిమ అర్ధగోళం రెండింటిలోనూ అకాన్‌కాగువా పర్వతం ఎత్తైనది. ఇది పశ్చిమ-మధ్య అర్జెంటీనాలోని చిలీ సరిహద్దులో ఉంది. అకాన్‌కాగువా పర్వతం ఉత్తర, దక్షిణ అనే రెండు శిఖరాలను కలిగి ఉంది, ఇవి ఒక శిఖరం ద్వారా అనుసంధానించబడి ఉన్నాయి. దక్షిణ శిఖరం 22,736 అడుగులు (6,930 మీటర్లు) ఎత్తులో ఉంది. 22,831 అడుగులు (6,959 మీటర్లు) ఎత్తులో ఉన్న ఎత్తైన ఉత్తర శిఖరాన్ని మొదటిసారిగా 1897లో స్విస్ అధిరోహకుడు మాథియాస్ జుర్బ్రిగ్గెన్ చేరుకున్నాడు.

ఉత్తర అమెరికా: డెనాలి

డెనాలి (మౌంట్ మెకిన్లీ అని కూడా పిలుస్తారు) ఉత్తర అమెరికాలో ఎత్తైన శిఖరం. ఇది దక్షిణ-మధ్య

అలాస్కాలోని అలాస్కా శ్రేణిలో ఉంది. ఈ పర్వతం 18,000 అడుగులు (5,500 మీటర్లు) ఎత్తు ఉంటుంది. 1910లో ఇద్దరు ప్రాస్పెక్టర్లు ఉత్తర శిఖరాన్ని జయించిన మొదటి అధిరోహకులు. హడ్సన్ స్టక్, హ్యారీ కార్స్టెన్స్ జూన్ 7, 1913న సౌత్ పీక్‌కు ఒక బృందానికి నాయకత్వం వహించారు. ఈ రోజుల్లో, ప్రతి సంవత్సరం వందలాది మంది అధిరోహకులు ఈ శిఖరాగ్రాన్ని చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

ఆఫ్రికా: కిలిమంజారో

కిలిమంజారో పర్వతం ఆఫ్రికాలో ఎత్తైన శిఖరం. ఇది కెన్యా సరిహద్దుకు సమీపంలో ఈశాన్య టాంజానియాలో ఉంది. ఈ పర్వతం మూడు అగ్నిపర్వతాలతో రూపొందింది. శంఖువును పోలి ఉండే కిబో, 19,340 అడుగులు (5,895 మీటర్లు) ఎత్తులో ఉంది. కిలిమంజారో పర్వతం ప్రపంచంలోనే నాల్గవ అత్యంత ప్రముఖ పర్వతం. 1889లో ఈ శిఖరాన్ని చేరుకున్న మొదటి వ్యక్తి జర్మన్ భౌగోళిక శాస్త్రవేత్త హాన్స్ మేయర్ , ఆస్ట్రియన్ పర్వతారోహకుడు లుడ్విగ్ పుర్ట్‌షెల్లర్. మౌంట్ కిలిమంజారో నేషనల్ పార్క్ 1987లో యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించబడింది.

యూరప్: మౌంట్ ఎల్బ్రస్

కాకసస్‌లోని ఎత్తైన శిఖరం, ఐరోపాలోని ఎత్తైన ప్రదేశం నైరుతి రష్యాలోని మౌంట్ ఎల్బ్రస్. 2.5 మిలియన్ సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ అంతరించిపోయిన అగ్నిపర్వతం జంట శంఖుల్లా ఉంటుంది. ఇవి 18,510 అడుగులు (5,642 మీటర్లు), 18,356 అడుగులు (5,595 మీటర్లు) ఎత్తు వరకు విస్తరించి ఉన్నాయి. పొడవైన శంఖువును మొదటిసారిగా 1874లో స్విస్ గైడ్ పీటర్ నుబెల్ నేతృత్వంలోని బ్రిటిష్ యాత్ర అధిరోహించింది.

అంటార్కిటికా: విన్సన్ మాసిఫ్

1935లో అమెరికన్ అన్వేషకుడు లింకన్ ఎల్స్‌వర్త్ కనుగొన్న విన్సన్ మాసిఫ్ అంటార్కిటికాలో అత్యంత ఎత్తైన పర్వతం. ఖండంలోని పశ్చిమ భాగంలోని ఎల్స్

వర్త్ పర్వతాల సెంటినెల్ శ్రేణిలో ఉన్న ఈ శిఖరం రోన్నే ఐస్ షెల్ఫ్‌ను చూస్తుంది. ఇది సముద్ర మట్టానికి 16,050 అడుగుల (4,892 మీటర్లు) ఎత్తున ఉంది. అంటార్కిటికా అన్వేషణకు నాయకత్వం వహించిన యుఎస్ కాంగ్రెస్ సభ్యుడు కార్ల్ విన్సన్ పేరు మీద విన్సన్ పేరు పెట్టారు. దీని శిఖరాగ్రాన్ని మొదటిసారిగా 1966లో అమెరికన్ ఆల్పైన్ క్లబ్, నేషనల్ సైన్స్ ఫౌండేషన్ మద్దతుతో ఒక అమెరికన్ చేరుకున్నారు.

ఆస్ట్రేలియా: మౌంట్ కోస్సియుస్కో

మౌంట్ కోస్సియుస్కో ఆస్ట్రేలియాలో ఎత్తైన శిఖరం. ఇది ఆగ్నేయ న్యూ సౌత్ వేల్స్‌లోని ఆస్ట్రేలియన్ ఆల్ప్స్ స్నోవీ పర్వతాలలో ఉంది. ఈ శిఖరం 7,310 అడుగులు (2,228 మీటర్లు) ఎత్తు. పోలిష్ అన్వేషకుడు, భూవిజ్ఞాన శాస్త్రవేత్త పాల్ స్ట్రెజెలెక్కి 1840లో మౌంట్ కోస్సియుస్కోను అధిరోహించిన మొదటి యూరోపియన్. అతను ఈ పర్వతానికి పోలిష్ దేశభక్తుడు, అమెరికన్ విప్లవ వీరుడైన టాడ్యూస్జ్ కోస్సియుస్కో పేరు పెట్టాడు.

‘శీతాకాలపు ట్రెక్‌ల రారాణి’

కేదార్‌కాంత

భారతదేశంలోని ఉత్తరాఖండ్ రాష్ట్రం పూర్తిగా ప్రకృతి అద్భుతాలతో నిండి ఉంది. అందుకే ఈ భూమిని దేవుని స్వంత భూమి లేదా ‘దేవభూమి’ అని పిలుస్తారు. ఈ ప్రదేశం ప్రత్యేకత ఏడాది పొడవునా సాహసయాత్ర కోరుకునే ట్రెక్కర్లను ఆకర్షించడంలో విజయవంతమైంది. ఇక ప్రసిద్ధ శీతాకాల ట్రెక్ ప్రదేశం కేదార్‌కాంత. ఈ ట్రెక్ ‘శీతాకాలపు ట్రెక్‌ల రాణి’ గా పేరు పొందింది. గోవింద్ నేషనల్ పార్క్ దట్టమైన పైన్ అడవుల గుండా కేదార్‌కాంత శిఖరం వైపుగా ట్రెక్కింగ్ వెళుతుంది. మోకాలి లోతు మంచు, పై నుండి మంత్రముగ్ధులను చేసే దృశ్యం. కేదార్‌కాంత ట్రెక్ 12,500 అడుగుల ఎత్తులో ఉన్నప్పటికీ ట్రెక్కింగ్ మొదలుపెట్టేవారికి ఈ మార్గం సులభంగా ఉండటంతో మరింత ప్రాచుర్యం పొందింది.

ఇక్కడ మంచు ఏప్రిల్ నెల వరకు ఉంటుంది. ఇది ఇతర శీతాకాలపు ట్రెక్‌లకు భిన్నంగా చాలా ప్రజాదరణ పొందింది. ఈ ట్రెక్ సంక్రి అనే చిన్న గ్రామం నుండి ప్రారంభమవుతుంది. ఓక్, రోడోడెండ్రాన్ దట్టమైన అడవులు, గడ్డకట్టిన సరస్సు మధ్యలో నడక సాగిస్తూ, మంచు శిఖరాన్ని అధిరోహించడానికి ఎంతో మంది ఉత్సాహం చూపుతుంటారు. ప్రముఖ హిమాలయ శిఖరాలు అయిన బందర్‌పూంచ్, కాల్‌నాగ్, స్వర్గారోహిణి మొదలైనవి.. కేదార్‌కాంత శిఖరం నుండి కనిపిస్తాయి.

ఈ ట్రెక్ ప్రత్యేకత ఏమిటంటే...

- దేశంలోని అత్యంత ప్రసిద్ధ శీతాకాలపు ట్రెక్‌లలో ఒకటిగా పేరొందింది. హిమాలయాలలో శీతాకాలంలో అందుబాటులో ఉండే మంచు ట్రెక్‌కి ఇది అనుకూలమైనది.
- ఇది హిమాలయ శిఖరాన్ని ఎక్కిన అనుభూతిని ఇస్తుంది.
- మొదట్లో ట్రెక్కింగ్ చేసేవారికి అనువైన ప్రాంతం.
- కేదార్‌కాంత బేస్ క్యాంప్ అద్భుతమైన సుందర దృశ్యాలకు ఆలవాలం.
- శిఖరం నుండి కనిపించే దృశ్యం మనల్ని మంత్రముగ్ధులను చేస్తుంది.
- కేదార్కాంత శిఖరం నుండి సూర్యోదయం అత్యుత్తమమైనది.

కేదార్‌కాంత ట్రెక్ షెడ్యూల్



ఆరు పగళ్లు, ఐదు రాత్రుళ్ల ప్యాకేజీని ట్రావెల్ ఏజెన్సీలు అందిస్తున్నాయి.

1వ రోజు: డెహ్రాడూన్ నుండి సంక్రి వరకు 196 కి.మీ డ్రైవ్, దీనికి 8–9 గంటల సమయం పడుతుంది.
2వ రోజు: సంక్రి నుండి జుడా కా తలాబ్ క్యాంప్ సైట్ వరకు 3.5 కి.మీ ట్రెక్, 5–6 గంటలు పడుతుంది. ఎత్తు 7200 అడుగుల నుండి 9186 అడుగుల వరకు ఉంటుంది.
3వ రోజు: జుడా కా తలాబ్ నుండి కేదార్‌కాంత బేస్ క్యాంప్‌కు 3 కి.మీ ట్రెక్ చేయాలి. ఇందుకు 4–5 గంటల సమయం పడుతుంది. ఎత్తు 9186 అడుగుల నుండి 10,334 అడుగుల వరకు ఉంటుంది.
4వ రోజు: సమ్మిట్ హర్గావ్ క్యాంప్‌లో పగలు, రాత్రి ప్రయాణం, బస సమయం మొత్తం 7 కి.మీ 9–10 గంటలు.
5వ రోజు: హర్గావ్ నుండి సంక్రికి దిగి డెహ్రాడూన్‌కు 4 కి.మీ దిగి, 196 కి.మీ ప్రయాణం చేస్తూ డెహ్రాడూన్‌కు చేరుకోవాలి.

సంక్రి ఎలా చేరుకోవాలంటే...

హిమాలయాల దిగువ ప్రాంతంలో ఉన్నది సంక్రి. కేదార్‌కాంత, హర్ కి డన్, పులారా రిడ్జ్, బాలి పాస్ వంటి అనేక ప్రసిద్ధ హిమాలయ ట్రెక్‌లకు బేస్‌క్యాంప్‌గా పనిచేస్తుంది. నగర జీవిత హడావిడికి దూరంగా ఉన్న ఈ చిన్న గ్రామం మన హృదయాలను ఇట్టే దోచుకుంటుంది. అందమైన హోమ్‌స్టేలు, రుచికరమైన తినుబండారాలు, కేఫ్‌లు, అద్భుతమైన స్వర్గరోహిణి శిఖరం, మంత్రముగ్ధులను చేసే దృశ్యాలతో సంక్రి ప్రాంతం ప్రేమలో ఇట్టే పడిపోతాం.

సంక్రి డెహ్రాడూన్ నుండి 206 కి.మీ. ఢిల్లీ నుండి 434 కి.మీ దూరంలో ఉంది. ఢిల్లీ నుండి నేరుగా సంక్రి చేరుకోలేం. డెహ్రాడూన్ చేరుకున్న తర్వాతనే సంక్రికి ప్రయాణించవచ్చు:

రోడ్డు మార్గం:
సంక్రి డెహ్రాడూన్ నుండి దాదాపు 206 కి.మీ దూరంలో ఉంది మరియు సాధారణంగా చేరుకోవడానికి 8–9 గంటలు పడుతుంది.
రెండు మార్గాలు ఉన్నాయి:
వయా ముస్సోరీ - తక్కువ దూరం. ఈ మార్గాన్నే చాలా మంది అనుసరిస్తారు.
వయా వికాస్‌నగర్ - ముస్సోరీ ట్రాఫిక్‌ను నివారించాలనుకుంటే మంచి ఎంపిక.

బస్సు ద్వారా:
డెహ్రాడూన్ రైల్వే స్టేషన్ నుండి సంక్రికి ప్రైవేట్, ప్రభుత్వ బస్సులు అందుబాటులో ఉన్నాయి . సాధారణంగా రోజుకు 2–3 బస్సులు ఉంటాయి. చివరి బస్సు ఉదయం 8:00 గంటలకు బయలుదేరుతుంది. ఆ తరువాత, సంక్రికి బస్సులు అందుబాటులో లేవు.

టాక్సీ ద్వారా:
4 లేదా అంతకంటే ఎక్కువ మందితో కలిసి ప్రయాణిస్తుంటే టాక్సీని అద్దెకు తీసుకోవాలి. డెహ్రాడూన్ నుండి సంక్రికి టాక్సీ ధర రూ.6500 ఉంటుంది.

రైలు మార్గం:
సంక్రికి సమీప రైల్వే స్టేషన్ డెహ్రాడూన్ రైల్వే స్టేషన్. అక్కడి నుండి, సంక్రి చేరుకోవడానికి బస్సు లేదా టాక్సీ తీసుకోవచ్చు.

విమాన మార్గం:
సంక్రికి సమీప విమానాశ్రయం డెహ్రాడూన్ లోని జాలీ గ్రాంట్ విమానాశ్రయం. భారతదేశంలోని ప్రధాన నగరాల నుండి డెహ్రాడూన్‌కు విమానాలు అందుబాటులో ఉన్నాయి, ఆ తర్వాత రోడ్డు మార్గంలో సంక్రి చేరుకోవచ్చు.

ఆసీస్‌దే రెండో టెస్టు

8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ ఓటమి

స్టార్క్‌కు రెండో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు
ఈ నెల 17 నుంచి మూడో టెస్టు ● యాషెస్ సిరీస్

బ్రిస్బేన్: ప్రతిష్టాత్మక 'యాషెస్' సిరీస్‌లో ఆస్ట్రేలియా జట్టు రెండో విజయం ఖాతాలో వేసుకుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం ముగిసిన రెండో టెస్టులో ఆసీస్ 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తుచేసి 2–0తో ముందంజ వేసింది. 'డే అండ్ నైట్' టెస్టుల్లో తమ ఆధిపత్యం కొనసాగించిన కంగారూలు... ప్రఖ్యాత 'గాబా' స్టేడియంలో ఇంగ్లండ్‌కు అటు బ్యాట్‌తో, ఇటు నోటితో గట్టిగా బదులిచ్చారు. ఇంగ్లండ్ నిర్దేశించిన 65 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 10 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ స్టీవ్ స్మిత్ (9 బంతుల్లో 23 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడటంతో ఆసీస్ అలవోకగా 69 పరుగులు చేసి గెలిచింది. గంటకు 150 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు వేస్తూ ఆసీస్‌ను ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేసిన ఇంగ్లండ్ పేసర్ ఆర్చర్‌ను స్మిత్ బ్యాట్‌తో బదులిచ్చాడు. ఈ ఇద్దరి మధ్య కాసేపు మాటల యుద్ధం సాగింది. ఈ క్రమంలో స్మిత్ 'గాబా'లో వెయ్యి టెస్టు పరుగులు పూర్తి చేసుకున్నాడు. ట్రావిస్ హెడ్ (22; 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో అట్కిన్సన్ 2 వికెట్లు పడగొట్టాడు.

స్టోక్స్ పోరాటం వృథా...

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 134/6తో నాలుగో రోజు ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్... చివరకు 75.2 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ బెన్ స్టోక్స్ (152 బంతుల్లో 50; 4 ఫోర్లు), విల్ జాక్స్ (92 బంతుల్లో 41; 2 ఫోర్లు) పోరాడినా ఫలితం లేకపోయింది. 'బాజ్‌బాల్' మాయలో పడి దూకుడు తప్ప సంయమనంగా ఆడటం మానేసిన ఇంగ్లండ్ జట్టు... ఆదివారం అచ్చమైన టెస్టు ఇన్నింగ్స్ ఆడే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా స్టోక్స్ తన అనుభవాన్ని రంగరించి మ్యాచ్‌ను ముందుకు తీసుకెళ్లాడు. అతడు 148 బంతుల్లో హాఫ్‌సెంచరీ పూర్తి చేసుకున్నాడు. టెస్టు క్రికెట్‌లో స్టోక్స్‌కు ఇది రెండో నెమ్మదైన అర్ధశతకం. 2019లో ఆస్ట్రేలియాపైనే 152 బంతుల్లో అతడు 'ఫిఫ్టీ' మార్క్ అందుకున్నాడు. ఏడో వికెట్‌కు అతడు జాక్స్‌తో కలిసి 96 పరుగులు జోడించి జట్టుకు ఇన్నింగ్స్ పరాజయాన్ని తప్పించాడు. మరింత స్కోరు చేసి ఆస్ట్రేలియాను ఒత్తిడిలోకి నెట్టడంలో మాత్రం ఇంగ్లండ్ సారథి విఫలమయ్యాడు. నెసెర్ బౌలింగ్‌లో స్మిత్ కళ్లుచెదిరే క్యాచ్‌తో జాక్స్‌ను పెవిలియన్‌కు పంపాడు. ఈ జోడీ విడిపోయాక ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. ఆస్ట్రేలియా బౌలర్లలో మైకెల్ నెసెర్ 5 వికెట్లతో అదరగొట్టగా... స్టార్క్, బొలాండ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 8 వికెట్లు తీయడంతో పాటు 77 పరుగులు చేసిన ఆసీస్ స్టార్ పేసర్ స్టార్క్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య ఈ నెల 17 నుంచి మూడో టెస్టు ప్రారంభం కానుంది.

మైకెల్ నెసెర్, హెడ్

14 డే–నైట్ టెస్టుల్లో ఆస్ట్రేలియా జట్టు సాధించిన విజయాలు. ఇప్పటి వరకు మొత్తం 25 డే–నైట్ టెస్టులు జరగ్గా... ఇందులో ఆస్ట్రేలియా 15 టెస్టులు ఆడింది. గత ఏడాది జనవరిలో 'గాబా'లో వెస్టిండీస్‌తో జరిగిన డే–నైట్ టెస్టులో మాత్రమే ఓడిపోయిన ఆస్ట్రేలియా మిగతా 14 టెస్టుల్లో విజయం సాధించింది.

'రోహిత్, కోహ్లి కీలకమే కానీ'...

- యువ ఆటగాళ్లు కూడా అద్భుతం
- పేస్ ఆల్‌రౌండర్ హర్షిత్ రాణాపై ప్రశంసలు
- వన్డేల్లో ఏ స్థానంలో ఆడేందుకైనా సిద్ధంగా ఉండాలి
- టీమిండియా హెడ్ కోచ్ గంభీర్ వ్యాఖ్యలు

గంభీర్

సాక్షి, విశాఖపట్నం: దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో విజయం సాధించడంలో సీనియర్లతో పాటు... యువ ఆటగాళ్లూ కీలక పాత్ర పోషించారని భారత హెడ్ కోచ్ గౌతం గంభీర్ అన్నాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం విశాఖ వేదికగా జరిగిన చివరి వన్డేలో టీమిండియా 9 వికెట్ల తేడాతో నెగ్గి సిరీస్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. టి20, టెస్టు ఫార్మాట్‌ల నుంచి తప్పుకున్న భారత మాజీ కెప్టెన్, 'రన్ మెషీన్' విరాట్ కోహ్లి ఈ మూడు మ్యాచ్‌ల్లో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీతో 302 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు గెలుచుకోగా... రోహిత్ శర్మ రెండు అర్ధశతకాలతో ఆకట్టుకున్నాడు. గంభీర్‌కు సీనియర్ ఆటగాళ్లకు మధ్య సయోధ్య కుదరడం లేదనే వార్తల నేపథ్యంలో... సిరీస్ విజయం అనంతరం గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. జట్టులో రోహిత్, కోహ్లి ప్రాధాన్యత... పేస్ ఆల్‌రౌండర్‌గా హర్షిత్ రాణా రాణించడం... వాషింగ్టన్ సుందర్‌కు బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోషన్ ఇవ్వడం వంటి వివరాలు అతడి మాటల్లోనే...

- కోహ్లి, రోహిత్ నాణ్యమైన ప్లేయర్లు. వాళ్లు ప్రపంచశ్రేణి ఆటగాళ్లు అని ఇప్పటికే చాలాసార్లు చెప్పా. ఇలాంటి అనుభజ్ఞులు డ్రెస్సింగ్ రూమ్‌లో ఉండటంతో జట్టుకు ఎంతో మేలు చేస్తుంది.
- వాళ్లు చక్కగా ఆడుతున్నారు. సుదీర్ఘకాలంగా జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారు. ఇక ముందు కూడా దాన్ని కొనసాగిస్తారని ఆశిస్తున్నా. 50 ఓవర్ల ఫార్మాట్‌లో వాళ్లిద్దరూ చాలా ముఖ్యం.
- పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్లు అందుబాటులో ఉంటే... జట్టు ఎంపికలో వెసులుబాటు ఉంటుంది. అందుకే హర్షిత్ రాణా వంటి వారిని ప్రోత్సహిస్తున్నాం. ఎనిమిదో స్థానంలో బ్యాట్‌తో పరుగులు చేయగల ప్లేయర్ ఉంటే ఏ జట్టుకైనా మేలే కదా. అలాంటి ఆటగాడు జట్టులో సమతూకాన్ని తీసుకువస్తాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని ముగ్గురు ప్రధాన పేసర్లు జట్టులో ఉండటం తప్పనిసరి. రాణా పేస్ ఆల్‌రౌండర్‌గా మరింత పరిణతి సాధిస్తే అది టీమ్‌కు బాగా ఉపయోగ పడుతుంది. ఆ దిశగా అతడిని ప్రోత్సహిస్తున్నాం.
- బుమ్రా అందుబాటులో లేకున్నా... అర్ష్‌దీప్, ప్రసిధ్ కృష్ణ, హర్షిత్ రాణా చక్కటి ప్రదర్శన కనబర్చారు. ఈ ముగ్గురికి వన్డే క్రికెట్‌లో పెద్దగా అనుభవం లేకపోయినా... వచ్చిన అవకాశాలను సరిగ్గా వినియోగించుకొని చక్కటి ఫలితాలు రాబట్టారు.
- వన్డే క్రికెట్‌లో స్థిరమైన బ్యాటింగ్ ఆర్డర్ ఉండాలని నేను అనుకోవడం లేదు. పరిస్థితులకు తగ్గట్లు ఆటగాళ్లంతా సిద్ధంగా ఉండటం మేలు. టెస్టు క్రికెట్‌లో అయితే ప్రతి స్థానానికి ప్రత్యేకమైన ఆటగాళ్లు ఉండటం మంచిది, కానీ, పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఓపెనింగ్ జోడీ మినహా తక్కిన స్థానాలకు ఆ అవసరం లేదు.
- వాషింగ్టన్ సుందర్‌నే తీసుకుంటే అతడు ఏ స్థానంలోనైనా చక్కగా ఒదిగిపోగలడు. విదేశాల్లో చక్కటి ఇన్నింగ్స్‌లు ఆడాడు. మూడో స్థానంలో, ఐదో స్థానంలో, ఎనిమిదో స్థానంలో ఇలా ఎక్కడ అవసరమైతే అక్కడ బ్యాటింగ్ చేసేందుకు చిరునవ్వుతో సిద్ధంగా ఉంటాడు. ఇలాంటి ఆటగాళ్లు జట్టులో ఉంటే ఎంతో బాగుంటుంది. అతడికి మంచి భవిష్యత్తు ఉంది.
- ఇటీవలి కాలంలో మ్యాచ్ ఫలితాలను నిర్ణయించడంలో టాస్ కీలకం అవుతోంది. మొదట బౌలింగ్ చేయడంలో, ఆ తర్వాత బౌలింగ్ చేయడంలో చాలా తేడా ఉంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో మన బౌలర్లకు బంతిపై సరిగ్గా పట్టు చిక్కలేదు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో మన బ్యాటర్ల ప్రతాపం అందరూ చూశారు.
- వన్డే సిరీస్ ఫలితాలపై మంచు ప్రభావం చూపింది కానీ... టి20 సిరీస్‌కు ఆ ఇబ్బంది ఉండదు. రెండు ఇన్నింగ్స్‌లు సాయంత్రం తర్వాతే ప్రారంభమవుతాయి కాబట్టి ఇద్దరికీ పరిస్థితులు దాదాపు ఒకేలా ఉంటాయి.

విజేత సంస్కార్

గువాహటి: భారత బ్యాడ్మింటన్ వర్ధమాన తార సంస్కార్ సరస్వత్ తన కెరీర్‌లో తొలి అంతర్జాతీయ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం ముగిసిన గువాహటి ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–100 టోర్నీలో రాజస్తాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన 19 ఏళ్ల సంస్కార్ చాంపియన్‌గా అవతరించాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో సంస్కార్ 21–11, 17–21, 21–13తో భారత్‌కే చెందిన జాతీయ మాజీ చాంపియన్ మిథున్ మంజునాథ్‌ను ఓడించాడు. గువాహటిలోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శిక్షణ తీసుకుంటున్న సంస్కార్ జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్నాడు. గతేడాది జాతీయ పురుషుల డబుల్స్ టైటిల్‌ను దక్కించుకున్న సంస్కార్ ఈ ఏడాది జాతీయ జూనియర్ చాంపియన్‌గా నిలిచాడు.

రన్నరప్ తన్వీ శర్మ

మరోవైపు రైజింగ్ స్టార్ తన్వీ శర్మకు నిరాశ ఎదురైంది. మహిళల సింగిల్స్ ఫైనల్లో పంజాబ్‌కు చెందిన 16 ఏళ్ల తన్వీ శర్మ 18–21, 18–21తో టుంగ్ సియో టాంగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో పృథ్వీ కృష్ణమూర్తి–సాయిప్రతీక్ (భారత్) ద్వయం 13–21, 18–21తో కాంగ్ ఖాయ్ జింగ్–ఆరోన్ తాయ్ (మలేసియా) జంట చేతిలో ఓటమి పాలై రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది.

నాకొద్దు... లావైపోతా!

సాక్షి, విశాఖపట్నం: టెస్టుల్లో పోగుట్టుకున్న సిరీస్ తాలూకు ప్రతిష్టను భారత్ వెంటనే విశాఖ తీరంలో వన్డే సిరీస్‌తో నిలబెట్టుకుంది. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో విన్నర్స్ ట్రోఫీతో ఫొటోలకు ఫోజులిచ్చిన ఆటగాళ్లంతా హోటల్‌కు చేరాక కూడా సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా సెంచరీ హీరో యశస్వి జైస్వాల్ కేక్ కోసి 'కింగ్' కోహ్లి నోటిని తీపి చేశాడు. తర్వాత అక్కడే ఉన్న 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మకూ కేక్ ముక్కను తినిపించబోయాడు. వెంటనే ఏమాత్రం మొహమాటం లేకుండా రోహిత్ 'ప్లీజ్... నాకొద్దు. దీన్ని తింటే తిరిగి లావెక్కిపోతా'నంటూ జైస్వాల్ ప్రయత్నాన్ని వారించాడు. దీంతో అక్కడున్న సహచరులంతా పెద్దగా నవ్వేశారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. లెక్కలేనన్ని లైక్స్, రీట్వీట్స్‌తో సోషల్ మీడియాలో తెగ సందడి చేస్తుంది. కేక్ చిన్న ముక్కే అయినా రోహిత్ కఠినమైన డైట్‌కు ఇబ్బంది కలగొచ్చనే బెంగతోనే 'హిట్‌మ్యాన్' సున్నితంగా తిరస్కరించాడు. కోహ్లి లాగే కేవలం వన్డేలకే పరిమితమైన ఈ స్టార్ ఓపెనర్, మాజీ విజయవంతమైన కెప్టెన్ గత కొంతకాలంగా ఫిట్‌నెస్‌పైనే ప్రధానంగా దృష్టిపెట్టాడు. వన్డే వరల్డ్‌కప్ (2027)కు దాదాపు ఏడాదిన్నర ఉండటంతో నోటిని డైట్ క్రమశిక్షణతో కట్టిపడేశాడు. దీని వల్లే అతను ఏకంగా 11 కిలోల బరువుతగ్గాడు. ఇంట్లో నోటిని అదుపులో పెట్టుకున్న ఈ దిగ్గజ బ్యాటర్ క్రీజులో మాత్రం బ్యాట్‌కు పనిచెబుతున్నాడు. ఏమాత్రం అడ్డు అదుపు లేకుండా భారీషాట్లతో చెలరేగిపోతున్నాడు. ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లోనూ రోహిత్ రెండు అర్ధసెంచరీలను సాధించాడు. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ గెలిచింది. సిరీస్ కైవసం చేసుకుంది.

మెస్సీ ఖాతాలో మరో ట్రోఫీ

మేజర్ లీగ్ సాకర్ టైటిల్ నెగ్గిన ఇంటర్ మయామి క్లబ్

ఫ్లోరిడా: అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లయోనెల్ మెస్సీ ఖాతాలో మరో టైటిల్ చేరింది. మేజర్ లీగ్ సాకర్ (ఎంఎల్ఎస్) కప్‌లో మెస్సీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఇంటర్ మయామి జట్టు తొలిసారి విజేతగా నిలిచింది. శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన తుదిపోరులో ఇంటర్ మయామి క్లబ్ 3–1 గోల్స్ తేడాతో వాంకోవర్ క్లబ్‌పై విజయం సాధించింది. ఇంటర్ మయామి జట్టు తరఫున మెస్సీ అన్నీ తానై వ్యవహరించాడు. ఫైనల్లో ఈ స్టార్ ఆటగాడు గోల్ చేయలేకపోయినా... సహచరులు గోల్స్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ ఎనిమిదో నిమిషంలో వాంకోవర్ జట్టు ఆటగాడు ఎడైర్ ఒకాంపో 'సెల్ఫ్ గోల్' చేయడంతో మయామి జట్టు ముందంజ వేయగా... ఆ తర్వాత రోడ్రిగో డె పాల్ (71వ నిమిషంలో), టాడియో అల్లెండె (90+6వ నిమిషంలో) చెరో గోల్ కొట్టారు. వాంకోవర్ జట్టు తరఫున అలీ అహ్మద్ (60వ నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు. ఈ సీజన్‌లో మెస్సీకిది మూడో మేజర్ లీగ్ టైటిల్ కాగా... ఓవరాల్‌గా కెరీర్‌లో 47వది. 'మూడేళ్ల క్రితం ఎంఎల్ఎస్ టైటిల్ గెవాలని కలగన్నా... అది ఈ రోజు సాధ్యమైంది. సీజన్ ఆసాంతం జట్టు మొత్తం కలిసికట్టుగా ఆడింది. ఇన్నాళ్లు పడ్డ కష్టానికి ప్రతిఫలం దక్కింది. ఆటగాళ్లందరూ దీనికి అర్హులు' అని మెస్సీ పేర్కొన్నాడు. ఇంటర్ మయామి క్లబ్‌కు ఇదే తొలి ఎంఎల్ఎస్ టైటిల్ కాగా... మెస్సీకి 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్' అవార్డు దక్కింది.

జర్మనీ దిగ్గజ ఆటగాడు థామస్ ముల్లర్ వాంకోవర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించగా... చాన్నాళ్ల తర్వాత ముల్లర్‌పై మెస్సీ ఆధిపత్యం కనబర్చగలిగాడు. గతంలో పలుమార్లు ముల్లర్ కారణంగా అర్జెంటీనా జట్టు ప్రధాన టోర్నీల్లో పరాజయం పాలైంది. 2010 ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్, 2014 వరల్డ్‌కప్ ఫైనల్లో ముల్లర్ సారథ్యంలోని జర్మనీ జట్టు... అర్జెంటీనాపై విజయం సాధించింది. ఇలా ఇప్పటి వరకు పలు కీలక టోర్నీల్లో మెస్సీపై ముల్లర్‌దే ఆధిపత్యం కాగా... ఎట్టకేలకు ఎంఎల్ఎస్ కప్‌లో మెస్సీ బదులు తీర్చుకున్నాడు.

నమీబియా క్రికెట్ జట్టు సలహాదారుగా కిర్‌స్టెన్

కిర్‌స్టెన్

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాకు చెందిన భారత మాజీ హెడ్ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్‌ను నమీబియా పురుషుల క్రికెట్ జట్టు సలహాదారుగా నియమించుకుంది. హెడ్ కోచ్ క్రెయిగ్ విలియమ్స్‌తో కలిసి నమీబియా జట్టు కోసం ఆయన పనిచేయనున్నారు. త్వరలోనే జరిగే టి20 ప్రపంచకప్ వరకు కాంట్రాక్టు కుదిరినట్లు నబీబియా క్రికెట్ బోర్డు వెల్లడించింది. 'నమీబియాలాంటి నిబద్ధత గల జట్టుతో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. కొంతకాలంగా నమీబియా మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. నాకున్న కోచింగ్ అనుభవంతో ఆ జట్టు మరింత రాటుదేలేందుకు, వచ్చే ప్రపంచకప్‌లో రాణించేందుకు కృషి చేస్తాను' అని కిర్‌స్టెన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ సఫారీ మాజీ ఓపెనర్ 2004లో అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరయ్యారు. 2007లో భారత హెడ్ కోచ్‌గా నియమితులయ్యారు. ఆయన కోచింగ్‌లోనే ధోని సేన 2011లో జరిగిన వన్డే వరల్డ్‌కప్‌ను సాధించి, రెండోసారి (1983 తర్వాత) విశ్వవిజేతగా నిలిచింది. తదనంతరం దక్షిణాఫ్రికా సహా పలు జాతీయ జట్లకు హెడ్ కోచ్‌గా వ్యవహరించారు. ఐపీఎల్ సహా విశ్వవ్యాప్తంగా జరిగే టి20 లీగ్‌ల్లోనూ పలు ఫ్రాంచైజీలకు కోచ్‌గా, మెంటార్‌గా కిర్‌స్టెన్ పనిచేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి–మార్చిలలో భారత్, శ్రీలంకలు సంయుక్తంగా టి20 ప్రపంచకప్ టోర్నీకి ఆతిథ్యమివ్వనున్నాయి.

కేరళలోని అష్టముడి సరస్సులో ఆదివారం
అగ్నికి ఆహుతవుతున్న మత్స్యకారుల బోట్లు

యూఏఈలోని అబూ దాబిలో ఆదివారం ఫార్ములా వన్ రేస్ సందర్భంగా
అలరించిన జెట్ విమానాల విన్యాసాలు

జర్మనీ రాజధాని బెర్లిన్‌లో మిచెన్‌డార్ఫ్ వద్ద వార్షిక పోటీలో
శాంతాక్లాజ్ వేషధారణలో పరుగులు తీస్తున్న ఔత్సాహికులు

హలో కొండపల్లి

తొలి మొబైల్ టవర్ రాకతో గ్రామస్తుల సంబరాలు

టవర్ ఏర్పాటయ్యే చోటుకు పిల్లలు సహా తరలివచ్చిన గ్రామస్తులు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మావోయిస్ట్ ప్రభావిత బిజాపూర్ జిల్లా మారుమూలనున్న కొండపల్లి గ్రామంలో మొదటిసారిగా మొబైల్ టవర్ ఏర్పాటైంది. రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌కు 450 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి మొన్నమొన్నటి వరకు బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధాలు లేవు. తెలంగాణ సరిహద్దులకు సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న ఈ పల్లె రోడ్డు, విద్యుత్, తాగునీటి వసతి ఇటీవలి వరకు లేనేలేవు. గత వారం ఈ ఊళ్లో మొబైల్ టవర్ ఏర్పాటు చేశారు. ఇది కేవలం సాంకేతికపరమైన ముందడుగే కాదు, బయటి ప్రపంచంతో ఏర్పడిన సంబంధాలకు ఓ గుర్తని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. బస్తర్ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెక్యూరిటీ క్యాంపునకు ఈ గ్రామం సమీపంలోనే ఉంది. టవర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసిన వెంటనే కొండపల్లి గ్రామంలోని వారు పండగ చేసుకున్నారు. వారంతా కలిసి ఊరేగింపుగా నృత్యాలు చేసుకుంటూ మండార్ డోలు శబ్దాల మధ్య కోలాహలంగా టవర్ ఏర్పాటయ్యే ప్రాంతానికి చేరుకున్నారు. వీరికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తోడయ్యారు. మొబైల్ టవర్ ఏర్పాటుతో ఇప్పుడా గ్రామ ప్రజలు బ్యాంకింగ్ సేవలు, ఆధార్, రేషన్ కార్డు, ఆరోగ్య పథకాలు, పింఛను, విద్యా సేవలకు దగ్గరయ్యారని ప్రభుత్వం తెలిపింది. 2024 డిసెంబర్‌లో కొండపల్లి సమీపంలో భద్రతా బలగాల క్యాంపు ఏర్పాటయ్యాక, శిథిలావస్థకు చేరుకున్న రోడ్డును పునరుద్ధరించారు. మొత్తం 50 కిలోమీటర్ల పొడవైన రహదారి పనులు ఇంకా కొనసాగుతున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. రెండు నెలల క్రితమే ఆ గ్రామానికి మొదటిసారిగా విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. దీంతో, చిన్నారుల చదువు, చిన్న వ్యాపారులు సహా పలు విషయాల్లో గ్రామస్తులు జీవన విధానమే సమూలంగా మారిపోయింది. బస్తర్ ప్రాంతంలోని బిజాపూర్ సహా ఏడు జిల్లాల పరిధిలో 403 గ్రామాల్లో వివిధ ప్రభుత్వ పథకాలు ప్రస్తుతం అమలవుతున్నాయని ప్రభుత్వం వివరించింది.గత రెండేళ్లలో ఇక్కడ 728 మొబైల్ టవర్లు ఏర్పాటు కాగా, మరో 449 టవర్లను 2జీ నుంచి 4జీకి అప్‌గ్రేడ్ చేశారని తెలిపింది.

సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తే మళ్లీ రాజకీయాల్లోకి సిద్ధూ

సిద్ధూ భార్య కౌర్ ప్రకటన

ఛండీగఢ్: పంజాబ్‌లో పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తే నవజ్యోత్ సింగ్ సిద్ధూ తిరిగి క్రియాశీల రాజకీయాల్లోకి వస్తారని ఆయన భార్య, పార్టీ నాయకురాలు కౌర్ అన్నారు. ఏ పార్టీకి ఇవ్వడానికి తమ దగ్గర సరిపడా భారీ నగదు నిల్వల లేవని అన్నారు. కానీ సీఎంగా గెలిస్తే పంజాబ్‌ను బంగారు రాష్ట్రంగా మార్చగలమని ధీమా వ్యక్తం చేశారు. 'మేం పంజాబ్ కోసం, పంజాబీల కోసం ఎప్పుడూ పోరాడుతాం. కానీ ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోవడానికి మా దగ్గర రూ.500 కోట్లు లేవు'అని ఆమె వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై గవర్నర్ గులాబ్ చంద్ కటారియాను కౌర్ కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె.. తమను ఎవరు డబ్బు డిమాండ్ చేశారనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. పంజాబ్ కాంగ్రెస్ యూనిట్‌లో అంతర్గత కలహాలున్నాయని, ముఖ్యమంత్రి పదవిని ఇప్పటికే ఐదుగురు నాయకులు ఆశిస్తున్నారని ఆమె తెలిపారు. 'బీజేపీలో చేరతారా?' అని మీడియా ప్రశ్నించగా.. తాను అతని తరపున వాఖ్యానించలేనన్నారు. పంజాబ్ కాంగ్రెస్ మాజీ చీఫ్ అయిన సిద్ధూ కొన్నాళ్లుగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఆయన ప్రచారం చేయలేదు. ఐపీఎల్–2024 సీజన్‌లో సిద్ధూ క్రికెట్ కామెంటరీలోకి తిరిగి వచ్చారు. ఇటీవల కొత్త యూట్యూబ్ ఛానల్ 'నవజోత్ సిద్ధూ అఫీషియల్'ను ప్రారంభించారు. క్రియాశీల రాజకీయాల్లోకి తిరిగి రావడం గురించి ప్రశ్నించగా.. తాను ప్రజల సంక్షేమం కోసమే రాజకీయాలు చేశానని, తనకదో వ్యాపారం కాదని స్పష్టం చేశారు. 2027లో పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

సాయుధ దళాలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు

న్యూఢిల్లీ: అసమాన ధైర్యసాహసాలతో దేశాన్ని రక్షిస్తున్న సాయుధ దళాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం సాయుధ దళాల జెండా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన తన సామాజిక మాధ్యమ 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్ చేశారు. 'మన దేశాన్ని అచంచల ధైర్యంతో రక్షించే ధైర్యవంతులైన సాయుధబలగాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. మీ క్రమశిక్షణ, సంకల్పం, స్ఫూర్తి ప్రజలను కాపాడతాయి. మన దేశాన్ని బలోపేతం చేస్తాయి. మీ నిబద్ధత దేశం పట్ల మీకున్న భక్తికి ప్రబల నిదర్శనంగా నిలుస్తుంది' అని మోదీ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. సాయుధ దళాల జెండా దినోత్సవ నిధికి ప్రధానమంత్రి విరాళం ఇచ్చారు. ఈ నిధికి విరాళాలు ఇవ్వాలని ప్రజలకు మోదీ విజ్ఞప్తి చేశారు.

విప్ సంస్కృతి వద్దంటూ కాంగ్రెస్ ఎంపీ ప్రైవేట్ బిల్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ స్థిరత్వాన్ని ప్రభావితం చేసే బిల్లులు, తీర్మానాలు కాకుండా ఇతర అంశాలపై ఓటింగ్ సమయంలో పార్లమెంట్ సభ్యులు స్వతంత్రంగా వ్యవహరించడానికి వీలు కల్పించేందుకు ఉద్దేశించిన ప్రైవేట్ బిల్లును కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విప్ ఆధారిత అణచివేత నుంచి ఎంపీలకు విముక్తి కల్పించి, మంచి చట్ట నిర్మాణాన్ని ప్రోత్సహించడమే తన ఉద్దేశమన్నారు. దీనికోసం ఫిరాయింపుల నిరోధక చట్టానికి సవరణలు చేపట్టాలన్నారు. విశ్వాస తీర్మానం, అవిశ్వాస తీర్మానం, వాయిదా తీర్మానం, ద్రవ్య బిల్లులు, ఆర్థిక సంబంధమైన తదితర ప్రభుత్వ స్థిరత్వానికి సంబంధించినవి కాకుండా ఇతర అంశాలపై సభ్యులు స్వతంత్రంగా ఓటింగ్‌లో పాల్గొనేందుకు వీలు కల్పించాలంటూ తివారీ గతంలో 2010, 2021లోనూ ఈ బిల్లును ప్రవేశపెట్టడం గమనార్హం.

ఖరీదైన ఫోను కోసం గొడవ.. బోరు బావిలో దూకి టీనేజర్ ఆత్మహత్య

కచ్: సెల్ ఫోన్ విషయమై తండ్రితో గొడవపడిన ఓ టీనేజర్ బోరుబావిలో దూకి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. గుజరాత్‌లోని కచ్ జిల్లా భుజ్ తాలుకాలో ఘటన చోటుచేసుకుంది. జార్ఖండ్‌కు చెందిన ఓ కుటుంబం కుక్మా గ్రామంలోని ఫాం హౌస్‌లో ఉంటోంది. ఆ కుటుంబానికి చెందిన రుస్తామ్ షేక్(17) శనివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో ఖరీదైన సెల్‌ఫోన్ విషయంపై తండ్రితో గొడవపడ్డాడు. చేతిలోని సెల్‌ఫోన్‌ను విసిరి పారేసి, దగ్గర్లో ఉన్న పడావు పడిన బోరు బావి వద్దకు చేరుకున్నాడు. దానిపైని అడ్డుపెట్టిన బండరాయిని తొలగించి అమాంతం లోపలికి దూకాడు. భూమికి రెండున్నర అడుగుల ఎత్తులో, అడుగున్నర వెడల్పున్న ఆ బావి లోతు 140 అడుగులు. సమాచారం అందడంతో అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఊపిరి అందక రుస్తామ్ కేకలు వేస్తుండటంతో లోపలికి ఆక్సిజన్‌ను పైపుల ద్వారా పంపించారు. వెంటనే సహాయక చర్యలను మొదలుపెట్టారు. ఎట్టకేలకు అతడిని అర్ధరాత్రి దాటాక 3 గంటల సమయంలో వెలుపలికి తీయగలిగారు. వెంటనే ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. అతడు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆత్మహత్యగా కనిపిస్తున్నప్పటికీ ప్రమాదవశాత్తు సంభవించిన మరణంగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నికల సంస్కరణలపై చర్చలో రాహుల్

న్యూఢిల్లీ: లోక్‌సభలో మంగళవారం ఎన్నికల సంస్కరణలపై జరిగే చర్చలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొంటారు. ఆయనతోపాటు కేసీ వేణుగోపాల్, మనీశ్ తివారీ, వర్షా గైక్వాడ్ తదితరులు కూడా పాలుపంచుకుంటారు. ముందు రోజు సోమవారం, వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టే చర్చలో లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్, ప్రియాంకా గాంధీలు పాల్గొననున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. వీరిద్దరితోపాటు దీపేందర్ హుడా, బిమోల్ అకోయిజమ్, ప్రణితి షిండే, కిరణ్ రెడ్డి చామల తదితరులు పాలుపంచుకోనున్నారని ఆ వర్గాలు వివరించాయి. ఎన్నికల సంస్కరణలు, వందేమాతరంపై రాజ్యసభలో మంగళ, బుధ, గురువారాల్లో జరిగే చర్చల్లో ప్రతిపక్ష నేత మలికార్జున ఖర్గే మాట్లాడుతారు.

రేప్ కేసులో భారతీయుడికి జైలు

హామిల్టన్: టీనేజర్‌పై అత్యాచారం ఆరోపణల కేసులో న్యూజిలాండ్ కోర్టు భారత సంతతి క్యాబ్ డ్రైవర్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ ఘటన 2023లో చోటుచేసుకుంది. హామిల్టన్‌లో క్యాబ్ నడిపే సత్వీందర్ సింగ్ ఓ టీనేజర్‌ను తీసుకెళ్తున్నాడు. మార్గమధ్యంలో క్యాబ్‌లోని జీపీఎస్‌ను స్విచ్ఛాఫ్ చేశాడు. దీనివల్ల ఆ ట్రిప్ పూర్తయినట్లు కనిపిస్తుంది. అనంతరం డోర్ లాక్ చేసి, మరో రూట్‌లోకి వాహనాన్ని మలిపి, ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో తానెంతో వేదన చెందినట్లు బాధకు గురయినట్లు బాధితురాలు తెలిపింది. అయితే, ఇదంతా కట్టుకథ అనీ, పరస్పర సమ్మతితోనే అదంతా జరిగిందని సింగ్ తరపు లాయర్ వాదించారు. న్యూజిలాండ్ మహిళలు చాలా ఫాస్ట్ అని పేర్కొన్నారు. సిక్కు మతానికి చెందిన తన క్లయింట్ జైలులో ఇబ్బందులు ఎదుర్కొంటాడని తెలిపారు. ఈ వాదనలను జడ్జి తోసిపుచ్చారు. బాధితురాలి మానసిక పరిస్థితిపై ఆ ఘటన తీవ్ర ప్రభావం కలిగించిందని, బయటి ప్రపంచం ప్రమాదకరమైందనే భావనకు వచ్చిందని పేర్కొన్నారు. సత్వీందర్ సింగ్‌కు ఏడేళ్ల రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

ముంద్వా భూమి కేసులో రవీంద్ర అరెస్టు

పుణే: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తనయుడు పార్థ్ పవార్ భాగస్వామిగా ఉన్న సంస్థకు సంబంధించిన ముంద్వా భూవివాదంలో సబ్ రిజిస్ట్రార్ రవీంద్ర తరును పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఆయనకు అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించిన ప్రభుత్వం గతంలోనే సస్పెండ్ చేసింది. పుణేలో రూ.300 కోట్ల విలువైన 40 ఎకరాల ప్రభుత్వ భూమిని పార్థ్ పవార్ భాగస్వామిగా ఉన్న అమాదియా ఎంటర్‌ప్రైజెస్‌కు అక్రమంగా కట్టబెట్టినట్లు కేసు నమోదైంది. వాస్తవానికి ఈ భూమి మార్కెట్ విలువ రూ.1,800 కోట్లు ఉంటుంది.



వాంగ్‌చుక్ నిర్బంధంపై నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నిర్బంధాన్ని సవాల్ చేస్తూ ఆయన భార్య గీతాంజలి జె. ఆంగ్మో వేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీం కోర్టు విచారణ చేపట్టనుంది. జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ) కింద వాంగ్‌చుక్‌ను నిర్బంధించడం అక్రమం, ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తూ ఏకపక్షంగా తీసుకున్న చర్యగా గీతాంజలి పేర్కొన్నారు. నవంబర్ 24వ తేదీన జరిగిన విచారణ సందర్భంగా పిటిషన్‌పై వివరణ ఇచ్చేందుకు సమయం కావాలంటూ కేంద్రం, లద్దాఖ్ యంత్రాంగం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరడంతో సుప్రీం ఓకే చెప్పింది. దీనిపై జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్వీ అంజారియాల ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టనుంది. లద్దాఖ్‌ను రాజ్యాంగం ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని, రాష్ట్ర హోదా కల్పించాలనే డిమాండ్లతో సెప్టెంబర్‌లో చేపట్టిన ఆందోళన హింసాత్మక రూపం దాల్చింది. పలు ఘటనల్లో నలుగురు చనిపోగా, 90 మంది వరకు గాయపడ్డారు. హింసను ప్రేరేపించారనే ఆరోపణలపై వాంగ్‌చుక్‌ను సెప్టెంబర్ 26వ తేదీన నిర్బంధంలోకి తీసుకున్నారు.

బెనిన్‌లో తిరుగుబాటు యత్నం భగ్నం

తిరుగుబాటును టీవీలో ప్రకటిస్తున్న మిలటరీ కమిటీ సభ్యులు

కొటొనౌ: పశ్చిమ ఆఫ్రికా దేశం బెనిన్‌లో ఆదివారం జరిగిన తిరుగుబాటు యత్నం విఫలమైంది. ఆదివారం, డిసెంబర్ 7వ తేదీ ఉదయం కొందరు సైనికులు దేశాన్ని, రాజ్యాంగ సంస్థలను అస్థిరపరిచేందుకు ప్రయత్నించారు. అయితే, బెనిన్ సైనిక బలగాలు, వాటి నాయకత్వం, తమ ప్రమాణానికి కట్టుబడి ఉన్నాయి. దేశం కోసం నిలబడ్డాయి. కుట్రను భగ్నం చేశాయి'అని అంతర్గత మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అంతకుముందు, మిలటరీ కమిటీ ఫర్ రీఫౌండేషన్ అని చెప్పుకుంటూ కొందరు సైనికులు ప్రభుత్వ టీవీలో తిరుగుబాటు ద్వారా ప్రభుత్వాన్ని రద్దు చేశామని ప్రకటించుకున్నారు. లెఫ్టినెంట్ కల్నల్ పాస్కల్ టిగ్రిని మిలటరీ కమిటీ అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు తెలిపారు. అధ్యక్ష భవనం పరిసరాల్లో కాల్పుల శబ్దాలు వినిపించాయి. ఈ పరిణామాల నడుమ అధ్యక్షుడు పాట్రిస్ టలోన్ ఎక్కడున్నారనేది తెలియరాలేదు. కొద్దిసేపు ప్రభుత్వ టీవీ, రేడియో సిగ్నళ్లు ఆగిపోయాయి. అనంతరం ప్రసారాలు తిరిగి మొదలయ్యాయి. బెనిన్‌లో తిరుగుబాటు వార్తలపై ఎకనామిక్ కమ్యూనిటీ ఆఫ్ వెస్ట్ ఆఫ్రికన్ స్టేట్స్(ఎకోవాస్) స్పందించింది. బెనిన్‌లోని పాస్కల్ ప్రభుత్వానికి పూర్తి మద్దతు ప్రకటించింది. అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చింది. 2016 నుంచి అధికారంలో కొనసాగుతున్న పాస్కల్ వచ్చే మార్చిలో అధ్యక్ష ఎన్నికల అనంతరం వైదొలగాల్సి ఉంది. 1960లో ఫ్రాన్స్ నుంచి స్వాతంత్ర్యం పొందిన బెనిన్‌లో తరచూ తిరుగుబాట్లు జరుగుతున్నాయి. 1991 నుంచి దేశంలో స్థిరత్వం నెలకొంది. టలోన్ పార్టీకి చెందిన మాజీ ఆర్థిక మంత్రి రొము వాల్డ్ వడగ్ని వచ్చే ఎన్నికల్లో గెలిచే అవకాశాలున్నాయి. ప్రతిపక్ష నేత రెనాడ్ అగ్బొజోకు తగినంత మంది మద్దతు తెలపలేదనే కారణంతో అధికారులు అనర్హుడిగా ప్రకటించారు. 2024లో తిరుగుబాటుకు కుట్ర పన్నారనే ఆరోపణలపై టలోన్ సన్నిహితులిద్దరికి కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. గత నెలలో దేశ పార్లమెంట్ అధ్యక్షుడి పదవీ కాలాన్ని ఐదు నుంచి ఏడేళ్లకు పెంచింది. అయితే, రెండు పర్యాయాలు మాత్రమే పనిచేయాలనే నిబంధన విధించింది. మరో పశ్చిమాఫ్రికా దేశం గినియా బిస్సావులో ఇటీవల సైనిక తిరుగుబాటు జరగడం తెల్సిందే.

గల్వాన్ యుద్ధ స్మారకం ఆవిష్కరణ

లద్దాఖ్: ప్రపంచంలోనే అత్యధిక ఎత్తులో నిర్మించిన గల్వాన్ యుద్ధ స్మారక చిహ్నాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం ఆవిష్కరించారు. లద్దాఖ్‌లోని దర్బుక్ షియోక్ దౌలత్ బేగ్ ఓల్డీ రోడ్డులో కేఎం–120 పోస్ట్ సమీపంలో దీనిని ఏర్పాటు చేశారు. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో చైనా బలగాలతో జరిగిన ఘర్షణలో 20 మంది భారత సైనికులు నేలకొరగడం తెలిసిందే. స్మారక చిహ్నాన్ని త్రిశూలం, డమరుకం రూపంలో రూపొందించారు. త్యాగం, వీరత్వానికి చిహ్నంగా ఎరుపు, నలుపు రంగు గ్రానైట్ రాళ్లతో నిర్మించిన స్మారక చిహ్నంపై యుద్ధవీరులకు గుర్తుగా కాంస్యంతో తయారు చేసిన 20 బొమ్మలను ఏర్పాటు చేశారు. ఇక్కడి కాంప్లెక్సులో మ్యూజియం, గల్వాన్ ఘటనను తెలిపే డిజిటల్ గ్యాలరీ ఉన్నాయి.

తల్లి పక్కన నిద్రిస్తున్న శిశువును ఎత్తుకెళ్లిన తోడేలు

- తొమ్మిది రోజుల వ్యవధిలో మూడో ఘటన
- డ్రోన్ కెమెరాలతో ముమ్మర గాలింపు

బహ్రెయిచ్: ఉత్తరప్రదేశ్‌లోని కైసర్ గంజ్ ప్రాంతంలో మరోసారి తోడేలు దాడి ఘటన చోటుచేసుకుంది. తల్లి పక్కన నిద్రిస్తున్న చిన్నారిని ఓ తోడేలు నోట కరుచుకుని ఎత్తుకెళ్లింది. అటవీ సిబ్బంది, గ్రామస్తులు డ్రోన్ కెమెరాల సాయంతో ముమ్మరంగా గాలింపు చేపట్టారు. ఘటన మల్లహన్‌పుర్వ గ్రామంలో శనివారం అర్ధరాత్రి దాటాక జరిగింది. కిరణ్ సంతోష్ దంపతుల నాలుగు నెలల సుభాష్ తల్లి పక్కన నిద్రిస్తుండగా చడీచప్పుడు కాకుండా ఇంట్లోకి ప్రవేశించిన తోడేలు నోట కరుచుకుని సమీపంలోని అడవిలోకి పరుగుతీసింది. వెంటనే అప్రమత్తం చేయడంతో గ్రామస్తులు ఆ ప్రాంతాన్నంతా గాలించారు. లాభం లేకపోవడంతో అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అటవీ శాఖ బృందాలు గ్రామానికి చేరుకుని డ్రోన్ కెమెరాలతో చిన్నారి జాడను కనుగొనేందుకు యత్నిస్తున్నారు. 'గతంలో తోడేలు కనిపించినట్లు గ్రామస్తులు చెప్పిన నదీ సమీప ప్రాంతాలు, చెరకు తోటలు సహా అన్ని ప్రాంతాల్లోనూ మా బృందాలు గాలిస్తున్నాయి. శిక్షణ పొందిన షూటర్లను కూడా రంగంలోకి దించాం. ఆ తోడేలును పట్టుకోవడమో లేదా చంపేయడమో చేస్తాం'అని డీఎఫ్‌వో రామ్ సింగ్ యాదవ్ చెప్పారు. కాగా, మల్లన్‌పుర్వ గ్రామంలో గత 9 రోజుల వ్యవధిలో చోటుచేసుకున్న మూడో ఘటన ఇది. నవంబర్ 28న ఐదేళ్ల బాలుడు స్టార్ తోడేలు దాడిలో ప్రాణాలు కోల్పోయాడు. డిసెంబర్ 5న మరో ఐదేళ్ల బాలిక తోడేలు దాడిలో గాయపడింది. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి బహ్రెయిచ్ జిల్లాలో తోడేళ్ల దాడుల ఘటనలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 8 మంది చిన్నారులతోపాటు ఓ వృద్ధుడు చనిపోయారు. మరో 32 మంది గాయపడ్డారు. దీంతో, సీఎం యోగి ఆదిత్యనాథ్ ఈ ప్రాంతంలో ఏరియల్ సర్వే చేపట్టారు. ఆయన ఆదేశాలతో షూటర్లు నాలుగు తోడేళ్లను కాల్చి చంపారు.

ఉత్తరభారతాన్ని వణికిస్తున్న చలి

న్యూఢిల్లీ: ఉత్తరభారతంలో శీతల పరిస్థి తులు కొనసాగుతున్నాయి. ఆదివారం జమ్మూకశ్మీర్‌లోని అమర్‌నాథ్ యాత్ర బేస్ క్యాంపులో అత్యధికంగా మైనస్ 4.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇక్కడే ప్రముఖ పర్యాటక ప్రాంతం పహల్గాం రిసార్టుంది. కశ్మీర్‌లోని వివిధ ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతల్లో పెరుగుదల నమోదవుతున్నప్పటికీ, ఇప్పటికీ 0–1 డిగ్రీ సెల్సియస్ మధ్యలోనే కొనసాగుతున్నాయని ఐఎండీ తెలిపింది. అదేసమయంలో, పంజాబ్, హరియా ణా, రాజస్తాన్‌లలో 3 నుంచి 7 డిగ్రీల సెల్సియస్ డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలున్నాయి. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాల్లోని కొన్ని ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో చలిగాలులు వీచే అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఢిల్లీలో కనీస ఉష్ణోగ్రత 8 డిగ్రీలుగా ఉంది. జార్ఖండ్‌లో ని 8 జిల్లాల పరిధిలో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల సెల్సియస్ దిగువన నమోదవు తున్నాయి. పశ్చిమబెంగాల్‌లోనూ ఇవే పరిస్థితులున్నాయి. డార్జిలింగ్‌లో ఆదివారం 6.2 డిగ్రీలుగా ఉంది.

మూడేళ్లుగా కరెంటు బిల్లు కట్టని తేజ్ ప్రతాప్ యాదవ్

పట్నా: బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ పెద్దకుమారుడు, ఇటీవల మహువా అసెంబ్లీ స్థానం నుంచి ఓడిపోయిన తేజ్ ప్రతాప్ యాదవ్ మరోసారి వార్తల్లో నిలిచారు. గతంలో ఎమ్మెల్యే హోదాలో ప్రభుత్వ నివాసంలో తేజ్ ప్రతాప్ నివసించిన కాలంలో నమోదైన రూ. 3.6 లక్షల విద్యుత్ బిల్లును ఆయన ఇంకా చెల్లించలేదన్న విషయం తాజాగా బట్టబయలైంది. పట్నాలోని బ్యూర్ ప్రాంతంలో ఉన్న సొంత ఇంటికి సంబంధించిన విద్యుత్ బిల్లును 2022 జూలై నుంచి ఇప్పటివరకు ఆయన చెల్లించలేదు. మూడేళ్ల బకాయిలు అలాగే పేరుకు పోయాయి. సామాన్యులు ఒక నెల బకాయి ఉన్నా కనెక్షన్ తీసేసే విద్యుత్ అధికారులు తేజ్ ప్రతాప్ విషయంలో మాత్రం ఉదారంగా వ్యవహరించడంతో బిహార్ విద్యుత్ సంస్థ పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బకాయిలు పెరగకుండా నిరోధించడానికి బిహార్ రాష్ట్ర విద్యుత్ సంస్థ స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లకు మారింది. కానీ తేజ్ ప్రతాప్ నివాసంలో మాత్రం పోస్ట్‌పెయిడ్ మీటర్ నడుస్తుండటం గమనార్హం. కంపెనీ నిబంధనల ప్రకారం రూ.25,000, అంతకంటే ఎక్కువ బకాయిలు పడిన పోస్ట్‌పెయిడ్ కనెక్షన్‌ను వెంటనే రద్దుచేయాలి. బకాయిలు రూ.3 లక్షలు దాటినా అతని ఇంటిఇక విద్యుత్‌సరఫరా ఎందుకు నిలిపేయలేదని పలు పార్టీల నేతలు విమర్శలు మొదలెట్టారు.

మధ్యప్రదేశ్‌లో 10 మంది నక్సల్స్ లొంగుబాటు

బాలాఘాట్: మధ్యప్రదేశ్‌లో 10 మంది నక్సలైట్లు ఆదివారం ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ సమక్షంలో లొంగిపోయారు. వీరిపై 2.36 కోట్ల నగదు బహుమతి ఉన్నట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయినవారిలో నలుగురు మహిళలు ఉన్నారు. ఏకే–47, ఇన్సాస్ రైఫిల్స్ సహా పలు ఆధునిక ఆయుధాలను ప్రభుత్వానికి అప్పగించారు. వీరంతా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా(మావోయిస్టు)కు చెందిన భోర్సాదేవ్ ఏరియా కమిటీ సభ్యులు అని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని దిండోరి, మాండ్ల ప్రాంతాలు నక్సల్స్ ప్రభావం నుంచి పూర్తిగా విముక్తి పొందినట్లు సీఎం మోహన్ యాదవ్ ప్రకటించారు. దేశంలో చిట్టచివరి 'లాల్ సలామ్'కు సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

యూపీలోని బదౌన్‌కు చెందిన ఈ యువతి ఏకంగా శ్రీకృష్ణుడినే పెళ్లాడింది. గ్రామమంతా తరలివచ్చి, ఈ పెళ్లి తంతును ఆసక్తిగా తిలకించింది

దేశంలో అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

74వ రాజ్యాంగ సవరణ చట్టం

74వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని 'నగరపాలక చట్టం' అని కూడా అంటారు. దీని ద్వారా పట్టణ ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించారు. నగర పాలక బిల్లును పార్లమెంటులో 1991లో ప్రవేశపెట్టారు. దీన్ని 1992లో ఆమోదించారు. 1993 జూన్ 1 నుంచి దీన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ప్రకరణలు 243(P) నుంచి 243(ZG) వరకు ఈ చట్టం గురించి తెలియజేస్తాయి. వీటిని ప్రత్యేకంగా IX(A) భాగంలో చేర్చారు.

ప్రకరణ 243(P)–మున్సిపాలిటీల నిర్వచనం

మున్సిపల్ కార్పొరేషన్: ఒక నగరాన్ని పరిపాలించడానికి ఏర్పాటు చేసిన సంస్థ.

మున్సిపాలిటీ: ఒక పట్టణాన్ని పరిపాలించడానికి ఏర్పాటు చేసిన సంస్థ.

నగర పంచాయతీ: గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతంగా మారుతున్న పట్టణాన్ని పరిపాలించడానికి ఏర్పాటు చేసిన సంస్థ.

మెట్రోపాలిటన్ నగరం: జనాభా 10 లక్షలు దాటిన నగరం. దేశంలో వీటి సంఖ్య 53.

ప్రకరణ 243(Q)–మున్సిపాలిటీల ఏర్పాటు:

మున్సిపల్ కార్పొరేషన్: జనాభా 3 లక్షలు దాటిన నగరాన్ని కార్పొరేషన్‌గా గుర్తించవచ్చు.

తెలంగాణలో వీటి సంఖ్య 6. అవి:

1. హైదరాబాద్ 2. వరంగల్
3. కరీంనగర్ 4. నిజామాబాద్
5. రామగుండం 6. ఖమ్మం

ఆంధ్రప్రదేశ్‌లో 13 ఉన్నాయి. అవి:

1. కర్నూల్ 2. కడప
3. అనంతపురం 4. చిత్తూర్
5. తిరుపతి 6. నెల్లూరు
7. ఒంగోలు 8. గుంటూరు
9. విజయవాడ 10. ఏలూరు
11. కాకినాడ 12. రాజమండ్రి
13. విశాఖపట్నం

మున్సిపాలిటీ: జనాభా 40 వేలు దాటిన పట్టణాన్ని మున్సిపాలిటీగా గుర్తిస్తారు. తెలంగాణలో 37, ఆంధ్రప్రదేశ్‌లో 67 మున్సిపాలిటీలు ఉన్నాయి. వార్షిక ఆదాయం ఆధారంగా వీటిని అయిదు రకాలుగా పేర్కొంటారు.

1. థర్డ్‌గ్రేడ్ – రూ. కోటి లోపు ఆదాయం
2. సెకండ్ గ్రేడ్ – రూ. కోటి నుంచి రెండు కోట్ల ఆదాయం
3. ఫస్ట్‌గ్రేడ్ – రెండు నుంచి మూడు కోట్ల రూపాయల ఆదాయం
4. స్పెషల్ గ్రేడ్ – మూడు నుంచి నాలుగు కోట్ల ఆదాయం
5. సెలక్షన్ గ్రేడ్ – నాలుగు కోట్ల రూపాయలకు పైగా ఆదాయం

నగర పంచాయతీ: సాధారణంగా 11,000 కంటే ఎక్కువ 40,000 కంటే తక్కువ జనాభా ఉన్న, గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతంగా మారుతున్నదాన్ని నగర పంచాయతీగా గుర్తిస్తారు. తెలంగాణలో 26, ఆంధ్రప్రదేశ్‌లో 32 నగర పంచాయతీలు ఉన్నాయి.

ప్రకరణ 243(R) – మున్సిపాలిటీల నిర్మాణం

I. మున్సిపల్ కార్పొరేషన్

ఇందులో ప్రధానంగా 4 విభాగాలు ఉంటాయి.

కార్పొరేషన్ కౌన్సిల్: ఇందులో మూడు రకాల సభ్యులు ఉంటారు.

1. ప్రత్యక్షంగా ఎన్నికైన కార్పొరేటర్లు
2. పదవీ రీత్యా సభ్యులు
3. సహకార సభ్యులు

మేయర్: ఈయనను పరోక్షంగా ఎన్నుకుంటారు. అవిశ్వాస తీర్మానం ద్వారా ముందుగానే తొలగించవచ్చు.

స్థాయి సంఘాలు: కార్పొరేషన్‌లో 6 స్థాయి సంఘాలు ఉంటాయి. ఇవి కీలకపాత్ర పోషిస్తాయి.

కమిషనర్: ఈయన కార్పొరేషన్ సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారు.

II. మున్సిపాలిటీ

ఇందులో ప్రధానంగా మూడు విభాగాలు ఉంటాయి.

మున్సిపల్ కౌన్సిల్: ఇందులో మూడు రకాల సభ్యులు ఉంటారు.

1. ప్రత్యక్షంగా ఎన్నికైన కౌన్సిలర్లు
2. పదవీ రీత్యా సభ్యులు
3. సహకార సభ్యులు

మున్సిపల్ చైర్మన్: పరోక్షంగా అయిదేళ్లకు ఎన్నికవుతారు. అవిశ్వాస తీర్మానం ద్వారా ముందుగానే తొలగించవచ్చు.

మున్సిపల్ కమిషనర్: మున్సిపల్ సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారు.

ప్రకరణ 243(S)–వార్డు కమిటీల ఏర్పాటు: ప్రతి వార్డుకు లేదా ఒకటి కంటే ఎక్కువ వార్డులకు కలిపి వార్డు కమిటీని ఏర్పాటు చేయవచ్చు. దీని అధ్యక్షుడిగా వార్డు కౌన్సిలర్ కొనసాగుతారు. సభ్యులుగా పౌర ప్రముఖులను నియమిస్తారు. వీటి ఉద్దేశం పౌరుల సహకారం, భాగస్వామ్యంతో వార్డును అభివృద్ధి పరచడం.

ప్రకరణ 243 (T) – రిజర్వేషన్లు: జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు 18.25%, ఎస్టీలకు 8.25% రిజర్వేషన్లు కల్పించారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు 34%, మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించారు. ఈ రిజర్వేషన్లను రొటేషన్ పద్ధతిలో అమలు పరుస్తారు.

ప్రకరణ243 (U) – కాలపరిమితి: మున్సిపాలిటీల సాధారణ కాలపరిమితి అయిదేళ్లు. ఏదైనా మున్సిపాలిటీ రద్దైతే 6 నెలల్లోపు ఉప ఎన్నికలు నిర్వహించాలి. ఒకవేళ మున్సిపాలిటీ కాలం పూర్తవడానికి 6 నెలల కంటే తక్కువ సమయం ఉంటే ఉపఎన్నిక జరపాల్సిన అవసరం లేదు.

ప్రకరణ 243(V) – అభ్యర్థుల అనర్హతలు: మున్సిపాలిటీలకు పోటీ చేసే అభ్యర్థుల అర్హతలను రాజ్యాంగం ద్వారా కాకుండా శాసనసభ చట్టం ద్వారా నిర్ణయిస్తారు. వీటికి పోటీ చేయడానికి కనీస వయసు 21 సంవత్సరాలు. 1995 తర్వాత ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్నవారు అనర్హులు.



ప్రకరణ 243(W) – మున్సిపాలిటీల విధులు, అధికారాలు: మున్సిపాలిటీలకు మొత్తం 18 అంశాలపై అధికారం కల్పించారు. వీటిని ప్రత్యేకంగా 12వ షెడ్యూల్లో చేర్చారు. ఈ అధికారాలను బదలాయించే అధికారం రాష్ట్ర శాసనసభకు కల్పించారు. వీటిలో 11 తప్పనిసరి, 7 ఐచ్ఛిక విధులు ఉన్నాయి.

తప్పనిసరి విధులకు ఉదాహరణ:

1. నగర ప్రణాళిక రూపకల్పన
2. భూముల క్రమబద్ధీకరణ, భవనాల నిర్మాణం
3. మురికివాడల అభివృద్ధి
4. రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం
5. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం
6. అగ్నిమాపక సేవలు
7. పట్టణ పర్యావరణ రక్షణ ఏర్పాట్లు
8. పట్టణ, పేదరిక నిర్మూలన
9. జనన, మరణాల నమోదు
10. శ్మశానాల ఏర్పాటు, నిర్వహణ

ప్రకరణ 243 (X) – మున్సిపాలిటీల ఆదాయ మార్గాలు: మున్సిపాలిటీలకు ప్రధానంగా 5 రకాల ఆదాయ మార్గాలు ఉన్నాయి.

1. పన్నులు (ఇంటి పన్ను, నీటి పన్ను, ఆస్తి పన్ను, వినోద పన్ను).
2. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులు
3. ఆస్తులు 4. విరాళాలు
5. ధర్మ, ఇతర సంస్థల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయం

ప్రకరణ 243 (Y) – ఆర్థిక సంఘం: మున్సిపాలిటీలకు నిధుల పంపిణీ కోసం గవర్నర్ రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయాలి. అధికరణ 243(I) ప్రకారం ఏర్పాటు చేసే ఆర్థిక సంఘం వీటికి కూడా వర్తిస్తుంది.

ప్రకరణ 243 (Z) – మున్సిపాలిటీల ఆడిటింగ్ అండ్ అకౌంటింగ్: వీటి నిర్వహణ కోసం శాసనసభ చట్టం ద్వారా ప్రత్యేక ఆడిటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం వీటిని ఏర్పాటు చేయలేదు. జిల్లా స్థాయి ఆడిటర్లు వీటిని నిర్వహిస్తున్నారు.

ప్రకరణ 243 (ZA) – మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణ: మున్సిపాలిటీలకు సకాలంలో, సక్రమంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి గవర్నర్ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేయాలి. ప్రకరణ 243(K) ప్రకారం ఏర్పాటు చేసే రాష్ట్ర ఎన్నికల సంఘం వీటికి కూడా ఎన్నికలను నిర్వహిస్తుంది.

ప్రకరణ 243 (ZB) – కేంద్రపాలిత ప్రాంతాలకు వర్తింపు: నగరపాలక చట్టం కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా వర్తిస్తుంది. అసెంబ్లీ ఉన్నవాటికి అసెంబ్లీ చట్టం ద్వారా, లేనివాటికి రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా వర్తింపజేస్తారు.

ప్రకరణ 243 (ZC) – కొన్ని ప్రాంతాలకు మినహాయింపు: ప్రకరణ 244లో పేర్కొన్న షెడ్యూల్డు ప్రాంతాలకు, ఆదివాసీ ప్రాంతాలకు నగరపాలక చట్టం వర్తించదు. పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతానికి కూడా వర్తించదు.

ప్రకరణ–243 (ZD) – జిల్లా ప్రణాళిక కమిటీ: ప్రతి జిల్లాకు ఒక ప్రణాళిక కమిటీని ఏర్పాటు చేయాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007లో ఏర్పాటు చేశారు. వీటిలో 30 మంది సభ్యులు ఉంటారు. వీరిలో 24 మంది ఎన్నికైనవారు (పంచాయతీలకు ఎన్నికైన సభ్యుల నుంచి 80%, మున్సిపాలిటీలకు ఎన్నికైన సభ్యుల నుంచి 20% మందిని తీసుకుంటారు). మిగిలిన ఆరుగురిలో.. అల్పసంఖ్యాక వర్గం నుంచి ఒకరు, వివిధ రంగాల్లో నిపుణులైన ముగ్గురు, జడ్పీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఉంటారు. పదవీ రీత్యా జడ్పీ చైర్మన్ దీని అధ్యక్షుడిగా కొనసాగుతారు.

ప్రకరణ 243 (ZE) – మెట్రోపాలిటన్ ప్రణాళిక కమిటీ: జనాభా 10 లక్షలు కంటే ఎక్కువ ఉన్న ప్రాంతాలకు వీటిని ఏర్పాటు చేస్తారు. దీని నిర్మాణం, విధులను రాష్ట్ర శాసనసభ చట్టం ద్వారా నిర్ణయిస్తారు. దీని అధ్యక్షునిగా నగర మేయర్ కొనసాగుతారు. కమిషనర్ మెంబర్ సెక్రటరీగా కొనసాగుతారు. మున్సిపల్ పరిపాలన అనుభవం ఉన్న నలుగురిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. మరికొందరిని గ్రామపంచాయతీ అధ్యక్షులు, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికైన సభ్యులు ఎన్నుకొంటారు.

ప్రకరణ 243 (ZF) – పాత శాసనాల కొనసాగింపు: 74వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చేంత వరకూ పాత చట్టాలే కొనసాగుతాయని, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు శాసనసభ చట్టం ద్వారా కొత్త చట్టాలను అనువర్తింపజేసుకోవాలని ఈ ప్రకరణ తెలియజేస్తుంది.

ప్రకరణ 243 (ZG) – న్యాయస్థానాల జోక్యం నుంచి మినహాయింపు: మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, ఎన్నికల నిర్వహణ, వార్డుల విభజన మొదలైన విషయాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోకూడదు.

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశంలో ఏర్పాటు చేసిన మొదటి మున్సిపాలిటీ ఏది?
   ఎ) ముంబై బి) మద్రాస్
   సి) మచిలీపట్నం డి) కోల్‌కతా
2. దేశంలో ఉన్న కంటోన్మెంటు బోర్డులెన్ని?
   ఎ) 55 బి) 60 సి) 62 డి) 65
3. భారతదేశంలో కంటోన్మెంటు చట్టాన్ని ఏ సంవత్సరంలో చేశారు?
   ఎ) 1907 బి) 1914
   సి) 1924 డి) 1927
4. భారతదేశంలో మొదటగా ఏర్పాటు చేసిన పట్టణాభివృద్ధి సంస్థ ఏది?
   ఎ) ముంబై బి) ఢిల్లీ
   సి) కోల్‌కతా డి) అలహాబాద్
5. జిల్లా ప్రణాళిక కమిటీ అధ్యక్షునిగా ఎవరు కొనసాగుతారు?
   ఎ) జిల్లా కలెక్టర్
   బి) జిల్లా పరిషత్ అధ్యక్షుడు
   సి) సంబంధిత జిల్లా మంత్రి
   డి) పైన పేర్కొన్న ఎవరూ కాదు
6. భారతదేశంలో అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ ఏది?
   ఎ) ముంబై బి) కోల్‌కతా
   సి) ఢిల్లీ డి) చెన్నై
7. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మొదటి మేయర్ ఎవరు?
   ఎ) సరోజినీ పుల్లారెడ్డి
   బి) మాడపాటి హనుమంతరావు
   సి) సలావుద్దీన్
   డి) వెంకట్రామి రెడ్డి
8. నగరపాలక సంస్థలకు సంబంధించి ప్రత్యేక సిబ్బంది విధానం ఏయే రాష్ట్రాల్లో అమల్లో ఉంది?
   ఎ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ
   బి) ఉత్తరప్రదేశ్, బిహార్
   సి) గుజరాత్, పశ్చిమబెంగాల్
   డి) పైవేవీ కావు
9. సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ ఏ నగరంలో ఉంది?
   ఎ) హైదరాబాద్ బి) పుణే
   సి) న్యూఢిల్లీ డి) చెన్నై

సమాధానాలు

1) బి; 2) సి; 3) సి; 4) బి; 5) బి; 6) ఎ; 7) బి; 8) సి; 9) సి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. భారత రాజ్యాంగంలోని 12వ షెడ్యూల్‌లో మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్ని పాలనా నియంత్రణ వ్యవహారాల గురించి పేర్కొన్నారు?
   ఎ) 15 బి) 16
   సి) 17 డి) 18
2. గ్రామీణ ప్రాంతం నుంచి నగర ప్రాంతానికి మారేవి:
   ఎ) నగర పంచాయతీలు
   బి) రూరల్ మున్సిపాలిటీలు
   సి) పంచాయతీ మున్సిపాలిటీలు
   డి) మున్సిపల్ పంచాయతీలు
3. భారత రాజ్యాంగ ఎన్నో ఆర్టికల్ ప్రకారం మున్సిపాలిటీలకు అధికారాలను ఇచ్చే హక్కు రాష్ట్ర శాసనసభకు ఉంది?
   ఎ) 243 (V) బి) 243 (W)
   సి) 243 (Z) డి) 243 (S)
4. భారతదేశంలో మొత్తం స్థానాల్లో మూడో వంతు స్థానాలను మహిళలకు ఏ ఎన్నికలకు సంబంధించి కేటాయించారు?
   ఎ) గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలు
   బి) విధాన సభలు
   సి) విధాన మండలి డి) పైవన్నీ
5. భారతదేశంలో నగర స్థానిక సంస్థలకు సంబంధించిన రాజ్యాంగ సవరణ ఏది?
   ఎ) 64వ సవరణ బి) 72వ సవరణ
   సి) 73వ సవరణ డి) 74వ సవరణ

సమాధానాలు

1) డి; 2) ఎ; 3) బి; 4) ఎ; 5) డి.

కలువ కన్నులు అనేది ఏ సమాసం?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

సమాసాలు

సమ ప్రాధాన్యం ఉన్న రెండు వేర్వేరు పదాలు ఏకపదంగా సమసించి కొత్త అర్థాన్ని సూచించడాన్ని 'సమాసం' అంటారు.

ఉదా: 'పని', 'మనిషి' అనే రెండు వేర్వేరు పదాలు కలిసి 'పనిమనిషి' అనే సమాస పదం ఏర్పడింది.

పద ప్రాధాన్యాన్ని అనుసరించి సమాసాలు ఆరు రకాలు.. అవి:

1) అవ్యయీభావ సమాసం
2) తత్పురుష సమాసం
3) ద్వంద్వ సమాసం
4) బహుబ్రీహి సమాసం
5) కర్మధారయం
6) ద్విగువు

డీఈఈసెట్ పరీక్షలో సమాసాలపై తప్పనిసరిగా ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి అభ్యర్థులు వీటిపై అవగాహన పెంచుకోవాలి.

మాదిరి ప్రశ్నలు

1. 'చంపకవతి పట్టణం' ఏ సమాసం?
   1) విశేషణ పూర్వ పద కర్మధారయం
   2) సంభావన పూర్వ పద కర్మధారయం
   3) ఉపమాన పూర్వ పద కర్మధారయం
   4) ఉపమాన ఉత్తర పద కర్మధారయం
2. 'సూర్యచంద్రులు' ఏ సమాసం?
   1) బహుబ్రీహి
   2) విశేషణ ఉభయ పద కర్మధారయం
   3) ద్వంద్వ సమాసం
   4) విశేషణ ఉత్తర పద కర్మధారయం
3. 'అబ్జముల వంటి పదములు' విగ్రహ వాక్యానికి సమాస పదం ఏమిటి?
   1) పాదాబ్జములు 2) అబ్జపదాలు
   3) పదాబ్జములు 4) అబ్జపాదాలు
4. 'నలుదెసలు' అనేది ఏ సమాసం?
   1) ద్వంద్వ 2) ద్విగువు
   3) విశేషణ పూర్వ పద కర్మధారయం
   4) రూపకం
5. కింది వాటిలో ద్విగు సమాసం కానిది ఏది?
   1) పంచకావ్యాలు 2) చతుర్వేదాలు
   3) వేషభాషలు 4) ఎనిమిది మూరలు
6. కలువ కన్నులు అనేది ఏ సమాసం?
   1) ఉపమాన ఉత్తర పద కర్మధారయం
   2) ఉపమాన పూర్వ పద కర్మధారయం
   3) విశేషణ పూర్వ పద కర్మధారయం
   4) ద్వంద్వ సమాసం
7. 'రాజభటుడు' ఏ సమాసం?
   1) సప్తమీ తత్పురుష
   2) పంచమీ తత్పురుష
   3) షష్ఠీ తత్పురుష
   4) ప్రథమా తత్పురుష
8. 'పాపభీతి' ఏ సమాసం?
   1) ద్వితీయా తత్పురుష
   2) తృతీయా తత్పురుష
   3) పంచమీ తత్పురుష
   4) సప్తమీ తత్పురుష
9. 'మృదుమధురం' ఏ సమాసం?
   1) విశేషణ పూర్వ పద కర్మధారయం
   2) విశేషణ ఉభయ పద కర్మధారయం
   3) విశేషణ ఉత్తర పద కర్మధారయం
   4) ద్వంద్వ సమాసం
10. 'అమెరికా రాయబారి' ఏ సమాసం?
    1) సప్తమీ తత్పురుష
    2) పంచమీ తత్పురుష
    3) షష్ఠీ తత్పురుష
    4) సంభావన పూర్వపద
11. 'వయోవృద్ధుడు' ఏ సమాసం?
    1) తృతీయా తత్పురుష
    2) ద్వంద్వ 3) చతుర్థీ తత్పురుష
    4) విశేషణ పూర్వ పద కర్మధారయం
12. 'విధాతృనానతి' ఏ సమాసం?
    1) పంచమీ తత్పురుష
    2) సప్తమీ తత్పురుష 3) షష్ఠీ తత్పురుష
    4) విశేషణ ఉత్తర పద కర్మధారయం
13. కింది వాటిలో ద్విగు సమాసాన్ని గుర్తించండి.
    1) విద్యాధికులు 2) స్త్రీ పురుషులు
    3) భారతదేశం 4) ఏభై సంవత్సరాలు
14. 'కాశీ పట్టణం' ఏ సమాసం?
    1) రూపక సమాసం
    2) సంభావనా పూర్వపద కర్మధారయం
    3) సప్తమీ తత్పురుష
    4) పంచమీ తత్పురుష
15. 'కొండ యొక్క మలుపు' – సమాస పదం?
    1) కొండదరి మలుపు
    2) కొండమలుపు 3) కొండనున్న మలుపు
    4) కొండ పక్క మలుపు
16. 'సత్యదూరం' – ఏ సమాసం?
    1) పంచమీ తత్పురుష
    2) ద్వంద్వ సమాసం 3) షష్ఠీ తత్పురుష
    4) ద్వితీయా తత్పురుష
17. 'నెలతాల్పు' – ఏ సమాసం?
    1) ప్రథమా తత్పురుష
    2) ద్వితీయా తత్పురుష
    3) తృతీయా తత్పురుష 4) రూపక సమాసం
18. 'దేశభక్తి' – ఏ సమాసం?
    1) సప్తమీ తత్పురుష
    2) ద్వంద్వ సమాసం
    3) విశేషణ పూర్వ పద కర్మధారయం
    4) తృతీయా తత్పురుష
19. కింది వాటిలో తృతీయా తత్పురుష సమాసం ఏది?
    1) పొట్టకూడు 2) ధనహీనుడు
    3) రాక్షసభయం 4) రాజశ్రేష్ఠుడు
20. 'అసత్యం' – ఏ సమాసం?
    1) ద్వంద్వ సమాసం
    2) నఞ్ బహుబ్రీహి 3) నఞ్ తత్పురుష
    4) విశేషణ ఉత్తర పద కర్మధారయం
21. 'సంఘ సంస్కర్తలు' – ఏ సమాసం?
    1) బహుబ్రీహి 2) ద్వితీయా తత్పురుష
    3) ద్వంద్వ సమాసం 4) సప్తమీ తత్పురుష
22. 'శక్తిని అనుసరించి' విగ్రహ వాక్యంగా ఉన్న సమాస పదం ఏది?
    1) శక్తి ప్రకారం 2) శక్త్యానుసారం
    3) యథాశక్తి 4) శక్తిననుసరించి
23. 'ప్రతి నిత్యం' – ఏ సమాసం?
    1) ప్రథమా తత్పురుష
    2) అవ్యయీభావ సమాసం
    3) ద్వితీయా తత్పురుష
    4) చతుర్థీ తత్పురుష
24. కింది వాటిలో అవ్యయీభావ సమాసం కానిది?
    1) నిశ్చలం 2) ప్రతి దినం
    3) నిరుపయోగం 4) అన్యాయం
25. 'అర్ధరాత్రి' ఏ సమాసం?
    1) అవ్యయీభావం 2) ప్రథమా తత్పురుష
    3) ద్వంద్వ సమాసం
    4) ద్వితీయా తత్పురుష
26. కింది వాటిలో ప్రథమా తత్పురుష సమాసం కానిది?
    1) నడిరేయి 2) మధ్యాహ్నం
    3) మద్యపానుడు 4) అర్ధరాజ్యం
27. 'కనకాభిషేకం' – ఏ సమాసం?
    1) చతుర్థీ తత్పురుష
    2) తృతీయా తత్పురుష
    3) ద్వితీయా తత్పురుష 4) సప్తమీ తత్పురుష
28. కింది వాటిలో రూపక సమాసం కానిది?
    1) విద్యాగంధం 2) లతాలలనలు
    3) త్రిజగములు 4) కోపాగ్ని
29. కమలనాభుడు – ఏ సమాసం?
    1) షష్ఠీ తత్పురుష 2) ద్వంద్వ సమాసం
    3) పంచమీ తత్పురుష 4) బహుబ్రీహి
30. కింది వాటిలో బహుబ్రీహి సమాసం కానిది?
    1) ముక్కంటి 2) రాజాజ్ఞ
    3) చంచలాత్ములు 4) బాష్పపూరితనయన
31. కింది వాటిలో ద్వితీయా తత్పురుష సమాసం కానిది?
    1) హితార్థకాంక్షులు 2) జలధరం
    3) ధనాఢ్యుడు 4) విద్యార్థులు
32. 'అర్ధశతాబ్ది' ఏ సమాసం?
    1) ద్వితీయా తత్పురుష
    2) ప్రథమా తత్పురుష
    3) ద్విగు సమాసం
    4) తృతీయా తత్పురుష
33. 'అమృతతుల్యములు' ఏ సమాసం?
    1) చతుర్థీ తత్పురుష
    2) ద్వంద్వ సమాసం
    3) పంచమీ తత్పురుష
    4) తృతీయా తత్పురుష
34. కింది వాటిలో చతుర్థీ తత్పురుష సమాసం ఏది?
    1) ఆవుదూడ 2) భిక్షాపాత్ర
    3) నోటిమాట 4) విద్యాగురుడు
35. 'అధమాధముడు' – ఏ సమాసం?
    1) నఞ్ తత్పురుష
    2) చతుర్థీ తత్పురుష
    3) పంచమీ తత్పురుష
    4) సప్తమీ తత్పురుష
36. 'ద్వారకవాటం' – ఏ సమాసం?
    1) ద్వంద్వ సమాసం
    2) పంచమీ తత్పురుష
    3) సప్తమీ తత్పురుష 4) షష్ఠీ తత్పురుష
37. కింది వాటిలో సప్తమీ తత్పురుష సమాసం?
    1) దాస్యవిముక్తులు 2) నోటిమాట
    3) సమాజ రుగ్మతలు 4) జీవనోపాధి
38. కింది వాటిలో నఞ్ తత్పురుష సమాసం కానిది?
    1) అద్వైతం 2) అసాధ్యం
    3) అసత్యం 4) క్రియాలోలురు
39. 'పుణ్యభూమి' ఏ సమాసం?
    1) విశేషణ పూర్వ పద కర్మధారయం
    2) ద్వంద్వ సమాసం
    3) సప్తమీ తత్పురుష
    4) ఉపమాన పూర్వ పద కర్మధారయం
40. కింది వాటిలో విశేషణ పూర్వ పద కర్మధారయ సమాసం కానిది?
    1) తెల్లగుర్రం 2) చిరకాలం
    3) గాజుటాలు 4) చిరుగాలి
41. 'మామిడిగున్న' ఏ సమాసం?
    1) విశేషణ పూర్వ పద కర్మధారయం
    2) విశేషణ ఉత్తర పద కర్మధారయం
    3) ద్వంద్వ 4) షష్ఠీ తత్పురుష
42. 'ఉదార విశాలం', 'ఇరుగు పొరుగు' లాంటి పదాల్లో ఉన్న సమాసం ఏది?
    1) విశేషణ ఉత్తర పద కర్మధారయం
    2) విశేషణ పూర్వ పద కర్మధారయం
    3) విశేషణ ఉభయ పద కర్మధారయం
    4) ఉపమాన పూర్వపద కర్మధారయం
43. 'కాటుక కొండ' పదంలో ఉన్న సమాసం?
    1) విశేషణ పూర్వ పద కర్మధారయం
    2) ద్వంద్వ సమాసం
    3) ఉపమాన పూర్వ పద కర్మధారయం
    4) ఉపమాన ఉత్తర పద కర్మ ధారయం
44. 'శూరమణి', 'పైరు పచ్చలు' లాంటి పదాల్లో ఉన్న సమాసం?
    1) ద్వంద్వ సమాసం
    2) ఉపమాన ఉత్తర పద కర్మధారయం
    3) ఉపమాన పూర్వ పద కర్మధారయం
    4) విశేషణ ఉత్తర పద కర్మధారయం
45. 'మోక్షలక్ష్మి', 'అంకశయ్య' లాంటి పదాల్లో ఉన్న సమాసం ఏది?
    1) రూపకం 2) ద్వంద్వ
    3) ఉపమాన పూర్వ పద కర్మధారయం
    4) విశేషణ పూర్వ పద కర్మధారయం
46. కింది వాటిలో సంభావనా పూర్వ పద కర్మధారయ సమాస పదమేది?
    1) సంసార సాగరం 2) ఆస్యగహ్వరం
    3) కడిమి చెట్టు 4) వేదార్థములు
47. 'నవనాడులు', 'నూరు పద్యాలు' పదాల్లో ఉన్న సమాసం ఏది?
    1) ద్వంద్వ 2) ద్విగు సమాసం
    3) ప్రథమా తత్పురుష
    4) అవ్యయీభావ సమాసం
48. కింది వాటిలో ద్వంద్వ సమాసం కానిది?
    1) అర్ఘ్యపాద్యములు
    2) ధైర్య సాహసాలు
    3) ఐదుదినాలు 4) సౌభాగ్య సౌఖ్యాలు
49. 'బాలుడి నుండి గోపాలుని వరకు' అనే విగ్రహ వాక్యానికి సమాస పదం?
    1) బాలగోపాలం 2) గోపాల బాలం
    3) ఆబాలగోపాలం 4) ఆగోపాలబాలం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 3; 4) 2; 5) 3; 6) 2; 7) 3; 8) 3; 9) 2; 10) 3; 11) 1; 12) 3; 13) 4; 14) 2; 15) 2; 16) 3; 17) 2; 18) 1; 19) 2; 20) 3; 21) 2; 22) 3; 23) 2; 24) 4; 25) 2; 26) 3; 27) 2; 28) 3; 29) 4; 30) 2; 31) 3; 32) 2; 33) 4; 34) 2; 35) 3; 36) 4; 37) 3; 38) 4; 39) 1; 40) 3; 41) 2; 42) 3; 43) 3; 44) 2; 45) 1; 46) 3; 47) 2; 48) 3; 49) 3.

దేవుడి గదిలో వెలిగే దీప ప్రమిద లాంటి ల్యాంప్?

ఒక ఇంటిలో విద్యుత్ కనెక్షన్.. ఒక గది నుంచి మరో గదికి శ్రేణిలోనూ, గదిలోని విద్యుత్ పరికరాలను సమాంతరంగానూ సంధానం చేస్తారు. దేవుడి పటాలు లేదా విగ్రహాల వద్ద ఆర్క్ ల్యాంప్‌లను ఉపయోగిస్తారు. వీటి నుంచి వెలువడే కాంతి రంగు వెలుగుతున్న దీప ప్రమిదనుంచి వెలువడుతున్న కాంతి రంగును పోలి ఉంటుంది. సాధారణంగా ఇలాంటి ల్యాంప్‌లలో నియాన్ అనే జడ వాయువును ఉపయోగిస్తారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భౌతిక శాస్త్రం

విద్యుత్

ఘటం (Cell)

నిర్జల/అనార్ధ ఘటం: ఇందులో ఎలాంటి ద్రవ పదార్థాలు ఉండవు. కాబట్టి దీన్ని 'డ్రై సెల్' అంటారు. ఈ ఘటాన్ని సులభంగా ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తీసుకెళ్లవచ్చు. అందువల్ల వీటిని కెమెరా, రేడియో, టార్చ్‌లైట్, గడియారాలు, ఆట బొమ్మలు, రిమోట్ కార్లు మొదలైనవాటిలో ఉపయోగిస్తారు.

గౌణ ఘటాలు: వీటిని గ్లాస్టన్ ప్లాంటే (ఫ్రాన్స్) అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఇందులో విద్యుత్ శక్తి రసాయన శక్తిగా, రసాయన శక్తి విద్యుత్ శక్తిగా మారుతుంది. ఇలాంటి ఘటాలను నిర్వహించడానికి లిథియం, కాడ్మియం, నికెల్, కోబాల్ట్ తదితర పదార్థాలను వినియోగిస్తారు. ఈ ఘటాలను మొబైల్ ఫోన్లు, హ్యాండీక్యామ్, కృత్రిమ ఉపగ్రహాలు, అంతరిక్ష నౌకల్లో ఉపయోగిస్తారు.

లెడ్ యాసిడ్ బ్యాటరీ: దీన్ని థామస్ ఆల్వా ఎడిసన్ కనుగొన్నాడు. ఈ ఘటాల్లో లెడ్‌ను ధన ధ్రువం (ఆనోడ్), లెడ్ పెరాక్సైడ్‌ను రుణ ధ్రువం (కేథోడ్)గా వాడతారు. ఈ ఘటంలో ఎక్కువగా ఉపయోగించే ఆమ్లం 'సజల సల్ఫ్యూరిక్ ఆమ్లం'. ఇలాంటి ఘటాలను వాహనాల్లో ఉపయోగిస్తారు.

- మానవాళికి ఎక్కువగా ఉపయోగపడుతున్న సజల సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని 'కింగ్ ఆఫ్ ది కెమికల్స్'గా పేర్కొంటారు.
- ప్రతి జీవిలో 'కార్బన్' మూలకం తప్పనిసరిగా ఉంటుంది. దీన్ని 'కింగ్ ఆఫ్ ది ఎలిమెంట్స్' అని పిలుస్తారు.
- బంగారం మెతకదనాన్ని అధికం చేసినప్పుడు దాన్ని సన్నటి తీగలా సాగదీయవచ్చు. అందువల్ల లోహాల్లో బంగారాన్ని 'కింగ్ ఆఫ్ ది మెటల్స్'గా పేర్కొంటారు.

విద్యుత్ బల్బు

విద్యుత్ బల్బును థామస్ ఆల్వా ఎడిసన్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. గాజుతో రూపొందించిన విద్యుత్ బల్బుల్లో టంగ్‌స్టన్ తీగను ఫిలమెంట్‌గా అమరుస్తారు. అందులో తక్కువ పీడనం వద్ద ఆర్గాన్ అనే జడవాయువును నింపుతారు.

టంగ్‌స్టన్ విద్యుత్ నిరోధం తక్కువగా, ద్రవీభవన స్థానం ఎక్కువగా (2400 °C - 2900 °C) ఉంటుంది. అందువల్ల దీని ద్వారా విద్యుత్ ప్రవహిస్తున్నప్పుడు అది ఎక్కువ ఉష్ణోగ్రతకు వేడెక్కినప్పటికీ కాలిపోకుండా ఉంటుంది. కానీ ఈ బల్బుల్లో విద్యుత్ వ్యర్థం ఎక్కువగా ఉంటుంది.

సీఎఫ్ఎల్ బల్బ్

దీని పూర్తిపేరు Compact Flourocent Lamp. దీన్ని ఎడ్వర్డ్ హామర్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఇందులో తక్కువ మోతాదులో పాదరసాన్ని ఉపయోగిస్తారు. సీఎఫ్ఎల్ బల్బుల్లో ఎలాంటి ఫిలమెంట్లు లేకపోవడం వల్ల విద్యుత్ వ్యర్థం దాదాపుగా ఉండదు.

ట్యూబ్‌లైట్

గాజుతో రూపొందించిన ఒక గొట్టం రెండు చివరల వద్ద ఆనోడ్, కెథోడ్ అనే ఎలక్ట్రోడ్‌లను అమరుస్తారు. వాటి మధ్య తక్కువ పీడనం వద్ద కావాల్సిన వాయువులను నింపుతారు.

ట్యూబ్‌లైట్ లోపలి గోడలపై టంగ్‌స్టన్ లేదా సిలికేట్ రసాయనిక పదార్థంతో పూత పూయడం వల్ల తెలుపురంగులో ఉన్న కాంతి విడుదలవుతుంది. ఇందులో ఎలాంటి ఫిలమెంట్ లేకపోవడం వల్ల విద్యుత్ పొదుపు ఎక్కువగా ఉంటుంది. కానీ ఈ ట్యూబ్‌లైట్ వెలగడానికి 220V వోల్టేజీ అవసరమవుతుంది.

ఫ్లోరోసెంట్ ల్యాంప్

ఇందులో తక్కువ మోతాదులో పాదరసాన్ని ఉపయోగిస్తారు.

చాపం దీపాలు (Arc Lamps)

వీటిని సర్ హంఫ్రీ డేవిస్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఇలాంటి బల్బుల నుంచి అధిక తీవ్రత ఉన్న కాంతి వెలువడుతుంది. అందువల్ల వీటిని కింద పేర్కొన్న సాధనాల్లో ఉపయోగిస్తారు.

- సినిమా ప్రొజెక్టర్లలో ఇలాంటి ల్యాంప్‌లను అమర్చి, వాటి నుంచి వెలువడుతున్న కాంతిని ఇనుముపై పతనమయ్యేలా చేస్తారు. ఆ ఫిల్మ్‌పై ఉండే బొమ్మ తెరపై ఏర్పడుతుంది.
- నౌకాశ్రయంలో లైట్ హౌస్ పై భాగంలో ఇలాంటి ల్యాంప్‌లను అమరుస్తారు. వీటి నుంచి వెలువడుతున్న కాంతిని ఉపయోగించి రాత్రి సమయంలో తీరం వైపు వస్తున్న నౌకలకు మార్గ నిర్దేశనం చేస్తారు.

ఆవిరి దీపాలు

వీటిని పీటర్ కూపర్ హెవిట్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. సాధారణంగా ఇలాంటి బల్బ్‌లలో పాదరస ఆవిరిని లేదా సోడియం వేపర్‌ను ఉపయోగిస్తారు.

- అలంకరణ దీపాలను శ్రేణిలో సంధానం చేస్తారు.

ఫ్యూజ్ తీగ

దీన్ని లెడ్, టిన్‌ల మిశ్రమంతో తయారు చేస్తారు. ఇందులో పరిగణనలోకి తీసుకోలేనంత తక్కువ మోతాదులో Cuను కూడా వినియోగిస్తారు. ఈ మిశ్రమ లోహాన్ని 'టైప్ మెటల్' అని కూడా అంటారు. ఈ ఫ్యూజ్ వైర్ విద్యుత్ నిరోధం ఎక్కువగా, ద్రవీభవన స్థానం తక్కువగా ఉంటుంది.

ఈ తీగను ఎలక్ట్రిక్ వలయంలో శ్రేణిలో కలుపుతారు. ఒకవేళ ఎలక్ట్రిక్ వోల్టేజీ 220V కంటే ఎక్కువగా ఉంటే ఈ ఫ్యూజ్ వైర్ వేడెక్కి కాలిపోతుంది. ఈ విధమైన అధిక వోల్టేజీల నుంచి ఎలక్ట్రిక్ ఫీల్డ్‌ను కాపాడటానికి ఫ్యూజ్ వైర్‌ను ఉపయోగిస్తారు.

- విద్యుత్ హీటర్‌లో నిక్రోమ్ తీగను ఫిలమెంట్‌గా వాడతారు. దీని విద్యుత్ నిరోధం, ద్రవీభవన స్థానాలు ఎక్కువగా ఉండటమే దీనికి కారణం. అందువల్ల దీని ద్వారా ప్రవహించే విద్యుత్ ప్రవాహం పూర్తిగా ఉష్ణశక్తిగా మారి ఆ ఫిలమెంట్ వేడెక్కుతుంది. ఈ ఉష్ణాన్ని ఉపయోగించి వంట చేసుకోవచ్చు. ఈ తీగ ద్రవీభవన స్థానం ఎక్కువగా ఉండటం వల్ల ఇది కరిగిపోకుండా ఉంటుంది.

విద్యుత్ ఫలితాలు (ఎలక్ట్రిక్ ఎఫెక్ట్)

సీబెక్ ఫలితం

రెండు వేర్వేరు లోహపు తీగలను తీసుకుని వాటి రెండు చివరలను రెండు సందులుగా అమరిస్తే ఏర్పడే వలయాన్ని 'ఉష్ణయుగ్మం' అంటారు. ఇందులో ఉన్న ఒక సంధిని మంచు ముక్కల్లో అమర్చినప్పుడు దాని ఉష్ణోగ్రత 0° సెంటీగ్రేడ్‌కు తగ్గుతుంది. దీన్ని చల్లని సంధి అంటారు. రెండో సంధిని ద్రవంలో అమర్చి వేడి చేసినప్పుడు దాని ఉష్ణోగ్రత పెరుగుతుంది. అందువల్ల దీన్ని వేడి సంధి అంటారు. ఈ వేడి సంధి వద్ద ఇచ్చిన ఉష్ణం విద్యుత్ వలయంలో విద్యుత్ శక్తిగా మారి ప్రవహిస్తుంది. ఈ విధంగా జనించిన విద్యుత్‌ను ఉష్ణ విద్యుత్ అంటారు. దీన్ని కనుగొన్న శాస్త్రవేత్త సీబెక్ కావడం వల్ల దీన్ని 'సీబెక్ ఫలితం' అంటారు.

సీబెక్ ఫలితంలో జనించిన ఉష్ణ విద్యుత్ రెండు అంశాలపై ఆధారపడి ఉంటుంది.

1. ఉష్ణయుగ్మాన్ని తయారు చేయడానికి ఉపయోగించే 'పదార్థాల స్వభావం'పై ఆధారపడి ఉంటుంది. అందువల్ల గరిష్ట ఉష్ణ విద్యుత్ జనించడానికి ఈ ఉష్ణయుగ్మాన్ని యాంటిమొని (Sb), బిస్మత్ పదార్థాలను ఉపయోగించి నిర్మిస్తారు.
2. చల్లని సంధి, వేడి సంధి ఉష్ణోగ్రతలోని తేడాపై ఉష్ణ విద్యుత్ ఆధారపడి ఉంటుంది. ఈ ఉష్ణోగ్రతలోని తేడా పెరిగితే ఉష్ణ విద్యుత్ కూడా పెరుగుతుంది.

ఉష్ణ విద్యుత్ ఉష్ణోగ్రతా మాపకం: ఇది సీబెక్ ఫలితం ఆధారంగా పనిచేస్తుంది. ఈ ఉష్ణోగ్రత మాపకాన్ని యాంటిమొని, బిస్మత్ పదార్థాలను ఉపయోగించి నిర్మిస్తారు.

ఉపయోగాలు:

1. క్రిమి కీటకాల ఉష్ణోగ్రతలను 0.025 °C వరకు కచ్చితంగా కొలవవచ్చు.
2. వేగంగా మార్పు చెందే ఉష్ణోగ్రతలను కచ్చితంగా నమోదు చేయడానికి వాడతారు.

పెల్టియర్ (Peltier) ఫలితం

ఒక ఉష్ణయుగ్మం ద్వారా విద్యుత్ ప్రవహిస్తున్నప్పుడు అది ఒక సంధి వద్ద పరిసరాల్లోని ఉష్ణం మొత్తాన్ని గ్రహించి ఆ ఉష్ణరాశిని ఎలక్ట్రాన్ల సహాయంతో రెండో సంధి వైపు బదిలీ చేసి బయటకు విడుదల చేయడం ద్వారా వేడెక్కుతుంది. దీన్నే పెల్టియర్ ఫలితం అంటారు.

అనువర్తనం:

1. ఎయిర్ కూల్డ్ గదులు, రిఫ్రిజిరేటర్లు పెల్టియర్ ఫలితం ఆధారంగానే పనిచేస్తాయి.

- రిఫ్రిజిరేటర్‌ను జేమ్స్ హారిసన్ కనుగొన్నాడు.
- రిఫ్రిజిరేటర్‌లో ఆహార పదార్థాలు మన్నికగా, తాజాగా ఎక్కువ కాలం పాటు నిల్వ ఉండటానికి కావాల్సిన ఆదర్శ ఉష్ణోగ్రత 4 డిగ్రీల సెల్సియస్.
- రిఫ్రిజిరేటర్‌లో ఉన్న డోర్‌ను తెరచి అందులో కావాల్సిన ఆహార పదార్థాలను అమర్చి తిరిగి డోర్‌ను మూసివేయడానికి కావాల్సిన ఆదర్శ సమయం అయిదు సెకన్లు మాత్రమే.
- పనిచేస్తున్న ఒక రిఫ్రిజిరేటర్‌ను అమర్చిన గది ఉష్ణోగ్రత పెరుగుతుంది.

థామ్సన్ ఫలితం

ఒక తీగ ద్వారా విద్యుత్ ప్రవహిస్తున్నప్పుడు ఆ తీగ మొత్తం వేడెక్కుతుంది లేదా చల్లబడుతుంది. దీన్నే జౌల్ లేదా థామ్సన్ ఫలితం అంటారు. మంచును తయారు చేసే ఐస్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్లు చల్లబడేవాటికి ఉదాహరణలు. విద్యుత్ హీటర్, విద్యుత్ బాయిలర్, విద్యుత్ స్ట్రీమ్ బాయిలర్, విద్యుత్ కుంపటి, విద్యుత్ ఇస్త్రీ పెట్టె, విద్యుత్ కెటిల్ మొదలైనవి వేడెక్కేవాటికి ఉదాహరణలు.

- ఇస్త్రీ పెట్టె రెండు పలకల మధ్య అభ్రకం (మైకా) కాగితాన్ని అమరుస్తారు. అభ్రకం ఉత్తమ ఉష్ణ వాహకం, విద్యుత్ బంధక పదార్థం. కాబట్టి ఐరన్ బాక్స్‌లో పైన ఉన్న ఫలకలో ఉత్పత్తి చెందిన ఉష్ణాన్ని తన ద్వారా కింది ఫలకలోకి ప్రసారం చేస్తుంది. దీంతోపాటు ఇది విద్యుత్ బంధక ధర్మాన్ని కలిగి ఉండటం వల్ల రెండు పలకల మధ్య విద్యుత్ ప్రసారం జరగకుండా నిరోధిస్తుంది.

మాదిరి ప్రశ్నలు

1. విద్యుత్ శక్తిని యాంత్రిక శక్తిగా మార్చేది?
   ఎ) మోటారు
   బి) జనరేటర్
   సి) ట్రాన్స్‌ఫార్మర్
   డి) కెపాసిటర్
2. స్థావర విద్యుత్తును నిల్వ చేసేది?
   ఎ) మోటారు
   బి) జనరేటర్
   సి) ట్రాన్స్‌ఫార్మర్
   డి) కెపాసిటర్
3. ఇళ్లలో ఉపయోగించే విద్యుత్ పరికరాలను ఏ పద్ధతిలో కలుపుతారు?
   ఎ) శ్రేణి
   బి) సమాంతరం
   సి) విడివిడిగా
   డి) ఏదీకాదు
4. యాంత్రిక శక్తిని విద్యుచ్ఛక్తిగా మార్చేది?
   ఎ) మోటారు
   బి) జనరేటర్
   సి) ట్రాన్స్‌ఫార్మర్ డి) విద్యుద్దర్శిని
5. కిందివాటిలో ఓమ్ నియమాన్ని పాటించనిది?
   ఎ) రాగి బి) ఇనుము
   సి) చెక్క డి) సిలికాన్
6. విద్యుత్‌కు ప్రమాణాలు?
   ఎ) ఓమ్ బి) ఓమ్-మీటర్
   సి) ఆంపియర్ డి) వోల్ట్

సమాధానాలు:

1) ఎ; 2) డి; 3) బి; 4) బి; 5) డి; 6) సి.

Memory that requires refreshing of data is..

BANK EXAMS

COMPUTER AWARENESS

1. The key which lets you to exit a program when pushed?
   a) Arrow key b) Space bar
   c) Escape key d) Return key
   e) Back space key
2. The ability of an OS to run more than one application at a time is called?
   a) Multitasking
   b) Object-oriented programming
   c) Multi-user computing
   d) Time-sharing
   e) Time computing
3. Which of the following statements best describes the batch method of input?
   a) Data is processed as soon as it is input.
   b) Data is input at the time it is collected.
   c) Data is collected in the form of source documents, placed into groups, and then input to the computer.
   d) Source documents are not used.
   e) All the above
4. The benefit of using computers is that:
   a) Computers are very fast and can store huge amounts of data.
   b) Computers provide accurate output even when input is incorrect.
   c) Computers are designed to be inflexible.
   d) All the above
   e) None of these
5. The function of CPU is:
   a) To provide external storage of text
   b) To communicate with the operator
   c) To read, interpret and process the information and instruction
   d) To provide a hard copy
   e) all the above
6. To find a saved document in the computer's memory and bring it up on the screen to view is called:
   a) Reversing
   b) Rerunning
   c) Retrieving
   d) Returning
   e) Removing
7. The Internet is a system of:
   a) Software bundles
   b) Web pages c) Website
   d) Interconnected networks
   e) Trusted networks
8. Code consisting of bars and lines of varying widths or lengths that is computer-readable is known as:
   a) An ASCII code
   b) A magnetic tape
   c) An OCR scanner
   d) A bar code
   e) An OMR Code
9. A ____ is a unique name that you give to a file of information.
   a) Device letterb) Folder
   c) File name
   d) File name extension
   e) None of these
10. What is an email attachment?
    a) A receipt sent by the recipient.
    b) A separate document from another program sent along with an email message.
    c) A malicious parasite that feeds off your messages and destroys the contents.
    d) A list of CC or BCC recipients.
    e) None of these
11. Which of the following are all considered advantages of e-mail?
    a) Convenience, speed of delivery, generality and reliability
    b) Printable, global and expensive
    c) Global, convenience and Microsoft owned
    d) Slow delivery, reliable, global and inexpensive
    e) None of these
12. Windows is?
    a) CUI
    b) GUI
    c) Voice User Interface
    d) Application
    e) AUG
13. In a client/ server model, a client program:
    a) Asks for information
    b) Provides information and files
    c) Serves software files to other computers
    d) Distributes data files to other computers
    e) None of these
14. Computers manipulate data in many ways, and this manipulation is called _____.
    a) Utilizing b) Batching
    c) Upgrading d) Processing
    e) None of these
15. A worksheet can have a maximum of ____ Number of rows:
    a) 256 b) 1024 c) 32,000
    d) 65,535 e) 10,000
16. A worksheet range is a:
    a) A command used for data modeling
    b) A range of values such as from 23 to 234
    c) A group of cells
    d) A group of worksheets
    e) All the above
17. The short cut key to quickly create a Bullet Point in MS WORD is:
    a) Ctrl + Shift + B
    b) Ctrl + B
    c) Ctrl + Shift + *
    d) Ctrl + Shift + L
    e) None of these
18. ______ hard drives are permanently located inside the system unit and are not designed to be removed, unless they need to be repaired or replaced.
    a) Static b) Internal
    c) External d) Dynamic
    e) None of these
19. DFD is:
    a) Data file distribution
    b) Data file definition
    c) Digital file distribution
    d) Data flow diagram
    e) Data file definition
20. The quickest and easiest way in MS-Word to locate a particular word or phrase in a document is to use the ______ command.
    a) Replace b) Find
    c) Lookup d) Search
    e) Rename
21. Word processing, spreadsheet, and photo-editing are example of ?
    a) Application software
    b) System software
    c) Operating system software
    d) Platform software
    e) Keyboard software
22. Which of the following is/ are used to identify a user who returns to a Website?
    a) ASPs b) Plug-ins
    c) Scripts d) Cookies
    e) History
23. RAM can be thought of as the ___ for the computer's processor.
    a) Planning room b) Waiting room
    c) Factory d) Operating room
    e) System room
24. Which of the following functions is not performed by CPU?
    a) Graphical Display of data
    b) Arithmetic calculations
    c) Managing Memory
    d) Managing Input and Output
    e) None of these
25. The Feature that keeps track of the right margins is:
    a) Find and Replace
    b) Word Wrap
    c) Right justified
    d) Left justified
    e) Ragged Right
26. Which of the following options is used to display information such as title, page number of the document?
    a) Insert Table b) Auto correct
    c) Thesaurus
    d) Spelling and grammar
    e) Header and Footer
27. The processor is a _____chip plugged onto the motherboard in a computer system.
    a) LSI b) VLSI c) ULSI
    d) XLSI e) WLSI
28. Which of the following will be used if a sender of e-mail wants to bold, italics etc the text message?
    a) Reach Signature
    b) Reach Text c) Reach Format
    d) Plain Format
    e) Plain Text
29. CPU is also called as?
    a) Microprocessor
    b) Execute c) Microchip
    d) Decoder e) Register
30. A menu contains a list of
    a) Commands b) Data
    c) Objects d) Reports
    e) Files
31. A command to get a file you worked on from the memory where it was stored
    a) Close b) Delete
    c) Open d) Get it
    e) Remove
32. A ______ is a collection of data that is stored electronically as a series of records in a table.
    a) Spreadsheet b) Presentation
    c) Database d) Web page
    e) File system
33. The software tools that enable a user to interact with a computer for specific purposes are known as?
    a) Hardware
    b) Networked softwares
    c) Sharewares d) Applications
    e) None of these
34. What is the term for unsolicited e-mail?
    a) Newsgroup b) Usenet
    c) Backbone d) Flaming
    e) Spam
35. Two or more Computers are Connected to each other for sharing Information form a?
    a) Network b) Router
    c) Server d) Tunnel
    e) Pipeline
36. Punched cards are associated with the name?
    a) Leibniz
    b) Jacquard
    c) Pascal
    d) Cobal
    e) Hollerith
37. A device or system not directly connected to the CPU is:
    a) On-line b) Keyboard
    c) Memory d) Off-line
    e) Mouse
38. Modern Computers are very reliable but they are not
    a) Fast b) Powerful
    c) Infallible d) Cheap
    e) None of above
39. Which is not a system tool?
    a) Folder b) Backup
    c) Scandisk d) Format
    e) None of these
40. _______ are specialized utility programs that make using the Internet and the Web easier and safer.
    a) Telecom b) Web utilities
    c) Norton Utilities
    d) Web firewalls e) None
41. A(n) _______ can be used to block access to specific sites.
    a) Filter b) Hardware block
    c) Censor d) Rubicon
    e) None of these
42. Operating System is an interface between?
    a) User and program
    b) User and hardware
    c) User and client
    d) a and c e) a and b
43. Memory that requires refreshing of data is:
    a) SRAM b) EPROM
    c) DRAM d) Bubble Memory
    e) SPAD

KEY

1) c;	2) a;	3) c;	4) a;
5) c;	6) c;	7) d;	8) d;
9) c;	10) b;	11) a;	12) b;
13) a;	14) d;	15) d;	16) c;
17) d;	18) b;	19) d;	20) b;
21) a;	22) d;	23) b;	24) a;
25) e;	26) e;	27) b;	28) b;
29) a;	30) a;	31) c;	32) c;
33) d;	34) b;	35) a;	36) e;
37) d;	38) c;	39) a;	40) b;
41) a;	42) b;	43) c.	